సామాజిక బౌద్ధ ధమ్మం

(బుద్ధుని జీవితం - బోధనలు : జీవన విధానం)



భిక్షు సుమేధ బోధి

సామాజిక బౌద్ధ ధమ్మం

భిక్షు సుమేధ బోధి

సామాజిక బౌద్ధ ధమ్మం

భిక్షు సుమేధ బోధి
సెల్ : **97014 53550**
ఈ-మెయిల్ : dham.sol@gmail.com

తొలి ముద్రణ : 2024
కాపీలు : 1000

WORLD ALLIANCE OF BUDDHISTS –WAB HQ
The Global Buddhist Building
40, Moo 8, Klong 2, Klong Luang
Pathumthani 12120 THAILAND
Tel : +66 (087) 502 6888
Web: www.wabhq.org

World Alliance of Buddhists

Congratulatory Message

It is my pleasure to bless Indian devotees through my message to 'BUDDHUNI BODHNALU' telugu language book written by Ven.Sumedha Bodhi also known as 'DHARMA SOLDIER'.

The book mainly intended to educate people about Buddhism especially Buddhism for modern society or 'Engaged Buddhism'. I hope 'Engaged Buddhism' definitely bring happiness and inspiration among Telugu readers.

May the power of the Triple Gem bless us all with strength , wisdom and great success.

Very Truly Yours,

Ven. P.P. Dhammo

Ven. Dr. Pornchai Palawadhammo (Pinyapong)
President of World Alliance of Buddhists (WAB)

ముందుమాట

ఈ పుస్తకం సమకాలీన ప్రపంచంలో బౌద్ధ ధర్మాన్ని సామాజిక దృక్కోణంలో అర్థం చేసుకోవడానికి ఒక వినమ్ర ప్రయత్నం. ఆధునిక సమాజంలో వ్యక్తి జీవన విధానాన్ని, విలువలను, ధర్మాచరణను సమన్వయం చేసుకోవడం ఎంత ముఖ్యమో ఈ గ్రంథం ద్వారా వివరించబడింది.

“సామాజిక బౌద్ధం” (Socially Engaged Buddhism) అనే భావనను ఆచరణలో ఎలా అమలు చేయాలి? వ్యక్తిగత జీవితంలో ధర్మాన్ని ఎలా అనుసరించాలి? సమాజానికి ఉపయోగపడే విధంగా ధర్మాన్ని పాటిస్తూ ఎలా జీవించాలి? అనే ప్రశ్నలకు ఈ పుస్తకం సమాధానాన్ని అందిస్తుంది.

ఈ గ్రంథం సాధారణ పాఠకులను దృష్టిలో ఉంచుకొని రాయబడింది. ధర్మాన్ని ఆచరించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఇది ఒక మార్గదర్శిగా ఉపయోగపడుతుంది. వ్యక్తిగత అభివృద్ధి, మానవతా విలువలు, సమాజ సేవ–ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ జీవించడానికి ఈ పుస్తకం సహాయపడుతుంది.

ఈ గ్రంథం రెండు ప్రధాన భాగాలుగా విభజించబడింది:

భాగం 1: బుద్ధుని జీవితం మరియు బోధనలు

భాగం 2: ఆ బోధనలను ఆధునిక సమాజంలో ఎలా ఆచరించాలి

ఈ పుస్తకం మతం, కులం, వర్గం అనే భేదాలు లేకుండా ప్రతి మనిషికి ఉపయోగపడే విధంగా రూపొందించబడింది. దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమైన వ్యాసాల ఆధారంగా ఈ గ్రంథం రూపుదిద్దుకుంది.

రచయిత మాట

ఈ పుస్తకం సనాతన ధర్మం అయిన బౌద్ధ ధర్మమును నేటి ఆధునిక శాస్త్ర, సాంకేతిక ప్రపంచములో ఏ విధంగా సాధన చేసి జీవితములో తమ ఆశయాలను నీతి, నియమాలను పాటిస్తూ సాధించుకోవాలి ? అనుకునేవారికి బాగా ఉపయోగపడుతుంది.

సామాజిక బౌద్ధ-ధమ్మము (Socially Engaged Buddhism) అను ఈ నూతన జీవన విధానమును పాటించడం ద్వారా నిత్య జీవితంలో ధర్మమును ఎలా ఆచరించాలో తెలుస్తుంది.

జిజ్ఞాసకులకు జ్ఞాన అభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఇది ధార్మిక లోకంలో మొదటి మెట్టును అధిరోహించుటకు ప్రోత్సాహిస్తుంది. ధార్మిక జీవన విధానమును ప్రారంభించు సాధకులకు మార్గదర్శినిగా కూడా ఉపయోగపడుతుంది. ఈ నూతన విధానం పాటించుటవలన సత్ప్రవర్తన తద్వారా ఉన్నత వ్యక్తిత్వం, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు.

ఈ పుస్తకం ద్వారా తెలుగు ప్రజల్లో ధర్మజ్ఞానం పెంపొందాలని నా ఆకాంక్ష. మన జీవితాన్ని మనమే సంస్కరించుకోవడం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలు పెరుగుతాయి.

ప్రతి వ్యక్తి తనలోని చెడు అలవాట్లు, అజ్ఞానం, స్వార్థం వంటి దుష్ప్రవర్తనలను గుర్తించి, వాటిని సరిదిద్దుకోవాలి. అదే నిజమైన ధర్మాచరణ. ఈ మార్పు వ్యక్తిగత స్థాయిలో ప్రారంభమై, కుటుంబం, సమాజం, దేశం వరకు విస్తరించాలి.

ఈ గ్రంథం ద్వారా పాఠకులు ధర్మాన్ని కేవలం సిద్ధాంతంగా కాకుండా, రోజువారీ జీవితంలో ఆచరించే మార్గాన్ని తెలుసుకుంటారు ఆశిస్తున్నాను.

ఈ పుస్తకం రచనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. బుద్ధుని ఆశీస్సులు అందరికీ కలగాలని కోరుకుంటున్నాను.

భిక్షు సుమేధ బోధి

రచయిత పరిచయం

శ్రీ భిక్షు సుమేధ బోధి గారు శ్రీ ఎస్. ధర్మారావు, శ్రీమతి యమునగార్ల ప్రథమ సంతానం. వీరు బుద్ధుని బోధనలకు ఆకర్షితులై పరివ్రాజకులైనారు.

వీరు స్వయంగా ఆంగ్లములో మన దేశంలోను, ఇతర దేశాలలోను పుస్తకములను రచించారు. వాటిని వివిధ ప్రచురణ సంస్థలు ప్రచురించాయి. వారు రాసిన అనేక వ్యాసములు దేశ, విదేశాలలో వివిధ దిన పత్రికలలో, వార పత్రికలలో, మ్యాగజైన్సలలో, సొవనీర్స్‌లలో ప్రచురితమయినాయి.

వీరి పుస్తకముల యందు విషయము నైతిక సాధన, ముక్తిమార్గం, దుఃఖ నివారణ, జ్ఞాన అభివృద్ధి, వ్యక్తి వికాసం మొదలగునవి. వీరి రచనల సారాంశం. శాంతి, సౌభ్రాతృత్వం, మానవ కళ్యాణం కొరకు ఉద్దేశించినవై ఉంటాయి.

వీరు రచనలతో పాటు ధర్మమునకు సంబంధించిన అనేక కార్యక్రమములను నిర్వహించడం, పాల్గొనటం జరిగింది. దేశ విదేశాలలో సెమినార్స్, కాన్ఫరెన్స్‌లలో పాల్గొనడం జరిగింది. అనేక దేశములను సందర్శించి అక్కడ జీవన విధానాన్ని, ఆచార వ్యవహారములను, అవగాహన చేసుకొన్నారు. బౌద్ధ ధర్మ సాధన మరియు బోధన చేస్తూ ఉండేవారు.

వీరు ధార్మిక విద్యతో పాటు, లౌకిక విద్యను కూడా అభ్యసించారు. వీరు బౌద్ధ ధర్మం స్వీకరించక ముందు వైదిక ధర్మమును పాఠించుట వలన (బౌద్ధ, వైదిక) ధర్మముల గురించి తెలిసినవారు.

– లతా రాజా ఫౌండేషన్

విషయ సూచిక

పార్ట్ 1 – బుద్ధుని జీవితం–బోధనలు 09

1. బుద్ధుడు – బోధనలు 11
2. జ్ఞానసమరం 18
3. బుద్ధత్వము 26
4. జ్ఞానోదయం తరువాత 31
5. ధమ్మ బోధకు ఆహ్వానం 35
6. బుద్ధుని ప్రథమోపదేశ సారాంశం 42
7. బుద్ధుని ప్రథమోపదేశం : ధర్మచక్ర ప్రవర్తన సూత్రం 49

పార్ట్ 2 – సామాజిక బౌద్ధ ధర్మము 55

1. నా దృష్టిలో సామాజిక బౌద్ధధర్మం 57
2. నవయాన బౌద్ధం 63
3. సంగీతులు: బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను రక్షించటంలో వాటి పాత్ర 67
4. బౌద్ధం – పోరాట సంకల్పం 72
5. సామాజిక బౌద్ధ ధర్మం ద్వారా ఏర్పడే శక్తిసామర్థ్యాలు 95
6. సామాజిక బౌద్ధ ధర్మం – ఆధునిక నాగరికత 97
7. కలవరము, గందరగోళము 108
8. పునరుద్ధరణపై ఒక సమీక్ష 133
9. ధార్మికం – మానవత్వం 137

పార్ట్ 3 – రీ స్క్రిప్టింగ్ 141

1. సిగాలోవాద సుత్తం 143
2. దీఘజాణు (వ్యాఘ్రపాద) సుత్తం 153
3. మహామంగళ సుత్తం 156
4. పరాభవసుత్తం 158

పార్ట్ - 1

బుద్ధుని జీవితం మరియు బోధనలు

1. బుద్ధుడు – బోధనలు

సిద్ధార్థుని జననం:

ప్రపంచ ప్రసిద్ధ ధర్మప్రవక్తగా మారనున్న ఒకానొక రాకుమారుడు, నేటి భారతదేశపు సరిహద్దు ప్రాంతం, నేపాల్‌కు చెందిన, కపిలవస్తులోని లుంబినీ వనంలో, క్రీ.పూ. 6వ శతాబ్దం, వైశాఖ (మే) నెల పున్నమినాడు జన్మించాడు. అతని తండ్రి, ఉన్నత శాక్య వంశప్రభువైన శుద్ధోధనుడు. తల్లి, రాణి మహామాయ. శిశువు జన్మించిన, ఏడవనాడు, తల్లి మరణించగా, శుద్ధోధనుని రెండవభార్యా, మహామాయ చెల్లెలూ అయిన మహా ప్రజాపతి గౌతమి, తనకుమారుడు నందుని పెంపకాన్ని దాసీజనులకప్పగించి, తానా శిశువు బాధ్యతలను స్వీకరించింది.

రాకుమారుని జన్మవార్తను వినిన ప్రజలందరూ, ఆనందపరవశులయ్యారు. 'కాలదేవల' అన్నపేరుగల, రాజపురోహితుడూ, గొప్పతాత్విక సంపన్నుడూ అయిన అసితమహర్షి ఈ సంతోషకరమైన వార్తను విని, ఉల్లాసభరితులై, శిశువును చూడటానికి వచ్చారు. మహర్షి రాకకు సంతసించిన శుద్ధోధనమహారాజు, తన కుమారుని చేత మహర్షికి తగిన గౌరవించాలనే ఉద్దేశ్యంతో, శిశువును అసితమహర్షి చెంతకు తీసుకెళ్ళాడు. కానీ అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తూ, బాల సిద్ధార్థుడు తన పాదాలను మహర్షి జడలపై ఉంచాడు.

జ్ఞానదృష్టితో ఆ శిశువు ఉజ్జ్వలభవిష్యత్తును దర్శించిన అసితమహర్షి, వెంటనే తను ఆసనంపైనుండి లేచి, చేతులు జోడించి ఆ శిశువుకు నమస్కరించాడు. శుద్ధోధనుడు కూడా మహర్షిమార్గాన్నే అనుసరించాడు.

అసితమహర్షి మొదట చిరునవ్వునవ్వి, తరువాత దుఃఖపడినాడు. ఆ మిశ్రమస్పందనలను గూర్చి అడిగిన రాజుతో, ఈ శిశువు జ్ఞానోదయం పొంది, బుద్ధుడిగా ఎదగనున్నందుకు ఆనందపడినాను కాని, అరూపలోకంలో (A Formless Plane) (పదార్థ రహిత భూమిక) తన మరుసటి జన్మ అరూప లోకంలో జరుగబోతుందని తెలుసుకున్నాడు. ఆ కారణంగా అత్యున్నతజ్ఞానం వలన ప్రయోజనాన్ని పొందలేకపోతున్నందుకు దుఃఖపడుతున్నానని చెప్పాడు.

బారసాల:

జన్మించిన ఐదవరోజు, రాకుమారునికి 'కోరికలు తీరినవాడు' అన్న అర్థంలో 'సిద్ధార్థుడు' అని నామకరణం చేశాడు రాజు. గౌతమ వంశానికి చెందిన యువరాజు సిద్ధార్థ గౌతముడయ్యాడు. ప్రాచీన భారతీయ సంస్కారాలననుసరించి, ఆ నామకరణ మహోత్సవానికి, చాలామంది పండితులైన బ్రాహ్మణశ్రేష్ఠులు ఆహ్వానితులయ్యారు. వారిలో ఎనిమిదిమంది పేర్కొనదగినవారు. శిశువు రూపురేఖలను పరిశీలించిన ఏడుగురు తమచేతి వ్రేళ్ళు రెండింటిని పైకిలేపి, ఆ శిశువు భవిష్యత్తులో ప్రపంచాన్నేలేగొప్ప చక్రవర్తిగాగాని, జ్ఞానోదయం పొందిన బుద్ధునిగాగాని వర్ధిల్లుతాడని చెప్పారు. కానీ వారందరిలో పిన్నవయస్కుడూ, ధీమంతుడూ అయిన 'కొండణ్ణ' మాత్రం, ఆ శిశువు నుదుటిపై కుడివైపుకు మెలితిరిగి ఉన్న శిరోజాలను చూచి, ఒక్క వ్రేలిని మాత్రం పైకిలేపి, లౌకిక సుఖాలను త్యజించి, రాకుమారుడు తప్పక బుద్ధుడవుతాడని నిర్ధారించాడు.

ఏరువాక పండుగ:

సిద్ధార్థుని బాల్యంలో పేర్కొనదగిన విషయమొకటుంది. అదొక ఊహాతీతమైన ధ్యానానుభవం (ఆనాపానా ధ్యానం). అంతేకాదు, భవిష్యత్తులో జ్ఞానోదయం పొందడంకోసం అతడు సాగించిన సత్యాన్వేషణలో కీలకమైన అనుభవంకూడా.

వ్యవసాయపనులను ప్రారంభించడానికి మునుపు 'ఏరువాక' పండుగను నిర్వహించడం ఆనవాయితీ. అందరికీ చెందిన పండుగ కాబట్టి, రాజు, రాజుతోబాటు, సామాన్యజనులు కూడా ఆ ఉత్సవంలో పాలుపంచుకున్నారు. తమతోబాటు, తమ కుమారుడైన సిద్ధార్థుని కూడా వ్యవసాయ క్షేత్రానికి తీసికెళ్ళాడు రాజు. ఒక నేరేడు చెట్టు నీడలో, ఉయ్యాలకట్టి, అందులో సిద్ధార్థుని దాసీల పర్యవేక్షణలోనుంచి, రాజు, 'ఏరువాక' ఉత్సవంలో పాల్గొన్నాడు. ఉత్సవం సందడిగా, ఉల్లాసంగా సాగుతున్న తరుణంలో దాసీజనులుకూడా యువరాజును గమనించడం మరిచి, ఆ ఆనందమయమైన, ఆ పండుగ వాతావరణంలో లీనమయ్యారు.

ఏరువాక పండుగ సమయంలో, ఒకవైపు ఉల్లాసోత్సాహాలు సందడిస్తూ ఉండగా, మరోవైపు, నేరేడు చెట్టుక్రింద, ఒక నిశ్శబ్దమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొనింది. ధ్యానసాధనకు అనువైన ఆ వేకువ సమయంలో, పిన్నవయస్కుడు, జ్ఞానస్వరూపుడు, ఆ శిశువు పద్మాసనంలో కూర్చొని, శ్వాసమీద ధ్యాస నిలిపి, చిత్తైకాగ్రతను సాధించి మొదటి సమాధిస్థితిని పొందాడు. తమ కర్తవ్యాన్ని మరిచి, ఉల్లాసపూరితమైన పండుగ వాతావరణంలో లీనమైన దాసీజనం, తమ కర్తవ్యం గుర్తొచ్చి చూసినపుడు, పద్మాసనంలో కూర్చొని, ధ్యానంలో మునిగిన పసిబాలుడు, సిద్ధార్థుని చూచి ఆశ్చర్యచకితులయ్యారు. విషయాన్నెరిగిన రాజు, హడావిడిగా వచ్చి, ధ్యానమగ్నుడైన పసిబాలుని చూసి, "నా ప్రియమైన కుమారుడా! ఇదే నీకు నేను సమర్పించే రెండవ ప్రణామం" అని చేతులు జోడించి నమస్కరించాడు.

విద్యాభ్యాసం:

రాకుమారునిగా, సిద్ధార్థుడు చదువుకొని, యువరాజ పదవిని అధిరోహించి ఉండాలి. కానీ ఆ వివరాలు మనకు క్షుణ్ణంగా లభించడం లేదు. యుద్ధవీరుడిగా నేర్చుకోవలసిన యుద్ధవిద్యలందు, ప్రత్యేక శిక్షణను పొందిన దాఖలాలు మాత్రం కనిపిస్తున్నాయి.

వైవాహిక జీవనం:

పదహారు సంవత్సరాల వయస్సులో, సిద్ధార్థుడు, సౌందర్యవతి, సమవయస్కురాలు,తనకు వరుసకూడా అయిన యశోధరను వివాహమాడినాడు. దాదాపు పదమూడు సంవత్సరాలు, ప్రాపంచిక కష్టసుఖాలతో సంబంధం లేకుండా, ఆనందమయమైన వైవాహిక జీవనాన్ని గడిపాడు. రాకుమారునిగా తన ఆడంబర జీవితాన్ని గూర్చి, సిద్ధార్థుడిలా చెప్పాడు: "నేను చాలా సున్నితమనస్కుడను. మా తండ్రిగారి నివాసంలో నాకోసం ప్రత్యేకించి మూడు తామర కొలనులు నిర్మించారు. ఒకవైపు నీలిదామరలు, మరోవైపు ఎఱ్ఱదామరలు, వేరొకవైపు తెల్లదామరలు విరబూసి ఉండేవి. కాశీచందనాన్ని తప్ప, వేరే గంధాన్ని వాడేవాడినికాను. అంగవస్త్రము మొదలు సమస్త వస్త్రాలూ కాశీ నుండి తేబడినవే. రాత్రిపగలూ కూడా, ఎండ,చలి, దుమ్ము, మంచు ఏవీ తాకని విధంగా, నాపై ఒక రక్షణకవచం ఎప్పుడూ ఉండేది. చలికాలంలో, వేసవిలో, వర్షా కాలం లో నివాసానుగుణంగా నాకోసం మూడు భవనాలు నిర్మించబడినాయి. వర్షాకాలపు నాలుగు నెలలూ, భవనం దాటి బయటకు రాకుండా ఉండేవిధంగా, స్త్రీ విదుషీమణుల చేత గానాది కార్యకలాపాలు నిర్వహింపబడుతుండేవి. ఇతరుల యిళ్లలో పనివారికి, తవిటిబియ్యపు పులిసిన గంజి యివ్వబడగా, మా తండ్రిగారియింట, మాంసాహారంతో కూడిన భోజనం యివ్వబడేది."

కాలం గడుస్తున్నకొద్దీ, అతనిలో సత్యావగాహన పట్ల శ్రద్ధ, క్రమంగా మొదలయింది. అతని ధ్యానశీలత, అవధులులేని కారుణ్యభావనలు, కేవలం రాచభవనపు ఆనందాల్లో గడపడానికే, అతనిని పరిమితంచేయలేదు. వ్యక్తిగతమైన దుఃఖాలేవీ లేకున్నా, దుఃఖార్తులైన మానవులపట్ల సానుభూతి, అతనిని కలతపడేలాచేసేది. సౌకర్యాలూ,సంపదల మధ్యనున్నప్పటికీ, అతడు, ప్రాపంచికదుఃఖాన్ని అవగతం చేసికోగలిగాడు.

పరిత్యాగం:

రాకుమారుడు సిద్ధార్థుడు ఇలా ఆలోచించాడు: " పుట్టుక, నాశనము, రోగము, మరణము, వేదన, మాలిన్యాలతో కూడిన ప్రాకృతిక వలయంలో నేనెందుకు భాగస్వామిని కావాలి? ఆ విషయాలలో మునిగితేలుతూ వాటి నిష్ప్రయోజనత్వాన్ని ఎలా గుర్తుపట్టగలను? సులభంగా లభ్యంకానిది, తప్పక పొందవలసినదీ, సంపూర్ణ శ్రేయోదాయకమైనదీ అయిన నిబ్బానాన్ని/ ముక్తిని గూర్చి ఎలా అన్వేషించగలను?" గృహస్థ జీవితం చాలా ఇరుకైనది, చెరశాలవంటిది. కలుషితమైనది. ఇల్లులేనివాని జీవితం, స్వేచ్ఛగా వీచే చల్లగాలిలాంటిది. పరిపూర్ణంగా, పవిత్రంగా జీవించడం అనే జీవన విధానం, ప్రాపంచిక జీవితానికి పరిమితమైనవారికి కష్టమవుతుంది.

ఒకానొక ప్రకాశవంతమైనరోజు, బయటి ప్రపంచాన్ని చూడటానికై, రాజభవనం నుండి వెలువడి, ఆనందవనానికి వాహ్యాళిగా బయలుదేరిన సిద్ధార్థుడు, కఠోరమైన జీవిత వాస్తవాలను, దర్శించాడు. సంకుచితమైన, రాచభవనపు అంతరాలతో, ఆనందపుటంచులను మాత్రమే చవిచూచిన సిద్ధార్థునినుండి, మానవ జీవితంలోని సహజమైన చీకటికోణాలు కనిపించకుండా దాచబడినాయి. మనసును కల్లోలపరిచే కొన్ని వాస్తవాలను, మొదటిసారిగా బయటిప్రపంచంలో చూశాడు సిద్ధార్థుడు. అతని పరిశీలనాత్మకమైన కనులు, మొట్టమొదటగా ఒక బలహీనుడూ, నిస్తేజుడూ అయిన ముసలివానిని, ఒక రోగిని, ఒక శవాన్ని, ఒక పరివ్రాజకుడును చూశాడు. మొదటి మూడుదశలూ, మానవజీవితంలో ఎదుర్కొనక తప్పని పరిణామాలు, నాల్గవది అయిన పరివ్రాజకత్వం, జీవితంలోని బాధలనుండి విముక్తిని కలిగించే, శాంతియుతమైన, ప్రశాంతమైన జీవనాన్ని సాధించ డానికి ఉపకరించే దశగా చెప్పబడినది. అనుకోకుండా ఎదురయిన ఈ నాలుగు సంఘటనలు, సిద్ధార్థుని గృహపరిత్యాగానికి ప్రేరేపించాయి.

సామాన్య ప్రజలకు ఆకర్షణీయమైనది, విలువలేనిది అయిన ఇంద్రియసుఖాల అప్రాధాన్యతను, అర్థం చేసికొని, ప్రజ్ఞావంతులు నిజమైన ఆనందాన్ని పొందే పరిత్యాగం పట్ల ఆసక్తిని పెంచుకుని, సత్యాన్ని, శాశ్వతమైన శాంతిని అన్వేషించే ప్రయత్నంలో యీ ప్రపంచాన్ని త్యజించాలని నిర్ణయించుకున్నాడు, సిద్ధార్థుడు.

ఎంతో ఆలోచించి, తుది నిర్ణయం చేసికున్న తరువాత, వనం నుండి రాచనగరుకు తిరిగిరాబోతుండగా, తనకు కుమారుడు జన్మించినాడన్న వార్తను అందుకున్నాడు. ఆ వార్తకు సంతోష పడకపోగా, తన ప్రథమ సంతానాన్ని ఒక ప్రతిబంధకంగా భావించాడు. ఆనందకరమైన విషయాలకు పొంగిపోయే, ఒక సాధారణమైన తండ్రికాడు సిద్ధార్థుడు. రాకుమారుడు, అసాధారణమైన తండ్రి అయిన సిద్ధార్థుడు, “ఒక ప్రతిబంధకం జన్మించింది. సంకెళ్ళు ఏర్పడ్డాయి” అని ఆశ్చర్యపోయాడు. ‘శృంఖలం’ అన్న అర్థంలోనే, ఆ శిశువుకు ‘రాహులుడు’ అని తరువాత,ఆ శిశువు తాతగారిచేత నామకరణం చేయబడింది.

ఆలోచనాశీలుడైన సిద్ధార్థునికి, రాజభవనం అనుకూల నివాసం కాదు. యౌవనవతి, సౌందర్యవతి అయిన భార్యగాని, ప్రియమైన శిశువుగాని, యీ ప్రపంచాన్ని పరిత్యజించాలన్నకోరికనుండి, సిద్ధార్థుని వెనుకకు మరలింపలేకపోయినారు. ఒక మంచి భర్తగా, తండ్రిగా, చక్రవర్తిగా ఉండటం కన్నా, అతడు పొందవలసిన, పోషించవలసిన గొప్ప పాత్ర వేరే ఏదో ఉంది. రాజప్రాసాదపు ఆకర్షణలేవీ అతనికి నిజమైన ఆనందాన్ని కలిగించలేకపోయాయి. గృహాన్ని విడిచిపెట్టేందుకు తగిన సమయం ఆసన్నమయింది.

‘కంఠక’మనే పేరుగల అశ్వాన్ని సిద్ధంచేయమని, తనకు ఇష్టుడైన ఛన్నునికాదేశించి, తాను యశోధర భవనానికి వెళ్ళాడు, సిద్ధార్థుడు. ఆమె గది తలుపులను తెరిచి, గడపపైనే నిలబడి, గాఢనిద్రలోనున్న భార్యాబిడ్డలను రాగరహితమైన చూపులతో చూశాడు. వదిలివెడుతున్న తరుణంలో భార్య, సుతునిపై అతనికున్న దయ చాలా గొప్పది. దుఃఖార్తులైన మానవాళిపట్లనున్న దయ అంతకన్న గొప్పది. వలసినన్ని సౌకర్యాలు, భద్రత కలిగి ఉన్న భార్యాసుతుల, ప్రాపంచికపరమైన సుఖాలగురించిగాని, భవిష్యజ్జీవనాన్ని గురించిగాని అతడు బాధపడలేదు. దీని అర్థం, అతడు భార్యాసుతులపట్ల తక్కువ ప్రేమకలిగినవాడని కాదు. మానవాళిపట్ల ఎక్కువప్రేమ కలిగినవాడని మాత్రమే!

అన్నిటినీ తన వెనుకే వదలిపెట్టి, తేలికపడిన మనస్సుతో, తన రథసారథి ఛన్నునితో కలిసి, రాజప్రాసాదం నుండి వెలుగుకై వెదుక్కుంటూ, బాహ్యప్రపంచంలోకి పయనించాడు. సత్యాన్ని, శాంతిని, అన్వేషించేందుకై,

ఒంటరిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఆ విధంగా ప్రపంచాన్ని పరిత్యజించాడు సిద్ధార్థుడు. అది, జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించిన ముసలివాని పరిత్యాగం వంటిది కాదు. త్యజించడానికి ఏమీలేని, ఒక నిరుపేదవాని పరిత్యాగంవంటిదీ కాదు. సంపూర్ణ యౌవనంలోనున్న, అంతులేని సంపదలతో తులతూగుతున్న, ఒక రాకుమారుని ప్రపంచ పరిత్యాగమది. చరిత్రలో మరేది దీనితో పోల్చడానికి వీలులేని, మహత్తరమైన పరిత్యాగమది. ఆ చారిత్రిక పయనాన్ని, సిద్ధార్థుడు, తన ఇరవైతొమ్మిదవయేట ప్రారంభించాడు.

చాలాదూరం ప్రయాణించి, 'అనోమా' నదిని దాటి, ఆ నదీతీరంలో విశ్రమించాడు. అక్కడ, తన శిరస్సు మీది, గడ్డం మీది, జుట్టును కత్తిరించుకొన్నాడు. తన దుస్తులను, ఆభరణాలను, రాజభవనంలో అప్పగించమని, ఛన్నునిచేతికిచ్చాడు. తాను ఐచ్ఛికంగా,పేదరికాన్ని ఎన్నుకున్న వాడై, సన్యాసులు ధరించే కాషాయవర్ణపు బట్టలను ధరించాడు.

ఒకప్పుడు, సంపదల ఒడిలో సేదతీరిన సిద్ధార్థుడు, ఇప్పుడు ఎవరైనా ఇష్టపూర్వకంగా ఇచ్చే భిక్షతో జీవించే ఒక సన్యాసి మాత్రమే. అతనికొక శాశ్వతమైన నివాసం లేదు. ఒక నీడనిచ్చే చెట్టు, ఒక ఏకాంతమైన గుహ, అతనికి పగలూ రాత్రి నివాసస్థానాలయ్యాయి. మండించే ఎండలో, సూదుల్లా పొడిచే చలిలో, పాదరక్షలులేని కాళ్లతో, శిరోముండనంతో, ఎంతెంతోదూరం నడిచాడు. అతనికంటూ సొంతంగా ఏమీలేక, ఒక భిక్షాపాత్రను, శరీరాన్ని కప్పుకునేందుకు తగు మాత్రపు దుస్తులనూ కలిగి, తన సకల శక్తులను సత్యాన్వేషణ దిశగా కేంద్రీకరించి ముందుకు సాగాడు.

అన్వేషణ:

ఒక సంచారిగా, మంచిని అన్వేషించేవానిగా, అగమ్యగోచరమైన శాంతినన్వేషిస్తూ, సన్యాసిగా ప్రసిద్ధికెక్కిన, ఆలారకాలామున్ని చేరుకున్నాడు, సిద్ధార్థుడు. అతనితో, "మిత్రమా!కాలామా! నేను మీతోబాటుకలిసి, పవిత్రజీవనాన్ని గడపాలని కోరుకుంటున్నాను" అని అన్నాడు. అందుకు కాలాముడు, "ఓ పూజ్యుడా! నువ్వు మాతోనే ఉండిపోవచ్చు. ఒక తెలివైన వ్యక్తి, అంతఃప్రేరణలద్వారా ఇక్కడి బోధనలను, గురువు సిద్ధాంతాలను, అతి తక్కువకాలంలోనే అర్థం చేసికోగలడు. గొప్ప సాధకుడిగా కూడా కాగలడు." అని అన్నాడు. అతి స్వల్పకాలంలోనే, సిద్ధార్థుడు, గురువు గారి సిద్ధాంతాన్ని ఆకళింపుచేసికొన్నాడు. కానీ అంతిమ సత్యాన్ని (Ultimate Truth) గురించిన అవగాహనను కలిగించే శక్తి ఆ సిద్ధాంతానికి లేకపోయింది. "ఆంతరికప్రేరణ కలిగించే ప్రజ్ఞ ద్వారా, తానొక సిద్ధాంతాన్ని సాక్షాత్కరింపజేసికొన్నానని మాత్రమే ఆలారకాలాముడు చెప్పడం లేదు. తాను అర్థం చేసికొన్న సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నాడు కూడా!" అని, కాలాముని గురించి ఆలోచించిన సిద్ధార్థుడు, కాలాముని దగ్గరకు వెళ్ళి,"మిత్రమా, కాలామా! నీ ఆంతరికజ్ఞానంతో నీవు కనుగొని, ఆచరిస్తున్న ఈ ధ్యానవిధానం, సత్యాన్ని గురించి ఎంతవరకు చెబుతుంది?" అని అడిగాడు. అప్పుడు కాలాముడు, శూన్యతావాదాన్ని, ఏకాగ్రతయొక్క ఉన్నతదశను గూర్చి సిద్ధార్థునికి చెప్పాడు. "ఈ ధ్యానవిధానం పట్ల ఆలార కాలాముడు పొందిన విశ్వాసము, శక్తి, అప్రమత్తత, ఏకాగ్రత, జ్ఞానాలను నేను కూడా పొందగలుగుతున్నాను. కాలాముడు తాను సాక్షాత్కరించుకుని ఆచరిస్తున్న, ఆ సత్యాన్ని నేనూ దర్శించగలిగితే ఎలా ఉంటుంది?" అని ఆలోచించాడు సిద్ధార్థుడు.

అతి త్వరితకాలంలోనే, తన ఆంతరిక జ్ఞానంచేత, తానాసత్యాన్ని దర్శించి, ఆచరించగలిగాడు సిద్ధార్థుడు. కానీ ఉన్నతసత్యాన్ని గూర్చిన అవగాహనను పొందలేకపోయాడు. అతడు ఆలారకాలాముని

చేరి, “మిత్రమా, కాలామా! మీరు మీ జ్ఞానం చేత దర్శించి, ఆచరిస్తున్న సిద్ధాంతం, యింతేనా, ఇంకా ఏమైనా ఉందా? నేనుకూడా యీ ధ్యానవిధానాన్ని దర్శించి, ఆచరించగలుగుతున్నాను.” అని అన్నాడు. అసూయనెరుగని, ఆ ఉన్నత గురువు కాలాముడు, ఖ్యాతికెక్కిన తన శిష్యుని మానసిక విజయాన్ని గురించి విని ఆనందపడినాడు. తనతో సమానునిగా అతనిని గుర్తించి గౌరవించడమే కాదు, సిద్ధార్థుని మెచ్చుకుంటూ, ఇలా అన్నాడు. “మిత్రమా! సంతోషం. చాల సంతోషం. నీ వంటి గౌరవింపదగిన పరివ్రాజకుడుని తోడుగా పొందడానికి నేను చాలా సంతోషిస్తున్నాను. నేనే ధ్యానవిధానాన్ని స్వయంగా దర్శించి, ఆచరిస్తున్నానో, అదే ధ్యానవిధానం నీవూ దర్శించి, ఆచరిస్తున్నావు. నీ అంతట, నీవు దర్శించి, ఆచరిస్తున్న, అదే ధ్యానవిధానాన్ని నేను దర్శించి ఆచరిస్తున్నాను. నీవు తెలుసుకున్న దానినే నేనూ తెలుసుకున్నాను. నా అంతటి వాడివే నీవు. నీ అంతటి వాడినే నేను కూడా! రా, మిత్రమా! మనిద్దరమూ సన్యాస సంఘానికి ఆచార్యులుగా వ్యవహరిద్దాం. అని అన్నాడు కాలాముడు.

“మానసిక ఏకాగ్రతలో ఉన్నతదశకు మాత్రమే చేర్చి, జీవితంపట్ల అసహనాన్ని, విరాగత్వాన్ని, దుఃఖనిరోధాన్ని, ప్రశాంతతను, అంతరజ్ఞానాన్ని, జ్ఞానోదయాన్ని, నిర్వాణాన్ని కలిగించని, ఆ ధ్యానవిధానం పట్ల గౌతముడు తృప్తిని పొందలేదు. తన జ్ఞానాన్ని పెంచుకుని, తాను సమర్థునిగా ఎదుగక, తనవంటి మరో సన్యాసికి సాయమందించినా, తానా సంఘాన్ని నడుపలేదు. అలా చేసినట్లైతే, ఒక గ్రుడ్డివాడు, మరో గ్రుడ్డివానిని నడిపించినట్లవుతుంది.” అని ఆలోచించిన గౌతముడు, కాలాముని మాటలపట్ల అసంతృప్తుడై, అతనిని వదిలిపెట్టి, తన పయనాన్ని, కొనసాగించాడు.

ఆనాటి భారతీయ మేధావులు చదువుకోవడం, మతసిద్ధాంతాలనో, మరోదాన్నో వ్యాఖ్యానించుకోవడంతో కాలం గడిపేవారు. ఆధ్యాత్మిక జీవనాన్ని గడిపేవారికి ఏకాంతంగా జీవించాలన్నా, శిష్యగణంతో కలిసి జీవించాలన్నా, వారికి కావలసిన సౌకర్యాలన్నీ సమకూర్చబడేవి. వారి స్వభావానుగుణంగా, వారిలో చాలమందికి పెద్ద పెద్ద శిష్యగణాలుండేవి, కాబట్టి గౌతమునికి, ఆలారకాలాముని మించిన గురువు లభించడం కష్టంకాలేదు.

ఆ తరువాత గౌతముడు ‘ఉద్దకరామపుత్రుడు’ అనే గురువును చేరి, అతని ఆదరణలో, ధ్యానాన్ని అభ్యసించుటకు అనుమతిని పొంది, అతని శిష్యునిగా అంగీకరింపబడినాడు. అతి స్వల్పకాలంలోనే, తనగురువు నేర్పిన సంజ్ఞాసంజ్ఞ స్థితి కాని (Neither Perception nor Non-Perception) సమాధిని (ఎనిమిదవ సమాధి అనుభూతిని) ఈ దశలో, ‘చైతన్యం ఉంది’, అనిగాని, ‘చైతన్యం లేదు’ అనిగాని చెప్పలేము. ప్రాచీన భారతీయ ఋషులెవరూ, దీనిని మించినస్థాయికి చెందిన, ఆధ్యాత్మికానుభవాన్ని పొందినవారు కారు.

ఉన్నతుడైన ఆ గురువు, రాకుమారుడైన తన శిష్యుడు సాధించిన విజయాన్ని విని ఎంతో సంతోషించాడు. అతని పూర్వ గురువువలేగాక, శిష్యులందరి బాధ్యతను తీసికోమని కోరాడు. “మిత్రమా, చాలసంతోషం! మాకు చాలసంతోషంగా ఉంది. ఉద్దకరామునికి తెలిసిన సిద్ధాంతం, నీకూ తెలుసు. నీకు తెలిసిన ధ్యానవిధానం, ఉద్దకరామునికీ తెలుసు. రాముడు నీవూ సమానులే. రా, మిత్రమా! ఇప్పటినుండి సన్యాససంఘాన్ని నీవు నడుపుదువుగాని”. అని గౌతమునితో అన్నాడు.

అయితే సిద్ధార్థునికి యింకా అత్యున్నత సత్యాన్ని అందుకోవాలనే దాహం ఉంది. మనసుమీద పూర్తిగా ఏకాగ్రతను సాధించాడు గాని, తన లక్ష్యం ఇంకా చాలదూరంలోనే ఉందని గుర్తించాడు. అంతిమ

దశ అయిన నిబ్బానాన్ని /విముక్తిని, దుఃఖ నిరోధమార్గమైన – అంటే అన్ని తృష్ణలను నశింపజేసికొన్న దుఃఖనిరోధమార్గమైన నిబ్బానాన్ని, చేరుకోవడం అతని లక్ష్యం. ఉద్దకరాముని ధ్యానవిధానం కూడా, తన అంతిమ లక్ష్యసాధనకు దోహదపడదు అని తెలిసి, అక్కడినుండి కూడా వెళ్లిపోయాడు సిద్ధార్థుడు.

తాను నేర్చుకోవడానికి ఎన్నుకున్నవారు సాధించినదానికన్న, తాను దర్శింపదలచుకున్న జ్ఞానం గొప్పదని అర్థం చేసికున్నాడు. తాను దర్శించాలనుకున్న పరమ సత్యాన్ని నేర్పే వారెవరూ లేరని గ్రహించాడు. ఎవరికివారే ప్రయత్నించి, తెలుసుకోవలసినదే తప్ప, ఎవరూ ఎవరికీ సాయపడలేరని కూడా అర్థం చేసికొన్నాడు.

❖ ❖ ❖

2. జ్ఞానసమరం

"తనకుపనికిరానివి, చెడువి అయిన పనులను చేయటం చాల సులభం. ఉపయోగకరమైనవి, మంచివి అయిన పనులను చేయటం నిజానికి ఎంతో కష్టం"

–(ధమ్మపదం)

సంఘర్షణ:

లక్ష్యాన్ని చేరుకోలేక పోయిన, ధైర్యాన్ని కోల్పోని గౌతముడు, అసదృశమైన శాంతిని, పరమసత్యాన్ని వెదుకుతూ, మగధరాజ్య పరిసరాలలో తిరుగుతూ, త్వరలోనే, సేనాని నగర వ్యాపారకేంద్రమైన ఉరువెలకు చేరుకున్నాడు. అక్కడ, ఒక అందమైన ప్రదేశాన్ని తన నివాసంకోసం ఎన్నుకున్నాడు. ఇసుకతిన్నెలతో కూడిన నదీప్రవాహం, సుందరమైన వనం కలిగిన ఆ ప్రాంతం, ఊరికి దగ్గరగానున్న ప్రాంతం. అతడిలా ఆలోచించాడు.

"ఎంత అందమైన ప్రదేశమిది! సుందరమైన అడవి చెట్లతో, మనసును ఆహ్లాదపరచే నదీ ప్రవాహంతో, గ్రామానికి దగ్గరగానున్న ఈ ప్రాంతంలో నాకు ఆహారంకూడా లభించగలదు. ఏదైనా శ్రమపడి సాధించాలనుకునే, రాచబిడ్డలకు ఈ ప్రదేశం ఎంతో అనుకూలమైనది కదా!"

ప్రశాంతమైన వాతావరణం, పరసరాల సౌందర్యం, ఆకర్షణీయమైన ప్రకృతి దృశ్యాలతో పరిమళించే ఈ స్థలం, అతని ధ్యానానికి అనుకూలమైనది. లక్ష్య సాధనకోసం, ఆ ప్రాంతంలోనే, ఏకాకిగా నివసించాలని అతడు నిర్ణయించుకున్నాడు.

గౌతముని భవిష్యత్తును నిర్ధారించి చెప్పిన, యువకుడు కొండణ్ణ, మిగిలిన ఏడుగురు బ్రాహ్మణుల కుమారులలో నలుగురైన, భద్దియ, వప్ప, మహానామ, అస్సజి అనేవారు మొత్తం అయిదుగురు సిద్ధార్థుని గృహపరిత్యాగాన్ని గూర్చి విని, తామూ సంసారాన్ని త్యజించి అతనితో పాటే ఉండసాగారు.

ప్రాచీన భారతదేశంలో, కర్మకాండలకు, మతపరమైన ఆచారాలకు, తపస్సులకు, యజ్ఞయాగాదులకు ప్రాధాన్యాన్నిచ్చేవారు. కఠినతరమైన పరివ్రాజక జీవితాన్ని గడపనిదే, ఏమీ సాధించడం వీలుకాదు, అన్న ప్రగాఢమైన విశ్వాసాన్ని కలిగి ఉండేవారు, అదే నమ్మకంతో, ఆరు సంవత్సరాల కాలం గౌతముడు, జ్ఞానోదయం కోసం మానవాతీతమైన సమరాన్ని ఎడతెగకుండా కొనసాగించాడు. అతని సున్నితమైన శరీరం, అస్థిపంజరంలా తయారయింది. శరీరాన్ని కష్టపెట్టుకున్న కొలదీ, అతడు తనకు తెలియకనే, తన లక్ష్యసాధనకు దూరం కాసాగాడు. తానెంత తీక్షణంగా శ్రమించినదీ, ఏయే విధానాలను అనుసరించినదీ, క్రమంగా తన అంతిమ లక్ష్యాన్నెలా చేరుకున్నదీ అన్న వివరాలను అతడు తన మాటలలోనే స్పష్టం చేసినట్లుగా వివిధ 'సుత్తములు' (బౌద్ధ ప్రామాణిక గ్రంథం) చెబుతున్నాయి.

మహాసచ్చాక సుత్త అతని ప్రాథమిక ప్రయత్నాలను గూర్చి ఇలా చెబుతుంది.

“పళ్ళను బిగించి, నాలుకను అంగిటికి నొక్కిపెట్టి, ధర్మబద్ధమైన తలపులతో, చెడుతలపులను అణచి నశింపజేస్తే ఎలా ఉంటుంది?” అన్న ఆలోచన నన్ను ఆవరించుకున్నది. అలాగే నేను నా పళ్లను బిగించి, శ్రమపడి నాలుకను అంగిటికి నొక్కిపెట్టి, ధర్మబద్ధమైన తలపులతో, నాలోని చెడు తలపులను అణచి నశింపజేశాను. శ్రమ అధికమవుతున్న కొలదీ, నా బాహుమూలల (చంకలు) నుండి చెమటలు ప్రవహింప మొదలిడినాయి. బలవంతుడొకడు, ఒక బలహీనుని తలను, భుజములను గట్టిగా పట్టి, క్రిందకి నొక్కి, పడగొట్టి స్వాధీనపరచుకొనినప్పుడు కలిగినంతటి బాధతో సమానమైన బాధను అనుభవించినా, నేను వెనుదిరగక పోరాడుతూనే ఉన్నాను.

నా శక్తి సంపూర్ణమైనది. అజేయమైనది. నా అప్రమత్తత శాశ్వతమైనది. చలించనిది. బాధాకరమైన శ్రమవలన, నా శరీరం అలసిపోయినా, ఆ శ్రమవలన మరింత శక్తిమంతుడినే అయ్యాను. బాధాకరమైన సంవేదనలు ఉత్పన్నమయినా, అవి నా మనస్సును మాత్రం తాకలేదు.

అప్పుడు నేను, శ్వాసరహిత పరమానందస్థితిని పెంపొందించుకుంటే ఎలా ఉంటుంది? అని ఆలోచించాను.

“దాని ప్రకారం, నేను నా నోటినుండి, ముక్కు రంధ్రాలనుండి, సాగే ఉచ్ఛ్వాస నిశ్వాసాలను పరిశీలించాను. అలా పరీక్షించినపుడు, శ్వాసను నిరోధించినపుడు, నా చెవులనుండి వెలువడే గాలి పెద్దపెద్ద శబ్దాలను చేయటం గమనించాను. ఒక కంసాలివాని కొలిమి తిత్తినుండి వెలువడే గాలి చేసే పెద్ద శబ్దాలను నా చెవులనుండి వెలువడే గాలికూడా సృష్టించడాన్ని గమనించాను.

ఏదేమైనా, నా శక్తి పరిపూర్ణమైనది. అజేయమైనది. నా జాగరూకత శాశ్వతమైనది, చలించనిది. బాధాకరమైన శ్రమవలన, నా శరీరం అలసిపోయినా, ఆ శ్రమవలన శక్తిమంతుడినే అయ్యాను. బాధాకరమైన సంవేదనలు నాలో ఉత్పన్నమయినా అవి నా మనసును తాకలేదు.

అప్పుడు నేను శ్వాసరహితవ్యాయామాన్ని చేసినట్లయితే ఎలా ఉంటుంది? అని ఆలోచించాను. దానిప్రకారం, నోటినుండి, ముక్కురంధ్రాలనుండి, చెవులనుండి వచ్చిపోయే ఉచ్ఛ్వాసనిశ్వాసాలను పరీక్షించాను. నేను నోటినుండి, ముక్కురంధ్రాలనుండి, చెవులనుండి శ్వాసించడాన్ని నిరోధించాను. లోపలున్న గాలి అత్యంత క్రూరంగా నా కపాలాన్ని తాకటం ప్రారంభమయింది. బలవంతుడయినవాడు, నిశితమైన ఆయుధంతో, నా కపాలాన్ని రంధ్రం చేస్తున్నట్లు, నేను శ్వాసను నిరోధించగానే, లోపలున్న గాలి నా కపాలాన్ని క్రూరంగా బద్ధలు కొట్టడం ప్రారంభించింది. నాలో ఉత్పన్నమయిన బాధాకరమయిన సంవేదనలు, నా మనసును మాత్రం తాకలేకపోయాయి.

శ్వాసరహిత పరమానందాన్ని పెంపొందించుకుంటే ఎలా ఉంటుంది? అని మళ్ళీ నేను ఆలోచించాను. దాని ప్రకారం, నోటినుండి, శ్వాసరంధ్రాలనుండి, చెవులనుండి కూడా గాలిని నిరోధించి పరిశీలించాను. అత్యంత అధికమైన గాలి నా పొట్టను చీలుస్తున్నట్లు బాధించడాన్ని గమనించాను. ఒక కసాయివాడో, అతని సహాయకుడో, వాడియైన కత్తితో, పొట్టను చీలుస్తున్నట్లుగా, లోపల బంధింపబడిన అధికమైనగాలి, నా పొట్టను చీల్చడాన్ని మొదలుపెట్టింది.

ఏది ఏమైనా, నా శక్తి సంపూర్ణమైనది. బాధాకరమైన యిటువంటి సంవేదనలు నా మనస్సుపై మాత్రం ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి.

శ్వాసరహిత పరమానందాన్ని ఇంకా పెంపొందించుకుంటే ఎలా ఉంటుంది? అని మళ్ళీ ఆలోచించాను. దానిప్రకారం, నా నోటినుండి, శ్వాసరంధ్రాల నుండి, చెవులనుండి తిరిగే ఉచ్ఛ్వాస నిశ్వాసాలను పరిశీలించాను. నేనిలా నా శ్వాసను ఆపినకొద్దీ, ఒక భయంకరమైన మంట, నా శరీరరంధ్రాల ద్వారా లోనికి చొచ్చుకొని వచ్చి, నా శరీరాన్ని తాకింది. ఇద్దరు బలవంతులు కలిసి, చేతులను పట్టి, మండుతున్న బొగ్గుల గుంటలో వేసి పూర్తిగా దహింపజేసినట్లు, శరీర రంధ్రాల నుండి చొచ్చుకొని వచ్చిన మంటలు నా శరీరాన్ని బాధించాయి.

ఏది ఏమయినా, నా శక్తి పరిపూర్ణమైనది. ఎటువంటి బాధాకరమైన సంవేదనలూ, నా మనసును తాకలేదు.

ఈ స్థితిలో నన్ను చూసిన దేవతలు, "గౌతముడు మరణించాడు" అని అన్నారు. "గౌతముడు ఇంకా మరణించలేదు, కానీ మరణిస్తూ ఉన్నాడు" అని మరికొందరు అన్నారు. ఇంకొందరు దేవతలు మాత్రం, "గౌతముడు మరణించనూలేదు. మరణిస్తూనూ లేదు. కానీ అర్హతుడవుతున్నాడు. ఒక అర్హతుడు కొనసాగవలసిన సరియైన మార్గమిదే!" అని గుర్తించారు.

నిరాహార పద్ధతికి మార్పు:

అప్పుడు నేను, "నిరాహారపద్ధతిలో ధ్యానాన్ని సాగిస్తే ఎలా ఉంటుంది?" అని ఆలోచించాను.

అప్పుడు దేవతలు నా దగ్గరికి వచ్చి, " ఓ మహాత్ముడా! పూర్తిగా నిరాహార పద్ధతిని అనుసరించవద్దు. మీరలా చేసినట్లయితే, మేము పవిత్రమైన ద్రవాలను మీ దేహరంధ్రాలద్వారా లోనికి పంపుతాము. దానివలన మీరు దృఢంగా ఉండగలరు." అని అన్నారు.

"నేను నిరాహార దీక్షను కొనసాగిస్తున్నపుడు, ఈ దేవతలు, పవిత్ర ద్రవాలను నా శరీరరంధ్రాల ద్వారా లోనికి పంపడం జరిగితే, నాకు ప్రాణహాని లేని మాట నిజమే, కానీ నా వైపునుండి నేను మోసగాడినే అవుతాను. కాబట్టి వారిని నిరాకరించాలి." అని తలచి, "అవసరం లేదు" అని వారితో అన్నాను.

అప్పుడు నా కొక ఆలోచన కలిగింది. "నేను కొద్దికొద్దిగా ఆహారాన్ని తీసికోవడమో, లేక అతి తక్కువ మోతాదులో, ఏ పెసర రసమో, బఠాణీలో, లేదా ఏవైనా చిక్కుళ్ల జాతికి చెందిన గింజలను గాని తీసికుంటే ఎలా ఉంటుంది?" అని ఆలోచించాను.

ఆహారాన్ని అతి తక్కువ పరిమాణంలో తీసుకోవడం చేత, నా శరీరం బాగా కృశించి పోయింది. బలమైన ఆహారం లేక పోవడం చేత, నా శరీరభాగాలన్నీ, పటుత్వాన్ని కోల్పోయి, రెల్లుగడ్డి కణుపుల్లా, నల్లేరు తీగల కణుపుల్లా అయి పోయాయి. ఒంటె గిట్టల వలె దృఢంగా ఉండిన నా తొడలు బలహీనపడినాయి. శిథిలమయిన ఇంటి దూలాలు చెల్లాచెదురయి నట్లు, నా ప్రక్కటెముకలు శిథిలమయ్యాయి. లోతయిన బావిలో దూరంగా కనిపించే చుక్కల్లా, నా కనుగ్రుడ్లు, లోతుకు వెళ్ళాయి. పచ్చిగానున్నపుడు కోసిన గట్టి గుమ్మడి కాయ, ఎండా గాలి తగిలి ముడుచుకొని పోయినట్లు, నా తలచర్మం కూడా ముడతలు పడి, కృశించింది.

నేను నా పొట్టనుతాకినపుడు, నా చేతికి వెన్నెముక తగిలింది. నా వెన్నెముకను తాకినపుడు, నా పొట్ట చర్మం తగిలింది. బలమైన ఆహారం లేనందువలన, నా పొట్టచర్మం, వెన్నెముకకు అంటుకుని పోయింది. మలమూత్ర విసర్జనలప్పుడు, ఉన్నచోటనే శక్తి చాలక కూలి పోతున్నాను. నన్ను నేను, బలోపేతునిగా చేసుకోవడం కోసం, నా శరీరభాగాలను మర్దనా చేసికున్నాను. ఫలితంగా, నా శరీరం పైనున్న జుట్టు రాలిపోయింది. నన్ను చూసినవారు, "గౌతముడు, నల్లగా మారాడు" అన్నారు. కొందరేమో, "నలుపు వర్ణంకాదు, నీలివర్ణంలోకి మారాడు." అన్నారు. మరికొందరేమో, "నలుపు వర్ణమూ కాదు, నీలివర్ణమూ కాదు, కపిలవర్ణంలోకి మారాడు." అని అన్నారు. ఆహారం లేనందువలన నా శరీరశుద్ధ వర్ణం, వెలిసినట్లుగా మారిపోయింది.

అప్పుడు నేనిలా ఆలోచించాను. "పూర్వం సన్యాసులూ, బ్రాహ్మణులూ, ఎంతో శ్రమించి దర్శించిన వాస్తవమూ, బాధాకరమూ, నిశితమూ, తీవ్రమూ అయిన సంవేదనలు, ఇంతే అయిఉంటాయి. ఇంతకన్న ఎక్కువగాదు. భవిష్యత్తులో సన్యాసులూ, బ్రాహ్మణులు కూడా, తమనుతాము ఎంత కష్టపెట్టుకుని సాధన చేసినా, వాస్తవమూ, బాధాత్మకమూ, నిశితమూ, తీవ్రము అయిన సంవేదనలను ఇంతే పొందగలరు. వీటికన్నా ఎక్కువగా పొందలేరు. ఈ కఠినతరమైన సాధన వలన, మానవ సహజమైన శ్రేష్ఠమైన పరమ జ్ఞానాన్ని, అంతర్ముఖత్వాన్ని, పరమశాంతిని పొందలేను. జ్ఞానోదయాన్ని పొందడానికి తగిన మార్గం మరేదో ఉన్నది."

క్రూరమారుని ప్రలోభాలు:

ఇన్నాళ్లుగా, గౌతముడు ఆచరించిన కఠినతరమైన నియమాలన్నీ నిష్ప్రయోజనమైనవని తేలాయి. అవి, అతని బలాన్ని హరించడానికే తోడ్పడినాయి. దృఢమైన అతని శరీరం, ప్రస్తుతం సున్నితంగా మారడం మాత్రమేగాక, ఏ చిన్ని కష్టాన్ని కూడ ఎదురుకొనలేని స్థితికి చేరుకున్నది.

అతని ప్రశాంతమైన ఆకారం, గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. బంగారువర్ణపు దేహచ్ఛాయ. కళావిహీనమై పోయింది. శరీరంలోని

రక్తం, ఇంకిపోయింది. అతని బలమైన కండరాలు క్షీణించాయి. కన్నులు లోతుకు పోయాయి. చూపు మందగించింది. మొత్తం మీద బ్రతికున్న అస్థిపంజరంలా మారిపోయాడు. అతడు మరణం తీరానికి చేరుకున్నాడు.

ఇటువంటి క్లిష్టమైన స్థితిలోకూడా, ప్రధాన ధ్యేయాన్ని సాధించాలన్న తపనతో, ఆ నిరంజనా నదీ తీరంలో, పరమ భద్రతా స్థితి అయిన నిర్వాణాన్ని సాధించాలన్న ప్రయత్నంలోనున్న, గౌతముని వద్దకు నముచి (మారుడు) వచ్చి ఇలా అన్నాడు. "మీరు సన్నబడినారు. రూపం చెదిరిపోయినది. మరణానికి చేరువయ్యారు. మీలోని వేయి భాగాలు మరణానికి దగ్గరపడగా, ఒక్క ప్రాణం మాత్రమే మిగిలి ఉంది. ఓ మహనీయుడా! మీరు బ్రదకాలి. జీవితం గొప్పది. బ్రతికి ఉంటే మీరు ఎటువంటి కార్యాలనైనా సాధించవచ్చు.

బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తూ, యజ్ఞయాగాదులు చేయడం ద్వారా, ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చు. మిమ్ములను మీరు శ్రమకు లోను జేసికొని సాధించేదేమున్నది? ఈ మార్గం క్లిష్టతరమైనది, కఠినమైనదికూడా. లక్ష్యసాధన తేలికైన కార్యం కాదు." ఈ మాటలు పలుకుతూ, మారుడు, ఆ ఉన్నతుని ముందు నిలబడినాడు.

ఇలా మాట్లాడిన మారునితో ఉన్నతుడైన గౌతముడిలా అన్నాడు. ఓ దురాత్మా! ప్రమత్తుల బంధువా! నీవు నీ స్వార్థంతో ఇక్కడకు వచ్చావు. గుణలేశము వలన ఏమీ సాధించలేము. ఓ మారుడా! నీవీ విధంగా మాటలాడటం, ఏ అయోగ్యులదగ్గరో అయితే బావుంటుంది.

శ్రద్ధ, ఆత్మ నిగ్రహం, వీరము, ప్రజ్ఞ అన్నవి నా లక్షణాలు. ఇలాంటి నా జీవితాన్ని గురించి ఎందుకు ప్రశ్నిస్తావు?

ఈ గాలికి నదీ ప్రవాహాలు కూడా ఎండగొట్టబడుతాయి. ఈ కఠోరస్థితిలో నాలోని రక్తం ఎండిపోక ఎందుకుంటుంది?

రక్తం ఎండిపోయినపుడు, పిత్తము, శ్లేష్మము కూడా ఎండిపోతాయి. నా కండరాలు కరిగిపోతున్న కొలదీ నా మనసు తేట పడుతుంది. నాలోని అప్రమత్తత, జ్ఞానం, ఏకాగ్రతలు ఇంకా దృఢతరమవుతాయి.

పరమసంవేదనలతో నేనిలా జీవిస్తున్నపుడు, నా మనస్సు లాలసకు దూరమవుతుంది. వ్యక్తి లోని పవిత్రతను గమనించు.

ఇంద్రియకాంక్షలు నీ ప్రథమ సేన. రెండవది అరతి, అంటే పవిత్రజీవనం పట్ల ఏహ్యత. మూడవది ఆకలిదప్పులు. నాలుగవది తృష్ణ. అయిదవది బద్ధకము, జడత్వములు. ఆరవది భయము. ఏడవది విచికిత్స, అంటే అనుమానము. ఎనిమిదవది వికర్షణ, మంకుతనములు. తొమ్మిదవది లోభము, పొగడ్తలు, సత్కారం, కీర్తికాంక్షలు. పదవది స్వోత్కర్ష, పరనిందలు. ఓ నముచీ! ధూర్త లక్షణాల పోషకుడా! ఇవీ నీ సైన్యాలు. పిరికివాడు నీ సైన్యాన్ని జయించలేడు. జయించినవాడు సంతోషాన్ని పొందుతాడు.

ఈ ముంజ గడ్డిని నేను ప్రదర్శిస్తున్నాను. ఈ ప్రపంచంలో జీవితానికి ప్రయోజనం ఏమిటి? ఓడిపోయి బ్రతకడం కన్న నాకు యుద్ధంలో మరణమే మేలయినది.

కొంతమంది పరివ్రాజకులు, బ్రాహ్మణులు ఈ యుద్ధంలో పాల్గొన లేరు. వారు, తాము ధర్మమార్గాన్ని త్రొక్కారా? అని కూడా తెలియనివారు.

మారుడు ఏనుగు మీద వస్తూ అన్నివైపులనుండి తన సైన్యంతో చుట్టుముట్టగనే, నేను పోరాటానికి ముందుకు నడిచాను. ఓ మారుడా! నన్ను నా స్థానం నుండి వెనుకకు తోయలేవు. ప్రపంచం, దేవతలందరూ ఏకమైనా జయించలేని నీ సైన్యాన్ని, నా ప్రజ్ఞతో, పచ్చి మట్టిగిన్నెను రాతితో పగులగొట్టినంత సులభంగా నాశం చేయగలను.

అప్రమత్తతతో, నా ఆలోచనలను నియంత్రించుకుని, దేశం నుండి దేశానికి తిరుగుతూ, ఎంతోమంది శిష్యులకు శిక్షణనివ్వగలను. శ్రద్ధతో, మంచి ఉద్దేశ్యంతో, నా ఉపదేశాలను సావధానతతో ఆచరిస్తూ, నా శిష్యులు లక్ష్యపెట్టరు. నా శిష్యులు, ఎక్కడికి వెడితే దుఃఖం ఉండదో, అక్కడికి వెడతారు.

మధ్యేమార్గం:

ప్రాచీన కాలంలో సాధకులు, తత్వవేత్తలు తప్పనిసరి అని భావించిన, కఠిన నియమాలద్వారా, తమనుతాము శోషింపజేసికునే విధానాన్ని, బుద్ధి కుశలతను, విశ్వాసాన్ని, ధైర్యాన్ని క్షీణింపజేసి, బలహీనపరచే విధానాన్ని, తానిన్నాళ్లు ఆచరించిన కఠినతరమైన, బాధాతప్తమైన ఆ విధానాన్ని, గౌతముడు, తన స్వీయానుభవం ద్వారా వ్యర్థమైనదని గ్రహించి, త్రోసిపుచ్చాడు. మరోవైపున, నైతికప్రగతిని అలక్ష్యంచేసే, మనసునకు నచ్చినట్లుగా వెళ్ళే మార్గాన్నీ త్రోసిపుచ్చాడు. శ్రేష్ఠమైన మధ్యంతరమార్గమైన, మధ్యేమార్గాన్ని, భవిష్యత్తులో అతని బోధనలకొక ప్రత్యేకతను కలిగించబోయే లక్షణాలలో ఒకటయిన, మధ్యమ మార్గాన్ని ఎన్నుకోవాలని నిశ్చయించుకున్నాడు.

ఏరువాకపండుగ సమయంలో, నేరేడు చెట్టుక్రింద, చల్లటి నీడలో కూర్చుండి, శ్వాసమీద ధ్యాస నిలిపి, ప్రథమ ధ్యానాన్ని (సమాధి స్థితిని), సాధించిన విధానాన్ని గుర్తుకు తెచ్చికొన్నాడు. "ఔను, ఇదే జ్ఞానోదయానికి సరియైన మార్గం." అని నిశ్చయించుకున్నాడు.

పూర్తిగా శుష్కించిన శరీరంతో జ్ఞానోదయాన్ని పొందడానికి వీలుకాదు, అనే విషయాన్ని గౌతముడు గ్రహించాడు. మానసిక బలానికి శారీరక బలం తప్పనిసరిగా అవసరం. శరీరానికి బలం కావాలంటే మితాహారం తీసికోవడం తప్పదని గ్రహించినవాడై, ఘన, ద్రవాహారాలు రెండింటినీ స్వల్పంగా తీసికోవాలని తీర్మానించుకున్నాడు.

గౌతముడు ఏది తెలిసికున్నా, తమకా జ్ఞానాన్ని నేర్పుతాడని ఆశించిన అయిదుగురు శిష్యులు, ఇన్నాళ్ళు గౌతముని అనుయాయులుగా నున్న ఆ అయిదుగురు శిష్యులు, ఈ అనుకోని పరిణామానికి నిరాశ చెందినారు. గౌతమునీ, ఆ స్థలాన్ని కూడా విడిచిపెట్టి, 'ఇసిపతనం' (ఇసిపట్టణం) చేరుకున్నారు. "గౌతముడు, లాలసకు లోబడినాడు. కఠినతరమైన మార్గాన్ని విడిచిపెట్టి, సౌకర్యవంతమైన జీవితం వైపు మరలుతున్నాడు." అని అక్కడివారితో చెప్పడం మొదలుపెట్టారు.

నిజంగా సహాయం అవసరమయిన సందిగ్ధసమయంలో, అతని సహాయకులు అతనిని ఒంటరి వానిగా విడిచిపెట్టి వెళ్ళిపోయారు. అతడు నిరాశ పడలేదు. తానునుభవించిన క్లిష్టమైన పోరాట సమయాలలో, అతనికి సహాయకారిగానే ఉండినా, వారిప్పుడు తమకుతాముగా తనను వదలివెళ్లిపోవడం అన్నది అనుకూలంగానే పరిణమించింది. ఆ ప్రాకృతిక ఏకాంతవాసంలోనే ప్రతిభావంతులు, అగాధమైన సత్యాలను అర్థం చేసికోవడమో, అత్యంతక్లిష్టమైన సమస్యలకు పరిష్కారాన్ని గ్రహించడమో అన్నది తరచూ జరిగే అపురూపమైన అంశాలు.

సత్యోదయం:

కొంత ఘనాహారాన్ని తీసికొని, కోల్పోయిన బలాన్ని పుంజుకున్నాడు, గౌతముడు. బాల్యంలో తాను పొందిన ప్రథమ ధ్యానాన్ని సులభంగా వృద్ధి చేసికొన్నాడు. నెమ్మదిగా, రెండవ, మూడవ, నాల్గవ ధ్యానాలను కూడ అభివృద్ధిపరచుకొనినాడు.

ధ్యానాలను అభివృద్ధి చేసికొన్న కొలది, అతడు సమగ్రమైన మానసిక ఏకాగ్రతను సాధించాడు. అతని మనసు దూరానుగత దృశ్యాలను కూడా ప్రతిఫలింపగల శుభ్రమైన అద్దంలా రూపుదిద్దుకున్నది.

ప్రశాంతమైనవి, పవిత్రమైనవి, లాలసమాలిన్యాలు అంటనివి, సున్నితమైనవి, జాగృతమైనవి, స్థిరమైనవి, కదిలించలేనివి అయిన తన ఆలోచనలను, గౌతముడు తనపూర్వజన్మ జ్ఞాపకాలకు సంబంధించిన జ్ఞానాన్ని గ్రహించేదిశగా మలుపుతిప్పాడు.

తన పూర్వ జన్మలలో, తానుపొందిన భాగస్వామ్యాలను అతడిలా గ్రహించాడు. మొదట ఒక జీవితం, తరువాత రెండు జీవితాలు, తరువాత మూడు, నాలుగు, ఐదు, పది, ఇరవై మొదలు యాభై జీవితాలు, తరువాత వంద, వేయి, లక్ష; విషయాసక్తితో విశ్వ ఆవృతులను, ఆ ఆవృతుల పుట్టుకను, వర్తనలను, ఆ చక్రంలో తాను ఫలానా పేరితో, ఫలానా కుటుంబంలో, ఫలానాకులంలో, ఫలానా ఆహారపు అలవాట్లతో, సంతోషదుఃఖసమ్మిశ్రితమైన జీవితానుభవంతో, చివరకు మరణం, అక్కడినుండి విడివడి, మరోచోట జన్మించడం, అక్కడ అతని పేరు ఫలానా, కుటుంబం, కులము, ఆహారవిధానాలు, సుఖదుఃఖాల అనుభవాలు ఫలానా ఫలానా అని అనుభూతంకావడం, మళ్ళీ మరణించడం.... ఆ విధంగా మరణించడం, జన్మించడం అన్న ఆవృతులను గుర్తించాడు.

ఆ విధంగా పూర్వజన్మలలో తన వైవిధ్యభరితమైన భాగస్వామ్యాన్ని, ఆ వివరాలను గుర్తుకు తెచ్చుకున్నాడు. వాస్తవమైన, రూఢియైన ఆ ప్రథమజ్ఞానాన్ని, రాత్రి ప్రథమ జాగరణలో గ్రహించాడు.

పూర్వజన్మల గురించిన తన అజ్ఞానాన్ని (అవిద్యను) ఛేదంచేసి, తన పవిత్రమయిన మనసును, జీవుల అంతము, పుట్టుకలపై అప్రమత్తమైన తన దృష్టిని లగ్నం చేశాడు. పవిత్రమైన, అసాధారణమైన, అతీతమానవ జ్ఞానదృష్టితో (Clairvoyant vision) ఒక జన్మనుండి మరణించిన తరువాత మరో చోట జన్మించడం, అట్టడుగు స్థితిలో కాని, ఉన్నతమైనస్థితి కాని, అందంగా కాని అందవిహీనంగా కాని, మోదభేదాలతోగాని మొదలైనవన్నీ కూడా ఆయా జీవులు ఆచరిస్తున్న కర్మల ఫలితమేనని గ్రహించాడు. మంచిమనుష్యులయినా, వారు చెడు పనులను చేయడం, చెడు మాటలు మాట్లాడటం, చెడు ఆలోచనలను కలిగిఉండటం, గౌరవనీయులను దూషించడం, నమ్మకద్రోహం చేయటం, నమ్మకద్రోహులకు విశ్వాసపాత్రులుగా నుండటం ఈ మొదలైన కర్మల ఫలితంగా తమ మరణానంతరం దుఃఖభాజనులుగానే జన్మిస్తున్నారు అని తెలిసికొన్నాడు. అదే మంచివారు, తమ మంచి మాటలు, చేతలు, ఆలోచనల వలన, గౌరవనీయులను గౌరవించడం వలన, నమ్మకస్థులుగా జీవించడం, నమ్మకస్థులకు విశ్వాసపాత్రులుగా ఉండటం వంటి మంచి కర్మలనాచరించడం వలన, తమ మరణానంతరం, ఆనందాత్మకమైన లోకాలలో జన్మిస్తున్నారని తెలిసికొన్నాడు.

ఈ విధంగా తన అతీత అంతర్దృష్టితో, జీవుల మరణము, పుట్టుకలకు, తాము ఆచరిస్తున్న కర్మలు కారణమవుతున్నాయని గ్రహించాడు.

వాస్తవమైన, రూఢియైన ఈ రెండవ రకమైన జ్ఞానాన్ని (అవగాహన), నడిరాత్రి అనుభూతి పొందాడు. అవిద్యను నశింపజేసి జ్ఞానోదయం (నిబ్బానము, జుఅశ్రీఅస్త్రష్ట్రవఅఎవత్) పొందినాడు.

సత్యంతో తననుతాను మమేకం చేసికొన్న బుద్ధ భగవానుడు ఈ విషయాలను గ్రహించాడు.: "ఇది దుఃఖము, ఇది దుఃఖ కారణము, ఇది దుఃఖ నిరోధము, ఇది దుఃఖ నిరోధమార్గము". అలా సత్యమగ్నుడయిన బుద్ధ భగవానుడు ఈ విధంగా అవగాహన చేసుకొన్నాడు.

తను విముక్తుడనయ్యానని తెలిసికొన్న బుద్ధ భగవానుడు, "నేనిప్పుడు విముక్తుడను. పునర్భవ ఆవృతం నుండి విముక్తుడనయ్యాను. నా పవిత్రజీవనం సంపూర్ణమయింది.

రాత్రి ఆఖరు జాగరణలో అతడు కనుగొన్న మూడవ జ్ఞానమిది. అజ్ఞానం తొలగి జ్ఞానం ఉదయించింది. చీకట్లు తొలగి వెలుగురేకలు వ్యాపించాయి.

❖ ❖ ❖

3. బుద్ధత్వము

"తథాగతులు ఉపదేశకులు మాత్రమే" ధమ్మపదం

బుద్ధుని గుణగణాలు:

అత్యద్భుతమయిన, తీక్షణమయిన ఆరేళ్ళ పోరాటం తరువాత, తన 35వ యేట, శ్రమణ గౌతముడు, ఎటువంటి అతీత ప్రాకృతిక శక్తుల, ఉపదేశకుల సహాయసహకారాలు లేకనే, స్వప్రయత్న స్వయం ప్రజ్ఞలమీద ఆధారపడి, మాలిన్యాలను తుదముట్టించాడు. నేర్చుకునే విధానాన్ని పూర్తిచేశాడు. స్వప్రబోధం చేత వస్తువులను, ప్రాపంచిక విషయాలను ఉన్న వానిని ఉన్నట్లుగానే గుర్తించే ప్రజ్ఞను పెంపొందించుకొని, జ్ఞానోపదేశం చేయగల జాగృతుడయిన బుద్ధునిగా మారాడు. అప్పటినుండి, అతడు గౌతమబుద్ధునిగా పిలువబడుతూ, భూత, భవిష్యత్ బుద్ధుల పరంపరలో ప్రత్యేకమైన గుర్తింపును పొందాడు.

అతడు బుద్ధునిగనే జన్మించలేదు. స్వప్రయత్నంచేత మాత్రమే బుద్ధుడయినాడు.

'అవగాహన చేసికొను', 'మేల్కొను' అనే అర్థాలు గల, 'బుధ్' అనే ధాతువు నుండి, ఏర్పడిన పాళీ భాషాపదం, 'బుద్ధ' అన్న పదం. చతురార్య సత్యాలను సంపూర్ణంగా గ్రహించి, అవిద్య అనే నిద్రనుండి జాగృతుడయినవాడు గనుక 'బుద్ధుడు' అని పిలువబడినాడు. తాను గ్రహించిన ధర్మాన్ని, విశ్లేషించి, వివరించి ఇతరులను జాగృతపరచిన, ఈ గౌతమబుద్ధుడు, ధర్మాన్ని గ్రహించి కూడా ఇతరులను మేల్కొలుపని, ప్రత్యేక (వ్యక్తిగత) బుద్ధులకన్న వేరయినవాడు. అందుకే 'సంపూర్ణ జ్ఞానమును పొందినవాడు' అనే అర్థంలో, 'సమ్మా సంబుద్ధ' అన్న గుర్తింపును పొందాడు.

జ్ఞానోదయానికి పూర్వం అతడు ఒక 'బోధిసత్వుడు' మాత్రమే! బుద్ధత్వాన్ని పొందాలని అభిలషించేవారిని, 'బోధిసత్వులు' అంటారు. బుద్ధత్వం పొందాలనుకున్న, ప్రతియొక్కరు, దాతృత్వం, క్రమశిక్షణ, త్యాగశీలత, జ్ఞానం, శక్తి, సహనం, నిజాయితీ, పట్టుదల, ఉపకారబుద్ధి, సమదృష్టి - అన్న లక్షణాలను, తీవ్రతరమయిన అభ్యాసం చేత పెంపొందించుకుని, ఈ బోధిసత్వస్థితిని దాటవలసినవారే!

ఒక ప్రత్యేకయుగంలో, ఒకే ఒక్క 'సమ్మా సంబుద్ధుడు' మాత్రమే ఉద్భవిస్తాడు. కొన్ని అరుదయిన మొక్కలు, వృక్షాలు ఒక్కొక్క పువ్వును మాత్రమే పూసినట్లు, విశ్వవ్యవస్థ కూడా, ఒకే ఒక సమ్మా సంబుద్ధుడు మాత్రమే జన్మిస్తాడు.

బుద్ధుడు, ఒక ప్రత్యేకతగలిగిన వ్యక్తి. దేవతలయొక్క, మానవులయొక్క శ్రేయస్సునూ, లాభప్రాప్తినీ, ఆనందాన్నీ, అభిలషిస్తూ, విశ్వకరుణ భావనను కలిగిన, బుద్ధులు ఈ ప్రపంచంలో అరుదుగనే జన్మిస్తారు. బుద్ధుడు ఒక అత్యద్భుతమయిన వ్యక్తి గనుక, ఆశ్చర్యకరమయిన మనిషి (ఆాఎఝతీఅఝ మీఝఅబంయ) అని అతనిని పిలిచారు. మరణం లేకుండా చేస్తాడు గనుక, 'అమతస్స దాతా' అన్నారు. అమలిన ప్రేమను, అగాధమయిన, నిగూఢమయిన జ్ఞానాన్ని, పరమసత్యాన్ని అందించినవాడు గనుక, 'వరద' అని పిలిచారు. ధర్మదేవతగనుక, 'ధమ్మ స్వామి' అన్నారు.

బుద్ధుని మాటల్లోనే చెప్పాలంటే, అతడు సాఫల్యమును పొందినవాడు/సఫలీకృతుడు (తథాగతుడు). అర్హుడయినవాడు, సంపూర్ణ జ్ఞానోదయం పొందినవాడు (సమ్మా సంబుద్ధుడు), ఇంకా ఉద్భవించని దానిని సృష్టించినవాడు, ఇంకా ఏర్పడనిదానిని నిర్మించినవాడు, ఇంకా ప్రకటింపబడని విధానాన్ని బహిరంగపరచినవాడు, మార్గాన్ని తెలిపినవాడు, మార్గదర్శకుడు, ఆధికారికంగా మార్గాన్ని గుర్తించిన వాడు కూడా!

బుద్ధుని జ్ఞానోదయసాధనలో ఏ గురువు పాత్రలేదు. "నాకు గురువు లేడు" (నా మే ఆచార్యో అత్తి) అన్నాడు బుద్ధుడు. లౌకిక జ్ఞానాన్ని, మామూలు గురువులనుండి గ్రహించాడు. కాని పారలౌకికజ్ఞానాన్ని, ఎవరి సాయమూ లేక, తన అంతరిక ప్రజ్ఞద్వారా తనకు తానై గ్రహించాడు.

తన జ్ఞానాన్ని, వేరొక గురువు నుంచి గాని, తానిన్నాళ్లూ పుట్టిపెరిగిన వైదిక సాంప్రదాయం నుంచి గాని గ్రహించి ఉంటే, అతడు తనను గూర్చి, "నేను అనుపమానగురువును" (అహం సత్తా అనుత్తరో) అని చెప్పి ఉండడు. పైగా, తన ప్రథమోపదేశంలో, తానిన్నాళ్లు వినియుండని విషయాలమీద వెలుగురేకలు ప్రసరించాయి అని అన్నాడు.

గృహపరిత్యాగ ప్రారంభకాలంలో, నాటి ప్రముఖులయిన మతగురువుల సాయాన్ని అతడు అపేక్షించాడుగానీ, తాను కనుగొన్న జ్ఞానం వారి బోధనలసారంలో ఛాయామాత్రంగా కూడా కనిపించలేదు. తనకుతానయి సత్యాన్ని అన్వేషించే విధంగా పరిస్థితులు అతనిని ప్రేరేపించాయి. తనలో తానే సత్య దర్శనం కోసం అన్వేషించాడు. అగాధమయిన, నిగూఢమయిన, ఆలోచనలలో మునిగితేలాడు. ఇంతకు పూర్వం, తాను వినని, కనని పరమసత్యాన్ని అర్థం చేసికొన్నాడు.

తానేదయితే తెలిసికోవాలనుకున్నాడో, దానిని గూర్చి తెలిసికొన్నాడు. అలా, ప్రధాన జ్ఞానాన్ని పొంది, 'సర్వజ్ఞాని' (సబ్బన్ను) అయ్యాడు. స్వప్రయత్నం చేత అతడు పొందిన, అసాధారణమయిన ప్రజ్ఞ, అసంఖ్యాక జన్మలలో సాగించిన ప్రయత్నాల నుండి, సాధించినదే!

బుద్ధుడెవరు?

ఒకసారి, ద్రోణుడు అనే పేరుగల ఒకానొక బ్రాహ్మణుడు, బుద్ధుని పాదముద్రలలో నున్న మహాపురుష లక్షణాలను గుర్తించి, బుద్ధుని దగ్గరకు వచ్చి ఇలా ప్రశ్నించాడు.

"మీరు దేవతలా?"
"కాదు, బ్రాహ్మణా! నిజానికి నేను దేవతను కాను."
"అయితే, మీరు గంధర్వులా?"
"కాదు బ్రాహ్మణా! నిజానికి నేను గంధర్వుడిని కాను."
"మరి యక్షులా?"
"కాదు బ్రాహ్మణా! నిజానికి నేను యక్షుడిని కాను."
"అయితే మీరు, మానవులా?"
"కాదు, బ్రాహ్మణా! నిజానికి నేను మానవమాత్రుడిని కాను."
"అయితే మీరెవరో తెలిసికొన గోరుతున్నాను"

అప్పుడు, బుద్ధుడిలా బదులిచ్చాడు. "దేవ, గంధర్వ, యక్ష, మానవులుగా పునర్భవం కలిగించే, మలినాలను అతడు నశింపజేశాడు."అంటూ

ఇంకా ఇలా అన్నాడు.
"నీటివలన మైల పడని
మనోహరమయిన పద్మంవలె,
ప్రపంచం వలన నేను మైలపడను.
కాబట్టి, బ్రాహ్మణా! నేను బుద్ధుడను."

బుద్ధుని ప్రకారం, దేవతల సంఖ్య లెక్కకు మిక్కిలి. వారుకూడ జీవులవలే, జననమరణ చక్రాలను కలిగినవారే. మానవజన్మను వాహికగా చేసికొని, వేర్వేరు కాలాలలో ఈ భువిపై జన్మించి, మానవుల విధిని నియంత్రించే, దైవికశక్తులను కలిగిన, సర్వోత్కృష్టుడైన దేవుడంటూ ఎవరూ లేరు.

ఇతరులకు తాను రక్షకుడనని, బుద్ధుడెపుడూ చెప్పుకోలేదు. ఏవ్యక్తికి చెందిన పవిత్రత, మాలిన్యాలు, ఆ వ్యక్తికి మాత్రమే సంబంధించినవి గనుక, ఎవరికివారే, తమ తమ విముక్తికై ప్రయత్నించాలని చెప్పాడు. ఒకరు, మరొకరిని పవిత్రులను చేయటంకాని, మలినపరచటం కానీ, జరగని పని, అని తన అనుయాయులతో అంటాడు, బుద్ధుడు.

తన అనుయాయులతో తనకు గల సంబంధాన్ని గురించి చెబుతూ, వ్యక్తిగత ప్రయత్నమూ అవగాహనల ప్రాముఖ్యాన్ని వివరించే సందర్భంలో బుద్ధుడిలా అంటాడు, "మీకు మీరే ప్రయత్నం చేయాలి. తథాగతులు ఉపదేశకులు మాత్రమే!"

దుఃఖము నుండి విముక్తుడయి, పరమసత్యాన్ని సాధించిన విధానాన్ని గురించి మాత్రమే బుద్ధుడు సూచిస్తాడు. తమ తమ దుఃఖాలనుండి విముక్తులు కావాలనుకున్న, శ్రద్ధగల శిష్యులకు, తామా మార్గాన్ని అనుసరించాలా, వద్దా, అని నిర్ణయించుకునే అధికారాన్ని వారికే వదిలివేశాడు బుద్ధుడు.

"విముక్తి కోరి, ఇతరులపై ఆధారపడటం వ్యతిరేకదృక్పథం. తమ పై తామే ఆధారపడటం అన్నది సానుకూలదృక్పథం. ఇతరులపై ఆధారపడటం వలన, మానవుడు తన ప్రయత్నాన్ని విడిచిపెడుతున్నాడు అన్నది నిజం."

"మీకు మీరే దీపం. మీకు మీరే ఆధారం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులపై ఆధారపడవద్దు."

బుద్ధుడు తన చివరి రోజులలో చెప్పిన ఈ అర్థవంతమయిన మాటలు, గమనింపదగినవి, స్ఫూర్తిదాయకమయినవి కూడా. లక్ష్యసాధనకు, స్వప్రయత్నమన్నది, ఎంత అవసరమయినదో ఈ మాటలద్వారా తెలుస్తుంది. ముక్తి కొరకు, రక్షకులమీద ఆధారపడటం, ఎంత వ్యర్థమో, మరణానంతర జీవితంలో ఆనందాలకోసం, కల్పిత దేవతలకు బలులనివ్వటం ఎంత ఫలరహితమో అన్నదానికి ఈ మాటలే ఉదాహరణలు.

బుద్ధుడు ఒక మానవుడు. మానవుడిగా జన్మించి, బుద్ధునిగా జీవించాడు. బుద్ధుడిగానే అతడి జీవితం చరమదశకు చేరుకున్నది. మానవుడే అయినా, తన ప్రత్యేకమయిన వ్యక్తిత్వం చేత అతీతమానవుడే

అయ్యాడు, ఈ విషయాన్నే, బుద్ధుడు నొక్కి వక్కాణించడమేగాక, తానొక అమరుడిని అన్న తప్పుడు ఆలోచనకు ఎవరికీ అవకాశాన్ని కల్పించలేదు. "బుద్ధునిలా, దేవుడు లేడు అన్న గురువుగాని, దేవునివంటి గురువుగాని ఏ మతంలోనూ లేడు" అని అందరూ అతనిగురించి చెప్పుకునేవారు. తన కాలంలో, తన అనుయాయులచేత బుద్ధుడు, మిక్కిలి గౌరవాన్ని పొందాడు అనడంలో, ఎటువంటి సందేహం లేదు. అయినప్పటికీ, తాను మాత్రం తనకు ఎటువంటి దైవత్వాన్ని ఆపాదించుకోలేదు.

బుద్ధుని వైశిష్ట్యం:

మనిషిగా జన్మించి, మనిషిగానే జీవించి, స్వప్రయత్నం చేత అత్యంత ఉన్నత స్థితి అయిన బుద్ధత్వాన్ని పొందటమే కాదు, తన ప్రజ్ఞ ద్వారా మానవ మేధస్సు యొక్క అజేయశక్తిని లోకానికి చాటాడు. కనులకు కనిపించని దేవుడు అన్న భారాన్ని, మనిషిపై మోపి, ఆ దివ్యశక్తి ముందు, మనిషిని, మనిషి శక్తియుక్తులను దిగువస్థాయిలోనివి, అని చెప్పక, మనిషి తన ప్రయత్నం చేత, అత్యంత ఉన్నతమయిన పరమజ్ఞానాన్ని, నిబ్బానాన్ని ఎలా సాధించ గలడు. అలా మనిషి విలువను పెంచాడు. బయటినుండి ఎటువంటి దైవసహాయంగాని, మధ్యవర్తిత్వంగాని లేకనే, జీవన దుఃఖాలనుండి, మనిషి తనకు తానే విముక్తుడు కాగలడని బోధించాడు. మానవ అభ్యున్నతికి అడ్డుపడే, వర్ణ ధర్మాన్ని, వ్యతిరేకించి, అందరికీ సమాన అవకాశాలను సమర్థించాడు.

ఉన్నతుడయినా, అల్పుడయినా, పుణ్యాత్ముడయినా, పాపాత్ముడయినా, జీవితంలో ఎటువంటి స్థితిలోనున్న వారయినా, జీవితపుటను తిప్పి, పరిపూర్ణతను సాధించాలనుకునే వారు ఎవరికయినా విముక్తి తలుపులు తెరిచే ఉంటాయని చాటాడు, అణచివేతకు గురి అయిన స్త్రీల స్థాయిని పెంచే విధంగా, సమాజంలో తమకున్న ప్రాధాన్యాన్ని గురించి వారిలో అవగాహనను కలిగించడమే గాక, స్త్రీల సంఘాన్ని స్థాపించిన మొదటి వ్యవస్థగా బౌద్ధాన్ని నిర్మించాడు. ప్రపంచ చరిత్రలోనే తొలి సారిగా, బానిసత్వ నిర్మూలనకు ప్రయత్నించాడు. జంతువుల దురదృష్టతను చాటే, యజ్ఞయాగాదులను నిషేధించి, జంతువులపై కరుణ చూపించాడు. తన బోధనలకుగాని, తనకుగాని బానిసలుగా ఉండమని తన అనుయాయులకు చెప్పలేదు. ఆలోచనలో స్వేచ్ఛను అనుమతించాడు. తనమీద గౌరవంతో, తన మాటలను ఒప్పుకోవటం గాక, ఒక బుద్ధిమంతుడు, పుటంపెట్టి, గీటురాయితో గీచి, బంగారం నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించినట్లు, తన బోధనలను కూడ, సంపూర్ణంగా పరీక్షించవలసినదనినాడు. సంతానాన్ని పోగొట్టుకుని, దుఃఖపడుతున్న, 'పటాచార', 'కిసాగౌతమి' అనే ఇద్దరు తల్లులను ఓదార్చాడు. 'పూతిగత్త', 'తిస్స థేర' అనే ఇద్దరు పరిత్యక్త రోగులకు, స్వయంగా సేవలు చేశాడు. పేదవారికి సాయపడటమే గాక, అకాలము, విషాదమూ అయిన మరణం నుండి, 'రజ్జుమాల', 'సోపాక'లను రక్షించాడు. 'అంగుళిమాలుడు' వంటి హంతకులకు, 'అంబాపాలి' (ఆమ్రపాలి) వంటి నగర గణికలను సమాజంలో ఒక గౌరవస్థానాన్ని, కలిగించాడు. బలహీనులకు ఉత్తేజాన్ని కలిగించాడు. చెదురుమదురయిన వారిని ఒక్కటి చేశాడు. అజ్ఞానులకు జ్ఞానాన్నందించాడు. అస్పష్టతతో నున్న వారికి స్పష్టతను చేకూర్చాడు. వంచనకు గురిఅయిన వారికి మార్గనిర్దేశం చేశాడు. అట్టడుగున నున్నవారికి ఉన్నతస్థితిని కల్పించాడు. కులీనుల గౌరవాన్ని పెంపుజేశాడు. ఉన్నవారయినా, లేనివారయినా జ్ఞానులయినా, నేరస్థులయినా, బుద్ధుని ఒక్క విధంగానే ప్రేమించారు. అతని గొప్ప ఆదర్శం, ప్రతియొక్కరికీ ఉత్తేజకారకమయింది. విశ్వకారుణ్య భావాన్ని, సాటిలేని సహనాన్ని కలిగిన విశిష్టుడయిన గురువు, బుద్ధుడు.

అతనిలో ఉన్న సంకల్పం, పరిత్యాగం, పరిపూర్ణపవిత్రత, ఆదర్శవంతమయిన వ్యక్తిగత జీవితం, ధమ్మ వ్యాప్తిలోని దోషరహిత పద్ధతులు, అతడు పొందిన అంతిమ విజయం. ఇవన్నీ కలిసి, ఈ ప్రపంచంలో ఇదివరకు లేని గొప్ప గురువుగా, ప్రపంచంలో అయిదవవంతు జనాభాచేత బుద్ధుని మనఃపూర్వకంగా స్వాగతింపజేశాయి.

“చరిత్రలోని ముగ్గురు మహనీయులు” అన్న తన గ్రంథంలో, H.G. Wells ఇలా చెబుతాడు. “మనం బుద్ధునిలో, ఒక వివేకవంతుని, ముముక్షువును, ఏకాంత ప్రేమికుని, వెలుతురు కోసం పోరాడే ఒక సైనికుని, వెరసి ఒక స్పష్టత కలిగిన మానవతా మూర్తిని చూడగలం. విశ్వజనీనమైన సందేశాన్ని ప్రజలకు అందించాడు, బుద్ధుడు, ఆధునికమైన ఎన్నో ఆలోచనలు, శతాబ్దాల క్రితం ఉండిన బుద్ధుని ఆలోచనలకు, అతి దగ్గరగా నున్నవే. జీవనదుఃఖాలు, అసంతృప్తులు అన్నిటికీ, మనలోని స్వార్థమే కారణమని చెప్పాడు. ఒక వ్యక్తి పవిత్రుడు కావడానికి ముందు, అతనిలోని ఇంద్రియ వాంఛలను, అహాన్ని, తొలగించుకోవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే, అతడు ఉన్నతుడిగా, రూపొందగలడు. క్రీస్తుకు 500 సంవత్సరాలకు పూర్వమే, బౌద్ధం అహాన్ని త్యజించాలని పిలుపునిచ్చింది. కొన్ని విషయాలలో మనకు, మన అవసరాలకు బుద్ధుడు చాలా దగ్గరగా ఉంటాడు.

“ఇంతవరకూ ఇలాంటి ఉన్నతుడు పుట్టలేదు” అని రవీంద్రనాథ ఠాగూరు, బుద్ధుని గూర్చి చెప్పాడు. డానిష్ భాషా పండితుడు, Fausball బుద్ధుడిని ప్రశంసిస్తూ, “అతడిని గూర్చి తెలిసికున్న కొలదీ, అతడిమీద నాకు ప్రేమ పెరిగింది’ అని చెప్పుకున్నాడు.

బుద్ధుని పట్ల విధేయత కలిగిన ఒక అనుయాయి నమ్రతతో, ఇలా చెబుతాడు. “అతనిగూర్చి ఎంత ఎక్కువగా తెలిసికున్న కొద్దీ, అంత ఎక్కువగా అతనిని ప్రేమిస్తాను. ఎంత ఎక్కువగా ప్రేమించిన కొద్దీ, అంత ఎక్కువగా బుద్ధుని గూర్చి తెలుసుకుంటాను.”

❖ ❖ ❖

4. జ్ఞానోదయం తరువాత

"ఈ ప్రపంచంలో రాగరహితమే సుఖం" ధమ్మపదం

జ్ఞానోదయం పొందడానికి ముందురోజు, గుర్తుంచుకోదగిన ఆ పూర్వాహ్న సమయంలో, బోధివృక్షం సమీపంలోనున్న 'అజపాల వృక్షం' క్రింద కూర్చుని ఉన్నాడు, బోధిసత్వుడు. ఆసమయంలో, సుజాత అనే పేరుగల, ఒకానొక ఔదార్యవంతురాలు, ఎంతో శ్రద్ధతో చేసిన పాయసాన్ని, ఆ బోధిసత్వునికి సమర్పించింది.

ఆ బలవర్ధకమైన ఆహారాన్ని, బుద్ధుడు ఆరగించాడు. జ్ఞానోదయంతరువాత, బుద్ధుడు, బోధివృక్షమూ, సమీపంలోని అజపాలవృక్షాల క్రింద, ఏడువారాలపాటు ఉపవాసంతో, గాఢమయిన ధ్యానంలో గడిపాడు.

ఆ ఏడు వారాలు:

మొదటి వారం:

మొదటివారమంతా బుద్ధుడు, బోధివృక్షం క్రింద, ఒకే ఆసనంలో కూర్చుని విముక్తి సుఖంలోని అర్హతత్వ ఫలాన్ని ఆనందంతో అనుభవించాడు. ఈ ఏడు రోజుల తరువాత, ఏకాగ్రతాస్థితినుండి బయటకు వచ్చిన బుద్ధుడు, ఆ రాత్రి ప్రథమయామంలో, తన దృష్టిని, ప్రతీత్యసముత్పాదం (భవాన్ని ఆశ్రయించిన = కారణం లేకుండా ఏదీ పుట్టదు) మీద కేంద్రీకరించాడు.

"ఇది (కారణం) ఉన్నపుడు, ఇది (ఫలితం, కార్యం) ఉంటుంది. ఈ కారణం ఉద్భవించడంవలన, ఈ ఫలితం పుడుతుంది (Cause and Effect).

అజ్ఞానం (అవిద్య) కారణంగా మంచిచెడుల నిబద్ధతతో కూడిన, గల జన్మల సంస్కారాలు (సంఖారాలు) పుడతాయి.

ఆ సంఖారాల కారణంగా, పునస్సంధించే విన్యానం పుడుతుంది.

పునస్సంధించే విన్యానం కారణంగా, నామరూపాలు (mind and matter) ఏర్పడుతాయి.

నామరూపాల కారణంగా షడాయతనాలు (సలాయతన) పుడతాయి.

షడాయతనాలు కారణంగా (ఆరు ఇంద్రియాలు) స్పర్శ (phassa or contact) కలుగుతుంది. స్పర్శ కారణంగా వేదన జనిస్తుంది.

వేదనల కారణంగా, తృష్ణ ఏర్పడుతుంది. తృష్ణ కారణంగా, ఉపాదానం (గ్రహణశక్తి), ఉపాదానం నుండి, భవం (becoming), భవంనుండి పుట్టుక (జాతి) కారణంగా వృద్ధాప్యం, మరణం, శోకం, పరిదేవనం, దుఃఖం, మానసిక బాధలు (దొమనస్స), నిస్పృహ (ఉపాయస)లు ఏర్పడతాయి.

ఈ విధంగా దుఃఖరాశి మొత్తం జనిస్తుంది.”

ఇలా బుద్ధుడు కార్యకారణ సంబంధంలోని, అర్థాన్ని గ్రహించినాడు.

“శ్రమించే, ధ్యానపరుడయిన సాధకుడు, నిజంగా ఈ సత్యాన్ని అవగతంచేసికొంటే, సత్యాన్ని, దాని కారణాలతోబాటు అర్థం చేసికుంటాడు కాబట్టి, సత్యాన్ని గురించిన అతని అనుమానాలన్నీ పటాపంచలవుతాయి.”

ఆ రాత్రి నడి ఝాములో, మహోన్నతుడు అయిన బుద్ధుడు, ఈ కార్యకారణ సంబంధాన్ని ఇలా తిరగతిప్పి చూశాడు.

కారణంలేకుంటే, ఫలితం ఉండదు. కారణం నశిస్తే ఫలితం నశిస్తుంది. కారణ నాశం వలన ఫలితం నశిస్తుంది. అలా, అవిద్యా నాశం వలన మంచిచెడుల ఖర్మ సంస్కారాలు (సంఖారాలు) నశిస్తాయి.

సంఖారాలు నశించడంతో, విన్యానం, విన్యాన నశించడంతో నామరూపాలు, నామరూపాలు నశించడంతో షడాయతనాలు, షడాయతనాల నశించడంతో స్పర్శ, స్పర్శా నశించడంతో వేదన, వేదన నశించడంతో తృష్ణ, తృష్ణ నశించడంతో ఉపాదానం, ఉపాదానం నశించడంతో పుట్టుక (భవం), భవం నశించడంతో జన్మ, జన్మ నశించడంతో జరా, మరణ, శోక, పరిదేవన, దుఃఖ, మానసిక బాధలు, నిస్పృహలు నశిస్తాయి.

ఈ విధంగా మొత్తం దుఃఖరాశి నశిస్తుంది.

“శ్రమించే, ధ్యానపరుడయిన సాధకుడు, వాస్తవంగా, ఈ సత్యాన్ని గ్రహిస్తే, కారణాన్ని అర్థం చేసుకుంటాడు గనుక, అతని అనుమానాలన్నీ తొలగిపోతాయి.” అని తెలుసుకున్నాడు.

రాత్రి మూడవ ఝాములో, కార్యకారణ సంబంధంలోని, అనులోమ, ప్రతిలోమ విధానం అన్న రెండు విధానాలమీద తన దృష్టిని కేంద్రీకరించాడు.

“ఈ కారణం ఉన్నపుడు, ఈ ఫలితం ఉంటుంది. కారణం జనించినపుడు, ఫలితం జనిస్తుంది. కారణం లేనపుడు, ఫలితం ఏదీ ఉండదు. అంటే కారణం నశించడంతో, ఫలితం నశిస్తుంది.

అవిద్య మీద ఆధారపడి, ఖర్మ సంస్కారాలు పుడుతాయి.

అవిద్యానాశనం చేత ఖర్మ సంస్కారాలు నశిస్తాయి. ఈ విధంగా, దుఃఖరాశి మొత్తంగా నశిస్తుంది. ఈ మొత్తం విషయాన్ని, అర్థం చేసికున్నాడు బుద్ధుడు.

“శ్రమతో ధ్యానం చేస్తున్న సాధకుడు, ఈ సత్యాన్ని అవగతం చేసికొంటే, ఆకాశంలో సూర్యుడు ప్రకాశించినట్లు, అతడు మారుని సమూలంగా పెకలించివేసి, ప్రకాశిస్తాడు.”

రెండవ వారం:

రెండవవారం ఎటువంటి సంఘటనలూ జరుగలేదు. కాని బుద్ధుడు, నిశ్శబ్దంగా, ప్రపంచానికి గొప్ప నీతి పాఠాలను బోధించాడు. జ్ఞానసమరంలో తనకిన్నాళ్లు ఆశ్రయమయిన స్థావర బోధివృక్షానికి కొంత

దూరంగా నిలబడి, కృతజ్ఞతా సూచకంగా రెప్పలార్పని దృష్టితో, బోధివృక్షం వంక చూస్తూ ఒక వారమంతా గడిపాడు.

బుద్ధుని ఈ ఉదాత్తతను, ఆదర్శంగా తీసికుని, అతని అనుయాయులు, జ్ఞానోదయం జ్ఞాపకార్థంగా, బోధివృక్షానికే కాక, దాని నుండి మొలకెత్తిన వృక్షాలకు కూడ, తమ గౌరవాన్ని ప్రకటిస్తారు.

మూడవవారం:

తన తాత్కాలిక వాసమయిన, బోధివృక్షాన్ని వదలిపెట్టనందువలన, అతని బుద్ధత్వ సాధనను గురించి దేవతలు అనుమానించారు. వారి ఆలోచనలను తెలిసికున్న బుద్ధుడు, వారి అనుమానాలను నివారించాలన్న ఉద్దేశంతో, తన మానసిక శక్తులను ఉపయోగించి, ఆభరణాలంకృతమయిన ఒక నడవను ఏర్పాటు చేసికొని, ఒకవారమంతా, ఆ నడవలోనే అటు ఇటు నడిచాడు.

నాలుగవ వారం:

నాల్గవ వారమంతా తన ఆభరణాలంకృతమయిన గృహంలో ధ్యానం చేస్తూ, అభిధమ్మ (ఉన్నత బోధ) సూత్రాలలో మునిగి తేలుతూ గడిపాడు. ఆ ధర్మంతో అతడెంతగా మమేకమైనాడంటే, అభిధమ్మంలో ఏడవ అధ్యాయమయిన సంబంధాల ప్రకరణం (Patthana = book of relations) గూర్చి, లోతుగా పర్యాలోచన చేస్తున్నపుడు, అతని శరీరము, మనస్సు పవిత్రమయి ఉజ్జ్వలవంతమయిన ఆరు రంగులు అతని శరీరం నుండి ప్రసరించాయని గ్రంథాలు చెబుతాయి.

అయిదవ వారం:

అయిదవ వారమంతా, బోధివృక్షానికి సమీపంలో నున్న అజపాల వటవృక్షం క్రింద ఒకే ఆసనంలో కూర్చుని విముక్తి సుఖానందాన్ని, పూర్తిగా అనుభవించాడు బుద్ధుడు.

ఆరవ వారం:

అజపాల వృక్షం దగ్గరి నుండి, బుద్ధుడు ముచలింద వృక్షాన్ని చేరుకుని, అక్కడ ఆరవ వారమంతా విముక్తానందాన్ని అనుభవించాడు. అప్పుడే ఎదురు చూడని విధంగా, భీకరమైన వర్షం కురిసింది. చల్లని గాలి, ఆకాశమంతా ఆవరించిన వాన మేఘాలు, చీకటి వాతావరణం చాలా రోజుల పాటు వ్యాపించాయి.

అప్పుడు ముచలిందుడు అన్న నాగరాజు, తన నివాసం నుండి బయటకు వచ్చి, బుద్ధుని చుట్టూ ఏడు చుట్టలుగా చుట్టుకుని, తన పెద్ద పడగను బుద్ధుని శిరసుపై నిలిపి, చలి వానలనుండి అతనిని కాపాడాడు.

వారాంతంలో, మేఘాలు లేని శుభ్రమయిన ఆకాశాన్ని చూచి, బుద్ధుని చుట్టూ చుట్టి ఉన్న తన ఏడు చుట్టలను విడిపించుకుని, ముచలిందుడు, తన నాగరూపాన్ని విడిచి ఒక యువకుని రూపం దాల్చి, ముకుళించిన హస్తాలతో ఉన్నతుడయిన బుద్ధుని ముందు నిలబడినాడు.

ఏడవ వారం:

ఏడవవారాన్ని, రాజాయతనవృక్షం క్రింద కూర్చొని, విముక్తానందాన్ని ఆస్వాదిస్తూ ప్రశాంతంగా గడిపాడు, బుద్ధుడు. బుద్ధుని బోధనలలో మొదటిది ఈ విధంగా ఉంటుంది.

"ఎన్నో జన్మల అస్తిత్వంలో, వృధాగా పరిభ్రమించాను.
వెదికినా కనుగొనలేని ఈ గృహనిర్మాతకై వెదుకుతూ..
మళ్ళీ మళ్ళీ జన్మించడమే దుఃఖం.
ఓ గృహనిర్మాతా! నీవు కనిపించావు. కానీ,
నీవిప్పుడు మళ్ళీ గృహాన్ని నిర్మించలేవు.
నీ ఇంటి వాసాలన్నీ ముక్కలు ముక్కలయినాయి.
నీ ఇంటికప్పు వెన్ను భాగం ధ్వంసమయింది,
నా మనసిపుడు అసంఖారవ మయింది,
నాలో తృష్ణారాహిత్యం జరిగింది"

తనకు సంపూర్ణజ్ఞానోదయం కలిగిన అదే రోజు, బుద్ధుడు, ఆంతరంగిక ఆధ్యాత్మికానుభవాన్ని స్పష్టంగా వివరించాడు. దుఃఖహేతువులయిన తన గతజన్మ పరిభ్రమణాలను, బుద్ధుడు చూపాడు. అతనికి జన్మల భ్రమణం తప్పలేదు. పర్యవసానంగా దుఃఖం కలిగింది. అతడు తన గృహనిర్మాతను, కనుగొనలేక గతజన్మల ఫలితంగా, పొందిన సాధనా సఫలత వలన, తన ఆఖరు జన్మలో ఏకాంత ధ్యానం ద్వారా, తనలోని ఆంతరిక జ్ఞానాన్ని తెలిసికొనినాడు. ఉన్నతమైన జ్ఞానోదయాన్ని పొందాడు. పట్టుకు దొరకని ఆ గృహనిర్మాత బయట ఎక్కడో లేదు, తనలోనే, తన మనసులోనే దాగి ఉన్నాడని తెలుసుకున్నాడు. అది తృష్ణ కావొచ్చు, రాగం కావొచ్చు, స్వకల్పితకర్మ కావొచ్చు. ఒక గుప్తమైన మానసిక విషయం, ఎప్పుడు, ఎలా పుడుతుందో తెలియగానే, ఈ తృష్ణ అగోచరమయినది. బుద్ధికి లోబడనిది. ఏది తాను, సృష్టించుకుంటాడో, దానిని తానే నశింపచేయగలడు. గృహనిర్మాతను కనుగొనడం అన్నది, అర్హత్వాన్ని పొంది, తృష్ణను నిర్మూలనం చేయడమే. అదే పై వచనంలో చెప్పబడిన "తృష్ణానాశం."

లోభం, ద్వేషం (దోస), మోహం, దురహంకారం, మిథ్యాదృష్టి, విచికిత్స (వాస్తవాన్ని అనుమానించడం), సోమరితనం, అవిశ్రాంతత, నిస్సిగ్గు, అనైతికత వంటి క్లేశాలు (మాలిన్యాలు) మున్నగునవి, ఈ స్వయం నిర్మిత గృహం యొక్క వాసాలు. ఈ పక్కవాసాలను కలిపిఉంచే, ఇంటికప్పు వెన్ను (ప్రధాన వాసం), మాలిన్యాలకు మూలమైన అజ్ఞానం (అవిద్య). జ్ఞానం చేత, ఆ అవిద్య అనే ప్రధాన వాసాన్ని, నశింపజేస్తే, ఈ స్వయం నిర్మితమైన, గృహం చెల్లాచెదరవుంది. ఈ అక్కరలేని ఇంటిని నిర్మించేందుకు, ఈ ప్రధానవాసం, ఇతర వాసాలే ఆధారాలు. వీటి విధ్వంసంతో, అక్కరలేని ఈ ఇంటిని ఎటువంటి వాస్తుశిల్పి అయినా నిర్మించలేడు.

మాలిన్యాలతో కూడిన మనస్సు అనే గృహాన్ని, విధ్వంసం చేసినపుడు, అనుపమానమయిన స్వేచ్ఛ లభిస్తుంది. అదే నిబ్బానం. లౌకిక సంబంధమయినవాటిని వదిలిపెట్టిన కొలదీ, పారలౌకికమైన నిబ్బానమే చివరగా మిగులుతుంది.

❖ ❖ ❖

5. ధమ్మ బోధకు ఆహ్వానం

"ఎవరయితే ధర్మాన్ని అర్థం చేసికొంటారో, వారు మానసిక ప్రశాంతతతో ఆనందంగా జీవిస్తారు. వివేకవంతులు, ఆర్యులు చెప్పిన ధమ్మం వలన, ఎప్పుడూ, సంతోషంగా జీవిస్తారు" – ధమ్మపదం

ధమ్మమే గురువుగా:

జ్ఞానోదయానంతరం, నిరంజనానదీతీరంలోనున్న అజపాల వట వృక్షం క్రింద కొన్నాళ్లు నివసించాడు, బుద్ధుడు. ఏకాంతధ్యానాన్ని చేసినందువలన, అతని మనసులో ఈ విధమయిన ఆలోచనలు కలిగాయి.

కాని ఈ ప్రపంచంలో, దేవతలు, మారులు, బ్రాహ్మలలో గాని ఇంకా సన్యాసులు, బ్రహ్మణులు, దేవతలు, మానవులతో కూడిన జీవులలో గానీ, నాకన్నా, ఉన్నతనైతిక సంపూర్ణతను సాధించినవారెవరూ లేరు. మరి నేనెవరిని గౌరవిస్తూ, విధేయతను చూపించగలను?"

అప్పుడు, అతనికిలా అనిపించింది. "నా అంతట నేనే అవగాహన చేసికొన్న ఈ ధమ్మాన్ని గౌరవిస్తూ, ఈ ధమ్మానికే విధేయునిగా ఉండాలి అనుకున్నాడు."

బుద్ధుడి, ఈ ఆలోచనలను తన మనసులో పసిగట్టిన, బ్రహ్మసహంపతి, బుద్ధుని ఎదుట ప్రత్యక్షమై, పైపంచెతో తన భుజాన్ని కప్పుకొని, కుడి మోకాలును భూమిపై మోపి చేతులు జోడించి నమస్కరిస్తూ ఇలా పలికాడు. "ఓ ఉన్నతుడా! అది అట్లే అగుగాక. ఓ గౌరవనీయుడా! ఓ ప్రజ్ఞావంతుడా! అది అట్లే అగుగాక. గతంలోని జ్ఞానులు కూడ, ధర్మాన్ని గౌరవిస్తూ, విధేయతతోనే బ్రతికారు, భవిష్యత్తులోని జ్ఞానులు కూడ, అలాగే బ్రతుకుతారు. వర్తమానంలోని ప్రజ్ఞావంతులు, మీరు కూడ ధర్మాన్ని గౌరవిస్తూ, విధేయత చూపుతూ జీవిస్తారు" అంటూ బ్రహ్మసహంపతి, తన మాటలను ఇంకా ఇలా కొనసాగించాడు. భూత, భవిష్యత్, వర్తమానకాలాలలో, జ్ఞానోదయం పొందిన ప్రజ్ఞావంతులందరూ, దుఃఖాన్ని నశింపజేసికొని, ధమ్మాన్ని గౌరవిస్తూ, ధమ్మానికి విధేయులయి ధమ్మబద్ధతతో జీవించారు, జీవిస్తారు కూడ. ఇవే బుద్ధుల లక్షణాలు. ఎవరైతే తమ ఉన్నతిని, దుఃఖరహిత జీవనాన్ని అభిలషిస్తారో వారు ఈ ఉన్నతమైన ధమ్మాన్ని గౌరవిస్తూ, బుద్ధుల బోధనలను గుర్తు చేసికుంటూ జీవించాలి."

ఇలా చెప్పి, బ్రహ్మసహంపతి, బుద్ధునికి గౌరవసూచకంగా వందనమాచరించి, ప్రదక్షిణం చేసి, అంతర్ధానమయ్యాడు.

ధమ్మబోధకు ఆహ్వానం:

రాజాయతన వృక్షం దగ్గరినుండి అజపాల వృక్షాన్ని చేరి, ఆ చెట్టుక్రింద, ఏకాంత ధ్యానాన్ని ఆచరించిన బుద్ధునిలో, ఈ ఆలోచనలు కలిగినాయి.

"నేను అర్థం చేసికొన్న ఈ ధర్మం చాలా గంభీరమయినది. ఇతరులకు గ్రహించడానికి కష్టమయిన, ప్రశాంతమైన, స్తుతిపాత్రమైన, తర్క మీమాంసకుల పరిమితంగాని, ఈ ధర్మం వివేకవంతులు అర్థం చేసికోదగినది. జీవులు లౌకికానందాలకు లోబడిన వారు. కార్యకారణ సంబంధాన్ని వివరించే ఈ ధమ్మాన్ని అర్థం చేసికోవడం కష్టం. సంఖారాలను అణచి వేసి, మాలిన్యాలను తొలగించుకొని, తృష్ణను నశింపజేసికొని, రాగరహిత క్షాళనల ఫలితంగా పొందదగిన నిబ్బానం, సులభంగా అవగాహన చేసికోగలిగినదిగాదు. ఈ ధమ్మాన్ని నేను ఇతరులకు బోధిస్తే, వారు నన్ను అర్థం చేసికొనరు. అప్పుడు నాకు మిగిలేది, అలసట మాత్రమే.

ఇలా ఆలోచిస్తున్న బుద్ధునికి, అపుడు, ఇంతకు పూర్వం తానెప్పుడూ వినియుండని ఈ అద్భుతమయినవచనం స్ఫురించింది.

'నేనీ ధమ్మాన్ని చాలా శ్రమపడి గ్రహించాను. ఈ ధమ్మాన్ని ప్రకటించవలసిన అవసరమిపుడు లేదు. ఎవరయితే, రాగ ద్వేషాలతో కొట్టుమిట్టాడుతున్నారో, వారీ ధమ్మాన్ని సులభంగా అర్థం చేసికోలేరు. చీకటిలోనున్నవారు, ఈ ఎదురీదగల, గంభీరమైన మార్మికమైన, అర్థంచేసికోవడానికి ప్రజ్ఞ అవసరమైన ఈ ధమ్మాన్ని దర్శించలేరు.

ఇలా పునరాలోచించిన బుద్ధుడు, ధమ్మాన్ని బోధించవలసిన అవసరం లేదు అని భావించాడు.

అప్పుడు, బుద్ధుని ఆలోచనలను తెలిసికొనిన బ్రహ్మసహంపతి, ఆ ధమ్మాన్ని వినకుండానే ప్రపంచం నాశనమవుతుందేమోనన్న భయంతో, బుద్ధుని కలిసి, ధమ్మబోధగావించవలసినదిగా కోరుతూ, ఇలా పలికాడు.

"ఓ శ్రేష్ఠుడైన తదాగతుడా! పరిపూర్ణ ధమ్మాన్ని అర్థం చేసుకున్న మీరు ఆ ధమ్మాన్ని బోధింతురుగాక. ఈ ప్రపంచంలో కనులలో కొద్ది దుమ్ముని మాత్రమే (అజ్ఞానపు పొరలు గ్రమ్మినవారు) కలిగిన వారు, ఈ ధర్మాన్ని అర్థం చేసికోలేక ఈ ధర్మాన్ని వినకనే అంతరించే వారు కొందరున్నారు. కానీ, ఈ ధర్మాన్ని అర్థం చేసికొన గలిగినవారుకూడా ఉన్నారు." అని అంటూ, ఇంకా ఇలా కొనసాగించాడు.

"ప్రాచీన కాలంలో, పవిత్రమయిన, ధర్మమొకటి మగధలో వెలసినది. మరణ రహిత స్థితిని బోధించే మీ ధర్మం తలుపులను తెరవండి. ఈ ధర్మాన్ని వినిన వారు, మచ్చలేని ధమ్మమని గ్రహిస్తారు. శిలామయమయిన పర్వత శిఖరాగ్రంలో నిలబడి, చుట్టూనున్న వారిని చూడగలిగిన వ్యక్తిలా, ఈ ధర్మ ప్రాసాదాన్ని ప్రజ్ఞావంతుడు గ్రహించుగాక. జననమరణాల దుఃఖంలో తగులుకొనియున్న మానవులను, దుఃఖరహితుడు దయజూచుగాక!"

"ఓ వీరుడా! యుద్ధ విజేతా! సార్థవాహనాయకుడా! ఋణ విముక్తా! ప్రపంచ యాత్రికుడా! లెమ్ము! ఉన్నతుడయిన బుద్ధుడు ధమ్మబోధను గావించుగాక! ఈ ధర్మాన్ని అర్థం చేసికోగలవారు ఎందరో ఉన్నారు." ఇలా పలికిన బ్రహ్మ సహంపతితో బుద్ధుడిలా చెప్పాడు.

"ఓ బ్రహ్మా! నాకొక ఆలోచన కలిగినది. నేను గ్రహించిన ఈ ధర్మాన్ని, లాలసాద్వేషాలతో నియంత్రించబడేవారు సులభంగా అర్థం చేసికోలేరు. లాలస బంధంలో చిక్కికొని, చీకటిలో వసించేవారు, ఎదురీదగల, గూఢమయిన, గంభీరమయిన, అర్థం చేసికోవడానికి ప్రజ్ఞ అవసరమైన, ఈ ధర్మాన్ని గ్రహించలేరు. దీనిని అర్థం చేసికొన్న నేను, ఈ ధర్మాన్ని బోధించవద్దు అన్న నిర్ణయానికి వచ్చాను.

రెండవసారి కూడ, బ్రహ్మసహంపతి, బుద్ధుని ధర్మబోధ కోసం కోరగా, బుద్ధుడు అదే సమాధానాన్ని చెప్పాడు. మూడవసారి కూడ బుద్ధుని కోరగా, ఆ ఉన్నతుడయిన బుద్ధుడు, జీవులమీది దయతో తన జ్ఞాన నేత్రంతో ప్రపంచాన్ని పరిశీలించాడు.

అలా పరిశీలిస్తున్నపుడు, కొద్ది స్థాయిలో, ఎక్కువ స్థాయిలో మనస్సులో మాలిన్యాలు కలవారిని, వివేకవంతులను, మందబుద్ధులను, మంచివర్తన కలిగినవారిని, చెడు వర్తన కలిగిన వారిని, సులభంగా బోధనను అందుకోగలిగినవారిని, కష్టతరంగా మాత్రమే బోధనను అందుకోగలిగిన వారిని గమనించాడు.

నీల, అరుణ, శ్వేత వర్ణపద్మాల కొలనులోని పద్మాలవలే, కొన్ని పద్మాలు నీటిలో పుట్టి, నీటిలో పెరిగి నీటిలోనే మునిగి పోతాయి. కొన్ని పద్మాలు, నీటిలో పుట్టి నీటిలో పెరిగి నీటి ఉపరితలం మీద మిగిలి ఉంటాయి. మరికొన్ని పద్మాలు నీటిలో పుట్టి, నీటిలో పెరిగి నీటి బయటకు చొచ్చుకొని వచ్చి, నీటి మరకలు లేకుండా వర్తిల్లుతాయి. ఆ ఉన్నతుడయిన బుద్ధుడు, తన బుద్ధనేత్రంతో ప్రపంచాన్ని పరిశీలించినపుడు, జీవులలో కొంచెం మానసిక మాలిన్యాలు కలిగినవారిని, ఎక్కువ మానసిక మాలిన్యాలు కలిగినవారిని, వివేకవంతులను, మందబుద్ధులను, సత్ప్రవర్తనులను, దుష్ప్రవర్తనులను సులభంగా బోధింపదగిన వారిని గమనించాడు. అప్పుడు బ్రహ్మ సహంపతితో ఈ వచనాన్ని పలికాడు.

ఓ బ్రహ్మ ! శ్లాఘనీయము, ప్రశస్తము, అయిన ఈ ధర్మాన్ని మనుష్యులకు బోధించడం అత్యంత కష్ట సాధ్యం. ఎందుకనగా వారు లోభ, దోష, మోహ వంటి మాలిన్యాలతో ఉంటారు." కొందరు మాత్రమే ధమ్మమును తెలుసుకొనగలరు.

ఉన్నతుడయిన బుద్ధుని బోధనలను వినే అవకాశం తనకే దక్కినదన్న ఆనందంతో, బ్రహ్మ, బుద్ధునికి నమస్కరించి, ప్రదక్షిణ చేసి అంతర్ధానమయ్యాడు.

ఇద్దరు ప్రథమ సాధకులు:

బుద్ధుడు, రాజాయతన వృక్షం క్రింద కూర్చొని ఉన్నపుడు, ఇద్దరు వ్యాపారులు, తపస్సు, భల్లిక అనే పేర్లు గలవారు, ఉత్కళం (నేటి ఒడిశా) నుండి ఆ మార్గంద్వారా వెళ్లడం జరిగింది. ఒక దేవత చెప్పింది! "ఓ అయ్యలారా! ఉన్నతుడయిన బుద్ధుడు, తన జ్ఞానోదయం తరువాత, రాజాయతన వృక్షం క్రింద నివసిస్తున్నాడు. అతని దగ్గరకు వెళ్ళి, కొంచెం పిండిని (వేయించిన పిండి), తేనె తుట్టెను అతనికివ్వండి. ఈ చర్య మీరు చిరకాలం మంచి జీవనాన్ని, ఆనందాన్ని అనుభవించేందుకు దోహదంచేస్తుంది."

ఈ సువర్ణావకాశాన్ని వారు సద్వినియోగ పరచుకున్నారు. ఆనందంగా ఆ ఉన్నతుని చేరి, నమస్కరించి, తమ ఆనందాన్ని ద్విగుణీకృతంచేయగల, తామిచ్చే భిక్షను స్వీకరించవలసినదిగా బుద్ధుని ప్రార్థించారు.

అప్పుడు బుద్ధునికిలా తోచింది, "తథాగతులెవరూ ఆహారాన్ని చేతులతో స్వీకరించలేదు, నేనెలా ఈ పిండిని, తేనె తుట్టెలను చేతులతో స్వీకరించగలను?"

బుద్ధుని ఆలోచనలను అర్థం చేసికొన్న నలుగురు రాజులు (దిక్పాలకులు), నాలుగు దిక్కులనుండి నాలుగు నల్ల రాతిచిప్పలను తెచ్చి యిచ్చి "ఓ దేవా! ఉన్నతులయిన బుద్ధుడు, పిండిని, తేనెతుట్టెలను స్వీకరింతురుగాక!" అని అన్నారు.

ఆ వ్యాపారులు అణకువతో ఇచ్చిన సమయానుకూల దానాన్ని, దయతో స్వీకరించి, చాలా రోజుల ఉపవాసం తరువాత, బుద్ధుడు ఆహారాన్ని భుజించాడు. భోజనానంతరం, వ్యాపారులు బుద్ధుని పాదములకు సాగిలపడి నమస్కరించి, ఇలా అన్నారు. "ఓ దేవా! మేము ఉన్న తులయిన బుద్ధుని, ధర్మాన్ని శరణువేడుతున్నాము. ఉన్నతులయిన బుద్ధులు, ఈ రోజునుండి ఆమరణ పర్యంతం మమ్ము బౌద్ధ ఉపాసకులుగా గుర్తింతురుగాక."

"బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి" అన్న ధర్మాన్ని ఉచ్చరిస్తూ, బౌద్ధాన్ని శరణు జొచ్చిన బుద్ధుని ప్రథమ ఉపాసకులు వీరే!

ధమ్మబోధనకై వారణాసికి వెళ్ళే దారిలో:

ధర్మాన్ని బోధించాలన్న ఆహ్వానాన్ని, అంగీకరించిన బుద్ధునికి తన విశిష్టమైనది, ప్రత్యేకమైనది అయిన సంఘంలోకి ప్రవేశించక పూర్వం, ఇలా అనిపించింది. "మొదటగా నేను ధమ్మాన్ని ఎవరికి బోధించాలి? ఎవరీ ధమ్మాన్ని త్వరితంగా అర్థం చేసికోగలరు? సరే! గొప్ప పండితుడు, జ్ఞాని, చాలాకాలం క్రితమే అతితక్కువ ధూళిని మాత్రమే కనులలో కలిగినవాడు (అజ్ఞానపు పొరలను అత్యంత తక్కువగా కలిగినవాడని అర్థం), ధర్మాన్ని వేగవంతగా అర్థం చేసికోగలిగిన, అలారకాలాముడు, ఉన్నాడుకదా!"

కానీ, అప్పటికే ఆలారకాలాముడు మరణించాడు." అని తెలిసింది.

తరువాత అతడు ఉద్ధకరామపుత్రుని గురించి విచారించారు. అతడు ఆ ముందురోజు సాయంత్రమే మరణించినాడన్న విషయం తెలిసింది.

అంతిమంగా, తన జ్ఞానోదయ సమరంలో తనకు సేవలందించిన, వీర్యవంతులయిన అయిదుగురు సన్యాసులను గురించి ఆలోచించాడు, బుద్ధుడు. తన అసాధారణీయమైన దృష్టితో, వారు వారణాసిలోని మృగదావనంలో నివసిస్తున్నారని గ్రహించాడు. సమయం వచ్చేవరకు, ఉరువేలలోనే ఆగి, వారణాసికి బయలుదేరాడు.

ఏ వృక్షం క్రింద జ్ఞానోదయం పొందాడో, ఆ బోధి వృక్షానికి, గయకు మధ్యగల రహదారిలో పయనిస్తున్నపుడు, 'ఉపకుడు' అన్న పేరుగల సంచారి అయిన ఒక సన్యాసి, బుద్ధుని చూచి, అతనితో ఇలా అన్నాడు. "మిత్రమా! నీ ఇంద్రియాలన్నీ కూడ పూర్ణ స్వచ్ఛతతో కాంతులీనుతున్నాయి. నీ శరీర కాంతి శుభ్రంగా, స్వచ్ఛంగా ఉన్నది. ఎవరి కొరకు నీవీ పరిత్యాగాన్ని చేశావు మిత్రమా? ఎవరు నీ గురువు?

అపుడు, బుద్ధుడు, ఇలా బదులిచ్చాడు.

"నేను దాటివచ్చినవన్నీ, నేను ఎరిగినవే,
నేను దూరంగా ఉన్నవన్నీ, నేను త్యజించినవే,
తృష్ణా నాశాన్ని పూర్తిగా అనుభూతం చేసికున్నాను (బుద్ధత్వం).
నాకు నేనై తెలిసికొన్న విషయాలకు
గురువని నేనెవరిని చెప్పుకోను?
నాకు గురువు ఎవరూ లేరు.
నాతో సమానమైన వారెవరూ లేరు
దేవతలతో సహా ఈ ప్రపంచంలో నాకు శత్రువులెవరూ లేరు,

ఈ ప్రపంచంలో రూఢిగా నేనే అర్హతుడను. లేక బుద్ధుడను. నాకు నేనే గురువును.
అతిక్రమించలేని గురువును నేను,
జ్ఞానోదయం పొందిన ఏకైక మూర్తిని.
సంతృప్తుడను, శాంతమూర్తిని,
ధర్మచక్ర సంస్థాపనకై కాశీ నగరానికి వెళుతున్నాను,

ఈ అంధఃప్రపంచంలో మరణ రాహిత్యమనే ఢంకాను మ్రోగిస్తాను."

"అయితే, ఓ మిత్రమా! నువ్వు అవధులు లేని విజేత అయిన అర్హతుడవు అని చెప్పికుంటున్నావా?" ప్రశ్నించాడు ఉపకుడు.

"మాలిన్యాలను నశింపజేసికొన్న నావంటివారు విజేతలే! కాబట్టి, ఉపకుడా! నేను విజేతనే అవుతాను." బదులిచ్చాడు బుద్ధుడు.

"అయి ఉండవచ్చు మిత్రమా!" సంకుచితంగా అని ఉపకుడు, తలను ఆడిస్తూ, ప్రక్కదారినుండి, వడివడిగా వెళ్లిపోయాడు.

ఈ మొదటి నిరాకరణ, ఎంత మాత్రం తనను చలింపచేయకపోగా, బుద్ధుడు, ఒక ప్రాంతం నుండి, మరొక ప్రాంతానికి, పయనిస్తూ, తొందరలోనే వారణాసిలోని మృగదావనాన్ని, చేరికొన్నాడు.

అయిదుగురు సన్యాసులతో కలయిక:

బుద్ధుడు, తన జ్ఞానసమర సమయంలో, కఠోరమైన పరివ్రాజక నియమాలను వ్యర్థ ప్రయాసలుగా గుర్తించి వదిలిపెట్టడాన్ని, అపార్థం చేసికున్న, ఆ అయిదుగురు పరివ్రాజకులు, తమవైపునకే వస్తున్న, బుద్ధుని దూరంనుండే చూసి, గౌరవించరాదని నిర్ణయించుకున్నారు.

వారి అభియోగం:

"మిత్రులారా! గౌతముడు వస్తున్నాడు. అతడు భోగలాలసుడు. గట్టి ప్రయత్నాన్ని వదలిపెట్టి, సుఖభోగాలవైపు మరలినవాడు. అతడు గౌరవింపదగినవాడు కాదు. అతని భిక్షాపాత్రనుగాని, అతని అంగవస్త్రమునుగాని తీసికొనవద్దు. కూర్చొనడానికి ఒక ఆసనాన్ని మాత్రం ఏర్పాటుచేద్దాం. అతనికి ఇష్టమయితే కూర్చుంటాడు"

అయితే, బుద్ధుడు తమను సమీపించిన కొలదీ, అతని మహోన్నతమయిన వ్యక్తిత్వం, వారితో బుద్ధునిపట్ల సగౌరవంగా ప్రవర్తించేలా చేసింది. ఒకరు ముందుకు వచ్చి, అతని భిక్షా పాత్రను, అంగవస్త్రాన్ని, తీసికున్నారు. మరొకరు, అతనికి ఆసనాన్ని సిద్ధం చేశారు. ఇంకొకరు అతనికి కాళ్ళు కడిగికొనడానికి నీటిని సమకూర్చారు.

అయితే వారు, తమకన్నా చిన్నవారినో, తమతో సమానమైనవారినో పిలిచినట్లు, బుద్ధుని పేరుపెట్టి పిలవడమో, మిత్రమా (ఆవుసో) అని సంబోధించడమో చేశారు.

దానిపై, బుద్ధుడు వారితో ఇలా చెప్పాడు.

"భిక్షువులారా! తథాగతుని పేరుపెట్టిగాని, 'ఆవుసో' అనిగాని పిలువవద్దు ('ఆవుసో' అంటే 'మిత్రమా' అని). భిక్షువులారా! తథాగతుడు ఉన్నతుడయినవాడు. అతడు సంపూర్ణజ్ఞానోదయాన్ని పొందినవాడు. మరణరాహిత్యాన్ని పొందినవాడు అని గ్రహించండి. నేను మీకు ధర్మాన్ని బోధిస్తాను. నా ఉపదేశానుసారం మీరు ప్రవర్తిల్లినట్లయితే, మీకు అనతికాలంలోనే, మీ అంతరికజ్ఞానం వలన, సత్యాన్ని అవగాహన చేసికోగలరు. కులీనులైనవారు, గృహపరిత్యాగం చేసి, ఏ సత్యాన్ని అయితే తెలిసికోవాలనుకుంటారో, ఆ సత్యాన్ని ఈ పవిత్ర జీవితంలోనే సిద్ధింపజేసికోగలరు."

దానికి ఆ అయిదుగురు పరివ్రాజకులు ఇలా బదులిచ్చారు.

"మిత్రమా, గౌతమా! క్రమశిక్షణతో, కఠినతరమైన పరివ్రాజక జీవితాన్ని గడిపిన కాలంలోనే ఎటువంటి అతీతమానవజ్ఞానాన్ని కాని, అంతర్దృష్టిని కాని పొందలేకపోయావు. కఠినతరమైన పరివ్రాజక జీవనాన్ని విడిచిపెట్టి, విలాసవంతమైన సుఖాలవైపు మరలిన వాడివి, ఆర్యులకు మాత్రమే సాధ్యమైన అతీత మానవప్రజ్ఞను, అంతర్దృష్టిని ఎలా పొందగలవు?"

దానికి బదులుగా బుద్ధుడు ఇలా పలికాడు.

"భిక్షువులారా! తథాగతుడు విలాసవంతుడుగాడు. గట్టి ప్రయత్నాన్ని విడిచిపెట్టి, సుఖమయ జీవనంవైపు మరలినవాడు కాడు. తథాగతుడు ఉన్నతుడు. సంపూర్ణ జ్ఞానోదయాన్ని పొందినవాడు. ఓ భిక్షువులారా! మరణరాహిత్య స్థితిని పొందినవాడనని గమనించండి. నేను మీకు ధమ్మాన్ని ఉపదేశిస్తాను. మీరు నా ఉ పదేశానుసారం అభ్యసించి నట్లయితే, మీ అంతరికజ్ఞానంతో గ్రహించిన, సత్యావగాహనతో జీవించగలరు. కులీనులైన వారు, గృహపరిత్యాగం చేసి, ఎటువంటి సత్యాన్ని తెలిసికోవాలని కోరుకుంటారో, అటువంటి సత్యాన్ని అతి స్వల్పకాలంలోనే గ్రహించగలరు."

భ్రమలోనున్న ఆ పరివ్రాజకులు రెండవసారికూడ తమ నిరుత్సాహాన్ని అదే విధంగా తెలిపారు. బుద్ధుడు కూడా తాను పొందిన జ్ఞానోదయం గురించి రెండవసారి కూడా వివరించాడు అతనిపట్ల నమ్మకం లేక, మూడవ సారికూడ తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చిన విముఖులైన ఆ అయిదుగురు సన్యాసులను బుద్ధుడు ఈ విధంగా ప్రశ్నించాడు.

"ఓ భిక్షువులారా! ఈ విధంగా ఇంతకు మునుపెప్పుడయినా నేను మీతో మాట్లాడిఉన్నానా?"

"నిజంగా లేదు భగవా!

బుద్ధుడు మూడవసారి కూడ తాను పొందిన సంపూర్ణ జ్ఞానోదయాన్ని గూర్చి వివరిస్తూ తన ఉపదేశానుసారం ప్రవర్తిల్లితే, వారుకూడ సత్యాన్ని అవగాహన చేసికోగలరని చెప్పాడు.

పవిత్రుడయిన బుద్ధుని పెదవులనుండి వెలువడిన, ఒక రూఢియైన సత్యమది. సంస్కారవంతులైన పరివ్రాజకులు, తమ అభిప్రాయాలలో మొండివైఖరిని కలిగినవారయినా, బుద్ధుడు పొందిన జ్ఞానోదయాన్ని, తమకు ధార్మిక గురువుగా, మార్గదర్శిగా వ్యవహరించడంపట్ల అతని సాధికారికతను గుర్తించారు.

వారతని మాటలను నమ్మి, అతని గంభీరమైన ఉపన్యాసాన్ని వినేందుకై నిశ్శబ్దంగా కూర్చున్నారు.

బుద్ధుడు, ఇద్దరు పరివ్రాజకులకు తన ధర్మాన్ని ఉపదేశించాడు. మిగిలిన ముగ్గురు భిక్ష గ్రహించడానికి వెళ్లారు. ఆ ముగ్గురు పరివ్రాజకులు తెచ్చిన భిక్షను ఆరుగురు సర్దుకున్నారు. ఆ ముగ్గురు సన్యాసులకు బుద్ధుడు ధమ్మ బోధను చేసినపుడు, మిగిలిన ఇద్దరు భిక్షకు వెళ్లారు. ఆ ఇద్దరు తెచ్చిన భిక్షను ఆరుగురు సర్దుకున్నారు.

జననం, వృద్ధాప్యం, మరణం, దుఃఖం, క్లేశాలకు లోబడిన తమ జీవన ప్రకృతిని గూర్చి బుద్ధునిచే హెచ్చరించబడి, జాగృతులయినారు. జన్మరహిత, జరారహిత, మరణరహిత, దుఃఖరహిత, క్లేశరహితము, అనన్యము, అతీతమయిన శాంతినిచ్చే, నిబ్బానానికై అన్వేషిస్తూ, అనన్య రక్షణను కలిగించే నిబ్బానాన్ని, జన్మ, జరా, రుజా, దుఃఖ, క్లేశరహితమయిన నిబ్బానాన్ని పొందారు.

తమ విముక్తి స్థిరమయినదని, ఇదే తమ చివరి జన్మ అని, తమకు పునర్భవం లేదు అన్న జ్ఞానం వారిలో కలిగింది.

చతురార్యసత్యాలను, గురించి చెప్పే 'ధమ్మచక్క పవత్తన సుత్త' (ధర్మచక్రప్రవర్తన సూత్రం) అన్నది బుద్ధుడు వారికి చెప్పిన ప్రథమోపదేశం. దానిని వినిన పెద్దవాడయిన కొండణ్ణ, పరివ్రాజక దశలో ప్రథమ దశను పొందాడు. మరికొంత ఉపదేశాన్ని వినిన మిగిలిన నలుగురు, 'సోతాపత్తి' దశను పొందారు. ఆత్మరాహిత్యం గురించి వివరించే, 'అనత్త లకన సుత్త' (అనాత్మ లక్షణ సూత్రం)ను వినిన, ఆ అయిదుగురు, అంతిమస్థితి అయిన అర్హతత్వ స్థితిని పొందారు.

అయిదుగురు ప్రథమ శిష్యులు:

పండితులయి అర్హతత్వాన్ని పొందిన, బుద్ధుని ప్రథమ శిష్యులు కొండణ్ణ, భద్దియ, వప్ప, మహానామ, అస్సజీ ఈ ఐదుగురిలో తన కుమారుని నామకరణ మహోత్సవానికి శుద్ధోధనుని ఆహ్వానాన్ని పొందిన ఎనిమిదిమంది బ్రాహ్మణ శ్రేష్ఠులలో కొండణ్ణ ఒకడు. అతడు వయసులో చిన్నవాడు. మిగిలిన నలుగురు తక్కిన వారిలో నలువురి పుత్రులు. బోధిసత్త్వుడు, బుద్ధత్వంకోసం శ్రమిస్తున్న కాలంలో, ఈ అయిదుగురు, గృహపరిత్యాగం చేసి, పరివ్రాజకత్వం స్వీకరించి, కుతూహలంతో అడవిని చేరినవారు. ఈ పనికిరాని తపోవిధానాలను, కఠినతరమైన సన్యాసదీక్షను విడిచిపెట్టి, చిక్కిశల్యమయిన శరీరాన్ని బలోపేతం చేసికోవడానికై, ఆహార స్వీకరణకు పూనుకున్నపుడు, ఆ పద్ధతిపట్ల నిరాశకు లోనయినా ఈ అయిదుగురు, అతనిని విడిచిపెట్టి, 'ఇసిపతనం' కు వెళ్ళిపోయారు. వారు వెళ్ళిన వెంటనే, బోధిసత్త్వుడు బుద్ధత్వాన్ని పొందినాడు.

గౌరవనీయుడయిన, 'కొండణ్ణ' మొదటి అర్హతుడయి, సంఘంలో జ్యేష్ఠసభ్యుడయినాడు. బుద్ధుని ముఖ్యశిష్యునిగా గుర్తింపును పొందిన సారిపుత్రుని (సారిపుత్త) సంఘంలో చేర్పించినవాడు, ఆ అయిదుగురిలో ఒకడయిన అస్సజీ.

❖ ❖ ❖

6. బుద్ధుని ప్రథమోపదేశ సారాంశం

"అన్నిమార్గాలలోఉత్తమమైనది ఆర్యఅష్టాంగమార్గం,
అన్నిసత్యాలలో ఉత్తమమైనవి చతురార్యసత్యాలు,
అన్ని స్థితులలో ఉత్తమమైనది రాగరహితస్థితి,
ద్విపాదజీవులలో ఉత్తమజీవి జ్ఞానదర్శి." -ధమ్మపదం

ముందుమాట:

జీవితం, జీవిత ప్రధాన లక్ష్యం. గురించి విభిన్నాభిప్రాయాలను కలిగిన, గొప్ప తత్వవేత్తలు, గురువులకు ప్రసిద్ధికెక్కినది ప్రాచీనభారతదేశం. బుద్ధునికాలంలో అరువదిరెండు విభిన్నమైన తాత్విక సిద్ధాంతాలున్నాయని దీఘనికాయంలోని, 'బ్రహ్మజాలసుత్త' చెబుతుంది.

ఆరోజుల్లో ప్రధానంగా వాడుకలోనున్న మత విశ్వాసాలనన్నిటిని, వ్యతిరేకించే హేతువాదులు వారి భౌతికవాదం పేర్కొనదగినది. దాని స్థాపకుడైన, చార్వాకుని పేరుమీదుగానే, చార్వాకులని పిలిచేవారు.

ప్రాచీన భౌతికవాదాన్ని, పాళీలోనూ, సంస్కృతంలోనూ 'లోకాయత' అనియంటారు. దాని ప్రకారం, మనిషి మరణంతో నాశం (శూన్యం) అవుతాడు. అతనిని మళ్ళీ జనింపజేసే శక్తిని కూడా, వదలిపెడతాడు. వారి ఉద్దేశంలో మరణమే అంతిమ స్థితి. ఈ ప్రపంచమే యదార్థం. "తిను, త్రాగు, సంతోషంగా జీవించు" అన్నది వారి సిద్ధాంతంగా కనిపిస్తుంది. సదాచారం (virtue) అన్నది ఒక మిథ్య. ఆనందంగా జీవితాన్ని అనుభవించడం యదార్థం. మతం అనేది మూఢమయిన, అంగీకృతంగాని ఒక మానసిక వ్యాధి. మంచి, ఔన్నత్యం, పవిత్రత, దయ. ఇటువంటి మాటలు, చేతలు నమ్మదగినవిగావు. ఇంద్రియసుఖం, స్వార్థం, తమకోరికలను ప్రకటించడం - ఇవన్ని ఈ సిద్ధాంతానికి ప్రతీకలు. వాంఛలు, సహజాతాలు అనేవి ప్రాకృతికవారసత్వాలు గనుక, వాటిని నియంత్రించవలసిన అవసరం లేదు.

మరో సిద్ధాంతం ప్రకారం, ముక్తి అనేది కఠోరమయిన నియమాలనాచరించవలసిన సన్యాసజీవనం వలన మాత్రమే సాధ్యం. ఇది పూర్తిగా ఉన్నత మత సిద్ధాంతాలకు చెందిన సన్యాసులు ఏర్పరచినదే. బోధిసత్వుడు, జ్ఞానం కోసం సమరాన్ని సాగిస్తున్న తరుణంలో, అతనిని సేవించిన ఐదుగురు సన్యాసులు కొంత యీ విశ్వాసానికి పట్టుబడి ఉన్నవారే.

ఈ దృష్టితోనే బుద్ధుడు కూడా, తన జ్ఞానోదయానికి ముందు, సన్యాస జీవనంలోని అన్ని విధానాలను ఆచరించాడు. అసామాన్యమైన ఆరేళ్ళ సమరం తరువాత, కఠోరదీక్షలతో తనను తాను శుష్కింపజేసికోవటం, వ్యర్థమని గ్రహించాడు. ఫలితంగా సఫలీకృతంగాని క్లిష్టమయిన మార్గాన్ని విడిచి, మధ్యేమార్గాన్ని ఎన్నుకున్నాడు. దాని ఫలితంగా, అతని అయిదుగురు శిష్యులు, అతనిపై విశ్వాసాన్ని కోల్పోయి, 'సన్యాసి గౌతముడు కఠోరనియమాలను విడిచిపెట్టి, భోగలాలసుడయినాడు' అని తలచి అతనిని వదలిపెట్టి వెళ్ళిపోయినారు.

తనకు కావలసినవాటిని సమకూర్చిపెట్టే, శిష్యులు తననలా వదిలిపెట్టిపోవటం, కొంత కష్టమే అయినా, బుద్ధుడు నిరాశపడలేదు. పైగా, వారలా తనను ఒంటరిగా వదలి వెళ్లినందుకు, వజ్రసంకల్పుడయిన బోధిసత్వుడు సంతోషపడినాడు. తక్కువకాని ఉత్సాహంతో, తనను తాను బలోపేతునిగా చేసికొని, గట్టి ప్రయత్నాన్ని విడిచి పెట్టకుండా, తన జీవితధ్యేయమయిన జ్ఞానోదయాన్ని పొందాడు.

జ్ఞానోదయానంతరం, ఇంచుమించు రెండు నెలల తరువాత, ఆషాఢ పౌర్ణమి నాడు, బుద్ధుడు, ఆ అయిదుగురు శిష్యులకు ప్రథమోపదేశాన్ని వినిపించాడు.

బుద్ధుని ప్రథమోపదేశం:

బుద్ధుని మొదటి ఉపదేశాన్ని "ధమ్మచక్క" అని అంటారు. 'సత్యచక్రము' అని ఈ పదానికి అర్థం. ధర్మవ్యాఖ్యాతల ప్రకారం, "ధమ్మ" అంటే 'జ్ఞానం', 'వివేకం' అని, "చక్క" అంటే 'స్థాపన' అని అర్థం. "ధమ్మచక్క" అంటే 'జ్ఞానస్థాపన' అని అర్థం. "ధమ్మచక్క ప్పవత్తన" అంటే 'జ్ఞాన సంస్థాపనా వివరణ' అని అర్థం. "ధమ్మం" అంటే 'సత్యం' అని, "చక్క" అంటే 'చక్రం' అనికూడా అర్థం చెప్పవచ్చు. "ధమ్మచక్క ప్పవత్తన" అంటే 'సత్యచక్రాన్ని స్థాపించడం', లేదా 'త్రిప్పటం' అని అర్థం.

తన మొట్టమొదటి ఉపదేశంలో బుద్ధుడు,తనకుతానయి కనుగొన్నది, తన బోధనల సారాంశం అయినది, అయిన 'మధ్యేమార్గం' గురించి చెప్పాడు. కఠోరదీక్షలలో నమ్మకమున్న తన ఐదుగురు శిష్యులకు, శాంతియుతమయిన జ్ఞానోదయానికి దారి చూపని విచ్చలవిడి భోగలాలస, తననుతాను శుష్కింపజేసికునే కఠోరసన్యాసనియమాలు – అన్న రెండుపద్ధతులను, త్రోసిరాజని, తన ప్రథమోపదేశంలో ఈ మధ్యేమార్గాన్ని వివరించాడు. మొదటిమార్గం, ఆధ్యాత్మికానుభవానికి అడ్డంకి కాగా, రెండవమార్గం 'మేధావి'ని బలహీన పరుస్తుంది. స్వయంగా తానీ మార్గాలు రెండింటినీ వ్యర్థ మని తెలిసికున్నాడు గనుక, బుద్ధుడు ఆ రెండు మార్గాలను విమర్శించాడు. ఆ అనుభవం నుంచి పరిపూర్ణతకు, విముక్తికి దారితీసే మార్గంగా, సహేతుకమయిన, లాభదాయకమైన, ఆచరణాత్మకమయిన మధ్యేమార్గాన్ని బోధించాడు.

వారణాశి, 'ఇసిపతన' లోని మృగదావనం (మిగదావనం)లో నున్నపుడు,ఈ ప్రథమోపదేశాన్ని బుద్ధుడు బోధించాడు.

ధార్మికోపదేశాన్ని వినడానికి అక్కడున్న మానవులు, ఆరేళ్లపాటు బుద్ధునితో కలిసిఉన్న ఆ తెలివిపరులయిన ఐదుగురు పరివ్రాజకులు మాత్రమే. అయితే, అదృశ్య రూపంలోనున్న, దేవతలు, బ్రహ్మలు కూడ అనన్యమయిన ఈ ధార్మికోపన్యాసాన్ని వినే సువర్ణావకాశాన్ని దక్కించు కున్నారని గ్రంథాలు చెబుతున్నాయి. ఈ కనిపించే ప్రపంచమేగాక, కనులకు కనిపించని ఇతర ప్రపంచాలు ఇంకా ఉన్నాయని, వాటిలో సూక్ష్మ శరీరులయిన వారెందరో ఉంటారని బౌద్ధులు నమ్ముతారు. బహుశాః దేవతలు, బ్రహ్మలు ఆ విలువయిన సమయంలో అక్కడ ఉండి ఉంటారు. అయినప్పటికీ బుద్ధుడు, ప్రముఖంగా ఉద్దేశించినది, ఆ అయిదుగురు పరివ్రాజకులనే. వారికే ఆయన తన ధర్మాన్ని ఉపదేశించాడు.

ఆరంభంలో బుద్ధుడు వారికి రెండు అంత్యాలకు దూరంగా ఉండవలసిందని హెచ్చరించాడు. బుద్ధుని అసలు మాటలివి: "ఏ పరివ్రాజకుడైనా (పబ్బజితేన) ఆశ్రయించరాని రెండు అంత్యాలున్నాయి." చివరి, తీవ్రం – అనే అర్థాలుగల అంత్యం అన్న పదం, ప్రపంచాన్ని పరిత్యజించినవాడు అనే అర్థంగల 'పబ్బజిత' అన్న పదం – ఈ రెండు పదాలకు ప్రత్యేకతనివ్వడం గమనింపదగినది.

బుద్ధునిమాటల్లోనే, ఒక అంత్యం ఇంద్రియవాంచలతో నిరంతర రాగం (కామసుఖల్లికానుయోగ) కలిగి ఉంటుంది. ఈ స్థితిని బుద్ధుడు, నీచమైనది, అసభ్యమైనది, ఐహికమైనది, అగౌరవప్రదం ఐనది, అప్రయోజనకరమైనది అని వివరించాడు. దీనివలన బుద్ధుడు, తన అనుయాయులందరినీ భౌతికపరమయిన సుఖాలను విడిచిపెట్టి, జీవితాన్ని అనుభవించకుండా అడవులకు వెళ్లమన్నాడని అర్థంకాదు. బుద్ధుడు అంత సంకుచిత మనస్కుడు కాదు.

దీనినిగురించి ఇంద్రియలోలుడు ఏమనుకున్నా, రాగరహితుడయిన ఆలోచనాపరుడు చెప్పినట్లు, అవి క్షణికమయినవి, పరిపూర్ణసంతృప్తి నీయలేనివి, చేదు అనుభవాలను మిగిలించేవి అని తెలుస్తోంది. "మామూలు మనిషికి, ప్రాపంచికానందాలనిచ్చేవి, సంపదను కూడబెట్టడం, దానిని అనుభవించడం అన్న రెండు విషయాలు. తెలివిపరుడయిన వాడు ఎవరూ, ఈ క్షణిక సుఖాలలో ఆనందాన్ని పొందలేడు. మామూలు మానవుడికి ఆశ్చర్యంగొలిపేవిధంగా, పరివ్రాజకుడు ఇంద్రియలోలత్వాన్ని దూరంగా ఉంచుతాడు. ఏది మొదటి వానికి సంతోషకారకమ వుతుందో, అదే సుఖం రెండవవానికి (పరివ్రాజకునికి) – భీతిని కలిగిస్తుంది." అని అంటాడు బుద్ధుడు.

రెండవ అంత్యం, కఠినతరమయిన నియమాలతో శరీరాన్ని శుష్కింపజేసికోవడం. ఈ నియమాలు బాధాకరం, హీనం, ప్రయోజనరహితం, సాధారణవ్యక్తి అభ్యాసానికి క్లిష్టతరం అయినవి, అని బుద్ధుడు అంటాడు. మొదటి అంత్యంలా, ఈ అంత్యాన్ని బుద్ధుడు, నీచమయినదని, అసభ్యమయినదని, ఐహికమయినదని అనలేదు. ఈ మూడు పదాలను బుద్ధుడు, ఎంతో అర్థవంతంగా వాడాడు. ఇంద్రియసుఖాలను పరిత్యజించిన నిజాయితీపరుడయిన సన్యాసి, కఠినతరమయిన నియమాలను, జీవనదుఃఖాలనుండి విముక్తిని పొందటం కోసం, అనుసరిస్తాడు. అప్రయోజనకరమయిన, బాధాకరమయిన అనుభవాలను పొందిన బుద్ధుడు, ఈ పద్ధతిని నిరర్థకమని అన్నాడు. ఇది దుఃఖాన్ని తగ్గించడానికి బదులు, మరింత పెంచుతుందని బుద్ధుని అభిప్రాయం.

బుద్ధుడు, అర్హతులు కూడ, ఉన్నతులు అనే అర్థంలో, 'ఆర్యులు' అని చెప్పబడినారు. అనార్యులు అనేవారు, ప్రాపంచిక మాలిన్యాలను వదలిపెట్టిన బుద్ధుడు, అర్హతులకన్నా భిన్నమయినవారు. 'అత్థ' అంటే

చరమసత్యం. అంటే, సంపూర్ణ దుఃఖవిముక్తి వలన కలిగే నిబ్బానం అని బౌద్ధుల అర్థం. 'అనత్థసంహిత' అంటే, అంతిమ సత్యానికి దోహదం చేయనిది అని అర్థం చెప్పుకోవచ్చు.

మొట్టమొదటగా బుద్ధుడు, అసలు విషయాన్ని, స్పష్టం చేసి, తన శ్రోతలలోని దురభిప్రాయాలను తొలగించాడు. అన్యమనస్కులయినవారి మనస్సులు తేటపడగానే, బుద్ధుడు, ఈ రెండు అంత్యాలకు సంబంధించిన వివరాలను తెలిపాడు. తథాగతుడు, ఈ రెండు అంత్యాలలోని దోషాలను గ్రహించినవాడయి, మధ్యేమార్గాన్ని అనుసరించాడు. ఈ నవ్యమార్గం, తథాగతుడు స్వయంగా కనుగొన్న మార్గం. ఈ కొత్త సిద్ధాంతానికి బుద్ధుడు, 'మజ్జిమ పటిపద' – మధ్యేమార్గం అని నామకరణం చేశాడు. తన కొత్త శిష్యులను ఒప్పించి, తన ఈ కొత్త మార్గానికి కట్టుబడి ఉండేలా, ఈ మార్గంలోని అనేక లాభాలను గురించి చెప్పాడు. ఒకదానికొకటి సరిగ్గా వ్యతిరేకంగా ఉండే పై రెండు అంత్యాలవలేగాక, ఈ మధ్యేమార్గం, ఉన్నవాటిని ఉన్నట్లుగానే గుర్తించగల అంతర్దృష్టిని, ఆంతరిక జ్ఞానాన్ని, కలిగిస్తుంది. అంతర్దృష్టి సరళమయినకొలదీ, మేధావియయినవాడు, ప్రతి విషయాన్ని యథార్థదృష్టితో చూడగలిగిన మేధోనైశిత్యాన్ని పొందుతాడు. అంతేకాదు. ప్రథమ అంత్యంలా క్లేశాలను కలిగించేదిగాక, మధ్యేమార్గం క్లేశాలను జయించేలాచేసి, శాంతిని కలిగిస్తుంది. అన్నిటికన్నా మించినది, ఈ పరివ్రాజక దశలోని నాలుగు పారలౌకిక మార్గాలను చేరుకునేందుకు, చతురార్యసత్యాలను అర్థం చేసికోవడానికి, అంతిమ లక్ష్యమయిన, నిబ్బానను అవగాహన చేసికోవడానికి ఈ మార్గం దారిచూపు తుంది.



ఇప్పుడు, మధ్యేమార్గం అంటే ఏమిటి? అని చూద్దాం. బుద్ధుడంటాడు, "అది, ఆర్య అష్టాంగమార్గం" అని. ఆ ఎనిమిది అంశాలను తన తరువాతి ఉపదేశాలలో వివరించాడు. మొదటి అంశం సమ్యక్ దృష్టి. బౌద్ధంలో ఇది కీలకాంశం. బుద్ధుడు అయిదుగురు పరివ్రాజకులు అనుమానాలను తీర్చి, వారికి సరైనమార్గనిర్దేశం చేయడానికి, సమ్యక్ దృష్టి తో తన మార్గాన్ని ప్రారంభించాడు. ఒకవ్యక్తి ఏమిటో అన్న జ్ఞానాన్ని ఉన్నదున్నట్లుగా ఆ వ్యక్తికి తెలుపుతుంది ఈ సమ్యక్ దృష్టి. స్వార్థానికి, చెడుతలపులకు, క్రౌర్యానికి వ్యతిరేకమైన, రాగరహిత స్థితికి, లేక, పరిత్యాగానికి, దయార్ద్రతకు, నిరపాయకరస్థితికి సంబంధించిన మంచి ఆలోచనలను కలిగిస్తుంది. సమ్యగాలోచనలను కలిగిస్తుంది. సమ్యగాలోచనలు, మనిషి నైతికతను పరిపుష్టం చేయగల సమ్యక్ వాక్కుకు, సమ్యక్ కర్మకు, సమ్యగ్జీవనానికి దారితీస్తాయి. ఈ మూడు వ్యక్తి నైతికతకు పరిపూర్ణతను చేకూరుస్తాయి.

ఆరవ అంశమయిన, సమ్యక్ ప్రయత్నం (సమ్యక్ కృషి), వ్యక్తిలోని చెడు ఆలోచనలను తొలగించి, మంచి ఆలోచనలను అభివృద్ధి పరచుకునేందుకు సాయ పడుతుంది. ఈ విధంగా వ్యక్తి, తన అంతఃపరీక్షలద్వారా, తన ఆలోచనలను, భావాలను సరిజూసుకొని, తనను తాను క్షాళన జేసికోవటం అవసరం. దీనికి సమ్యక్ అప్రమత్తత (సమ్యక్ సతి) అన్న ఏడవ సత్యం ద్వారా సాధించవచ్చు. సమ్యక్ ప్రయత్నం, సమ్యక్ అప్రమత్తతతో

కలిసి, సమ్యక్ ఏకాగ్రతకు (సమ్యక్ సమాధి) దారితీస్తుంది.ఏకాగ్రత కలిగిన, ఈ సమ్యక్ సమాధి స్థితిలో మనసు, ప్రతి వస్తు వును ఉన్నదానిని ఉన్నట్లుగా చూపే శుభ్రపరచిన అద్దంలా మెరుస్తుంది.

తన ఉపదేశ ప్రారంభంగా, రెండు అంత్యాలను, తాను కనుగొన్న మధ్యేమార్గాన్ని గురించి చెబుతూ, బుద్ధుడు చతురార్యసత్యాలను గూర్చి విపులీకరించి వివరించాడు.

'ఏది ఉన్నదో అది' అని అర్థం ఇచ్చే సత్యము అన్న పదానికి పాళీలో 'సచ్చ' అని అర్థం. సత్యం అన్నది సంస్కృత పదం.దీనికి 'నిర్ద్వంద్వమైన విషయం' అని అర్థం. నిర్ద్వంద్వమైన నాలుగు సత్యాలను బుద్ధుడు, తన బోధనలకు పునాదిగా గ్రహించాడు. ఈ చతురార్యసత్యాలు మానవ జీవన దుఃఖాలను తొలగించేవి. దేవుడిని కేంద్రంగా చేసికొన్న ఇతర మతాలను వ్యతిరేకించే బుద్ధుని ధర్మం వ్యక్తి కేంద్రకంగా వెలసినది. ఇది అంతర్ముఖీనమైనది, బహిర్ముఖీనమయినదికూడ. బుద్ధుడు ఉద్భవించినా, లేకున్నా ఈ సత్యాలు ఉంటాయి. అయితే ఈ భ్రమాత్మకమయిన ప్రపంచానికి ఆర్యసత్యాలను అందించినవాడు మాత్రం ఒక బుద్ధుడే. అవి కాలానుగుణంగా మారనివి, స్థిరమయిన, శాశ్వతమయిన సత్యాలు. ఆ ఆర్యసత్యాలను అర్థం చేసికున్నందుకోసం బుద్ధుడు, ఎవరికీ ఋణపడిలేడు. తన ఉపదేశంలో అతడే చెప్పినట్లు, "ఇంతకు ముందు వినియుండని ఈ విషయాలకు సంబంధించి నాలో ఒక అంతర్నేత్రం, జ్ఞానం, వివేకం, ప్రజ్ఞ, ప్రకాశం ఉద్భవించాయి." అన్న మాటలు నిజం. ఈ మాటలు చాల ముఖ్యమైనవి. వీటిని బట్టి మధ్యేమార్గం యొక్క మౌలికతను తెలిసికొనగలం.

ఈ చతురార్యసత్యాలను, పాళీలో, 'అరియ సచ్చాని' అంటారు. మాలిన్యాలను జయించిన ఒక గొప్ప అరియ (ఆర్యుడు) చే కనుగొనబడిన సత్యాలు గనుక, వాటినలా పిలుస్తారు.

మొదటి ఆర్యసత్యం దుఃఖం గురించి చెబుతుంది. ఆంగ్లంలో దుఃఖం అన్న పదాన్ని suffering (నొప్పి, బాధ, ఆవేదన), sorrow (దిగులు, విచారం, ఖేదం) అనే పదాలద్వారా వివరిస్తారు. కానీ అవి సరయిన అనువాదాలుకావు. దుఃఖాన్ని వేదనగా గుర్తిస్తే, అది భరింపరానిదని అర్థం.

దుఃఖం అన్న పదంలో 'దుః' అంటే తిరస్కరింపదగిన, తృణీకారం చేయదగిన అని, 'ఖం' అంటే శూన్యం అని అర్థం. ప్రపంచం బాధామయం, వేదనామయం గనుక అది తృణీకరింపదగినది. అది వాస్తవం కాదుగనుక, దుఃఖం అంటే తృణీకరింపదగిన శూన్యం, తిరస్కరింపదగిన ఖాళీ అని అర్థం.

సామాన్య మానవుడు దేన్నయినా, పైపైనే చూస్తాడు. కాని, అరియ మాత్రం, వాటిని ఉన్నది ఉన్నట్లుగానే గ్రహిస్తాడు. అరియకు జీవితమంతా దుఃఖమయమే. భ్రాంతిదాయికమయిన సంతోషాలతో, మానవులను మోసపుచ్చే భౌతిక సుఖాలు, కొన్ని వాంఛలను తృప్తిపరచేవిమాత్రమే. ఇవన్నీ, జన్మ, జరా, రుజ, మరణాలకు దారితీసేవే. ఈ దుఃఖం నుండి ఏ ఒక్కరూ తప్పించుకోలేరు.

తీరని కోరిక కూడ దుఃఖమే. తనను అసహ్యించుకునే, ద్వేషించే వస్తువులను గాని, మనుష్యులను గాని కలిగి ఉండాలని ఎవరూ అనుకోరు. అలాగే, తనకిష్టమయిన వస్తువులను పొందాలనిగాని, ఇష్టమయిన మనుష్యులతో కలిసి ఉండాలని గాని కోరుకుంటారు. ఇది ప్రకృతిసిద్ధ నియమం. కొన్నిసార్లు దేనిని తక్కువ కోరుకుంటామో, దేనిని కావాలనుకుంటామో అది లభించకపోవడం జరుగుతుంది. అటువంటి, ఎదురుచూడని అసంతోషకరమయిన వాతావరణం బాధాకరంగా పరిణమించడమేకాదు, అమాయకులను, అటువంటి సమస్యలను పరిష్క రిస్తాయేమో అన్నట్లుగా ఆత్మహత్యలవైపు పురిగొల్పుతాయి.

నిజమైన సంతోషం తమలోనే లభిస్తుంది. సంపదలు, అధికారం, గౌరవం, విజయాలు అన్న పదాల ద్వారా, నిజమైన సంతోషాన్ని నిర్వచించలేము. ప్రపంచానుభవాలు, బలవంతంగానో. అన్యాయంగానో దగ్గరయినా, రాగబంధంతో కూడుకొన్నవయినా, సరయిన మార్గంలో నడవకున్నా, అటువంటి ప్రపంచానుభవాలు అసహనాన్ని కలిగించడమే కాదు, పైగా అవి వేదనను, శోకాన్ని కలిగిస్తాయి.

సామాన్యులకు, సాధారణంగా గొప్పవి, ఆనందదాయకమయినవి ఇంద్రియసుఖాలు మాత్రమే. ముందుగానే తెలిసిపోయేవి, తృప్తిపరచేవి, మళ్ళీ మళ్ళీ తలచుకుని సంతోషపడేవి అయిన నిలకడలేని సంతోషాలు తాత్కాలికానందాన్ని కలిగిస్తాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. కాని అవి భ్రమాత్మకాలు, అశాశ్వతమైనవి.

బుద్ధుని ప్రకారం, భౌతిక సుఖాలపట్ల విరాగత్వం, లేదా వాటి అధిగమనం అన్నది గొప్ప ఆనందం. సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ దేహమే, దుఃఖహేతువు.

తృష్ణలు మూడు రకాలు. మొదటిది, అన్ని రకాల ఇంద్రియసుఖాలను కోరే స్థూలరూపంలో నున్న, కామ తృష్ణ. రెండవది, ఉండాలనే (భవ) కోరిక. అస్తిత్వసంబంధమైన భవతృష్ణ. మూడవది, లేకుండాలనే కోరిక. అనస్తిత్వసంబంధమయిన విభవతృష్ణ. వ్యాఖ్యానాలప్రకారం, చివరి రెండు తృష్ణలలోని రెండులక్షణాలలో మొదటిది, శాశ్వతత్వమన్ననమ్మకంతో ముడిపడిన ఇంద్రియసుఖాలమీది రాగం కాగా, రెండవది ఇంద్రియాతీత రాగం. భవతృష్ణకు రూపరాగం భూమికగాను, విభవతృష్ణకు అరూపరాగం భూమికగాను ఉన్నాయి. అందుకే, రూప, అరూపరాగాలు రెండూ, రెండు సంకెళ్లుగాను, నిర్బంధాలుగాను చెప్పబడతాయి.

ఈ తృష్ణ అనేది,అందరిలో నిగూఢంగా ఉండి, ఎక్కువగా జీవనవేదనలకు దారితీసే బలమయిన మానసికశక్తి. స్థూలరూపంలోనో, సూక్ష్మరూపం లోనో ఉంటూనే, ఈ ప్రపంచంలో పునర్భవానికి దారితీస్తూ, మనిషికి ఎన్నో జనన మరణాలకు కారణం ఈ తృష్ణే!

తృష్ణ స్థూలరూపం, సాధనలోని రెండవ రూపమైన 'సకదాగామి'ఆర్య దశను పొంది, బలహీన రూపాన్ని దాల్చుతుంది. మూడవదశ అయిన 'అనాగామి' దశను చేరగానే, నిర్మూలింపబడుతుంది. నాల్గవదశ అయిన 'అర్హతత్వదశ'ను చేరగానే తృష్ణయొక్క సూక్ష్మరూపం కూడ నిర్మూలన మవుతుంది.

ధమ్మపదం ఇలా చెబుతుంది:

"తృష్ణనుంచి శోకం, శోకం నుంచి భయం మొలకెత్తుతాయి. తృష్ణను జయించినవానికి శోకమూ ఉండదు, భయం అంతకన్నా ఉండదు. తృష్ణ పునర్జన్మలకు దారితీస్తుందని, బుద్ధుడు చెబుతాడు. కొందరు పండితులు, బుద్ధుడు పునర్జన్మను గురించి చెప్పలేదు అంటారు, కానీ బుద్ధుడు చెప్పిన పునర్భవానికి 'పునబ్భవ' అన్న ఈ పాళీ పదం అత్యంత విలువైన సాక్ష్యంగా గుర్తింపదగినది. రెండవ ఆర్యసత్యమయిన 'దుఃఖ సముదాయం', భూతభవిష్యద్వర్తమాన జన్మలతో సూటిగా వ్యవహరిస్తుంది. మూడవ ఆర్యసత్యమయిన 'దుఃఖనిరోధం', ఆర్యాష్టాంగ మార్గాలను అనుసరించడంద్వారా అర్థం చేసికోగలం. ఈ మార్గం, నిబ్బానానికి దారితీసే ప్రత్యేకమయిన మార్గం. ఇదే 'దుఃఖ నిరోధమార్గం' అనే నాల్గవ ఆర్యసత్యంకూడ. చతురార్యసత్యాలను విభిన్నరీతులలో వివరించిన బుద్ధుడు, తన ఉపదేశాన్ని, ఈ ఫలవంతమయిన మాటలతో ముగించాడు. "ఓ భిక్షువులారా! చతురార్యసత్యాలకు సంబంధించిన, సంపూర్ణమూ, సత్యము ఆంతరికజ్ఞాన ప్రబోధకమూ అయిన

మూడు స్థితులతో కలిసి, మొత్తం, నాలుగు ఆర్యసత్యాలు, పన్నెండు స్థితులు, నాకు క్షుణ్ణంగా అవగతంకానంతవరకు, నేను అనన్యమైన సంపూర్ణ జ్ఞానోదయాన్ని పొందానని చెప్పుకోలేదు. ఎప్పుడయితే ఈ నాలుగు ఆర్యసత్యాలకు సంబంధించి సంపూర్ణమయిన, సత్యమైన, ఆంతరంగిక ప్రజ్ఞను పొందానో, అప్పుడే ఈ ఆర్యసత్యాలను సంపూర్ణంగా అర్థం చేసికోగలిగాను. అపుడు మాత్రమే నేను అనుపమానమయిన, విశిష్టమయిన, సంపూర్ణజ్ఞానాన్ని (అనుత్తర సమ్మా సంభోధి) పొందానని చెప్పుకొన్నాను. నాలో జ్ఞానం, ప్రజ్ఞ కలిగినాయి. అప్రతిఘాతమయిన విముక్తిని నా మనసు అనుభూతం చేసికొన్నది. ఇది, నా ఆఖరుజన్మ. మళ్ళీ నాకు జన్మరూపేణా మరో అస్తిత్వం లేదు”

ఈ ఉపదేశం చివర, ఐదుగురు శిష్యులలో పెద్దవాడయిన కొండణ్ణ, ధమ్మాన్ని అవగాహన చేసికొన్నవాడయి, ఆర్య దశలోని మొదటి దశను పొందాడు. ఏది జననశీలమయిన ధమ్మమో, అది మరణశీలమయిన ధమ్మంకూడ అని అర్థం చేసికున్నాడు.

బుద్ధుడు, ‘ధమ్మచక్క’ ను ఉపదేశించగనే, భూమిపై నున్న దేవతలు ఆశ్చర్యంతో ఇలా అన్నారు, “ఏ సన్యాసి చేతగాని, మతగురువు చేతగాని, దేవతల చేతగాని, మారుని చేతగాని బ్రహ్మ చేతగాని ఈ ప్రపంచంలో, ఇంతకుపూర్వం ఎప్పుడూ, ఉపదేశింపబడని ఈ అద్భుతమయిన ‘ధమ్మచక్క’, శ్రేష్టుడయిన బుద్ధునిచేత, వారణాసి దగ్గరనున్న, ఇసిపతనంలోని మృగదావనంలో ఉపదేశింపబడినది”. దీనిని వినిన, ఇతర భూమికలలోని దేవతలు, బ్రహ్మలు కూడా ఇదే విషయాన్ని జయజయధ్వానాలతో చెప్పారు.

దేదీప్యమానమయిన దేవతల వెలుగును అణచివేసే విధంగా, ఒక తేజోవంతమయిన వెలుగురేక ఈ ప్రపంచంలో పొడసూపింది. ధమ్మం యొక్క వెలుగు మొత్తం ప్రపంచాన్ని వెలిగించడమేగాక, జీవులందరికి శాంతిసంతోషాలను తెచ్చింది.

❖ ❖ ❖

7. బుద్ధుని ప్రథమోపదేశం : ధర్మచక్ర ప్రవర్తన సూత్రం

నేనిలా విన్నాను: ఉన్నతుడయిన బుద్ధుడు, వారణాసి దగ్గరి ఇసిపతనంలోని మృగదావనంలో ఉంటున్నాడు. అక్కడ అయిదుగురు భిక్షులను సంబోధించి ఇలాచెప్పాడు.

"ఓ భిక్షులారా! పరివ్రాజకులైన వారు పరిత్యజించవలసిన రెండు అంత్యాలున్నాయి (Both Extremes).

1. ఇంద్రియవాంఛలలో మునిగితేలటం: ఇది నీచం. అసభ్యం, ప్రపంచకం, అప్రయోజనకరం.
2. తననుతాను శుష్కింపజేసికోవటం: ఇది బాధాకరం, అప్రయోజనకరం (Extreme Painful Austerities).

ఈ రెండు అంత్యాలను విడిచిపెట్టి, తథాగతుడు, దృష్టి (చక్షు)ని, జ్ఞానాన్ని (ప్రజ్ఞ) పెంచేది, శాంతి (ఉపసమాయ)ని, ఉన్నతజ్ఞానా (అభిజ్ఞాయ)న్ని, జ్ఞానసిద్ధి (సంబోధాయ)ని, నిర్వాణాన్ని (నిబ్బానాన్ని) కలిగించేది అయిన మధ్యేమార్గాన్ని కనుగొనినాడు.

"ఓ భిక్షులారా! దృష్టిని, జ్ఞానాన్ని పెంచేది, శాంతిని, ఉన్నతజ్ఞానాన్ని, జ్ఞానసిద్ధిని, నిర్వాణాన్ని (నిబ్బానాన్ని) కలిగించేది అయిన ఆ మధ్యేమార్గం ఏది?

అది ఆర్యాష్టాంగమార్గమే. సమ్యక్ దృష్టి (Right View), సమ్యక్ సంకల్పం (Right Intention), సమ్యక్ వాక్కు (Right Speech), సమ్యక్ కర్మ (Right Action), సమ్యగ్జీవనం (Right Livelihood), సమ్యక్ ప్రయత్నం (Right Effort), సమ్యక్ స్మృతి (Right Mindfulness), సమ్యక్ సమాధి (Right Concentration) అనేవి ఆర్య అష్టాంగమార్గం. ఓ భిక్షులారా, ఇదే తథాగతుడు కనుగొన్న మధ్యేమార్గం.

బుద్ధుడు ఇంకా ఇలా చెప్పాడు. "ఓ భిక్షులారా! ఇదే దుఃఖ ఆర్యసత్యం (దుక్ఖ అరియసచ్చ). జన్మకూడ దుఃఖం, జరా కూడ దుఃఖం, జాతి కూడ దుఃఖం, మరణం కూడ దుఃఖం. అసంతోషకరమయినవాటితో కలిసి ఉండటం దుఃఖం.

సంతోషకరమయినవాటినుంచి దూరంకావడం, దుఃఖం. కోరుకున్నదానిని పొందలేకపోవటం దుఃఖం. క్లుప్తంగా చెప్పాలంటే, పంచస్కంధాల పట్ల రాగం (రూప, వేదనా, సంజ్ఞ, శంఖార, విజ్ఞానాలు) దుఃఖమే.

ఓ భిక్షులారా! ఇది దుఃఖ కారణ ఆర్యసత్యం (దుక్ఖ సముదయ అరియసచ్చ).

ఇంద్రియవాంఛలకు సంబంధించిన కామతృష్ణ, అస్తిత్వ సంబంధమయిన భవతృష్ణ, అనస్తిత్వ సంబంధమయిన విభవతృష్ణలన్న మూడు రూపాలలోనున్న తృష్ణ, ఇదికావాలి అదికావాలి అని పట్టుకు వేలాడేలా చేసే తృష్ణ, పునర్భవాన్ని కలిగిస్తుంది.

ఓ భిక్షులారా! దుఃఖ నిరోధ సత్యం (దుక్ఖ నిరోధ అరియసచ్చ).

ఇది తృష్ణను పరిత్యజించటం, తృష్ణ నుండి స్వేచ్ఛను పొందటం, తృష్ణారాహిత్యం వంటి తృష్ణానాశానికి తోడ్పడుతుంది.

ఓ భిక్షులారా! దుఃఖ నిరోధమార్గ ఆర్యసత్యం (దుక్ఖ నిరోధగామిని పతిపద అరియసచ్చ).

సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పం (ఆలోచనలు), సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ, సమ్యక్ జీవనం, సమ్యక్ వాయామ (ప్రయత్నం), సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి అనే ఆర్య అష్టాంగమార్గం ఇదే.

1. (i) "ఇదే దుఃఖ ఆర్య సత్యం."

   "ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుమునుపెపుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో, ఒక చూపు, జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

   (ii) ఈ దుఃఖ ఆర్య సత్యాన్ని తెలిసికొని తీరాలి.

   "ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుమునుపెపుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో ఒక చూపు (Dhamma Vision), జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

   (iii) ఈ దుఃఖ ఆర్య సత్యాన్ని తెలిసికొన్నాను.

   ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుమునుపెపుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో ఒక చూపు (ధమ్మ చక్షువు), జ్ఞానం, అవగాహన,ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

2. (i) ఇదే దుఃఖకారణం అనే ఆర్య సత్యం.

   ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుమునుపెపుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన,ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

(ii) ఈ దుఃఖకారణ ఆర్యసత్య నిర్మూలన జరగాలి.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన,ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

(iii) ఈ దుఃఖకారణ ఆర్యసత్యం నిర్మూలితమైనది.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో, ఒక చూపు, జ్ఞానం, అవగాహన,ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

3. (i) ఇదే దుఖనిరోధ ఆర్యసత్యం.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

(ii) ఈ దుఃఖనిరోధ ఆర్యసత్యాన్ని గుర్తెరగాలి.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

(iii) ఈ దుఃఖ నిరోధ ఆర్యసత్యం నాకు అనుభూతమయినది.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

4. (i) ఇదే దుఃఖనిరోధానికి దారితీసేమార్గానికి సంబంధించిన ఆర్యసత్యం.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

(ii) దుఃఖనిరోధానికి దారితీసే మార్గానికి సంబంధించిన ఆర్యసత్యాన్ని సాధన చేయాలి.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

(ii) దుఃఖనిరోధానికి దారితీసే మార్గానికి సంబంధించిన ఆర్యసత్యం వృద్ధిపరిచాను.

ఓ భిక్షులారా! ఈ విధంగా, ఇంతకుముందెప్పుడూ వినని ఈ విషయానికి సంబంధించి, నాలో,ఒక చూపు, జ్ఞానం, అవగాహన, ప్రజ్ఞ వెలుగు కలిగాయి."

ఉపదేశాన్ని ముగిస్తూ, బుద్ధుడు ఇలా చెప్పాడు.

"ఓ భిక్షులారా! చతురార్యసత్యాలకు సంబంధించిన సంపూర్ణము, సత్యము, ఆంతరికజ్ఞాన ప్రబోధకమైనది అయిన మూడుస్థితులు కలిపి, నాలుగు ఆర్యసత్యాలు, పన్నెండు స్థితులు నాకు క్షుణ్ణంగా అవగతం కానంతవరకు, దేవతలు, మారులు, బ్రహ్మలు, సన్యాసులు, గురువులు, మానవులతో కూడిన యీ ప్రపంచంలో నేను, అనన్యమైన, సంపూర్ణ జ్ఞానోదయాన్ని పొందానని చెప్పుకోలేదు. (అనుత్తరమ్-సమ్మా-సంబోధిమ్).

ఎప్పుడయితే, చతురార్యసత్యాలకు సంబంధించిన సంపూర్ణసత్యం, ఆంతరికజ్ఞాన ప్రబోధికమైనది అయిన మూడు విధానాలు కలిపి, నాలుగు ఆర్యసత్యాలు, పన్నెందు విధానాలకు సంబంధించి, సంపూర్ణమయిన, సత్యమయిన, ఆంతరిక ప్రజ్ఞను పొందానో, అప్పుడే దేవతలు, మారులు, బ్రహ్మలు, సన్యాసులు, మతగురువులు, మానవులతో కూడిన యీ ప్రపంచంలో నేను, అనన్యమైన, సంపూర్ణ జ్ఞానోదయాన్ని పొందానని చెప్పుకొన్నాను. నాలో జ్ఞానం, అంతర్దృష్టి (ప్రజ్ఞ) కలగడమేకాదు, అప్రతిఘాతమయిన విముక్తిని నా మనసు అనుభూతం చేసికున్నది. ఇదే నా ఆఖరు జన్మ. నాకు మరో అస్తిత్వంలేదు.

ఈ విధంగా చెప్పిన, ఉన్నతుడయిన బుద్ధుని ఉపదేశానికి సంతోషపడిన భిక్షువులు బుద్ధుని మాటలను శ్లాఘించారు.

ఈ ధమ్మ సిద్ధాంతం ప్రకటింపబడగానే, మాలిన్యంలేని, మచ్చలేని సత్యాన్ని దర్శింపగలిగిన దృష్టి (ధమ్మనేత్రం) గౌరవనీయుడయిన కొండణ్ణలో ఉద్భవించింది. "ఏది జననశీలమయినదో అదే మరణశీలమయినదికూడా" అన్న సత్యాన్ని అవగతం చేసికొన్నాడు. కొండణ్ణ సోతాపన్నుడయినాడు.

బుద్ధుడు, 'ధమ్మచక్క' ను ఉపదేశించగనే, భూమిపై నున్న దేవతలు ఆశ్చర్యంతో ఇలా అన్నారు, "ఏ సన్యాసి చేతగాని, మతగురువు చేతగాని, దేవతల చేతగాని, మారుని చేతగాని బ్రహ్మ చేతగాని ఈ ప్రపంచంలో, ఇంతకుపూర్వం ఎప్పుడూ, ఉపదేశింపబడని ఈ అద్భుతమయిన 'ధమ్మచక్క', శ్రేష్ఠుడయిన బుద్ధునిచేత, వారణాసి దగ్గరనున్న, ఇసిపతనంలోని మృగదావనంలో ఉపదేశింపబడినది".

దీనిని వినిన, ఇతర భూమికలలోని, చతుమ్మహారాజిక, తవతింస, యమ, తుషిత, నిమ్మనరతి, పరనిమ్మితవసవత్తి మున్నగు దేవతలు, బ్రహ్మపరిసజ్జ, బ్రహ్మపురోహిత, మహాబ్రహ్మ, పరిత్తభ, అప్పమానభ, అభరస్స, పరిత్తసుభ, అప్పమానసుభ, సుభకిన్న, వెహప్ఫల, అవిత, అతప్ప, సుదస్స, సుదస్సి, అకనిత్థ మున్నగు బ్రహ్మలు కూడా ఇదే విషయాన్ని జయజయధ్వానాలతో చెప్పారు.

ఈ జయజయధ్వానాలు ఆ క్షణంలోనే, బ్రహ్మలోకాలన్నిటికీ వ్యాపించాయి. దీనిని వినిన, పదివేల ప్రపంచాలు, కంపించాయి, ఊగిపోయాయి, వణకిపోయాయి. దేదీప్యమానమైన దేవతల వెలుగును అణచివేసే విధంగా, ఒక తేజోవంతమైన వెలుగు ఈ ప్రపంచంలో పొడసూపింది. అపుడు, ఉన్నతుడయిన బుద్ధుడు, "మిత్రులారా! కొండణ్ణ ఈ సత్యాన్ని అర్థం చేసికున్నాడు. మిత్రులారా! కొండణ్ణ ఈ సత్యాన్ని అర్థం చేసికున్నాడు. అని చెప్పాడు. అప్పటినుండి గౌరవనీయుడయిన కొండణ్ణ, అణ్ణా కొండణ్ణ (తెలుసుకున్న కొండణ్ణ) గా గుర్తింపబడినాడు.

ధర్మచక్రప్రవర్తనసూత్రం- కొన్ని ప్రతిఫలనలు:

1. బౌద్ధం భౌతిక అనుభవం ఆధారంగా వెలసినది, గనుక, అది హేతుబద్ధమే గాని కాల్పనికమైనది కాదు.
2. బుద్ధుడు అన్నిరకాల ప్రమాణాలను లేదా ప్రాచీన సిద్ధాంతాలను విడిచి పెట్టాడు. పూర్తిగా అతనిదే అయిన ఒక ఉన్నత మాధ్యమాన్ని స్థాపించాడు.
3. బౌద్ధం ఒక మార్గం.
4. హేతుబద్ధమైన, అవగాహనే బౌద్ధంలోని కీలకాంశం.

5. అంధ విశ్వాసాలను అందలంనుండి త్రోసివేశాడు.
6. విశ్వాసాలకు, హేతుబద్ధం కాని సిద్ధాంతాలకుబదులు, ఆచరణకు ప్రాధాన్యమివ్వడం జరిగింది. విశ్వాసాలు, అహేతుక సిద్ధాంతాలు, వ్యక్తిని విముక్తుని చేయలేవు.
7. వేదాలలో చెప్పబడిన యజ్ఞయాగాదులు, కర్మకాండలకు బౌద్ధంలో స్థానం లేదు.
8. ప్రసన్నులను గావించుకోవడానికి బౌద్ధంలో దేవతలు లేరు.
9. మధ్యవర్తులుగా పనిచేసే పూజారివర్గం లేదు.
10. లక్ష్యమైన నిబ్బానసాధనకు, శీలము, సమాధి, ప్రజ్ఞ అతి ముఖ్యమైనవి.
11. బౌద్ధం పునాదులు చతురార్యసత్యాలు. అవి అనుభవం ద్వారా తెలుసుకోదగినవి.
12. నాలుగు ఆర్యసత్యాలు మనిషి జీవితంతో కూడియున్నవి. కాబట్టి, బౌద్ధం మానవ కేంద్రకం, అంతర్ముఖీనం.
13. బుద్ధుడు స్వయంగా వీటిని కనుగొన్నాడు. అందువలన, అతడు ఎవరికీ ఋణపడిలేదు. అతని మాటల్లోనే చెప్పాలంటే, “అవి మునుపెప్పుడూ వినియుండనివి.”
14. ఈ ఆర్యసత్యాలు కాబట్టి కాలంతోబాటు మారవు.
15. మొదటి ఆర్యసత్యం, దుఃఖానికి సంబంధించినది. ఇది, ఒక మనిషి యొక్క జీవితంలోని వివిధ దశలతో కూడి ఉంటుంది. ఇది విశ్లేషింపదగినది, పరీక్షింపదగినది, తననుతాను అర్థం చేసికోవడానికి ఈ పరీక్ష సాయపడుతుంది.
16. మొదటి ఆర్యసత్యాన్ని, హేతుబద్ధంగా అర్థం చేసికుంటే, రెండవ ఆర్యసత్యమైన దుఃఖ కారణాన్ని తొలగించుకోగలం.
17. అందరిలో గుప్తంగానున్న బలీయమైన శక్తితో, ఈ దుఃఖకారణం అనే రెండవ ఆర్యసత్యం, సంబంధం కలిగి ఉంటుంది.
18. తృష్ణ, కనులకు అగుపించని బలమైన మానసిక శక్తి. జీవితంలోని అనర్థాలకు కారకమైనది కూడా.
19. రెండవ చతురార్య సత్యం, భూత, వర్తమాన, భవిష్యత్ జన్మలతో పరోక్షంగా వ్యవహరిస్తుంది.
20. అందువలన జన్మల అస్తిత్వాన్ని బుద్ధుడు సమర్థించాడు అనవచ్చు.
21. జన్మల అనుబంధమైన కర్మసిద్ధాంతం, వానిలోనే నిక్షిప్తమై ఉంటుంది.
22. దుఃఖనిరోధం మూడవ ఆర్యసత్యం. లౌకికాలైన మొదటి రెండు ఆర్యసత్యాలవలె ఇది, వ్యక్తి ఆధారితమే అయినా, హేతువుకందనిది, లోకోత్తరమైనది.
23. మూడవ ఆర్యసత్యం తనకుతానుగా తెలిసికోగలిగినది. మనో నేత్రంతో దర్శించగలిగిన ధర్మం.
24. సర్వసంగపరిత్యాగం చేత అర్థంచేసికోగలిగినదీ ఆర్యసత్యం. దీనికి బాహ్య వస్తువులను పరిత్యాగం చేయటం కాదు, బాహ్య ప్రపంచంతో నున్న, అంతరంగరాగాన్ని పరిత్యజించటం అని అర్థం.
25. ఈ రాగాని న్(బాహ్య ప్రపంచరాగాన్ని) పూర్తిగా పెకలిస్తే, మూడవ ఆర్యసత్యం అర్థమవుతుంది. ఈ రాగాన్ని అణచివేయటం మాత్రమే, నిబ్బానం కాదు. అప్పుడది నశింపజేయడంతో సమానమవుతుంది. లౌకిక శక్తులతో ముడిపడి ఉన్న ఈ శక్తిని, నిర్మూలనం చేయటం వలన మాత్రమే నిబ్బానాన్ని అనుభూతం చేసికోవచ్చు.

26. నిబ్బానం అనేది, సాధింపవలసినదే కానీ, ఉత్పత్తిచేయడానికి వీలు పడనిది. ఇది ఈ జీవితంలోనే సాధించగలం. బౌద్ధసిద్ధాంతాలలో పునర్భవం ఒకటి అయినప్పటికీ, బౌద్ధ లక్ష్యం మాత్రం పునర్భవం కాదు అని దీనిని బట్టి అర్థం చేసికోగలం.
27. నాల్గవ ఆర్యసత్యాన్ని సాధించడం ద్వారా, మూడవ ఆర్యసత్యాన్ని వాస్తవం చేసికోవచ్చు.
28. ఒక బలమైన శక్తిని నిర్మూలనం చేయాలంటే ఎనిమిది శక్తివంతమైన కారకాలను (factors) పెంపొందించుకోవాలి.
29. ఈ ఎనిమిది కారకాలు పూర్తిగా మానసికమైనవి.
30. గుప్తమై ఉన్న దుష్టశక్తిని ఎదుర్కోవడానికి, ఎనిమిది శక్తిమంతమైన మంచిశక్తులను సమీకరించాలి.
31. ఈ మహా విజయం కలిగించే ఇతర లాభాలు, సంపూర్ణ స్వచ్ఛత, జన్మలనుండి విముక్తి, అన్ని క్లేశాలనుండి విముక్తమైన మనసు, మరణరాహిత్యస్థితి (అమత పథం).
32. ఈ విముక్తి పరిపూర్ణమైనది, పూర్తి స్వచ్ఛమైనది.
33. ప్రతి విషయంలో ఈ ప్రశ్నలను అడగవచ్చు. సంపూర్ణమైనది ఏది? పూర్తి స్వచ్ఛమైనది ఏది? బౌద్ధంలో ఒక మూర్తిగాని, శాశ్వత అస్తిత్వం గాని లేవు. కాని చైతన్యస్రవంతి మాత్రమే ఉంది క్లేశాలను తొలగించుకోవటంద్వారా ఈ చైతన్యస్రవంతి పరిశుభ్రమవుతుందని చెప్పటం సరియైనది.

గమనిక:

ఇంతవరకు చెప్పబడిన అంశాలు, శ్రీలంక బౌద్ధభిక్షువయిన నారదమహాథేరో గారి The Buddha and His Teachings". అన్న గ్రంథం నుండి గ్రహించి అనువదింపబడి, నేటి పరిస్థితులకనుగుణంగా తెలుగించడమైనది.

❖ ❖ ❖

పార్ట్ - 2

సామాజిక బౌద్ధ ధర్మము

1. నా దృష్టిలో సామాజిక బౌద్ధధర్మం

బౌద్ధం పుట్టినిల్లు భారతదేశమని ప్రతియొక్కరికీ తెలుసు. బుద్ధుని మహాపరినిర్వాణం తరువాత, అతని శిష్యులందరూ కలిసి, బుద్ధుని బోధనలను గ్రంథస్థం చేశారు. అతని బోధనలు 'త్రిపిటకాలు' అని పిలువబడే బౌద్ధసాధికారిక గ్రంథాలుగా, పాళీ భాషలో గ్రంథస్థం చేయబడినాయి.

బుద్ధుని మహా పరినిర్వాణం తరువాత, దాదాపు 200 సంవత్సరాలకు, వేర్వేరు కారణాలాధారంగా, అతని శిష్యులు తమనుతాము భిన్న భిన్న శాఖల క్రింద విభజించుకున్నారు. ఈ శాఖలు, ఎప్పుడయితే, బుద్ధుని బోధనలను అనుసరించడం తగ్గిందో, అప్పుడే బౌద్ధంలోని విలువలు క్షీణించడం మొదలయింది. ఆ సమయంలో బ్రాహ్మణ్యం మొదలుగా గల పెక్కు ఇతర మతాలు బౌద్ధులను తమ మతాలలో కలుపుకోవడం మొదలుపెట్టాయి.

మరో ముఖ్యమైన దశ ముస్లింల దండయాత్రల వంటి విదేశీపాలకుల దండయాత్రలు. ఎంతోమంది బౌద్ధభిక్షువులను సంహరించడమేగాక, వారి మత స్థాపనకై, బౌద్ధుల గ్రంథాలయాలను కూడా ధ్వంసం చేశారు. ఆనాటినుండి నేటి దాకా, భారతదేశంలో బౌద్ధం, తన సొంత సంప్రదాయాన్ని నిలుపుకునేందుకై నిరంతరం కృషి చేస్తూనే ఉన్నది.అయితే, మంగోల్ రాజు ఖుబ్లాఖాన్ బౌద్ధాన్ని ఆదరించాడు. ఆచరించాడు.అతనివల్లే టిబెట్, చైనా, మంగోలియాలలో బౌద్ధం వేళ్ళూనుకుంది.

భారతదేశంలో బౌద్ధధర్మాన్నిపునరుజ్జీవింపజేయటానికి, శ్రీలంక బౌద్ధుడు అయిన, అనగారిక ధర్మపాలుడు, చాలా ప్రయత్నించాడు. మహాబోధిసంస్థను స్థాపించి, పెక్కు పుస్తకాలను ప్రచురించాడు.

ఈ నేపథ్యంలో, సామాజిక బౌద్ధధర్మాన్ని (Socially Engaged Buddhism) అనే నూతన జీవన విధానం గురించి తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. ఇది 20వ శతాబ్దంలో తలెత్తిన బౌద్ధ విశ్వాసం మాత్రమే కాదు, నేటి మన సమాజానికి పనికివచ్చే అంశం కూడ.



Ven. Thich Nhat Hanh

ఇతర విశ్వాసాలు, విలువలపట్ల సహనం కలిగి ఉండటం అనే లక్షణం వలన, బౌద్ధం చరిత్ర ప్రసిద్ధికెక్కిందన్న విషయం, ఆ ధర్మ స్థాపకుని, ధైర్యాన్ని, ఉత్సాహాన్ని ధృవీకరించే సత్యం.

వియత్నాం బౌద్ధభిక్షువు, జెన్ గురువు, సామాజిక బౌద్ధుడు (Socially Engaged Buddhist) అయిన వెనరబుల్. టిక్ న హన్ (Thich Nhat Hanh), ఫ్రాన్స్ లోని ప్లమ్ (Plum) గ్రామంలో నివసిస్తున్నాడు. ఈ ప్రపంచీకరణ అనే కొత్త బంధాల రూపకల్పనకు, కలిసి పనిచేసే మత శాఖలు, సమర్థవంతంగా తోడ్పడుతున్నాయి. ఈ విశ్వ సమాజంలో, విభిన్న మతాల మధ్య, ఒక సమరసభావాన్ని, గౌరవాన్ని కలిగి ఉండటం అన్నది కలిగిఉంటారు.

సామాజిక బౌద్ధ ధర్మం అంటే, సామాజిక సమస్యలకు పరిష్కారంగా పనికి వచ్చే, బుద్ధుని బోధనలతో కూడిన ధర్మం, మానవహక్కులతో, సమానత్వ ప్రకటనతో, న్యాయబద్ధతతో, సామాజిక ప్రగతితో కూడివున్న ధమ్మం. నైతిక నియమాలనాచరించటమనే విధానం ద్వారా బౌద్ధాన్ని ఒక కొత్త నమూనాగా గుర్తించవచ్చు.

హీనయాన లేదా థేరవాద తాత్విక సిద్ధాంతాలను ఆచరించేవాడు, ధైర్యం, మంచి ఆరోగ్యం, తెలివి వంటి కొన్ని అర్హతలను కలిగి ఉండాలి. బుద్ధభగవానుని బోధనలను, సామాన్యులకందించిన నాగార్జునుని శూన్యవాదం (మహాయానం), బౌద్ధాన్ని మానవులకు ఆచరణ సులభం చేసింది. నాగార్జునునిలోని మహాకరుణ, సామాన్య మానవులకు కూడా నిర్వాణాన్ని సులభతరం చేసింది. బౌద్ధంలోని 'పంచశీల' అన్నది, నిర్వాణంపట్ల ఆసక్తి కలిగిన ప్రతియొక్కరు తప్పనిసరిగా పాటించవలసిన అంశం.

బౌద్ధంలోని నవ్య ఉద్యమమైన, ఈ సామాజిక బౌద్ధ ధర్మాన్ని, ఎవరైనా ఆచరించవచ్చు. ఇది పారమార్థికపరమైన ఆచరణ, ఆలోచనలతో కలిసి ఉన్న సామాజిక, రాజకీయ చర్య. ఈ పద్ధతిద్వారా, వికలాంగులైనా తమ ధార్మికోన్నతికై, సమాజం కోసం పనిజేస్తూ, బౌద్ధాన్ని ఆచరించవచ్చు. 'పంచశీల'ను ఆచరించటానికి ఇదొక ప్రత్యేక అవకాశం. సామాజిక బౌద్ధ ఆచరణ విధానం కలిసిన, ఈ కొత్త ఆచరణ మార్గాన్ని, 'నవయానశాఖ' అని పిలుస్తున్నారు. ఈ పుస్తకంలోనే, నవయానం గురించి తరువాత లోతుగా చర్చింపబడుతుంది.

ప్రస్తుతం, భారతదేశంలోనూ, ఇతర ప్రపంచదేశాలలోనూ ఈ సామాజిక బౌద్ధం, సమాజాభివృద్ధి కోసం ఎంతో సాయపడగలదు. నేను దక్షిణ భారతదేశ యాత్రలు చేస్తున్నప్పుడు, అట్టడుగు వర్గానికి చెందిన ఎందరో నా వద్దకు వచ్చి, బౌద్ధాన్ని గూర్చి బోధించమని అడిగారు. 'పంచశీల'ను ఆచరించమని, నేను వారితో అన్నాను. వారి పరిసరాలను శుభ్రం చేసికొని, బుద్ధధర్మాన్ని ఆచరించటానికి కావలసిన వేదికను తయారు చేసికోవలసిందిగా కూడా సలహా ఇవ్వడమైనది.

బౌద్ధులకు, ఇతర విశ్వాసాలు కలిగినవారికి మధ్య సంబంధసహకారాలను పెంచే విధానాలు చాలా ఉన్నాయి. విభిన్న మతసభ్యుల అవసరాలకు, అభిలాషలకు ప్రత్యుత్తరంగా, నియతి ప్రకారం క్రమంగా పరిణమించినవే బౌద్ధధమ్మ గ్రంథాలు (వచనాలు). బౌద్ధం విశ్వమతం. ప్రధానంగా, మానవ దుఃఖ నివారణకు సంబంధించినదై ఉన్నందువలన, బౌద్ధం విశ్వమతం అవుతుంది. ఇరవై ఒకటవ శతాబ్ది ప్రారంభంనుంచి, సామాజిక బౌద్ధం కార్యరూపంలో విలసిల్లుతూంది. ఈ ఉద్యమానికి ప్రేరణ యువభిక్షువుల నుండి లభిస్తుంది, అన్న గ్రహింపు చాలా ఉత్తేజాన్ని కలిగించే అంశం. ప్రస్తుతం యువబౌద్ధభిక్షుణిల పాత్ర కూడా, బౌద్ధంలో కొత్తదైన ఒరవడిని సృష్టిస్తున్నది. సామాజికబౌద్ధ కార్యకలాపాలు, సామాజిక సమానతను, అవగాహనను, స్నేహశీలత దిశగా సమాజాన్ని పురోగమింపజేయటానికి దోహదపడుతున్నాయి.

సామాజిక బౌద్ధధర్మం అన్నపదం, వియత్నాం కు చెందిన జెన్ గురువు, వెనరబుల్ టిక్ న హన్ ఏర్పరచిన రూపం. వియత్నాం యుద్ధ సమయంలో తన ధార్మిక మండలితో కలిసి, చుట్టూ ఉన్నవారి బాధలను తొలగించడానికి, వారు ఎంతో కృషి చేశారు. ఏకాంతోన్ముఖమైన మనసుతో, తమ ధ్యానంలో భాగంగానే, ఈ కృషిని వారు సలిపారు. అప్పటినుండి, బుద్ధధ్యానాచరణ, ధమ్మ బోధనల నుండి తాము

పొందిన లోచూపు, ప్రవీణతల ద్వారా సామాజిక, రాజకీయ, ఆర్థిక పరమైన అన్యాయాలకు బలియైపోతున్న బాధితుల సమస్యల పరిష్కార దిశగా, కృషిచేయాలనుకునే బౌద్ధులను, ఈ పదం– 'సామాజిక బౌద్ధధర్మం' అన్న ఈ పదం– ఎంతో ప్రభావితులను గావిస్తూ ఉన్నది.

ఈ రోజుల్లో మానవ జీవితాలను నైతికతకన్నా, తీవ్రమైన మనోవాంఛలు, స్వాధీనపరచుకుంటున్నాయి. మన సంప్రదాయంలో చెప్పబడిన నైతిక ఆచరణ వలన ఒనగూరే ప్రయోజనాలను గూర్చి మనం మరిచిపోయాం. మనం, మన చుట్టూ ఉన్న చెడుతో యుద్ధం చేసే ధమ్మసైనికులుగా మారాలి. నేను, మయన్మార్లో ధమ్మ సైనికుని గురించి వ్రాసిన విషయాలివే.

ధమ్మ సైనికుడు

హింసా దౌర్జన్యాలు, సామాజిక అసమానతలు రోజురోజుకూ పెచ్చుపెరిగిపోతున్నాయి. లంచగొండితనం, ఇతరులను బాధించటం, వంచన, అసమానతలు, అభద్రతా మొదలైన దుర్లక్షణాలు నేటి సమాజంలో బాగా వ్యాపిస్తున్నాయి.

లైంగిక నైతికతకు సంబంధించి, చాలా దేశాలలో, వ్యభిచారం చట్టబద్ధమైన వృత్తిగా కొనసాగుతున్నది. ఇది తీవ్రంగా ఖండించవలసిన అంశం.

ప్రజల మానసిక, సామాజిక జీవితాలు అసంతృప్తితో కొనసాగుతున్న సమాజంలో నేడు మనం నివసిస్తున్నాం. దౌర్జన్యపూరితమైన ఆలోచనలు, మానసిక ఒత్తిడులు, తీవ్ర కోపాలతో బాటు, నిరర్థకమైన ఆలోచనలు, మొదలైనవి, మనిషిని ఒక రోగిష్టిగా తయారు చేస్తున్నాయి. కొన్నిసార్లు, ఈ స్థితి, అతనిని ఆత్మహత్యలకు కూడా ప్రేరేపిస్తుంది. కాబట్టి, దృగ్విషయమైన ఈ అంశానికి ఒక చరమగీతాన్ని పలకాలన్నదే ధ్యేయం.

నేటి సామాజిక జీవనం, లాటరీలు మొదలైన జూదాలను ఆడటం, సిగరెట్లు కాల్చటం, మద్యపానం చేయటం, వక్క, పొగాకులను నమలటం, అనైతికంగా ప్రవర్తించటం, వంచన చేయటం, వంటి దురలవాట్లతో బాటు, నీతిబద్ధం కాని వ్యాపార ప్రకటనలను ఆస్వాదించటం వంటి దుర్లక్షణాలతో కూడుకొని ఉన్నది. ఈ ధోరణి, నేటి మానవజీవితాలను ఛిద్రం చేస్తూంది. వీలైనంత త్వరగా, ఈ స్థితి నుండి, సమాజం మార్పు చెందాల్సిన అవసరం ఉంది కాబట్టి, చెడుకు ఎదురొడ్డి పోరాడటానికి మనం, ధమ్మ సైనికులుగా మారాలని నిశ్చయించుకోవాలి.

గొప్ప పనిని చేయటం అన్నది ఒక యోగ్యతను కలిగిస్తుంది. సత్‌కర్మల నాచరించటం ద్వారా, మనం, ధర్మ నియమాలను కాపాడగలం. ఒకరు, ఈ పని వలన, గుర్తింపును, బహుమతులను కూడా పొందగలరు. ధమ్మాన్ని అనుసరించటం, ఒక సరైన కర్మగా నమ్మాలి.

ఒక సైనికుని కర్తవ్యం పోరాడడానికే పరిమితమై ఉంటుందని అనుకోవచ్చు. 'నేను ధమ్మ సైనికుడిని. నేను చెడుని ఓడించి, ధమ్మాన్ని పరిరక్షించడానికి, చతురార్య సత్యాలను, నైతిక పద్ధతిని అనుసరిస్తున్నాను' నాతో అందరూ నడవాలి.

ఇంకా అభివృద్ధి చెందని మన దేశం వంటి దేశాలలో, ప్రధానంగా అన్యాయాలకు బలి అవుతున్న దుఃఖార్తులకు, ఈ సామాజిక బౌద్ధం ఎంతవరకు సరిపోతుందో అన్న విషయాన్ని గూర్చి కొంత చర్చించాలి.

గత 2000 సంవత్సరాలుగా, మయన్మార్ ప్రజలు సంప్రదాయ బౌద్ధ విధానాన్ని ఆచరిస్తున్నారు. తమ దేశానికి పరిచయం అయిన బౌద్ధాన్ని, ఆనాటి నుండి ఈ నాటి వరకు అలాగే సంరక్షించడం, మయన్మార్ సంప్రదాయ బౌద్ధుల ప్రత్యేక లక్షణం. నిర్వాణాన్ని పొందటానికి అంతర్ముఖీనత్వం (విపస్సన) ఆచరించటానికిది సహాయపడుతుంది. అదే సమయంలో, పరస్పర స్నేహ సంబంధపూరితమైన, శాంతియుత సమాజ నిర్మాణానికి, సమ్యక్ జీవనాన్ని ఆచరించమని కూడా బుద్ధుడు మనకు బోధించి ఉన్నారని గుర్తుచేసికోవాలి.

మనం సామాజిక, రాజకీయ, ఆర్థికపరమైన దుఃఖాలతో, అన్యాయాలతో పోరాడాలనుకుంటే, దుర్మార్గపు అలవాట్లనుండి బయటపడాలను కుంటే, ధ్యానాచరణను కొంత పక్కనబెట్టి, గట్టిగా ప్రయత్నం చేయవలసి ఉంటుంది. ఇక్కడ మనం, భగవాన్ బుద్ధుని, మాటలను గుర్తుకు తెచ్చుకోవాలి. మానసికంగా గాని శారీరికంగాగాని, బాధపడుతున్న వ్యక్తి, ముందుగా ఆ బాధలనుండి బయటపడే ప్రయత్నానికి ప్రాధాన్యత నివ్వాలి. ఆ తరువాత, అతడు నిర్వాణాన్ని పొందగల, 'విపస్సన' ధ్యానాన్ని, ఏకాంత స్థలంలో కూర్చొని ఆచరించవచ్చు. కేవలం ఒకరికి సహాయపడటాన్ని గాని, ఒకరినుండి ఏదో సహాయాన్ని తీసికుని గడిపేయటాన్ని గాని, ఒక సాధకుని కర్తవ్యంగా థేరవాద బౌద్ధం అంగీకరించదు. పైగా థేరవాద బౌద్ధం మతంగాకాదు, ఒక జీవనకళగా ఆచరింపదగినది. కాబట్టి ఏదైనా ఆరోగ్య సమస్యలవంటి అవాంతరాలు సంభవించినట్లయితే, వారు ధ్యానాచరణలో కొంత వ్యవధి తీసికుని, తరువాత కొనసాగిస్తారు. తమకు తామే అయిన, తరచుగా తమను తాము కాపాడుకోగలిగిన (స్వయం పోషకాలైన) సామాజిక బౌద్ధ ధర్మం వంటి ఉద్యమాలు, గతంలో ఉన్న సంప్రదాయ బౌద్ధం సాధన నుండి బయటకు వచ్చే మార్గాన్ని సుగమం చేస్తున్నాయి.

దీనికొక ఉదాహరణనీయగలను. ఒక పుస్తకంలోని విషయాలు స్పష్టంగా అర్థం కావాలంటే, ఆ పుస్తక రచయితను గురించి కొంత అవగాహన అవసరం అవుతుంది. తన సోదర వియత్నాం ప్రజలు బాంబు

దాదులకు గురియై, దిక్కులేనివారయినపుడు, బౌద్ధ బిక్షువు టిక్ న హాన్. ఈ సామాజిక బౌద్ధానికి పిలుపునిచ్చారు. టిబెట్టు ప్రజలకు, దేశానికి నైతికబాధ్యతను వహించిన దలైలామాలా తన దేశప్రజల దుస్థితికి స్పదించారు.

ధ్యానతరగతులలో, పాల్గొనటం అన్నది మంచి పద్ధతే. అది, శాంతియుతమైనది, వ్యాకులపరచనిది కూడా. అయితే ఈ ప్రజల దైనందిన జీవనంలో, అది ఆచరణాత్మకమైనదేనా? దానికి తోడు, మనం జీవిస్తున్న, ఎన్నో వ్యాకులతలతో కూడిన ఈ ప్రపంచాన్ని శ్రేష్ఠతరంగా మార్చుకోవలసిన అవసరం మనకు ఉన్నది. పొరుగువారిని ముఠాలు దోచుకున్నపుడు, ఈ భూమి దోపిడీకి గురియై, నివశించడానికి పనికిరాని ఎడారిగా మారినపుడు, సమృద్ధిగా లభించే ఆహారానికి కొంత దూరం లోనే పేదవారు పస్తులున్నపుడు, మనలో చలనం లేకపోవడాన్ని గమనిస్తాం. నిజంగా మానవత్వానికి ఇదొక సవాలు! ఇటువంటి దుఃఖకరమైన పరిస్థితులకు, వెన్ను చూపడం సరియైన సమాధానం కాదు. ఎంత తక్కువగానైనా సరే, మనమెంత సహాయం చేయగలమో. అంతమాత్రమైనా చేయటమే మనం ఎన్నుకోవలసిన సరైన మార్గం.

ఉదాహరణకు, నేటి ఆసియా దేశాలలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను పరిశీలించినట్లయితే, ఎన్నో విషయాలు దుఃఖాలతో, అన్యాయాలతో ముడిపడి జరుగుతుండటాన్ని మనం గమనింపగలం. ఈ సామాజిక బౌద్ధాన్ని గనుక చేపట్టినట్లయితే, తప్పకుండా ఒక గొప్ప పరిణామం రాగలదు. నేటి సమాజాలలో అవినీతి మర్రి చెట్టులా అలుముకుంటున్నది. శాంతిభద్రతలు కూడా అవినీతిమయమై పోతున్నాయి.

ఆసియావాసులు ఈ సామాజికబౌద్ధధర్మాన్ని అనుసరించటం వలన, సాంఘికబలం చేకూరుతుంది. దీని ద్వారా, మనం పరస్పరం మన అభిప్రాయాలను పంచుకుని, తద్వారా ప్రపంచ ప్రజల సహకారాన్ని పొందగలం. ప్రపంచ సంబంధాల వలన మన దుఃఖం నుండి కూడా స్వేచ్ఛను పొందే అవకాశం ఉన్నది. శాస్త్ర సాంకేతిక విద్యల సహకారంతో, మనదేశంలోని సామాజిక బౌద్ధధర్మ సేవకులు మరింత ప్రతిభావంతంగా సమాజసేవను చేయగలుగుతారు.

శ్రీలంకలోని సామాజిక బౌద్ధ ధర్మ అనుయాయులు, శాంతియాత్రలను చేపట్టటం, ధ్యానతరగతులను నిర్వహించటం వంటి పనుల ద్వారా, శాంతిస్థాపనకోసం పాటుపడతారు. ఇదే విధంగా, దక్షిణ కొరియా, జపాను, చైనా, ఐరోపా, అమెరికా వంటి కొన్ని పాశ్చాత్య దేశాలలో, సామాజిక బౌద్ధధర్మాన్ని అనుసరించటం ద్వారా లబ్ధిని పొందుతున్నారు.

వాస్తవంగా, మయన్మార్ లోని 'సాగై' ప్రాంతంలో వైద్యశాలలను నిర్మించటం వంటి పనులద్వారా, సామాజిక బౌద్ధకార్యకర్తలు ఫలవంతంగా పని చేస్తున్నారు. అయినప్పటికీ, చేయవలసిన పనులు చాలా మిగిలిఉన్నాయి. శాంతియాత్రల నిర్వహణ, ధ్యానతరగతుల నిర్వహణల వంటివి, మన శక్తిని పంచుకోవటానికి ఉపకరిస్తాయి. బావులను త్రవ్వటం, రోడ్లనిర్మాణం వంటి సామాజిక కార్యకలాపాలు, ప్రజల సంక్షేమానికి ఉపకరిస్తాయి. కొత్తగా బౌద్ధాన్ని అర్థం చేసికోవాలనుకునేవారికి, బౌద్ధం గురించి తక్కువ తెలిసినవారికి, మనిషిని గొప్ప స్థాయికి తీసికెళ్ళేందుకు తోడ్పడే, మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష అనే నాలుగు బ్రహ్మవిహారాలు ఉపయోగపడతాయి. అందుకని వాటి గురించి చెప్పవచ్చు.

జీవితం అంటే నమ్మకం. సామాజిక బౌద్ధధర్మాన్ని నిష్పక్షపాతంగా, అనుసరించినపుడు అది దాని ప్రభావాన్ని చూపడం ప్రారంభిస్తుంది. దాని ద్వారా, ప్రజలు ద్వేషం, అత్యాశలతో కూడిన మార్గాలలో గమించడాన్ని విడిచిపెడతారని ఖచ్చితంగా చెప్పగలను. అందుకే, సంతోషంగా జీవించడానికి, తమ సమాజాన్ని శాంతియుతంగా, సమరసంగా ఉంచుకోవటానికి ప్రతివారు, సామాజిక బౌద్ధధర్మంలో భాగస్వాములు కావాలి.

❖ ❖ ❖

2. నవయాన బౌద్ధం

బౌద్ధ ధమ్మస్థాపకుడైన, బుద్ధుని విశ్వాసానికి ప్రతీకగా, బౌద్ధం, ఇతర విశ్వాసాలు, విలువలపట్ల సహనాన్ని కలిగి ఉన్నందువలననే ప్రసిద్ధిచెందింది. బౌద్ధ ప్రధాన శాఖలయిన, థేరవాదం, మహాయానం, వజ్రయానంల వలె, బౌద్ధంలోని మరొక ప్రధాన శాఖ అయిన ఈ కొత్త ఉద్యమాన్ని (సామాజిక బౌద్ధ ధమ్మాన్ని), కొత్త యానం అనే అర్థంలో 'నవయానం'గా గుర్తించవచ్చు. దళితబౌద్ధ ఉద్యమం, పాశ్చాత్యబౌద్ధం రెండూ ఈ పేరును తమది అని గుర్తిస్తున్నాయి. నామటుకునాకు, సామాజికబౌద్ధ ధర్మాన్ని ఆచరించటం అంటే, సామాన్య మానవునికి ఆచరణసులభం కాని చతురార్యసత్యాలను, ఆచరించటానికి సిద్ధం చేయటమే నని అర్థం.

తమ దైనందిన జీవనంలోని, అన్ని దృక్పథాలతో బాటు,ప్రజల ధార్మిక ఆచరణను పరిపూర్ణం చేయటానికి సహాయపడే విధానమిది. అచేతనమయిన వానిమీద కన్నా, జీవించి ఉండటం పట్ల శ్రద్ధ కలిగి ఉండటం, ఒక్కరే లబ్ధి పొందటం కన్నా, పెక్కురిని లబ్ధిదారులుగా చేయటం, ఒకే ఒక్కరు ఎదగడంకన్నా, విశ్వవిముక్తిపట్ల దృష్టిని పెట్టడం, వెరసి, ప్రపంచాన్ని వెనక త్రోసిపెట్టడంకన్నా, ప్రపంచ సమస్యలపట్ల దృష్టిని సారించేందుకే నవయానశాఖ తోడ్పడుతుంది.

ఈ అన్ని ప్రయత్నాలను కలగలుపుకొని వెలువడినదే, నవయానశాఖ అని గుర్తించగలం. ఈ కొత్త శాఖ, సామాన్య మానవులకు కూడా భగవాన్ బుద్ధుని బోధనలను ఆచరణ సులభం చేయగలదు. ఈ నవయానశాఖ, సామాజిక, రాజకీయ, ఆర్థిక సంబంధమయిన దుఃఖాలను, అన్యాయాలను గురించి పట్టించుకుని, వ్యవహరిస్తుంది, ఈ శాఖలోని ప్రతి అంశాన్ని గురించి విడివిడిగా చర్చిద్దాం.

దుఃఖం:

బుద్ధుడు చతురార్యసత్యాలను, సామాన్యమానవుల కొరకు మాత్రమే కాదు, జ్ఞానులయిన యోగుల కొరకు కూడా బోధించగా, ఈ నవయాన శాఖలోని మార్గదర్శకులు, సామాన్య మానవుల కోసం, పంచశీలను, మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షలతో కూడిన నాలుగు బ్రహ్మవిహారాలను ఆచరించటంపై బలంగా ఆధారపడినారు. సామాన్యమానవులు వీటి ఆచరణవలన, లబ్ధిపొందటమేకాదు, తమ పరిసరాలను కూడ శాంతియుతంగా, సమరసంగా మార్చుకోగలరు.

సమాజం:

ప్రస్తుతం మన సమాజం, లంచగొండితనం, వ్యభిచారం, మద్యపానం, దొంగతనాలు, పీడనలు, హత్యలు, బెదిరించి ధనంలాగి కోవడాలు, మానవహక్కుల నిరాకరణ వంటి దురలవాట్లతో పీడింపబడుతూంది. ఈ దురలవాట్లను రూపుమాపటానికి, ప్రధానంగా, ప్రజలు తమ అజ్ఞానాన్ని వదలి, అంతర్గతమయిన మార్పులకు, సానుకూల దృక్పథానికి స్వాగతం పలకాలి.

ఆర్థిక పరిస్థితులు:

ప్రపంచం ఈనాడు, ఆర్థిక సందిగ్ధతను ఎదుర్కుంటున్నది. పేదరికం రోజురోజుకూ పెచ్చు పెరిగిపోతూంది. ఆర్థికంగా అట్టడుగుననున్నవారి ఆశయాలను, కోరికలను తీర్చడంలో నేటి వ్యవస్థ విఫలం అవుతుంది. పెట్టుబడిదారీ విధానం, వినియోగ వ్యవస్థలు, అవినీతికరమయిన జీవనమార్గాలకు దారులు వేస్తున్నాయి. ఉదాహరణకు, పలు వ్యాపార సంస్థల యాజమాన్య వ్యవస్థలో, జరిగిన అవకతవకలు, భారతీయ ఆర్థిక విధానాన్ని, లోతుగా ప్రభావితం చేయటం వంటివి.

సామ్యవాదం,పెట్టుబడిదారీ విధానాల మధ్య విభేదాలు, గతానికి సంబంధించిన అంశమే అయినా, ప్రస్తుతం, ఇంచుమించుగా అన్ని +-7 ప్రభుత్వాలు, వివిధ సామాజిక, పెట్టుబడిదారీ విధానాలకు సంబంధించిన అసంపూర్ణ విషయాలతో కలిసి పనిచేస్తున్నాయి. ఏ ఆర్థిక వ్యవస్థ అయినా, ప్రభుత్వ విధానాలు అయినా, పునాదులను కదిలించే హింస కన్నా భిన్నంకాని విధంగా, గ్రామీణుల సాంప్రదాయబద్ధమయిన జీవితాలను, ప్రాకృతిక వనరులను దోచుకొని, పేదరికాన్ని వ్యాపింపజేస్తున్నాయి.

చెడు విషయాలను తొలగించుకోవాలని మాత్రమే చెప్పే, ఆధ్యాత్మికత, సమస్యలను పరిష్కరింపజాలదు. శాంతియుత విధానాలతో, మానసిక ప్రపంచాన్ని, బాహ్య విధానాలను మార్చడం వలన మాత్రమే, ఈ సమస్యలు పరిష్కరింపబడగలవు. పెట్టుబడిదారీ విధానం, వినియోగ వ్యవస్థ రెండింటినీ త్రోసిరాజనే, ఒక కొత్త వ్యవస్థకోసం, బౌద్ధ సంస్థలు గట్టిగా ప్రయతిస్తున్నాయి. ఈ కొత్త వ్యవస్థను 'బౌద్ధ ఆర్థికవిధానం' అని గుర్తించవచ్చు.

థేరవాద బౌద్ధ లక్ష్యంలో, రాజకీయాన్ని మతం నుండి వేరుగా పరిగణించలేదు. బండికున్న రెండు చక్రాలవలె, రాజ్య నాయకత్వం (ప్రాపంచిక చక్రం), ఆధ్యాత్మిక నాయకత్వం (మతచక్రం) రెండూ ఐక్యతతో కృషి చేశాయి. ఆధ్యాత్మికవేత్తలు ఉపదేశించిన నైతిక విధానాలను ప్రపంచనాయకులు ఎంతవరకు అనుసరించారు అన్న విషయం మీద ప్రభుత్వవిధానాలు ఆధారపడి ఉన్నాయి.

క్రీ.పూ. 273-232 మధ్య భారతదేశంలో, మౌర్య సామ్రాజ్యాన్నేలిన, ప్రసిద్ధ బౌద్ధ చక్రవర్తి అశోకుడు, ఈ విధానాన్ని (రాజ్యపాలనలో బౌద్ధధమ్మాచరణ), సిద్ధాంత పూర్వకంగా నిరూపించాడు.

మానవజాతి అంతా ఒకటేనని, ఐక్యతతో నివశించడానికి కృషి చేయాలని, ఎప్పుడయితే ప్రజలు ఆలోచిస్తారో, అప్పుడే వారు, హింస, హత్యచేయాలనే కోరికలు, అసహ్యము, పేరాశ, తన స్వాధీనంలోనే అన్నీ వుండాలనే వెర్రి భావనలను వదలిపెట్టవలసి ఉంటుంది. ఇది ఆర్య అష్టాంగమార్గంలోని ఒక విధానం. రాజకీయవేత్తలు, ప్రజలు, ఈ మార్గాన్ని అనుసరించినట్లయితే, ఇతరుల పట్ల దయకలిగి ఉండటం, ఇతరులను

పట్టించుకోవటం, ఇతరుల కష్టసుఖాలను కలిసి పంచుకోవటం, మొదలయిన మంచి లక్షణాలను పెంచుకుంటారు. ఈ లక్ష్యం వినటానికి సాధారణంగా కనిపించినా, పాశ్చాత్యదేశాలలో ప్రధానంగానున్న, హింస, భౌతికవాద దృక్పథం, వినియోగదారీ విధానాలను రూపుమాపే గొప్పశక్తిని కలిగి ఉన్న లక్ష్యమిది. పైగా అప్రమత్తతను ఆచరించటంద్వారా విశ్వైకభావన పెంపొందగలదు.

బుద్ధతత్వం గల రాజకీయనాయకుల పట్ల బౌద్ధులు విశ్వాసం కలిగి ఉంటారు. అప్రమత్తతను (వీఱఅంటబశ్రీశ్రీఅవంం) సాధనచేయటం ద్వారా ఎవరయినా సరే, తమలోని బుద్ధతత్వాన్ని గుర్తించగలరు. తద్వారా ప్రజలకు ఆ బుద్ధతత్వాన్ని పంచగలరు. ప్రారంభదశగా, ఒక రాజకీయవేత్త తాను అప్రమత్తతను ఆచరించి, తద్వారా, శాంతియుతమయిన, దయాన్వితమయిన మనస్సును పొందానని అర్థం చేసికున్నట్లయితే, అపుడతడు, తానే స్వయంగా, తన చుట్టూ ఉన్నవారికి, తనకోసం పని చేసేవారికి, తనకు ఓటువేసిన వారికి కూడా ఆ అప్రమత్త ఆచరణను పరిచయం చేయగలడు.

జంతు సంక్షేమం:

నవయానశాఖ అనుయాయులు, క్రూర జంతువుల, పెంపుడు జంతువుల రక్షణ కోసం సమానంగా పరిశ్రమించడమేగాక, వారు జంతుబలిని కూడా ఆపివేసే కృషి చేయాలి. ఈ క్రమంలోనే, వారు, సముద్రగర్భంలో మునిగి ఉన్న పగడాలను, వన్యమృగ సంరక్షణను కూడా ఒకే విధమయిన స్ఫూర్తితో, పరిరక్షించడానికి కృషి చెయ్యాలి.

చెట్లు, అడవుల సంరక్షణ:

సమతుల్య వాతావరణ పరిరక్షణకై, సామాజిక బౌద్ధులు, చెట్లను నరికివేయటాన్ని, అడవులను ధ్వంసం చేయటాన్ని ఆపేలా చూడాలి. ఈ పనివలన, ధమ్మాన్ని ఆచరించే సాధకునికి చుట్టూ కూడా, అందమయిన పరిసరాలు ఏర్పడగలవు.

పర్యావరణోద్యమం:

పారిశ్రామిక నేపథ్యంలో, 'హరితవిప్లవం' అన్నది, ఆరోగ్య పరిరక్షణకు, ఉత్పాదక పెంపుదలకు, జవాబుదారీ తనాన్ని తగ్గించటానికి, ఖర్చును తగ్గించటానికి, సామాజికబంధాల పెంపుదలకు సహకరిస్తుంది.

"నువ్వు ఆచరించే విలువలు, నీ అవసరాల కోసం కాదు, నా అవసరాలను తీర్చటంకోసమే" అన్న స్వార్థపూరిత వాతావరణంలో మనం నివసిస్తున్నాం. ఈ విధమయిన వాతావరణం కొందరికిమాత్రమే సంతోషాన్నీయగలవు. కానీ, "బహుజన హితాయ, బహుజన సుఖాయ"– అంటే చాలామంది మేలు కోసం, చాలామంది సంతోషం కోసం అన్న సూత్రాన్ని మనమెరుగుదుం. శాంతియుతమయిన, సమర సమయిన సమాజం కోసం, ప్రశాంత చిత్తతకోసం నవయానాన్ని ఆచరించటాన్ని మనం ప్రారంభించాలి. నవయానం ధర్మోపదేశాలను, బహుజన హితం కోసం నేర్పుతోంది.

❖ ❖ ❖

3. సంగీతులు: బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను రక్షించటంలో వాటి పాత్ర



నిర్వచనం:

'సంగీతి' = అంటే సాధారణార్థంలో ఇలా చెప్పుకోవచ్చు.

(1) ఒక పాట, సంగీతం, పదప్రయోగం, కలసి ఆలోచించుట, సమస్వరం, సమరసంతో, సమరసగానం, సమిష్ఠిగానం.

(2) బౌద్ధ గ్రంథాలలో ఈ పదానికి, కలిసి చదువుట, కంఠోపాఠముగా చదువుట, పఠనము అని అర్థాలున్నాయి. సంగీతి అన్న పదం, 'సద్ధర్మపుండరీక సూత్రం' అన్న బౌద్ధగ్రంథంలో, తథాగతుని సిద్ధాంతాల ప్రకటనకై నిపుణుల సంఘ ప్రస్తావన (సంగీతి కుశల తథాగత ధమ్మానామ్) లో ఈ సంగీతి అన్న పదప్రయోగాన్ని గమనించగలం.

బుద్ధవచన – పదం :

'బుద్ధవచన" అంటే, బుద్ధుని మాటలు, పలుకులు లేదా బోధనలు అని అర్థం. కొన్ని సార్లు ,ఈ పదం పాళీ సాహిత్యంలోని, 'బుద్ధవిషయ' (స్థాయి, అవకాశం, బుద్ధుని ప్రతిభాశక్తి), బుద్ధవెన్నయ్య (బుద్ధుని బోధనలకు అందుబాటులోనున్న, జ్ఞానోదయం పొందటానికి అర్హతగల), 'బుద్ధశాసన', (బుద్ధుని బోధనలు, బుద్ధ శాసనాలు) అన్న పదాలకు సమానార్థకంగా కూడ ఉపయోగంలో ఉన్నది.

స్వచ్ఛతను, పవిత్రతను రక్షించడంలో సంగీతుల పాత్ర:

పెద్దవయస్సులో, బౌద్ధభిక్షువయిన సుభద్దుడు, బుద్ధుని మహాపరినిర్వాణాన్ని గూర్చి విని, బుద్ధుడు భిక్షువులకోసం ఏర్పరచిన వినయ నియమాల ఆచరణపట్ల తన కోపాన్ని వ్యక్తం చేశాడు. బుద్ధుని మహాపరి

నిర్వాణ సమయంలో, భిక్షువులందరూ దుఃఖంలో మునిగిపోయి రోధిస్తున్న సమయంలో, "చాలు, మీ భక్తితో కూడిన గౌరవం. శోకించవద్దు. దుఃఖించవద్దు. మనమందరమూ ఈ సన్యాసి (బుద్ధుడు) బారినుండి బయటపడినాము. బుద్ధుడు, 'ఇది నీవు, చేయవచ్చు, ఇది నీవు చేయరాదు' అని చెప్పినపుడు ఎంతో హింసను అనుభవించాం. అయితే, ఇప్పుడు, మనకేది నచ్చితే దానినే చేయవచ్చు. మనకు నచ్చని దానిని చేయవలసిన అవసరం లేదు" అని సుభద్దుడు పలకడాన్ని, వృద్ధభిక్షువు, మహాకస్సపుడు వినినాడు.

సుభద్దుని వలె, ఇతర భిక్షువులు కూడా తమకు నచ్చినట్లు ప్రవర్తించాలనుకుంటే, బౌద్ధధమ్మం, వినయ నియమాలు మలినమవుతాయని, అలా జరిగినట్లయితే, అవి చాలకాలం పవిత్రంగా మనలేవని, సుభద్దుని మాటలను వినిన మహా కస్సపుడు జాగృతుడయినాడు. ఈ దుస్థితిని తప్పించడానికి. బుద్ధ ధర్మాన్ని భద్రపరచి రక్షించాలని తలచాడు. ఈ క్రమంలో బౌద్ధసంఘం అనుమతిని పొంది, ఐదువందలమంది అర్హతులను సమావేశపరచాడు. ఈ సంగీతి ఏర్పాటయిన సమయంలో అర్హతత్వాన్ని పొందిన ఆనందుడు కూడ సమావేశంలో పాల్గొనే అర్హతను పొందాడు.

దశపారమితలతో (దానం, శీలం, నైష్కర్మ్యం, ప్రజ్ఞ, వీర్యం, క్షాంతి, సత్యం, అధిష్ఠానం, మైత్రి, ఉపేక్ష) సమృద్ధుడు అయిన, ప్రపంచ ప్రసిద్ధిచెందిన బుద్ధుని మహాపరినిర్వాణం తరువాత నెల రోజులకు, మహాకస్సపథేరుడు, వృద్ధుడయిన సుభద్దుని పనికిమాలిన మాటలను గుర్తుచేసికున్నాడు. పాపవిముక్తులు, అర్హతులు అయిన ఐదువందలమంది భిక్షువులను, ఈ మహాసభ కోసం, మహాకస్సపథేరుడు ఎన్నుకొన్నాడు.

ఈ పై విషయాలనుండి, మహాకస్సపథేరుడు, బుద్ధబోధనల (బుద్ధవచనాల) స్వచ్ఛతను, పవిత్రతను రక్షించడానికి ప్రథమ సంగీతిని జరిపినాడని మనం అర్థం చేసికోవచ్చు.

కొంతకాలం తరువాత, కాకండకుమారుడయిన, యాస థేరుడు వజ్జియరాజ్యం లో పర్యటిస్తున్నపుడు, వేసాలి (వైశాలి) రాజ్యంలోని, వజ్జియభిక్షువులు, తమకుతామే, పది విషయాలను ప్రకటించుకున్నారని వినినాడు. "ఇది సరియైన పద్ధతి కాదు, కార్యాచరణలో లేకపోయి నట్లయితే, దశపారమితుడైన బుద్ధుడు అనుగ్రహించిన ధమ్మానికి రక్షణ ఉండదు. నేనిపుడు, బుద్ధధర్మాన్ని వివరిస్తాను" అని తలచాడు. కాకండపుత్ర యాసథేరుడు, వేసాలిలోని మహావన విహారంలో నున్న, కూటాగారంలో, రెండవ సంగీతిని జరపడానికి భిక్షువులను ఆహ్వానించాడు.

ఈ అంశం వలన, బుద్ధుడుపదేశించిన వినయ నియమాలలో వజ్జిపుత్తులు, కొన్ని మార్పులను చేసికున్నారని, యాసథేరుడు, బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను రక్షించడంకోసం రెండవ సంగీతిని జరిపినాడని మనం అర్థం చేసికోగలం.

సమ్మాసంబుద్ధుడు మహాపరినిర్వాణం పొందిన రెండువందల డెబ్బై యెనిమిది సంవత్సరాల తరువాత కొంతకాలానికి, తమ వైరుధ్య భావాలచేత, సమాజంలో గౌరవాన్ని, తమకు ఆహారాన్నిచ్చే దాతలను కోల్పోయిన అన్య సాంప్రదాయాలకు చెందనవారు తమకుతామే తమ జుట్టును కత్తిరించుకొని, కాషాయ వస్త్రాలను ధరించి, భిక్షువుల విహారానికి వెళ్ళి, 'ఉపోసథ' (కృష్ణచతుర్దశీ పూర్ణిమల రోజుల్లో, ఒక దగ్గర చేరడం, భిక్షువుల పాతిమొక్ఖ పాఠదినం) మొదలైన భిక్షువుల సమావేశాలలో పాల్గొనడం మొదలుపెట్టారు. వారి పనికిమాలిన అనేక చేతలు, బుద్ధశాసనంలో మరకలను ఏర్పరచినాయి. బౌద్ధ నియమం ప్రకారం, భిక్షువులు కానివారితో కలిసి 'ఉపోసథ'ను ఆచరించడానికి జంబూద్వీపంలోని భిక్షుసంఘం సంసిద్ధంగా లేకపోవటం వలన, ఏడు సంవత్సరాల పాటు, భిక్షువులు ఉపోసథ కార్యక్రమాన్ని ఆచరించలేదు.

ప్రతిభామూర్తి అయిన అశోకచక్రవర్తి, రాజ్యాన్ని పాలించడం మొదలుపెట్టిన పదిహేనేళ్ళ తరువాత, భిక్షువుల మధ్యగల దోషాలను పోగొట్టాలని, బుద్ధ శాసనాన్ని పరిశుద్ధం చేయాలని, భిక్షువులందరూ కలిసి ఉపోసథనాచరించేలా చేయాలని అనుకున్నాడు. ఈ నిమిత్తమై, అశోకారామంలో ఏర్పాటు చేసిన సభలో, భిక్షు సంఘంలో జ్యేష్ఠుడయిన, భదంత మొగ్గలిపుత్ర తిష్య థేరుడు, అశోక చక్రవర్తికి బుద్ధధమ్మాన్ని ఉపదేశించాడు. అశోకుడు, భిక్షుసంఘం లోని ఆచార్యులతోను, యితరులతోను మాట్లాడిన తరువాత, ఈ తప్పు భిక్షువులది కాదని, భిక్షుసంఘంలో, తమకు తామై భిక్షువులుగా కలసిపోయి ఉన్న ఆ వైరుద్ధ్య తైర్థికులదేనని కనుగొని, వారందరికి తెల్లని వస్త్రాలను కట్టబెట్టి, వారిని భిక్షుసంఘం నుండి బహిష్కరించాడు. మొగ్గలిపుత్ర తిష్య థేరునితో, “భన్తే! ఇప్పుడు బుద్ధశాసనం పవిత్రమయింది. భిక్షుసంఘం, క్రమం తప్పకుండ ఉపోసథను అనుసరింతురుగాక.” అని చెప్పి, వారికొక రక్షణను కల్పించి, అశోకుడు, తాను నగరానికి వెళ్ళిపోయినాడు. ఆవిధంగా, భిక్షుసంఘం సమావేశ మయి, బుద్ధశాసన ప్రకారం ఉపోసథ కార్యక్రమాన్ని పునరుద్ధరించుకున్నది.

బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను రక్షించడంలో విభిన్న దేశాల పాత్ర:

1. సామాజిక బౌద్ధధర్మం:

జ్ఞాని అయిన బౌద్ధుడు, తృష్ణ, అజ్ఞానాల వలన ఏర్పడే శారీరక మానసిక దుఃఖాలనే గాక, తృష్ణకు బాహిరంగా నున్న అస్తిత్వపరమైన దుఃఖాన్ని కూడా గుర్తుపట్టినట్లు తెలుస్తున్నది. భారతీయ బౌద్ధం లాగే, సామాజిక బౌద్ధధర్మం కూడ, సామాజిక, రాజకీయ, ఆర్థిక పరమయిన, మానవ దుఃఖాలు, అన్యాయాలకు పేదరికాన్ని కారణంగా పేర్కొంటూనే, భౌతిక నైతిక లాభావస్థలు, కరుణభావాలు, కర్మల మధ్యగల భేదాలవలన ఏర్పడే పేదరికం దుఃఖకారణమేనని తేల్చి చెబుతున్నది. అంతేకాదు, పేదరికంనుండి విముక్తిని పొందటం అన్నది, నైతిక ఎదుగుదలకు ప్రాథమికమైన అవసరంగా గుర్తించడమే కాదు, ఆ అవసరం పట్ల మనం చూపే నిర్లక్ష్యం సామాజికపరమయిన దిగజారుడుతత్వానికి కారణంగా గుర్తిస్తున్నది. అందుకే, ధమ్మాన్ని బోధించడానికి తగిన నియమాలుగా, నైతిక యాజమాన్యంతోబాటు, నేరుగా చేతలద్వారా నిర్వహించగల కర్మను గూర్చికూడ బోధిసత్వుడు ఒత్తిచెబుతున్నాడు.

ఈ విధంగా, బుద్ధధమ్మాన్ని ఆచరించటానికి పూనుకున్న, అర్హులయిన వ్యక్తులకు తగిన ప్రోత్సాహాన్నిస్తూ, సామాజికబౌద్ధధర్మం కూడ, బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను కాపాడుతున్నది.

2. మయన్మార్‌లో బుద్ధవచన స్వచ్ఛత, పవిత్రతలు:

మయన్మార్, థేరవాదబౌద్ధాన్ని ఆచరించే దేశాలలోఒకటని మనకు తెలుసు. బుద్ధవచనాన్ని ప్రారంభకాలం నుండి ఉన్నదానిని ఉన్నట్లుగానే రక్షించిన దేశమని కూడ తెలుసు. పూర్వం, ‘ఛత్తసంఘాయన’ అన్న పేరుతో, సంగీతులను నిర్వహించిన దేశమది. ఈ రోజుల్లో ఎవరయినా, బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను గురించి మాట్లాడాలనుకుంటే, వారు బ్రిటిష్ వలసవాదుల పాలనను దృష్టిలో ఉంచుకోవాలి. బ్రిటిషు ప్రభుత్వం, మయన్మారుకు క్రైస్తవులను పంపి, బౌద్ధులను, క్రైస్తవులుగా మార్చింది. శ్రీ యు.జనకాభివంశ అనే రచయిత, తన ‘నిత్యవ్యవహారంలో అభిధమ్మ’ అన్న గ్రంథంలో, బర్మాకు బౌద్ధం పరిచయం చేయబడిన కాలం నుండి అనుసరిస్తున్న, థేరవాదబౌద్ధ ఆచార్యులకు శిక్షణనివ్వడం అన్న పద్ధతిని నిలిపివేశారని పేర్కొన్నాడు. ప్రస్తుతపు మయన్మార్ బౌద్ధ సంఘాలు, యువభిక్షువులకు శిక్షణనిచ్చే, సుశిక్షితులయిన బౌద్ధ ఆచార్యుల కొరతతో బాధపడుతున్నది. శ్రీలంకలో కూడ స్వచ్ఛత, పవిత్రతలను కోల్పోతున్న దశలోనే బుద్ధవచనం ఉన్నది.

3. థాయ్‌లాండులో, బౌద్ధసిద్ధాంతాల ఆచరణకు, ఎక్కువమందిని బౌద్ధంలోకి అంగీకరించి, దుఃఖవిముక్తులను చేసేందుకు, సామాజిక బౌద్ధధర్మం ఒక ప్రత్యామ్నాయ ఉద్యమంగా రూపుదిద్దుకుంటున్నది. సమాజాన్ని మార్చాలన్న ధ్యేయంతో పనిజేసే, 'అరియవినయ ప్రాజెక్టు'లో సమీప కాలంనుంచి, నేను భాగస్వామిగా ఉన్నాను. అరియ వినయ ప్రాజెక్టు, భిక్షువులకు, భిక్షుణీలకు జీవితంలో క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ, వారు అనుసరించవలసిన సత్ప్రవర్తనను, గూర్చి, వివరిస్తుంది. విశాల దృక్పథంతో చెప్పాలంటే... ఇది, ధార్మికపరమయిన అభ్యాసాన్ని, చేసే కర్మతో (పనితో) అనుసంధానం చేస్తుంది. సమాజంలో పెరిగిపోతున్న సామూహిక హింసలకు, వినియోగదారీ విధానానికి గల, అవసరాన్ని బౌద్ధసమాజం, సరయిన పద్ధతిలో వినియోగించుకునే విధంగా, ఈ అరియ వినయ ప్రాజెక్టు ఎన్నో వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుంది. ఈ వర్క్‌షాప్‌లు భిక్షుసంఘాలకు, సామాజిక బాధ్యతను కలిగి ఉండవలసిన ఆవశ్యకతను ఒత్తి చెబుతాయి.

థాయ్‌లాండ్‌లోని, గాంధీ శాంతిబహుమతి విజేత అయిన, సులక్ శివరక్ష, ఈ సామాజిక బౌద్ధధర్మం ద్వారా, బౌద్ధ సంఘం యొక్క స్వచ్ఛతను, పవిత్రతను రక్షించడమన్న ధ్యేయంతో, క్రమశిక్షణా ప్రమాణాలను ప్రారంభించాడు. రోడ్లు, వంతెనల నిర్మాణం, పాఠశాలల నిర్వహణ, వైద్యశాలల ఏర్పాటు, మున్నగు పనులతోబాటు, అన్యాయానికి, హింసకు ఎదురొడ్డి పోరాడటం వంటి విభిన్న రంగాలలో కృషిచేస్తున్న భిక్షువులకు ఇదొక సువర్ణావకాశం. వారు వినయ నియమాలను పాటిస్తూనే, సంఘంలో పనిచేయవచ్చు.

4. శ్రీ ఎ.టి.అరియరతనే గారిచే ప్రారంభింపబడిన శ్రీలంకలోని 'సర్వోదయా శ్రమదాన ఉద్యమం' బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను రక్షించడంలో ప్రస్తుతం కృషి చేస్తూ ఉన్నది. బౌద్ధంలోను, శ్రీలంకలోని ఇతర ప్రాచీన సంప్రదాయాలలో ఉంటూనే, గ్రామీణ జీవితాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న శ్రీలంక భిక్షువుల భాగస్వామ్యాన్ని, సర్వోదయ సంఘం కొనియాడుతోంది."

"లాఠీలు, తుపాకులు, చెరసాలలు, ఉరికొయ్యలవంటి బాహిరమైన ఆయుధాలద్వారా సమాజాన్ని పునర్నిర్మించాలనుకుంటారు, రాజకీయవేత్తలు. కాని సామాజిక బౌద్ధులు 'మైత్రి', 'కరుణ'ల సాధన వలన వ్యక్తిలోకలిగే మానసిక పరివర్తన ద్వారా సమాజాన్ని సంస్కరించాలనుకుంటారు."

"రాజకీయవేత్తలు కాలువలు, వంతెనలు, ఎత్తయిన కట్టడాలను నిర్మిస్తే, సామాజికబౌద్ధులు మానవహృదయాలని నిర్మిస్తారు. రాజకీయవేత్తలు, ప్రజలను సరయిన మార్గంలో పెట్టడానికి, న్యాయశాస్త్ర పుటలను తిరగవేస్తే, సామాజిక బౌద్ధులు, ప్రజలను సరయిన మార్గంలో నడిపించడానికి, ధమ్మపథం పుటలను తిరగేస్తారు". ప్రజలలో శాంతిని కలిగించేధ్యానశిబిరాలను కూడా సామాజికబౌద్ధులు నిర్వహిస్తారు.

5. భారతదేశంలో వీటన్నిటికన్నా భిన్నమయిన కథనం ఉంది. బౌద్ధం భారతదేశంలో పుట్టిందని మనందరికీ తెలుసు. పన్నెండవశతాబ్దం తరువాత, బౌద్ధం భారతదేశంలో కనుమరుగయింది. బౌద్ధపతనానికి ఒకానొక కారణం శీల సాధన కోల్పోవటం. ఆ తరువాతే, చాలామంది, బౌద్ధాన్ని తమకు తోచిన పద్ధతిలో పునరుద్ధరించటానికి ప్రయత్నించారు.

భారతదేశంలో వివిధ దేశాలకు చెందినవారు, పెక్కు విహారాలను నిర్మించారు. ఈ విహారాలు, మహాయాన, థేరవాద సాంప్రదాయాలు రెండింటినీ ప్రతిఫలిస్తున్నాయి. ఈ విహారాలు, తమతమ దేశాలనుండి భారతదేశానికి తీర్థయాత్రికులుగా వచ్చే పర్యాటకులను గురించి శ్రద్ధ తీసికుంటున్నది. అయితే, ఈ విహార నిర్వాహకులు చాలామంది, అనర్హులయిన సోమరులకు దీక్షనివ్వటాన్ని, నేను స్వయంగా గమనించాను. రెండవది, చాలకొద్దిమంది విహార నిర్వాహకులు, సంఘసేవ పేరుతో, సామాజిక, రాజకీయాలతో కలిసి, తీవ్రంగా పనిచేస్తున్నారు. మూడవది, మరికొందరు విహార నిర్వాహకులు, సమాజంతో, వాణిజ్యపరమయిన సంబంధాలను కూడ నడుపుతున్నారు. మొత్తంగా ఈ విహారాలకు చెందిన భిక్షువులుకొందరు, పైన చెప్పిన కార్యకలాపాల ద్వారా, ధన సంపాదనకూడ చేస్తున్నారని నేను చెప్పగలను. కొన్నిసార్లు వారు, ఆ ధనాన్ని, భారత పురావస్తుశాఖ అధీనంలోనున్న, బౌద్ధ స్థూపాలు, విహారాలు మొదలయిన బౌద్ధ అవశేషాలకు దానమిస్తున్నారు. ఇటువంటి కార్య కలాపాలు, బుద్ధవచన స్వచ్ఛతను, పవిత్రతను నాశం చేస్తున్నాయి, కాబట్టి ఇటువంటి కార్యకలాపాలను వెంటనే ఆపించాలి.

ముగింపు:

ప్రపంచ ప్రసిద్ధిని పొందుతున్న మతాలలో బౌద్ధం పేర్కొనదగినది. కాబట్టి స్వచ్ఛతకు, పవిత్రతకు సంబంధించిన దిశగా అది పని చేయవలసిన అవసరం ఉన్నది. బౌద్ధం ప్రపంచమంతటా వ్యాపిస్తున్న, ఈ తరుణంలో, బౌద్ధధర్మ స్వచ్ఛతను, పవిత్రతను రక్షించాలన్న కుతూహలం, ప్రజలలో ఈ నాటికీ మిగిలే ఉన్నది.

❖ ❖ ❖

4. బౌద్ధం - పోరాట సంకల్పం

జీవన విధానం అనడానికి తగినన్ని విశ్వాసాలతో, ఆచరణలతో కూడిన సమాహార రూపమే బౌద్ధం. బుద్ధుడిగా అందరికీ తెలిసిన సిద్ధార్థ గౌతముని బోధనల ఆధారంగా వెలసినదే బౌద్ధం. ప్రాచీనకాలంలో, భారతదేశంలోని ఆంధ్రప్రాంతం, భగవాన్ బుద్ధుని అనుయాయులకు పేర్కొనదగిన ప్రాంతాలలో ప్రముఖమయినది. ఆంధ్రప్రాంతంలో నివసించే ప్రజలు, ప్రాకృతికంగా కొంత దౌర్జన్యపూరిత స్వభావం గలవారు. ప్రస్తుతం వారిలో ఎక్కువ శాతం మంది, పేదరికం, అవినీతి, అధర్మాల పీడనకు గురి అవుతూ బ్రదుకుతున్నారు. సామాజిక బౌద్ధధర్మం మాత్రమే, వారిని ఈ పీడనలనుండి విముక్తులను చేయగలిగిన ఏకైక మార్గమని నేను భావిస్తున్నాను. సామాజిక బౌద్ధధర్మం ద్వారా, భౌతికవాదం, నిరంకుశత్వాల స్థానంలో వాస్తవమయిన నైతిక సూత్ర ప్రమాణాలను నిలిపి, సన్మార్గం, సత్యం, ధర్మాలతో కూడిన విశ్వ ప్రమాణాలను, స్థాపించగలం అని తన మౌలికమయిన శాసనాల (బోధనల) చేత, శాస్త్రసంబంధమయిన ఆవిష్కరణలను సైతం, సమాధానపరచగలిగినాడు, బుద్ధుడు.

ఎప్పటికీ అభివృద్ధి చెందుతూనే ఉండే, జ్ఞానాన్ని ఉత్తమమయిన స్థితిలో ఉపయోగించడానికి తగిన ప్రమాణాలను కలిగిన ఆచరణమార్గాన్ని, బుద్ధుడు మనకు అందించాడు. బుద్ధుడు ఉపదేశించిన మధ్యేమార్గం ఆచరణ సాధ్యమయిన, ఎక్కువ సముచితమయిన ప్రత్యామ్నాయాన్ని మానవజాతికి అందించగలిగింది. ప్రపంచాన్ని, ప్రపంచంలోనున్న మానవుని స్థానాన్ని అర్థం చేసికొన్న స్థితిలో పుట్టిన సమతౌల్యమైన మనస్సు, సామాజిక బౌద్ధధర్మ ఆచరణతో జతపడినపుడు, సమాజాన్ని సమూలంగా మార్చడానికి అనువయిన ఔషధంలా పనిచేస్తుంది. నవయాన బౌద్ధశాఖ కూడ, సామాజిక బౌద్ధంలో భాగమే.

విద్యార్జన మరియు జీవనపోరాటం
(STUDAY AND STRUGGLE)

జీవనపోరాటానికి ప్రధాన కారణం అవిద్య. ఆయుధాలనుపయోగించకనే, ఈ పోరాటాల స్థితినుండి ప్రయోజనాత్మకంగా, బయటపడడానికి వ్యక్తికి జ్ఞానం సహాయకారికాగలదు. ఈ ఆధునిక యుగంలో, ప్రపంచమంతా విభిన్న సంఘర్షణలతో కూడి ఉన్నది. కనుక ప్రతివ్యక్తీ, తన సంప్రదాయాలను, సంస్కృతిని ఈ సంఘర్షణల నుండి కాపాడుకుంటూ, తనకు తానుగా ఎలా బ్రతకాలో తెలుసుకోవాలి. ఇలా విజయవంతంగా బ్రదకడానికి సమ్యక్ అవగాహన (దృష్టి, జ్ఞానం), అన్నది కీలకాంశంగా సాయపడగా, పోరాటం విద్యార్జనకు కావలసిన రూఢియైన అవసరం. వాస్తవంగా విద్య (చదువుకోవటం, తెలిసికోవటం) పోరాటం ఈ రెండూ ఒకదానిపై మరొకటి పరస్పరం ఆధారపడి ఉన్నవే.

నేనిపుడు విద్యార్జన-జీవనపోరాటాలను గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను, వాటి మధ్యగల సంబంధాన్ని గూర్చి కొంత వివరణాత్మకంగా చెప్పాలనుకుంటున్నాను.

విద్యార్జన అంటే ?

విద్యకు ఎన్నో అర్థాలున్నాయి. తెలివి, జ్ఞానం, తెలిసికొనుట, చదువుకొనుట మున్నగునవి. ఒకరి చదువు నైతికబద్ధంగా జరిగి ఉ ంటే, అటువంటి చదువు, వ్యక్తి సంతోషంగా బ్రతకడానికి దోహదపడుతుంది. ఉదాహరణకు, ఒక ఆచార్యుడుగానీ, లేదా ఒక శాస్త్రవేత్తగాని, అతని విద్యాభ్యాసం నైతికబద్ధమైన ఆవరణలో జరిగి ఉన్నట్లయితే, అతని నూత్న కల్పనలు, పరిశోధనా ఫలితాలు, అతనికి విజయాన్ని అందివ్వడమే కాదు, సుఖజీవనానికి కూడా ఉపకరిస్తాయి. కాకపోతే, అతడు తన లక్ష్యాన్ని అందుకునేందుకై, పట్టుదలతో, వివేకంతో ఎడతెగకుండా కష్టపడి చదవాలి. ఈ రోజుల్లో మనం ప్రతివిషయాన్ని, శాస్త్రసమ్మతంగా చదువుతున్నాం. మనమేం చదువుతున్నామో, దానినుండి పూర్తిగా వేరుపడిన భిన్నమయిన శాఖగా మతం మారిపోయింది. మనిషి సాంఘిక జంతువు. అతడు నింపాదిగా, శాంతంగా, గౌరవంగా బ్రదకడానికి జీవనకళను తెలిసి ఉండాలి. శాస్త్రవిద్య మనకొక అంతస్థును మాత్రమే ఇవ్వగలదు గాని, ధర్మసంబంధమైన జ్ఞానం ఒకరిని తెలివిపరునిగనే గాక, అంతిమ సత్యాన్ని తెలిసికోగలిగిన వానిగా ఎదగడానికి సహాయపడుతుంది. కాబట్టి, ఈ జీవితానికి, ఇక్కడి జీవితం తరువాత (నిర్వాణం పొందేవరకున్న జన్మలు) కూడ ఉపయోగ పడగలిగిన ధర్మాన్ని ఈనాటి విజ్ఞానశాస్త్రాన్ని ఉపయోగించి ఎలా అర్థం చేసికోవాలో మనం తెలిసికోవాలి.

జీవన పోరాటం అంటే ?

మంచి, చెడుల మధ్యజరిగే, తీవ్రమైన సంఘర్షణ అని పోరాటం అన్న పదానికి అర్థం. మనందరం 'సమ్యక్ జీవనం' కోసం అంటే సరయిన మార్గంలో జీవించడం కోసం పోరాటాలను సాగిస్తున్న వారమే. మన చుట్టూ ఆవరించి ఉన్న చెడుతో పోరాడక పోయినట్లయితే, ఒకనాటికి మనమే దానికి ఆహారంగా మారిపోగలం. కొన్నిసార్లు నీ ఎదుగుదలకోసం చెడుకు, వంతపాడటం జరుగవచ్చు. అప్పుడు నీవు నీ జీవితానికి నాయకుడివిగావు, ప్రతినాయకుడివే అవుతావు.

పోరాటం అనేది జీవితానికి ఉప్పులా ముఖ్యమైనది. ఏది లేకుండా చెడువైపునకు గాని, మంచివైపునకు గాని జరగడానికి వీలుపడదో, అటువంటి పోరాటం, సంఘర్షణ జీవితంలో, అనివార్యమయిన అవసరాలలో ఒకటి. కాబట్టి, పోరాటం జీవన అస్తిత్వానికి అత్యంత ఆవశ్యక మైనది. ఒక రకంగా చెప్పాలంటే జీవితమంతా పోరాటాలు, పోరాటాలతోనే నిండి ఉండే అవకాశమే ఎక్కువ. కష్టపడి సంపదను కూడబెట్టడానికి, పేరుప్రతిష్ఠలను, అధికారాన్ని సంపాదించడానికి, ఒక అంతస్థులో, హోదాలో నిలిచి ఉండటానికి, బ్రదకడానికి ఒక ముద్ద ఆహారం సంపాదించడానికి అన్నిటికీ తప్పకుండా పోరాటాన్ని సాగించవలసినదే. దీనికి భిన్నంగా చేయాలనుకున్న ప్రజలయినా, అంటే తమ మనసును చెడుతలపుల నుండి శుభ్రపరచుకోవాలనుకున్నా, కల్మషరహితంగా ఉంచుకోవాలన్నా, ఇంద్రియ వాంఛలనుండి బయటపడాలన్నా, శ్రేష్ఠతరమైన ఆధ్యాత్మికానుభూతిని సాధించాలనుకున్నా, వారు నిరంతరం జీవన పోరాటాన్ని కొనసాగించవలసినదే. కానీ ఈ విధమైన సంఘర్షణలమధ్య, శ్రేష్ఠతరమైన విస్పష్టత అన్న ఒక్క పదం తేడా మాత్రమే ఉన్నది.

అభివృద్ధి చెందని దేశాలలోని ప్రజలు, అత్యంత ప్రాథమికమయిన అవసరాలకోసంకూడ, పోరాటం చేయవలసిన అగత్యం ఉన్నది. ఇటువంటి ప్రపంచంలో, మోసగించేవారు, మోసానికి గురి అయ్యేవారు అన్న రెండే రెండు తెగల ప్రజలు మాత్రమే నివసిస్తున్నారు. అవినీతి, పెద్ద వటవృక్షంలా ఊడలు దిగి వ్యాపిస్తున్నది. యుద్ధానంతర శ్రీలంక ప్రజల పరిస్థితులను చూచినట్లయితే, అన్ని విషయాలలోను, స్వచ్ఛతతో, పవిత్రతతో కూడిన సంపూర్ణదేశాన్ని నిర్మించుకునేందుకై వారెంతో పోరాటాన్ని సాగించవలసిన అవసరం ఉన్నది. భారతీయులు కూడా నీతిదాయకమైన సమాజాన్ని నిర్మించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రజలు తమ లక్ష్యసాధనకు ఎంతో పోరాటాన్ని చేయక తప్పదు. అవినీతి చీకట్లను ఛేదించుకుని, వెలుతురువైపు తమ అడుగులను వేయటాన్ని వారిప్పుడు ప్రారంభించాలి.

ఇక్కడ పోరాటం అంటే, సమ్యక్ ప్రయత్నమే తప్ప వేరుకాదు. ఈ ప్రయత్నం నిరంతరం వ్యాయామంలా, సమ్యక్ వ్యాయామంలా కొనసాగాలి. బౌద్ధుల దృష్టిలో సమ్యక్ వ్యాయామం అంటే,

(1) ఇంతకుముందే మనలో ఉద్భవించిఉన్న చెడును తొలగించే ప్రయత్నం
(2) ఇంకా ఉద్భవించని చెడును, ఉద్భవించకుండా అడ్డుకునే ప్రయత్నం
(3) ఇంకా ఉద్భవించని మంచిని, ఉద్భవించేలా చేసే ప్రయత్నం
(4) ఇంతకుముందే మనలోనున్న మంచిని పెంచుకునే ప్రయత్నం అని అర్థం.

విద్యార్జన, పోరాటాల మధ్యగల సంబంధం ఏమిటి ?

విద్యార్జన మరియు పోరాటం అంటే చదువుకునేటప్పుడు చేసే పోరాటం అని అర్థం. విద్య, పోరాటాన్ని, పోరాటం విద్యను పరస్పరం బలపరుస్తాయి. పోరాటాన్ని చక్కగా నిర్వహించడానికి లేదా, పోరాటంపట్ల నేర్పుతో వ్యవహరించటానికి ఒకరికి సమ్యక్ అవగాహన, (సమ్యక్ జ్ఞానం) అవసరమవుతుంది. సమ్యక్ ప్రయత్నంతో చేసే పోరాటం, పనులను జరిగేలా చేస్తే, సమ్యక్ జ్ఞానం ఆ పనులు సరిగ్గా మంచి పద్ధతిలో జరిగేలా చేస్తుంది.

మానవత్వ రక్షణకోసం, ఈ భువిపై, ఉద్భవించిన మతప్రవక్తలు అందరూ, "అజ్ఞానపు చీకట్లను తొలగించుకొని, జ్ఞానజ్యోతులను వెలిగించుకోవాలి, అటువంటి జ్ఞానజ్యోతులను, విద్యార్జన మరియు పోరాటాలనుండే నీవు పొందగలవు" అని మనకు బోధించారు.

మనమిపుడు, ప్రధానమైన అంశాన్ని అర్థం చేసికొన్నాము. విభిన్న మనస్తత్వాలుగల, ప్రజలతో ఈ అంశాన్ని ఎలా మేళన చేయగలం? మొదటగా డిగ్రీకన్న తక్కువస్థాయిలో చదువుతున్న విద్యార్థుల విషయాన్ని గమనిద్దాం. భవిష్యత్తులో అన్వయించుకోవడానికి, శాంతియుతమైన సమరసమైన జీవనాన్ని పొందడానికి విద్యార్జన మరియు పోరాటం అన్న లక్ష్యాన్ని వారు సక్రమంగా అర్థం చేసికోవాలి.

ఇంట్లోను, సమాజంలోను, మహిళలకు ప్రముఖస్థానం ఉన్నది. వారు విద్యనేర్చి, తమ పెద్దలను అనుసరించాలి. తాము గొప్ప వ్యక్తులుగా రూపొందటానికి, పోరాటం చేయాలి. వారు తమ కర్మలను, నిర్వర్తిస్తూనే, విముక్తిని పొందేలా వారి ఆచరణ, అభ్యాసాలు తోడ్పడగలవు. అన్ని విషయాలలో కీలకస్థానాన్ని పోషించే మగవారు, సమాజంలో గౌరవస్థానాన్ని కల్పించే సమ్యక్ జీవనం కోసం పోరాటం సాగించాలి, వారు జ్ఞానులు కావటానికి చదువుకుని, బౌద్ధ సాంప్రదాయాలను పాటించాలి.

ఈ పోరాటాలు, మానవులకు తమచుట్టూ ఉన్న అజ్ఞానమనే చీకట్లను తొలగించుకోవటానికి సహాయపడగలవు. అవినీతి బురదలో కూరుకుపోయిన ప్రజలతో నిండిన భారతదేశంలో, అజ్ఞానమనే చీకట్లను తొలగించుకునే ప్రయత్నంలోనే నేనూ జీవిస్తున్నాను. అందరి క్షేమాన్ని ఉద్దేశించిన జీవితాన్ని గడపడానికి అవసరమైన నైపుణ్యాన్ని, సామాజిక బౌద్ధధర్మం సాధకునికి నేర్పగలదు.

ఆంతరిక విశ్వాసం :

నేటి పరిస్థితులలో, భిన్నమతాలతో వ్యవహరించటానికి, ఉపయోగపడే ఒకానొక ప్రసిద్ధ సంకల్పం, ఈ ఆంతరిక విశ్వాసం (విశ్వాసాల మధ్య) అనే సంకల్పం. విభిన్నమతాలకు చెందినప్రజలు, సరైన విశ్వాసంతో, పరస్పరం ఒకరిమతాన్ని గూర్చి మరొకరుఅర్థం చేసికున్నట్లయితే, స్వార్థం నుంచి పుట్టే మతసంఘర్షణలు తొలగిపోతాయి. ప్రపంచ ప్రజలందరినీ మతసామరస్యం వైపుగా, సామాజికబౌద్ధం నడిపిస్తుంది.

వ్యక్తిగత ఆచరణ ఆధారంగా, సామాజికమార్పును తేగలిగిన సాధనంగా బౌద్ధాన్నిచూశాడు, డా. బి.ఆర్. అంబేద్కర్ అయితే నిరుపేద కుటుంబాలకు చెందినవారు, సామాజిక అణచివేతకు గురి అయిన కుటుంబాలనుండి వచ్చినవారు అయిన భారతదేశంలోని అతని అనుయాయులు, వారిని బలపరచే ఆధారాలను అతిస్వల్పంగానో, కొన్నిసార్లు ఏమీలేకనో మాత్రమే పొందగలిగారు. బౌద్ధం సామాజికవిప్లవాన్ని తేగలదని డా. బి.ఆర్. అంబేద్కర్ భావించారు.

'నేను, నాది' అనే భావాలనుండి విముక్తులు కావడానికి, ప్రజలు సామాజిక బౌద్ధధర్మాన్ని అనుసరించాలి. అది వారి పాలిటి, ముఖ్య ఆశ్రయంగా మారగలదు. ఈ మార్గంద్వారా, మనం, మన దుఃఖాన్ని ప్రపంచప్రజలతో పంచుకోగలం. తద్వారా, ప్రపంచ ప్రజల సహాయంతో, మనం, మన దుఃఖాలనుండి విముక్తులము కాగలం. లభ్యమవుతున్న శాస్త్ర-సాంకేతిక సౌకర్యాలను ఉపయోగించుకోవడం ద్వారా, సామాజిక బౌద్ధధర్మ కార్యకర్తలు, తమ సమాజానికి సమర్థవంతంగా సేవలను అందించగలరు.

సామాజిక బౌద్ధధర్మాన్ని ఆచరించడం ఎలా?

ఇందులో ఏయే రకాల కార్యక్రమాలు ఉంటాయన్న ప్రశ్నను ఎదుర్కొంటాం. ముందుగా దానికి జవాబు చెప్పుకొందాం.

(1) మనం ధ్యానతరగతులను నిర్వహించాలి. (2) బౌద్ధంలోని ప్రధాన నియమమయిన పంచశీల ఆచరణకు ప్రాధాన్యతను ఈయాలి. (3) శాంతి నడకలను (Peace March) జరిపించాలి. (4) అన్ని

మతాలకు చెందిన వారిని ఒక్కచోట చేర్చి సామరస్యంతో పనిచేసేలా చేయాలి. (5) కార్యకర్తలుగా చేరడానికి ప్రజలకు ఆహ్వానం పలకాలి. (6) క్యాంపులలో కొత్తగా చేరినవారికి, బౌద్ధం గురించి తక్కువ తెలిసినవారికి, నిరక్ష్యరాసులకు, భగవాన్ బుద్ధుని శక్తివంతమయిన బోధనలను, ఆ బోధనలకు (అ) మైత్రి, (ఆ) కరుణ, (ఇ) ముదిత, (ఈ) ఉపేక్ష అనే బ్రహ్మవిహారాలతో గల సంబంధాన్ని అర్థం చేసికునేలా చేయాలి.

జీవితం అంటే నమ్మకం. కాబట్టి, సామాజిక బౌద్ధధమ్మాన్ని నిష్పక్షపాతంగా ఆచరించాలని అనుకున్నట్లయితే, అది, తనలోని శక్తిని చూపడమే కాదు, జీవితంపట్ల కొత్త నమ్మకాలను (Life is a hope) కలిగిస్తుంది. దక్షిణభారతదేశంలో, సామాజిక బౌద్ధధర్మ పథం, ఈ కొత్త సంకల్పం, న్యాయబద్ధమైన, శాంతియుతమైన, సామరస్య భావనతో నిండిన సమాజాన్ని నిర్మించేందుకు దోహదపడగలదు. విభిన్న మతాలతో కలిసి వ్యవహరించి, పరిమిత పద్ధతిలో ఆచరణలో చూపగలదు. నిజమైన ధమ్మ సైనికులుగా మనం పరస్పర ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలి.

యువత మరియు సామాజిక బౌద్ధధర్మం

బాల్యానికీ, ప్రౌఢదశకీ మధ్యనున్న కాలాన్ని యౌవనదశ అని అంటారు. ఈ దశను గురించిన నిర్వచనాలు, యౌవ్వనదశలోని విభిన్నత్వాలు కనిపిస్తున్నాయి. వ్యక్తిగతపరిణతి అన్నది, కాలక్రమానుగతంగా వచ్చే వయసుకు అనుగుణంగా ఉంటుందని అనలేము. ఎందుకంటే, అన్నీ వయస్సులవారిలోనూ, అపరిపక్వదశలోనున్నవారు ఉంటూనే ఉంటారు.

యౌవనం, కౌమారం, లేయౌవనప్రాయం, పసిప్రాయం, చిన్న వయస్సు. అన్నవి ఇంచుమించు ఒకే అర్థంలో ప్రపంచమంతటా వాడబడుతున్నా, కొన్నిసార్లు చిన్నచిన్న భేదాలు కనిపిస్తాయి. యౌవనమన్నది బాల్యకాలాన్నో, ప్రౌఢకాలాన్నో గాక, ఈ రెండింటికీ నడుమ జరుగుతున్న జీవితకాలానికి చెందుతుంది. 'అతడు యౌవనంలో ఉన్నాడు' అన్నట్లు, యౌవనం, అన్నపదం ఒక ప్రత్యేకమయిన మానసిక స్థితినికూడా సూచిస్తుంది. యువత అన్న పదం, చిన్నవయసు వారిని, యౌవనంలో నున్నవారిని సూచిస్తుంది.

"ఈ ప్రపంచం యువతనుండి నాణ్యమైన జీవితాన్నికోరుతుంది. ముఖ్యంగా వయస్సును బట్టి గాక, మనోస్థాయిని బట్టి యువతగా గుర్తించబడుతున్నవారిలో. చిత్తశాంతత, కాల్పనిక నాణ్యత, పిరికితనం పై ధైర్యం ప్రాధాన్యం, జీవన సౌలభ్యాలకోసం సాహసం చేయాలన్న కాంక్ష – ఇవన్నీ కలిగి ఉన్న యువతను, నాణ్యమైన యువతగా ఈ ప్రపంచం నిర్ధారిస్తుంది" అని అంటారు, రాబర్ట్ కెన్నెడీ.

సామాన్యార్థం లో చెప్పే లేయౌవనదశకు, శాస్త్రపరంగా చెప్పే, కౌమారదశకు పర్యాయపదం ఈ యువత అన్న పదం. యునైటెడ్ నేషన్స్, ఆగష్టు, 12వ తారీఖును 'అంతర్జాతీయయువతదినం' గా ప్రకటించింది.

యువకునిగా ఉన్నపుడు:

యౌవ్వనంలో ఉన్నపుడు, ఎవరు మంచిప్రవర్తనతో ఉంటారో, వారి భవిష్యత్తు చాలా ప్రకాశమానంగా ఉంటుంది. ఈ రోజుల్లోవలె నాటి యువత కూడ, న్యాయవిరుద్ధమైన సంబంధాలు, మత్తుపదార్ధ సేవనం, ఇతరులను క్షోభపెట్టడం, పొగత్రాగడం మున్నగు చెడుకార్యాలచేత ఆకర్షింపబడే వారు. 'పంచశీల' ను ఆచరించడంద్వారా, ఈ దురలవాట్లనుండి బయట పడవచ్చు. ఈ యువ సంఘాలలో పనిచేయడం వలన, పంచశీల ఆచరణ సులభతరమవుతుంది. అంటే, "మంచి చేయుము-మంచిగా ప్రవర్తించుము" (Do Good and Be Good) అన్నట్లు, అన్నివిధాలుగా వ్యక్తిత్వపెంపుదలను అభివృద్ధి చేసికోవచ్చునని నా ఉద్దేశ్యం. ఈ రకమైన భౌతిక, మానసిక వ్యాయామాలు, క్రమశిక్షణాయుత జీవితాన్ని గడపడానికి వ్యక్తికి దోహదపడతాయి.

"ధనాన్ని నష్టపోయినట్లయితే, ఏదీ నష్టపోనట్లు,
ఆరోగ్యాన్ని నష్టపోయినట్లయితే, కొంత నష్టపోయినట్లు,
శీలాన్ని నష్టపోయినట్లయితే, సమస్తమూ నష్టపోయినట్లే"

- యువత గుర్తుంచుకోవలసిన, అత్యంత ముఖ్యమైన సామెత ఇది.

యువతకోసం ఆధ్యాత్మిక, మతపరమైన ఆచరణ:

అసహనం, విభేదాలు, తృష్ణ, కోపం, నిరుత్సాహాలతో తొణికిసలాడుతున్న, ఈ సమాజానికి సహాయపడాలనుకున్న యువబౌద్ధులు, బౌద్ధులు కాని యితర యువకులైన ధర్మాచరణశీలురు, ఆరోగ్యకరమైన, కరుణతో కూడిన సమాజంకోసం శ్రమించాలి. ఒకరితో ఒకరు మాత్రమే గాక, ఈ భువిలోని సకల జీవరాసులపట్ల కూడ సామరస్యంతో వర్తిల్లడానికి స్థిరమైన ఆచరణగా బుద్ధుడు ప్రపంచ యువతకోసం, చెప్పిన మైత్రీకరుణలతో కూడిన నైతికమార్గాన్ని నిర్దేశించే సమ్యక్ అప్రమత్తత (సమ్యక్ సతి)ను నేటియువత ఆచరించవలసిన అవసరం ఉన్నది.

మన సమాజం ఏర్పరచిన ప్రాకృతిక కాలుష్యాలను, ప్రాకృతిక విధ్వంసాలను, చూచినపుడు, మనకు కోపం, వైఫల్యపుటాలోచనలు కలుగుతాయి. ఈ సామాజిక జీవన విధానాన్ని మార్చడానికి వ్యక్తిగతంగా మనమొక్కరమే సరిపోము, అని తెలిసినపుడు, నిరాశకు లోనవుతాము. కాని మన సామూహికాచరణలు (Spiritual Practioners group) ఖచ్చితంగా మనిషిని, సమాజాన్ని కూడ మార్చగలిగిన శక్తిని కలిగి ఉన్నాయి.

సహానుభూతి, మహాకరుణలను ఆచరించే ప్రాచీన సంప్రదాయబద్ధమైన జ్ఞాన నిధిగా, బౌద్ధాన్ని గుర్తించాలి, గాని కేవలం భక్తి మార్గంగా మాత్రం కాదు. బౌద్ధ ధమ్మసారం, శాస్త్రలక్ష్యంతో చాలా దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది. అందుకే, భౌతికవాదులైనా, నాస్తికులైనా, బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయులయినా వారిలో ఎటువంటి వివక్షలు లేని విశాలదృక్పథంతో కూడినమానసిక చైతన్యాన్ని పెంపొందించడానికి, సమానమైన జీవనాడిని కలిగిన బౌద్ధ ధమ్మం, శాస్త్రవిజ్ఞానం రెండూ సహాయపడతాయి. మైత్రి ఆచరణ, సోదరీ సోదరభావ ఆచరణ అన్నవి, బౌద్ధధమ్మ పునాదిరాళ్ళుగా రూపుదిద్దుకున్న అంశాలు.

సమాజంలోని ప్రజలు ఒక్కటిగా చేరినపుడు, వారు పరస్పరం కలిసిపోతారు. ధమ్మబోధనలను వింటారు. ధమ్మాన్ని గూర్చి పరస్పరం చర్చించుకుంటారు. సమ్యక్ అప్రమత్తతతో బాటు, కూర్చుని, నడుస్తూ, చేసే ధ్యానాలను కూడా ఆచరిస్తారు. ఈ అభ్యాసాలు వారి శారీరిక, మానసికపరమైన జీవనఒత్తిడులను తగ్గించేందుకు సాయపడతాయి. జీవితంపట్ల లోతైన అవగాహనను ఏర్పరచి, సంతోషమయంగా జీవించడానికి దోహదపడతాయి. పరస్పర సంబంధాలను మెరుగుపరిచే రీతిలో, దయతో వినడాన్ని, ప్రేమతో మాట్లాడడాన్ని అలవాటు చేయడమేగాక, అందరినీ సమాధానపరచి, సమాజంలోని ఇతరులపట్లకూడ వారలాప్రవర్తించేలా నేర్పుతాయి.

ఈ సమ్యక్ సతిని లోతుగా అర్థం చేసికోవడానికి, నిత్యజీవితంలో దానిని సరిగ్గా అభ్యసించడానికి, తద్వారా సమాజాన్ని కరుణతోను, సమరస భావనలతోను నింపడానికి అవసరమైన ఆచరణమార్గాలను అందరూ కలిసి ఆచరించేలా చేయడానికి ఈ ధర్మ సాధన మనకు సాయపడుతుంది. కలిసి శ్రమించినపుడు, మనమెన్నో స్థిరమైన మార్గాలను, ఇలా కనుగొనగలము.

- పరీక్షలకు ముందు, ఒత్తిడిని తగ్గించే మార్గనిర్దేశిక సూత్రాలను మన సహాధ్యాయులతో కలిసి పంచుకోవటం.
- మన స్నేహితులమధ్యగాని, కుటుంబసభ్యుల మధ్యగాని ఏర్పడిన సంఘర్షణలను తొలగించి, వారిని సమాధానపరిచేందుకు
- మన సహాధ్యాయులతో, స్నేహితులతో కలిసి – కూర్చుని, నడుస్తూ, తింటూ చేసే ధ్యాన సాధనను అప్పుడప్పుడూ ఏర్పాటు చేసుకోవడం.
- భూమి పరిస్థితులకు తగినట్లుగా మనలను మేల్కొల్పే, జీవావరణ సంబంధమైన తరగతులను నిర్వహించడం.
- పాఠశాలలు, కళాశాలలు, నగర, పట్టణ ప్రాంతాలలో, సేంద్రియపరమైన కూరగాయల తోటలను పెంచడం.
- వ్యసనపరులుగా, ఇతరులను ఆశ్రయించి బ్రదుకుతున్నవారుగా సంఘర్షణలకు లోనవుతున్న స్నేహితులు, ఆ దుఃఖం నుండి బయటపడడానికి, బౌద్ధంలోని సాధనాలు, అంతర్ముఖీనతల ద్వారా సహాయపడటం.
- స్థానికంగానున్న దాతృత్వ సంఘాలతో, కలిసి పనిచేస్తూ, అవసరంలోనున్నవారికి సాయపడటంలోను, అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో నిధుల ప్రణాళికలను ఏర్పరచడంలోనూ సహాయపడటం, వంటివి.

యువకులు, బాలలు వచ్చినేర్చుకుని, ఆనందంగా అప్రమత్తంగా జీవించడానికి అనువైన క్యాంపులను, ఈ సమాజసభ్యులు నిర్వహించ వచ్చు. ఈవిధంగా మనందరము ప్రకృతి సాహచర్యం చేత, మనలను మనం అభివృద్ధిపరచుకోవచ్చు.

మనం నివసిస్తుండే ఈ భూగ్రహం, చాలాకాలం నిలకడగా మన్నేందుకు సహాయకారిగా. ఈ సమ్యక్ అప్రమత్త ఆచరణలు మనలను ప్రోత్సహిస్తాయి. ఈ ఆచరణలు సభ్యుల జీవనాడిగ, వారిసేవకొక

ప్రత్యేక ప్రతీకలుగా రూపిస్తాయి. ఈ ఆచరణద్వారా పెంపొందించుకోదగిన జాగరూకత, ఏకాగ్రత, అంతర్ముఖీనతల వలన, సహనం, విచక్షణ, అవగాహన, కరుణ మొదలైన భావాలను కూడా అభివృద్ధి పరచుకోగలం.

సమ్యక్ అప్రమత్తత (Right Mindfulness) : నేటి సమాజంలో మెలకువగా, జాగ్రత్తగా ఉండటానికి తగిన బలాన్నిచ్చేది ఈ అప్రమత్తత, లేదా జాగరూకత. నిత్యజీవితంలోని ప్రతిక్షణాన్ని, ఆధారం చేసికొని, తీవ్రంగా చేసే అభ్యాసం ఇది. అప్రమత్తతతో ఉండటం అంటే, నీ చుట్టూ ఉన్నవారితో, నువ్వు చేసేపనులలో, ప్రతిక్షణం జాగురూకతతో జీవిస్తూ ఉండటం అని అర్థం. అంట్లు తోమేటపుడు కావొచ్చు, స్నానం చేసేటపుడు కావొచ్చు, కారు నడిపేటపుడు కావొచ్చు ఎల్లవేళలా, శరీరాన్ని, మనసును సామరస్య పథంలోకి తీసుకుపోవడమే నిజమైన అప్రమత్తత.

మనం ఇంట్లో ఉన్నపుడు, నడవటం, కూర్చోవటం, పనిచేయటం మొదలైన పనులన్నీ ఒకే విధంగా ప్రతిరోజూ చేస్తుంటాము. ఒకే ఒక ప్రత్యేకత ఏమంటే, ఆ చేసేపనులను, అప్రమత్తతతో, జాగరూకతతో చేయడమే. ఒక్క ధ్యానమందిరంలోనేకాదు, ఏ గదిలోనున్నా, ఏ పనిలో నున్నా, ప్రతిక్షణం మనం అప్రమత్తతను ఆచరించవచ్చు.

సంఘంతో కలిసి ఆచరిస్తున్నపుడు, ఈ అప్రమత్త ఆచరణ సంతోషదాయకంగా, విశ్రాంతిదాయకంగా స్థిరంగా మలువబడుతుంది. మనం ఒకరినొకరం అప్రమత్తులుగా చేసికొనే సూచికలుగా, ఆచరణమార్గంలో నడిచేలా– సహాయాన్ని పరస్పరం అందించుకోగలం. ఈ సంఘ సహాయం చేత, మనచుట్టూ ఉన్న వారిలో శాంతిసంతోషాలను పెంపొందించడానికి, మనచుట్టూ ఉన్నవారికి, మనం ప్రేమించేవారికి, శ్రద్ధవహించేవారికి బహుమానంగా, మనమీ అభ్యాసాన్ని సులభంగా ఆచరించవచ్చు. మన అంతరంగపు లోతులలోనున్న, ఏకత్వాన్ని, స్వేచ్ఛను వృద్ధిపరచుకోవడమేగాక, మనభయాలు, అర్థరాహిత్య స్థితులు, దుఃఖాలనుండి కూడా విముక్తులం కాగలం.

ప్రియమైన ఉపాసకులారా! ఉత్సాహంతో, అన్వేషణాశీలతతో, ఆచరణలోని ప్రతిఅంశానికి దగ్గరయ్యేలా, మన ఆచరణలో తెలివిగలవారంగా, శక్తిమంతులుగా, మనం ఉండేందుకు ప్రయత్నిద్దాం. ఏదో చేశామన్నా విధంగాగాక, అర్థం చేసుకుని ఆచరిద్దాం. నిర్బంధరహితంగా, మృదువైన చిత్తవృత్తితో, విశాల దృక్పథంతో, కొత్తభావాలను గ్రహించడానికి సిద్ధమైన హృదయంతో, మీ ఈ అభ్యాసాన్ని ఆనందించండి.

ఐదు సమ్యక్ అప్రమత్త (సమ్యక్ సతి) అభ్యాసాలు:

సమ్యక్ అప్రమత్త అభ్యాసం, ప్రాపంచిక ఆధ్యాత్మిక, నైతికతలకు సంబంధించిన బౌద్ధుల దృక్పథానికి ప్రతీక. బుద్ధుని బోధనలైన చతురార్యసత్యాలు, ఆర్య అష్టాంగమార్గాలను సక్రమంగా ఆచరించడం; సమ్యక్ అవగాహనతో మైత్రిని పెంపొందించుకోవడం; సకల జీవుల పట్ల సహానుభూతి (leading to healing)ని కలిగి ఉండటం; సమాజాన్ని మంచిగా మార్చడం; మనము, ప్రపంచం సంతోషంగా ఉండటం – అన్న అతి ముఖ్యమైన ఐదు బుద్ధుని బోధనలను స్థిరంగా ఆచరించడానికి ఉపకరించే ఆర్య అష్టాంగమార్గమే, ఈ సమ్యక్ అప్రమత్త ఆచరణ. ఈ ఐదు అప్రమత్తతలను తప్పక ఆచరించడం చాలా అవసరం. అంతర్ముఖీనత్వాన్ని పెంపొందించుకోవడానికి లేదా, విభేదాలు, అసహనం, కోపం, భయం, నిరాశ లవంటి అక్కరలేని భావాలను తొలగించుకోవడానికి సాయపడే సమ్యక్ అవగాహనను పెంపొందించుకోవడానికి కావలసినంత శక్తినిచ్చే

ఈ ఐదు అప్రమత్తతా అభ్యాసాలను ఆచరించాలి. వీటిప్రకారం మనం జీవితాన్ని మలుచుకున్నట్లయితే, మనం బోధిసత్వ మార్గంలోకి వచ్చినట్లు. ఈ మార్గంలో ఉన్నందువలన, మన వర్తమాన జీవితాన్ని గూర్చిన తత్తరపాటులో గాని, భవిష్యత్తును గూర్చి భయాలలో గాని మనలను మనం పోగొట్టుకోం.

శారీరక దృఢత్వం కోసం, 'అనాపానసతి' ని చేసేటపుడు, యోగాసనాలను వేయవలసిన అవసరం యువతకు ఉన్నది. ఇది శరీరం మరియు మనస్సును సక్రమంగా ఉంచడానికి తోడ్పడుతుంది.

చట్టవిరుద్ధమైన మాదకద్రవ్యాలు:

మాదకద్రవ్యాలు వ్యక్తిని, తాత్కాలిక ఆనందాలను కలిగించే చిత్త భ్రమలతో, మిథ్యా భావనలతో కూడిన మానసిక వాతావరణం లోకి పంపుతాయి. దురదృష్టవశాత్తు, ఆ మాదకద్రవ్యాల ప్రభావం తగ్గిపోగానే ఆ వ్యసనపరుడు, మానసికంగా క్రుంగిపోవడమే గాక, సోమరితనంతో మందగించిన మానసిక స్థితిని అనుభూతం చేసికుంటాడు. తాను పొందుతున్న అనుభూతులకు ఆనందిస్తూ, ఇంకా అలాటి మిథ్యానుభూతుల కోసం మరికొంత మాదకద్రవ్యాలను తీసికుంటారు. ఇదొక సంకుచితమైన పరిధిగా మారడమేగాక, ఈ అనుభూతులనిమిత్తం ఎంతో ధనాన్ని కూడా ఖర్చుపెడతారు. దొంగతనాలకు, ఇతరేతర తప్పిదాలకు కూడా ఈ వ్యసనం దారితీయవచ్చు.

తమ వ్యసనాలను నిరంతరం కాపాడుకోవడానికివలసిన ధనం కోసం, కొంతమంది యువత, తమకు ప్రియమైనవారిని కూడా చంపుకుంటారు. మత్తులోనున్నపుడు, మాదకద్రవ్యాల ప్రేరణవలన, చేసిన హత్యలమూలంగా, తమజీవితంలో అత్యంత ప్రముఖమైన కాలాన్ని జైళ్లలోనే గడిపేవారున్నారు.

తల్లిదండ్రులు, అలాగే ఉపాధ్యాయులు కూడా ఈ ఉచ్చులో పడనీయకుండా తమ పిల్లలప్రవర్తనను పర్యవేక్షిస్తూ ఉండాలి. తరగతులకు, పాఠశాల కార్యక్రమాలకు హాజరు కాకపోవడం, ఊగిసలాడే చిత్తవృత్తులు- ఇవి విద్యార్థి సోమరితనాన్ని, బుద్ధిమాంద్యతను తెలిపే చిహ్నాలు. ప్రారంభదశలోనే, ఈ వ్యసనాలను తొలగించడానికి తగిన చర్యను మనం వెంటనే తీసికోవాలి. మానసిక వైద్యులు కూడా, ప్రారంభదశలో నున్న మాదకద్రవ్యాల వ్యసనాన్ని తొలగించడం సులభమని చెబుతారు.

డేటింగ్:

వివాహమాడటానికి తగిన అర్హతను మదింపువేయడానికి, సామాజిక కార్యకలాపాలలో కలిసి పాల్గొనడానికి ఇద్దరు వ్యక్తులచేత చేసికొనబడిన ఒప్పందం వంటిది ఈ డేటింగ్. ఈ పదానికి ఎన్నో అర్థాలున్నప్పటికి, ఇద్దరు వ్యక్తులు పరస్పర అంగీకారంతో, జంటగా సామాజిక కార్యకలాపాలలో బహిరంగంగా పాల్గొనడం అన్న అర్థాన్ని ఇది చెబుతుంది.

ఈ పదానికున్న మౌలికమయిన అర్థాలు, ఆచరణలు, వివరణలలో దేశానికి, దేశానికి మధ్య తేడాలున్నాయి. ఇద్దరు వ్యక్తులు, లైంగిక సంబంధం కలిగి ఉన్నా లేకున్నా, బహిరంగమయిన సామాజిక చర్యల్లో కలిసి పాల్గొవడానికి సౌకర్యవంతంగా ఉన్నారా లేదా అని చూడడానికి, కొన్నిసార్లు, ఈ ఒప్పందకాలం వారి వివాహానికి అంగీకార సూచికగా మారడానికి కూడా ఈ డేటింగ్‌ను ఉపయోగించుకుంటున్నారు.

వివాహానికి పూర్వం లైంగిక సంబంధం కలిగి ఉండటం తప్పా?

అవును, తప్పే. వివాహానికి ముందు లైంగిక సంబంధం కలిగి ఉండటం తప్పే. ఇది ఎన్నో సమస్యలకు – అగౌరవం, మానసిక వేదనలు మొదలైన ఎన్నో సమస్యలకు దోహదం చేస్తుంది. అమ్మాయిలనో, అబ్బాయిలనో స్నేహితులుగా కలిగి ఉన్నామనడం, వివాహానికి ముందే ఇతరేతర సబంధాలను కలిగి ఉండటం అనుమతించదగినవి కావు.

లైంగిక సంబంధాలు:

సరైన విధంగా, పవిత్రంగా ఉన్నంతవరకు లైంగికాకర్షణలు చెడుకాకపోవచ్చు. స్త్రీపురుషుల వివాహానంతరం జరిగే లైంగికతే నిజమైన ఆనంద దాయకమైనవని చాలామంది ఇప్పటికీ విశ్వసిస్తారు.

గుర్తుంచుకో! నువ్వు నీ నడవడికను సరిదిద్దుకోవాలి. లేదంటే పాపం నీపై ఆధిపత్యం చెలాయిస్తుంది. మంచిమనసు లేకుంటే, మంచి పని అయినా పాపకార్యంగనే పరిణమిస్తుంది.

మత్తు:

ఈరోజుల్లో చాలామంది యువత, ధూమపానానికి, మధ్యపానానికి అలవాటుపడుతున్నారు. ఈ దురలవాట్లు ఊపిరితిత్తులను పాడుచేస్తాయి. పెదవులు, పళ్ళు, తమ సహజకాంతిని కోల్పోయి, రంగులో బలంలో కూడా, అసహజత్వాన్ని సంతరించుకుంటాయి. మద్యపానం, ఎన్నోరకాల రోగాలకు నాంది పలుకుతుంది. త్రాగుబోతులకు సాధారణంగా వచ్చే రోగం కాలేయ సంబంధమైనదే. ఈ రెండు దురలవాట్లు, కుటుంబాలనే కూల్చివేస్తాయి. ఆర్థికంగాకూడ ఎంతో నష్టం కలగడమేగాక, మొత్తం కుటుంబం, పేదరికంలో వెళ్ళిపోయే ప్రమాదం ఉన్నది. చిన్న వయసులోనే, ఈ రకమైన వ్యసనాలకు లోనయినట్లయితే, భవిష్యత్తులో వేదనలు, దుఃఖాలే మిగులుతాయి.

సామాజిక బౌద్ధధర్మం:

యువతకు కూడా ప్రయోజనాత్మకమైన కొత్త సంకల్పమిది. ఈ సంకల్పం పంచశీల, బ్రహ్మావిహారాలు, ధ్యానం మరియు, మంచి ఆరోగ్యాన్ని, శారీరిక దారుఢ్యాన్ని ఇవ్వగలిగిన యోగాభ్యాసాలను గురించి బోధిస్తుంది.

పంచశీల:

(1) జీవహింస చేయకుండుట.
(2) దొంగతనం చేయకుండుట.
(3) అక్రమ సంబంధాలకు దూరంగా ఉండుట.
(4) అబద్ధం ఆడకుండుట.
(5) వ్యసనములకు దూరముగా ఉండుట.

బ్రహ్మవిహారాలు:

(1) మైత్రి (సర్వజీవుల సంక్షేమ సుఖాలను నిజాయితీతో కోరే చిత్తవృత్తి)
(2) కరుణ (సకల జీవరాసుల దుఃఖాన్ని తొలగించాలని కోరే చిత్తవృత్తి)
(3) ముదిత (అసూయను మట్టుబెట్టి, సహానుభూతితో, సంతోషంతో కూడిన చిత్తవృత్తి)
(4) ఉపేక్ష (పక్షపాత రహితమైన సమచిత్తతను కలిగిఉండగల చిత్తవృత్తి)

యువకులు ఈ విధానాన్ని అనుసరించినట్లయితే, ఈ జీవితంలోనే వారు చాలా సంతోషాన్ని అనుభవించగలరు. భావి సమస్యలను ఎదుర్కోవడానికి వారు నిర్దుష్టంగా, కళాత్మకంగా జీవించడాన్ని అలవరచుకోవాలి. విషయాలను నేర్చుకోవడానికి జీవితంలో యౌవనకాలమే సరైన కాలం. అంతేకాదు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం – అందరూ యువత సరైన మార్గంలో ఎదగడానికి బాధ్యత వహించినపుడు, యువకుల సక్రమ ఎదుగుదల సులభసాధ్యమవుతుంది.

ధ్యానం

ధ్యానం వలన పొందగలిగిన ప్రయోజనాలను, ధ్యాన సంబంధమైన విభిన్న నైపుణ్యాలను, సాధకుల ప్రకృతికి తగిన, ధ్యానానికి ముందుగా ఆచరింపదగిన కొన్ని అభ్యాసాలను గురించి నేనీ అధ్యాయంలో వివరించుచున్నాను.

'ధ్యానం' అంటే మానసిక అభ్యాసానికి సంబంధించిన ఒక ప్రాచీన కళ అని చెప్పవచ్చు. ప్రాచీన ఋషులు, నిగూఢతత్వవేత్తలు అందరూ అధ్యాత్మిక అభివృద్ధికి, ధ్యానం ఒక అవసరమైన సాధనం అని అంగీకరిస్తారు. నిజానికి, కొన్ని సంప్రదాయాలు, ఈ ప్రాపంచిక బాధల నుండి, అన్ని రకాల దుఃఖాలనుండి, విముక్తిని పొందడానికి, ధ్యానం ఒక్కటే సరయిన మార్గమని విశ్వసిస్తాయి. తమ నిత్య జీవితంలోని, భిన్నరకాల ఒత్తిళ్లను, ఎదుర్కోవడానికి తగిన శక్తినిచ్చే ధ్యాన ప్రయోజనాలపట్ల, నేటి ప్రజలు చాలమంది, అప్రమత్తంగా ఉన్నారు. దానికితోడు, సక్రమంగా, చేసే ధ్యాన అభ్యాసాల వలన, ఆరోగ్యం, చిత్తవృత్తి, చేతనత్వాలు, అభివృద్ధి చెందడాన్ని గమనించగలం.

ఏది ఏమయినా, ధ్యానం యొక్క చరమలక్ష్యం, సంపూర్ణ మానసిక పరిశుభ్రత. ఆలోచనలు, చిత్తవృత్తులు, ఇంద్రియజ్ఞాన సంబంధంగా, ఎడతెగకుండా చేసే, అప్రమత్తమైన అభ్యాసాల వలన మానసిక పరిశుభ్రతను సాధించగలం. ధ్యానంలో ఏం జరుగుతుంది అంటే, ధ్యానం ద్వారా మనం, మన ఆలోచనలను నిశ్శబ్దంగా,

నెమ్మదిగా ఉంచగలుగుతున్నాం. మన మనస్సును, లేదా మన ఆలోచనలను, శాంతి పరచడంద్వారా, మనం, మన వాస్తవ ప్రకృతిని క్రమంగా అనుభూతం చేసికోగలం.

ధ్యానాన్ని, సక్రమంగా, అభ్యసించే సాధకులు తమ అభ్యాసం ద్వారా, దర్శించగలిగే చాల ప్రయోజనాలున్నాయి. జరుగుతున్న ఎన్నో పరిశోధనలు, వైద్యశాలల అధ్యయనాలు మున్నగువాటివలన, ఆరోగ్యం, శ్రేయస్సుల నిజమైన ప్రయోజనాలను పొందడానికి ధ్యానం సరయిన మార్గం అన్న ఒకే స్థిరమయిన ఫలితాంశాన్ని మనం అనుభూతం చేసికోగలుగుతున్నాం. శారీరక ఆరోగ్యంనుండి ఉద్వేగాల నియంత్రణ దాకా, మానసిక శ్రేయస్సునుండి, ధార్మిక అభివృద్ధిదాకాగల, ఎన్నో లాభాలు ధ్యానం వలన కలుగుతున్న ప్రయోజనాలుగా చెప్పగలం. నిజానికి, ఎందరో ధ్యానసాధకులు, ధార్మిక గురువులు, మనలోని పవిత్రతను పునరనుభూతం చేసికోవడానికి, మనిషి స్వభావం తెలిసికోవడానికి, ధ్యానం ఒక్కటే సరయిన మార్గమని అంగీకరిస్తున్నారు. దీనికి దగ్గరి త్రోవలు లేవు. నీ కోసం ఇతరులు సాధన చేయటం సాధ్యం కాదు. ఈ మార్గంలో, నీవే పురోగమించాలి.

మన జీవితాలలో, గొప్ప స్థాయికి చెందిన స్వీయ జాగరూకతలను ధ్యానం కలిగిస్తుంది. ఈ స్వీయ జాగరూకత వలన, మనలను మనం, బాగు చేసికోగలం. మన ఆలోచనలను, భావోద్వేగాలను, బాగా గుర్తించగలం. ఈ స్థితి, మన జీవితాలను సక్రమంగా నియంత్రించుకోవడానికి, జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలపట్ల సక్రమంగా స్పందించడానికి కావలసిన గొప్ప శక్తిని ధ్యానం వలన మనం పొందగలం. ఇది, మనలను శక్తిమంతులుగా చేస్తుంది. మనలో సానుకూలమైన మార్పులను కలిగిస్తుంది. నమ్రత కలిగిన స్వీయ అభివృద్ధిని మనలో పెంపొందింపచేస్తుంది.

మనలను మనం క్షమించుకోవడాన్ని, ఇతరులపట్ల క్షమను కలిగి ఉండటాన్ని సులభతరం చేయడం మాత్రమే గాక, ప్రతివిషయంలో అన్యాయంగా ప్రవర్తించడాన్ని, ఇతరులను నిరంతరం తప్పు పట్టే క్రీడ నుండి, ధ్యానం మనలను మరలిస్తుంది. మన ఒత్తిళ్లను పారద్రోలే ద్వారబంధంగా, అర్థం చేసికొనే శక్తిని, ఏకాగ్రతను పెంచే మార్గంగా మాత్రమేగాక, మానవ సంబంధాలను కూడా అభివృద్ధి పరచగలిగిన స్థితిని కలిగిస్తుంది. మనం జీవితాన్ని చూసే విధానంలో పెద్ద మార్పులను కలిగించగలిగిన, మనం ధ్యానం ద్వారా పొందగలిగిన చిన్న చిన్న అంతర్దృష్టుల ద్వారా మన జీవితంలో, మార్పులు సంభవిస్తాయి. ఇటువంటి మార్పులు, మన నమ్మకాల వ్యవస్థను మార్చడమేగాక, మన సమస్త చైతన్యాన్ని జాగృతపరుస్తుంది.

ప్రాచీన నిగూఢ తత్వంలో, ధార్మిక పరిణామానికి ధ్యానం ఒక సాధనంగా, ఉపయోగించబడింది. ఇప్పటికీ చాలమందికి, ధ్యానం అనేది, ధార్మిక అప్రమత్తతను పొందడానికిగల ఏకైక మార్గంగానే ఉంటూంది. మన ఎరుక స్థాయిని పెంచడంద్వారా, అంతర్దృష్టిద్వారా, ధార్మిక జ్ఞానాన్ని ఇవ్వగలిగిన చైతన్యంలోని పెనుమార్పునకు లేదా, విశ్వచైతన్యానికి ధ్యానం మనలను దగ్గర చేస్తుంది. కొందరు, అప్రత్యక్ష దర్శనం (యోగదృష్టి) లేదా, గొప్ప అంతఃప్రేరణ వంటి అతీంద్రియ మానసిక శక్తులను కూడా పొందగలరు. మరికొందరు శారీరక అనుభూతులను పొందినట్లుగా చెబుతారు. దుఃఖ విముక్తి, అన్నది అంతిమ లక్ష్యంగా గుర్తింపబడుతుంది.

ప్రారంభ సాధకునికి, ధ్యానం కష్టంగా తోచవచ్చు. చాలామంది చాలా మామూలుగా, తాము ధ్యానం చేయలేము అని అనుకుంటుంటారు. ధ్యానం అంటే ఏమిటోనని తెలియకున్నా, కొందరుతాము

చేయలేమనే చెబుతారు. ధ్యానం అనేది 'అందరూ చేయగలిగినది కాదు', అన్న మాట, ఒక ఊహ మాత్రమే! నిజానికి, 'ధ్యానం చేయటం' అన్నది చాలా మామూలు విషయం. అయితే స్థిరమయిన పట్టుదలతో కూడిన అభ్యాసం లేకుంటే, ధ్యానం యొక్క నిజమయిన ప్రయోజనాలను పొందలేము. విజయవంతమైన, ధ్యాన సాధకునికి కావలసినది క్రమశిక్షణ అన్నది మనం గమనించాలి.

ఏ ఇద్దరి ప్రారంభ సాధకుల అనుభవమూ ఒకటిగా ఉండదు. ధ్యానపద్ధతి, అభివృద్ధిక్రమాలు ఎవరికి వారికి భిన్నంగా ఉంటాయి. అయినా మనం శ్రమపడి ధ్యాన పద్ధతిని కొనసాగిస్తూ ఉంటే, కొన్ని సామాన్యమైన పోలికలు కనిపిస్తాయి. ప్రారంభ సాధకులు, సామాన్యంగా అనుభూతం చేసికొనే కష్టాలలో, శారీరక సంబంధమైన నొప్పి ఒకటి. మనలో ఎక్కువమంది, కదలకుండా స్థిరంగా ఒకే పద్ధతిలో చాలా సేపు కూర్చోలేము. మన శరీరం కదలడానికి సిద్ధమవుతూ ఉంటుంది. ఎప్పుడయితే మనం అటూయిటూ కదలకుండా స్థిరంగా 20 నుండి 30 నిముషాలు కూర్చోవాలను కుంటామో, అప్పుడు మనం అసౌకర్యాన్ని పొందుతాం. మన శరీరంలోని కొన్ని భాగాలు నొప్పి పెడతాయి. ఈ కారణం వలననే చాలామంది, తాము ధ్యానం చేయలేము, అన్న నిర్ణయానికి వచ్చేస్తూ ఉంటారు.

యధార్థమైన సత్యమేమిటంటే, నిజమైన శారీరక బాధలకన్నా, శారీరక అసౌకర్యం మన మనస్సుకు చాలా అసౌకర్యాన్ని కలిగిస్తుంది. నువ్వు నీ ధ్యాన భంగిమలను పట్టుదలతో కొనసాగిస్తున్నట్లయితే, చివరకు నీ శారీరికపరమైన అసౌకర్యం, దానంతటదే తొలగిపోవడాన్ని తెలిసికొని ఆశ్చర్యపోతావు. నువ్వు క్రమంగా 20 నిముషాలు, 30 నిముషాలు కూడా, ధ్యానం కోసం కూర్చొనగలవు. నిజానికి, కొద్దికాలం తరువాత, 45 నిముషాలు, అంతకన్నా ఎక్కువ సమయం ధ్యానంలో కూర్చోవటం సులభతరమవుతుంది. దీనికి నీ శారీరక స్పృహ హఠాత్తుగా నశించిపోవడం కారణం కాదు. అంతకన్నా, నీ మనస్సు, నీ శారీరక అసౌకర్యాన్ని నెట్టివేసే వాకిలిగా ఎదగడం దీనికి కారణం. శారీరక బాధ అనేది, ధ్యానాన్ని ప్రారంభించే సాధకులు జయించవలసిన, మొట్టమొదటి అడ్డంకి.

భావ అసౌఖ్యం (Mental Discomfort):

భౌతిక సుఖాలకు సంబంధించిన అనుకూల వాతావరణం నుండి దూరంగా జరిగినట్లే, భావోద్వేగాల అసౌకర్యం నుండి, మానసిక అసౌకర్యం నుండి కూడా, దూరంగా జరగడం నేర్చుకోవాలి. ధ్యానం చేస్తున్నపుడు, మనం, అస్పష్టతను, వివరించడానికి వీలుకాని ఇంద్రియ సంబంధమైన అసౌకర్యాన్ని, లేదా, గుండె బరువెక్కడం అనే స్థితిని అడ్డుకోవాలి. ధ్యానం ద్వారా, మనకు పరిచయంలేని కొత్త వాతావరణంలోకి ప్రవేశిస్తున్నాము, కనుక, మనలో పైకిలేస్తున్న భావోద్వేగ సంబంధమైన గాయాలు, మచ్చలనుండి ప్రేరణ పొందుతున్నాం, గనుక, మొదట, మనం అసౌకర్యాన్ని అనుభూతం చేసికుంటాము. కొందరికి ఈ పరిచయంలేని భావాలు, భయాన్ని కలిగిస్తాయి గనుక, వారు ఆ భావాలను అడ్డుకోవాలనుకుంటారు. వాటిని నిరోధిస్తారు. ఈ రకమైన విధానంలోని సమస్య ఏమిటంటే, నువ్వు దేనిని నిరోధించాలనుకుంటున్నావో, దానిని పట్టుదలతో చేయాలి.

నువ్వు పట్టించుకోకపోవడం, నిరోధించడం వలన మాత్రమే, ఆ భావోద్వేగాలు తొలగిపోవు. దానికి పట్టుదలతో కృషి చేయడం అవసరం. అసౌకర్యవంతమైన భావాలను పరిష్కరిస్తే తప్ప, వ్యక్తిగతమైన ఎదుగుదల, లేదా మార్పును సాధించడం అన్నది అసాధ్యం అన్న మాట నిజం. నువ్వు దానిని ఎదుర్కొనక తప్పదు. ఏది జరిగినా 'సరే'నని అనుకోవడమే దీనికి తగిన యుక్తి. దీనికి అర్థమేమిటంటే, అసౌఖ్య భావాలను ఉద్భవించనివ్వు,

దాని న్యాయాన్యాయాలను గురించి పట్టించుకోక, వాటిని వీలయినంత అనాసక్తితో పరిశీలించు. భావోద్వేగ సంబంధమైనదయినా, మానసికమయినదైనా, అసౌకర్యాలను అడ్డగించే విధానం, మన మనసుకు తెలిసిన సహజపద్ధతి. అయితే ఈ పద్ధతి, మన వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడే మంచి భావాలను, అడ్డగించవలసిన అవసరం లేదు. కాబట్టి భావోద్వేగాల మంచిచెడుల నిర్ధారణలో జాగృతులమై ఉండాలి. దీనికి అర్థం, మనం మన అనుకూల భూమిక నుండి దూరంగా జరగాలి. భావోద్వేగాలను అడ్డుకునే విధానం నుండి ఎంత దూరం జరిగితే, అంతగా మన ప్రయత్నాలనుండి సత్ఫలితాలను మనం అనుభూతం చేసికోగలం. దీనికి బహుమతి ఏమిటంటే, అంతర్దృష్టి, స్వీయ అవగాహనాలద్వారా పొంద గలిగిన వ్యక్తిగతమైన వికాసమే! అసౌకర్యాలను ఎదుర్కొనే విధానాన్ని, నిరోధించడాన్ని, చేసే అభ్యాసాలను జయించడం అనే విధానం, మనలోని ఒత్తిడిని క్రమంగా తొలగించడంలో కూడా మనకు సాయపడుతుంది.

యోగాభ్యాసాలు

ఈ చెప్పబడిన సామాన్యమైన అభ్యాసాలు, నీ శరీరాన్ని తేలికపరచడమే కాక, క్రమంగా నీవు ధ్యానాభ్యాసంలోనికి మారడానికి సహాయపడగలవు. ప్రత్యేకంగా, చెప్పబడిన ఈ అభ్యాసాలు, ముఖ్యంగా మేము వివరించిన రీతిలో, పద్ధతిప్రకారం ఆచరించినపుడు, మంచి ఫలితాలను ఇవ్వగలవని నమ్ముతున్నాము.

1 Ankle Crank
2. Half Butterfly
3. Him Rotation
4. Suat & raise post
5. Cro Walking
6. Churning the mill
7. Dynamic Spinal twist
8. Neck Movement

సమతా ధ్యానం

సమతా ధ్యాన లక్షణం, ఉన్నతమైన మానసిక ఏకాగ్రతను సాధించడం. దీనిని మనం 'ఝాన' అని పిలుస్తాం.

ఝాన అంటే ఒక వస్తువుపై కేంద్రీకరింపబడిన మానసిక స్థితి. ఒక వస్తువులోకి, మనస్సు సంపూర్ణంగా లీనమయిందంటే, ఆ మానసిక స్థితిని 'ఝాన' అని అంటాము. ఎప్పుడయితే, మనస్సు, ఒక విషయం మీద సంపూర్ణంగా లీనమవుతుందో, అప్పుడది దాని నుండి దూరం కాలేదు. ఏ ఇతరమైన విషయాలచేత అది ఆకర్షింపబడదు. ఏకాగ్రతతో ఒక విషయం మీద మనసు ఎంతవరకు లగ్నమై ఉంటుందో, అంతవరకు అన్నిరకాల ఆటంకాలు– ఇంద్రియ వాంఛలు, కోపం, ద్వేషం, అయిష్టం, బద్ధకం, జడత్వం (మందత), వ్యాకులతలు, అవిశ్రాంతత, పశ్చాత్తాపం, అనుమానాస్పద సందేహాలు– వంటి అన్ని ఆటంకాలనుండి విముక్తిని పొందగలదు.

ఏకాగ్రతవలన ప్రయోజనాలు:

గాఢమైన ఏకాగ్రతను కలిగిన మనసు, అన్నిరకాల మానసికపరమైన ఆటంకాల నుండి విముక్తం కాగలదు. ధ్యానవిషయం మీద మనసు లగ్నమయి ఉన్నంతవరకు, సాధకుడు, ప్రశాంతంగా, సంతోషంగా మనగలడు. ఇది సమతాధ్యాన ఫలితం.

ఇక్కడ 'సమత' అంటే, ఏకాగ్రత అని అర్థం. ఒక విషయంపై మనసు లగ్నమయి ఉన్నంతవరకు, ఆ మనసు, ప్రశాంతంగా, స్థిరంగా, నెమ్మదిగా ఉంటుంది కాబట్టి. సమతను, ప్రశాంతత, నెమ్మది అని కూడా అనువదించవచ్చు. కాబట్టి సమతా ధ్యానాన్ని, నెమ్మది ధ్యానమని, ప్రశాంత ధ్యానమని, స్థిరత్వ ధ్యానమని లేదా ఏకాగ్రతా ధ్యానమని అనువదించుకోవచ్చు.

సమతా ధ్యాని మూలాలను నశింపజేయలేడు:

అయితే, సమతా ధ్యానాన్ని అభ్యాసం చేసే సాధకుడు, మానసిక ఏకాగ్రతను సాధించిన సాధకుడు, భౌతిక, మానసిక విధానాలను, వాటి ప్రకృతిని అర్థం చేసికోలేడు. ఎందుకంటే, సమతా ధ్యాని, మానసిక, భౌతిక పరమైన ప్రత్యక్ష, పరోక్ష పద్ధతులను అవగాహన చేసికోలేడు గనుక, అతడు ఏ రకమైన మాలిన్యాలను కూడా నిర్మూలించలేడు.

'సమత' ధ్యాన లక్షణం, గాఢమయిన ఏకాగ్రతను పొందటం, సంతోషంగా, ప్రశాంతంగా, జీవించడం మాత్రమే! ధ్యాన విషయం మీద మనసు లగ్నమయి ఉన్నంతకాలం, ఈ స్థితి కొనసాగుతుంది. అయితే, అస్తిత్వం యొక్క మూడు స్థితులను లేదా, శారీరక మానసిక సంబంధమయిన మూడు లక్షణాలను అర్థం చేసికొననంతకాలం, ఎవరుకూడా, మోహం, అత్యాశ, వాంఛ, తృష్ణ, ద్వేషం, కోపం అయిష్టత మొదలయిన మాలిన్యాలను నిర్మూలించలేరు.

ఈ మానసిక మాలిన్యాలను తొలగించుకొననంతవరకు, ఎవరుకూడా, అన్ని రకాల దుఃఖాలనుండి విముక్తులు కాలేరు. అతడు ఇంకా దుఃఖ సముద్రంలో మునిగి ఉంటాడు. ఎప్పుడయితే అతడు, అనిత్యతను లేదా, అశాశ్వతతను, (అనిచ్చ) బాధలను, దుఃఖాన్ని, ఆత్మరాహిత్యాన్ని, (అసత్త) వ్యక్తి రాహిత్యాన్ని, శారీరక, మానసిక స్థితులను అర్థం చేసికుంటాడో, అప్పుడు మాత్రమే అతడు, అన్ని రకాల మాలిన్యాలను సంపూర్ణంగా నిర్మూలనం చేసికొని, సంతోషంగా, ప్రశాంతంగా జీవించగలడు.

సమతను అనుసరించి ఎప్పుడయితే సమతా ధ్యాన సాధకుడు, గాఢమైన ఏకాగ్రతను పొందుతాడో, అప్పుడతడు తన ఏకాగ్రతను పొందిన మనస్సును విపస్సనా ధ్యానానికి మరలించవచ్చు. సమతా ధ్యానం ద్వారా, సాధించిన ఏకాగ్రతలో, ఎటువంటి మానసిక, భౌతిక పద్ధతులనయినా, సులభంగా గ్రహించగలం. అటువంటి ధ్యానం, సమత ద్వారా, పొందిన విపస్సన ధ్యానంగా గుర్తింపబడుతుంది.

గాఢమయిన ఏకాగ్రతను పొందినప్పటికీ ఎటువంటి మాలిన్యాలను నిర్మూలించడానికి సమతాధ్యానం సరిపోదు. మనం 'విపస్సన'ను అభ్యాసం చేయాలి.

కొన్నిసార్లు, విపస్సన ధ్యానం చేత మాత్రమే, మానసిక ఏకాగ్రతను పొందడం కష్టమయినపుడు, మనం కొంతసేపు, ధ్యానవస్తువుపై మన మనసును నిలిపి, ఏకాగ్రతను సాధించే సమతాధ్యానాన్ని ఉపయోగించుకోవచ్చు.

గాఢమయిన ఏకాగ్రతను పొందిన తరువాత, మనం విపస్సన ధ్యానానికి మరలి, మనసుతో ఏది నిజంగా ఉన్నదో, ఏది ఉద్భవిస్తున్నదో అన్న విషయాన్ని గమనించవచ్చు.

విపస్సనా ధ్యాన లక్ష్యం నిబ్బానాన్ని పొందటం లేదా, శారీరక, మానసిక యధార్థస్థితుల అవగాహన ద్వారా, విముక్తిని పొందటం. అందుకోసమే మనం విపస్సనను, అభ్యాసం చేయాలి.

సమత ద్వారా విపస్సనను గాని, లేదా నేరుగా విపస్సనధ్యానాన్ని గాని మనం అభ్యాసం చేయవచ్చు. మనకు తగినంత కాలావకాశం ఉన్నట్లయితే, ఒక సంవత్సరం లేదా అంతకన్న ఎక్కువ కాలమో ఉన్నట్లయితే, మనం, మానసికపరమైన గాఢ ఏకాగ్రతను సాధించడానికి సమతా ధ్యానాన్ని ప్రారంభించవచ్చు. దాని తరువాత, శక్తిమంతమయిన ఏకాగ్రతను కలిగిన ఆ మనసు ఆధారంగా మనం విపస్సనను అభ్యాసం చేయవచ్చు.

విపస్సన

ఈ ప్రాచీన ధ్యాన నైపుణ్యం, బౌద్ధులచే ఆదరింపబడినది. 'విపస్సన' అంటే, వస్తువులను వాస్తవంగా ఉన్నదానిని ఉన్నట్లుగనే చూడటం అని అర్థం. 2600 సంవత్సరాలకు ముందే, బుద్ధ భగవానుడు ఈ ధ్యాన మార్గాన్ని పునరావిష్కరించాడు. ప్రస్తుతం, చాలామంది ఈ విపస్సన ధ్యానాన్ని, 'జీవనకళ'గా గుర్తిస్తున్నారు. ఈ విపస్సన ధ్యాన నైపుణ్యం, మనసును పరిశుభ్రం చేయడంద్వారా, ప్రపంచంలో రోగాలను తొలగిస్తుంది. జాతి, మత, లింగ వివక్షలు లేక అందరూ సమానమయిన ప్రయోజనాలను పొందే విధంగా, ఎప్పుడయినా, ఎక్కడయినా ప్రతి యొక్కరు, ఈ ధ్యానాన్ని అభ్యాసం చేయవచ్చు.

ఈ ధ్యానం వలన, మానసిక మాలిన్యాలు తుడిచిపెట్టబడతాయి. ఎడతెగకుండా, ఈ ధ్యానాన్ని ఆచరించడం వలన ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. ఈ విపస్సన ధ్యాన చరమలక్ష్యం, దుఃఖం నుండి బయటపడటమే కాదు, విముక్తిపథాన్ని చేరుకోవడం కూడా.

విపస్సన ధ్యానం అనేది, స్వీయ పరిశోధనల వలన, స్వీయ మార్పులకు దారితీయగల ధ్యానం. భౌతిక వేదనలను పరిశీలిస్తూ, ఎటువంటి తీర్మానాలకు, ప్రతిచర్యలకు లోనుగాకుండా, శరీరము, మనసు నుండి ఉద్భవిస్తున్న సంవేదనలను గుర్తించినట్లయితే, దుఃఖ స్వరూపాన్ని అర్థం చేసికోవడానికి అవకాశం కలుగుతుంది.

విపస్సన ధ్యానం దుఃఖహేతువులయిన, తృష్ణ, అయిష్టం, అజ్ఞానం అనే మూడు కారణాలను తొలగిస్తుంది. ఈ విపస్సన ధ్యానాన్ని చేయడానికి ముందు, సమతా ధ్యానాన్ని ఆచరించడం మంచిది. ఇది సాధకునికి జీవన సంవేదనలను పరిశీలించడానికి సహాయపడుతుంది.

పరిచయవాక్యాలు:

లేబిరింత్ (Labyrinth) ధ్యానం :

ఈ ధ్యాన నైపుణ్యం గాఢమయిన అంతర మాలిన్య నిర్మూలనకు దారి తీయదు. ఎవరిలో కూడా, ప్రగాఢమైన అంతర్దృష్టిని మేల్కొల్పదు. పైగా బుద్ధుడు చెప్పినట్లు ఈ ధ్యానంలో ఏకాంతవాసానికి వెళ్లవలసిన

ఆ అవసరంలేదు. జిడ్డు కృష్ణమూర్తి చెప్పినట్లు, ఎవరయినా అంతర్‌దృష్టిని 'సంబంధాల అద్దం' లేదా 'బాంధవ్యాల అద్దం' ద్వారానే పొందగలరు. అయితే, లేబిరింత్ అని పిలువబడే ప్రాచీన క్రైస్తవ పద్ధతి, భౌతికపరమైన సంబంధాలను పెంపొందించు కోవడానికి ఉపకరిస్తుంది. అంటే, కొత్త బాంధవ్యాలను ప్రారంభించాలన్నా, లేదా, ఏ ఇద్దరి మధ్యనయినా సంక్షోభాలు ఉంటే, వాటిని తొలగించుకోవాలనుకున్నా, వారు పరస్పరం ఒకరినొకరు అర్థం చేసికునేందుకు ఈ ధ్యానం దోహదపడుతుంది. ఈ లేబిరింత్ ధ్యానాన్ని ఆచరించాలనుకున్న వారు క్రైస్తవులుగా ఉండవలసిన అవసరం లేదు. ఎవరయినా, ప్రాచీనమయిన ఈ ధ్యానాన్ని ఆచరించవచ్చు. ఈ ధ్యాన విధానం ప్రపంచంలోని కొన్ని ప్రధాన క్రైస్తవ ఆలయాల్లో అందుబాటులోనున్నది. (ఉదాహరణకు- శ్రీలంకలోని ఎంజిల్కాన్ చర్చిలో).

ఈ లేబిరింత్ ధ్యానం అనేది కేవలం, త్రోవలు, గీతలను చూపే మేజ్ (Maze) వంటిది కాదు. ప్రజలను కలవరపరిచేదో, లేదా వారి త్రోవను మరిచిపోయేలా చేసేదో కాదు. మనుష్యుల్లో ఆధ్యాత్మికతను వృద్ధిపొందించడానికి ఉద్దేశపూర్వకంగా, రేఖాగణిత భూమికతో నిర్మింపబడిన మార్గమిది. పరిసరాలలోని వృక్షాలను, ముందే రాశులు పేరుకుపోయిన నేలను, సృజనాత్మకంగా మలుచుకోవడానికి ఉపకరించేలా మనం, ఈ లేబిరింత్ ధ్యానాన్ని అభివృద్ధి పరచుకోవచ్చు. వృక్షాలు, కనబడుతున్న సృజనలో భాగం కాబట్టి, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. అది మనకు కొనసాగుతున్న సృజనను, విధిని గుర్తుచేస్తాయి. విడిచిపెట్టబడిన, వస్తువులమూలంగా ఏర్పడిన రాశులు పేరుకుపోయిన భూభాగం, శుభ్రమైన నేలతో, విభిన్నమయిన రూపంతో, దట్టంగా మొలిచిన పచ్చిక తివాచీతో, ఇటుకరాతి గోడలతో నిర్మింపబడుతుంది. కాల్పనికతతో, సహనంతో కూడిన భద్రతవలన, ప్రతియొక్కరు, లేదా ఎవరయినా విశాలపరిధిలో, ప్రయోజకులుగా మారగలరు.

మన ఈ లేబిరింత్ ధ్యానం, విభిన్నరకాలయిన త్రోవలు, గుర్తులతో నిండి ఉన్నది. నున్నటి సిమెంటు, పచ్చిక, ఇసుక, గులకరాళ్ళు, బండలతో విభిన్నంగా నిర్మింపబడిన మార్గాలు, మన జీవనయానంలోని భిన్నమైన అనుభవాలను చెబుతాయి. కాని, మనం, మన పాదాలను నేలపై ఆన్చి, అనుభవాలను, ఎరుకను జాగృతపరచుకుంటూ, నిదానంగా నడవాలి.

పరిసరప్రాంతాల పరిశీలన, ప్రతిఫలనాలకు సమయాన్ని కేటాయించుకోవాలి. పాడుబడిన బావి, మనకు, మన తెగిన సంబంధాలను గురించో, మనకు దూరమైన వారిని గురించో ఆలోచించేలా చేయవచ్చు. మనలోపలి వ్యక్తిని, మనం చేరుకున్నట్లయితే, ఈ లేబిరింత్ ధ్యానం వలన కొంత ప్రయోజనాన్ని పొందినట్లుగా భావించవచ్చు. 'నేనెవరిని?', 'నేను ఏ విధంగా తయారుకాగలను?', 'నేను తల్లిదండ్రుల, బిడ్డల, భార్య లేదా భర్త, స్నేహితుల, విభిన్న మత సంబంధాల వలన నేను ఆనందంగా ఉన్నానా?' మొదలైన ప్రశ్నలను అనుభూతం చెందాలి. మనం గుట్టమీద గాని, బావి సమీపంలో గాని, కూర్చుని ధ్యానం చేసికోవడానికి సమయాన్ని కేటాయించుకోవాలి. నీ ప్రగతిని గురించి జ్ఞాపకాలను వ్రాసుకోవడం, నీకు సాయపడగలదు. మనం ఒక ప్రార్థనతో గాని, లేదా నిశ్శబ్దతతోగాని, ఈ ధ్యానాన్ని ప్రారంభించవచ్చు.

ముగింపుమాట:

ఈ లేబిరింత్ మార్గంలో, నువ్వు నడిచిన తరువాత, ఈ ధ్యానం నీకెంతో ఇవ్వగలదని, అయితే దానికి కూడా కొంత సమయం పడుతుందనీ, నీవు గ్రహిస్తావు. మళ్లీ, మళ్లీ స్వేచ్ఛగా నడవడానికి స్వతంత్రించు. లేబిరింత్ మార్గంలో, నీ అంతట నీవు నడవడానికిగాని, నీ జంటతో గాని, కుటుంబసభ్యులతోగాని, దగ్గరి స్నేహితులతోగాని కలిసి నడవడానికి స్వతంత్రించు. ఆదుర్దాగా నున్నపుడో, శోకంతో నున్నపుడో, అపరాధభావనతో

నున్నపుడో లేదా, దుఃఖంగానున్నపుడో, ఈ మార్గంలో నడవడానికి స్వతంత్రించు. నీవు, ఎవరికయినా కృతజ్ఞతలను చెప్పుకోవాలనుకున్నపుడో, ఎవరికయినా ఏదయినా ప్రత్యేకంగా చెప్పికోవాలనుకున్నపుడో, ఎవరితోనయినా నీకు అపార్థాలు ఏర్పడినపుడో వారితో కలిసి నడవడానికి స్వతంత్రించు. ప్రపంచంలోని కొన్ని ప్రధాన క్రైస్తవ ఆలయాలను పోలిన ఈ తోటలో, చుట్టూ స్వేచ్ఛగా తిరగడానికి లేదా ఏదయినా ఒక చోట నిశ్శబ్దంగా కూర్చుని ప్రశాంతంగా ధ్యానం చేసికోవడానికి స్వతంత్రించు.

జపమాలతో ధ్యానం:

విభిన్న సంస్కృతులు గల ఆసియా, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యదేశాలు, అనటోలియన్, ఒట్టోమన్, టర్కిష్, గ్రీకు, భారత్ వంటి దేశాలలో, ధ్యానంకోసం, ప్రతికూల శక్తులనుండి రక్షణకోసం, ఒత్తిడిని తగ్గించడం కోసం పూజ పూసలు లేదా శోక పూసలు అనబడే జపమాలలను వాడుతున్నారు.

ధ్యానంలో ఈ జపమాలలను ఉపయోగించడం అన్న ఆచారం, మానవ చరిత్ర అంత ప్రాచీనమయినది. ఇంచుమించుగా ప్రతి సంస్కృతిలో కనిపించే, ఈ జపమాలలను వాడటం అన్న ఆచారం, యథాలాపంగా ఏర్పడినది కాదు.

ఈ ప్రార్థనా (పూజ), లేక శోక పూసలు ఆధిభౌతికమయిన, మానసికమయిన ప్రభావాలను, వాటిని ఉపయోగించేవారిపై చూపుతాయని, పైగా ప్రతికూల శక్తులను హరిస్తాయని, నమ్ముతారు.

ఈ జపమాలలు సానుకూల వాతావరణంతో కూడిన, జీవితాన్ని నీకు కలిగిస్తాయి. ప్రాచీనకాలం నుండి, అందమైన రంగులు, మెరుగులు కలిగిన విలువయిన రాళ్ళతో కూడిన జపమాలలు ప్రజలను ఆకర్షిస్తాయి. అప్పటినుండి ప్రతి రత్నానికి, ఒక ప్రత్యేకమైన అర్థం చెప్పబడుతున్నది.

ఉదాహరణకు, మరకతాన్ని ధరించిన మనుష్యుల ఎముకలు విరగవని నమ్మే రెడ్ ఇండియనులు, యుద్ధ సమయంలో ఈ మరకత మణిని పొదిగినకవచాలను ధరిస్తారు. 'అజ్ టెక్' అనే గిరిజన తెగవారికి మరకతం చాలా ముఖ్యమయిన రత్నమని తెలుస్తోంది. రెడ్ ఇండియనుల సంస్కృతిలో, దాహం తీర్చడానికి, స్ఫటికం చాలా విలువయినదన్న విశ్వాసంతో దానిని ఉపయోగించడం కనిపిస్తున్నది. ప్రాచీన గ్రీకు సంస్కృతిలో, 'గరుడపచ్చ' మణి, మనుష్యులను త్రాగుడు నుండి రక్షించగలదన్న విశ్వాసంతో, పానపాత్రలను ఈ గరుడ పచ్చతో తయారు చేస్తారు.

జపమాలలు, ధ్యానం కోసం ఉపయోగించబడతాయి. 'హారం' అనే అర్థం గల ఈ జపమాలలు, (సంస్కృతంలో, 'మాల' అని, టిబెట్టు భాషలో (ట్రెంగ్వా = దండ), కొన్ని పూసలతో కూడి హిందువుల చేత, బౌద్ధులచేత ఉపయోగింపబడుతున్నవి. మంత్రం, లేదా దేవుని నామాలను మననం చేసేటపుడు, లేదా ధ్యానించేటపుడు, లెక్క కోసం ఈ జపమాలలు వాడబడతాయి. సంస్కృతంలో ఈ అభ్యాసాన్ని, 'జపం' అంటారు. ఈ జపమాలలు, 16, 27, 54 లేదా 108 పూసలతో కూడి ఉంటుంది.

టిబెట్టు బౌద్ధంలో 108 పూసలున్న మాలలను వాడటం సంప్రదాయం. కొంతమంది సాధకులు, 21 లేదా 28 పూసలున్న మాలలను సాష్టాంగ నమస్కారాలపుడు వాడుతారు. ఒకవేళ, ఎక్కడ ఒకే మంత్రాన్ని రెండుసార్లు జపించడం జరిగినా, ఆ తప్పులను సవరించడానికి, 108 పూసలున్న మాల 100 సంఖ్యగా లెక్కింపబడుతుంది.

నేనిక్కడ ఇచ్చిన కొన్ని విభిన్న ధ్యాన మార్గాలలో, సాధకులు తమకు తగిన మార్గాన్ని ఎన్నుకోవచ్చు.
గమనిక: ఇది ఈ శాఖ, అది మరొక శాఖ అన్న భేదాలను పాటించకుండా, లభిస్తున్న, వనరులనుండి, ప్రతియొక్కరు తమ అంతర్దృష్టిని, గురించి తెలిసికొని, అభివృద్ధి పరచుకోవాలని బుద్ధ భగవానుడు అంటాడు. నువు ఫలానా శాఖకు, లేదా పద్ధతికి చెందినవాడవని గుర్తింపును పొందినట్ల యితే, ప్రతి యొక్కరినుండి, తప్పక నేర్చుకోవలసిన విషయాలను నీవు నేర్చుకోలేక, మార్గాన్ని తప్పుతావు. ఇదే అన్ని రకాల సంఘర్షణలకు మూల కారణమవుతుంది.

ధార్మిక స్వాతంత్ర్యం, సామాజిక స్వాతంత్ర్యం

కొన్ని క్షణాలలో, పరస్పరం నాశనం చేసికోగలిగిన అణుబాంబులను, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నేడు ప్రపంచంలోని ఇంచుమించు అన్ని దేశాలు తయారు చేస్తున్నాయి. అయితే, ప్రపంచ ప్రజలు, త్రాగునీటి పరిశుభ్రత కోసం, వాతావరణ కాలుష్య నివారణ కోసం, సమతుల్య ఆహారం కోసం, మానవ హక్కుల సక్రమ వినియోగం కోసం, పేదరిక నిర్మూలన కోసం, పెరిగిపోతున్న అనైతికతతో, అవినీతితో పోరాటాన్ని కొనసాగి స్తూనే ఉన్నారు. ఇటువంటి వాతావరణం, ఒక వ్యక్తికి, ఆధ్యాత్మిక స్వేచ్ఛతోగాని, సామాజిక స్వేచ్ఛతో గాని జీవించగలిగిన స్థాయిని కల్పించలేదు.

ఎనిమిది వందల సంవత్సరాలు విదేశీయులపాలనలో నుండి స్వాతంత్ర్యాన్ని పొందిన భారతీయుల జనాభా సుమారు 1.4 బిలియనులకన్నా ఎక్కువే! 75 సంవత్సరాల తరువాతకూడ, భారతీయులమైన మనం, సక్రమమైన ప్రవర్తనను అలవరచుకోలేకపోతున్నాము. ప్రాథమికంగా కలహాశీలురుగా ఉన్న వ్యక్తులు, అనైతికతను కలిగి, దౌర్జన్యపరులుగా ఉన్నారు. భారతీయ సమాజంలో, ఆధ్యాత్మిక స్వేచ్ఛ, సామాజిక స్వేచ్ఛ- రెండూ తరచూ దుర్వినియోగపరచబడుతున్నాయి. స్థలము, సామాజిక స్థితి, వర్ణం, మతం, వర్గం మున్నగు అంశాల ఆధారంగా మనుష్యులు విభిన్న రకాలుగా విభజనను పొందుతున్నారు. నైతిక పునాదులు లేని చట్టాల ఆధారంగా మోసగాళ్ళు మాత్రమే ప్రయోజనాలను పొందుతున్నారు. తెలివితేటలతో అభివృద్ధి చెందుతున్న మనిషిపై రాళ్లు విసిరే పని తప్ప ఇది వేరుకాదు. కాబట్టి, దేశప్రజలందరికీ ఆధ్యాత్మికపరమైన స్వేచ్ఛ, సామాజికపరమైన స్వేచ్ఛ రెండింటి అవసరమూ ఉన్నది.

ధార్మిక, సామాజిక స్వాతంత్ర్యానికి సంబంధించిన విషయాలు ఈ లక్షణాలను కలిగి ఉంటాయి. మొదటిలక్షణం, స్వాతంత్ర్య స్వరూపం. రెండవది, స్వాతంత్ర్యంలోని రకాలు. ధార్మిక, సామాజిక పరమైన రెండు రకాల స్వాతంత్ర్యాలూ ఉండాలి. మూడవ లక్షణం, ఈ రెండు స్వాతంత్ర్యాల మధ్యగల సంబంధం. అంతేగాక, సామాజిక స్వాతంత్ర్యం లేకుండా, ధార్మిక స్వాతంత్ర్యాన్ని పొందటం వీలవుతుందా?, లేదా ధార్మిక స్వాతంత్ర్యం లేకుండా, సామాజిక స్వాతంత్ర్యాన్ని సాధించడం వీలవుతుందా? అన్న విషయం. ఈ చివరి విషయం కేంద్రంగానే, ముఖ్యంగా ఈ రెండు స్వాతంత్ర్యాల మధ్యనున్న సంబంధాల చుట్టూనే..... చర్చలు జరుగుతుంటాయి.

మనమిప్పుడు స్వతంత్రానికి, స్వేచ్ఛకు మధ్యగల సంబంధాన్ని చూద్దాం. మొక్కలయినా, జంతువులయినా, మానవులయినా జీవరాశికి స్వతంత్రత అనేది జీవితానికి, జీవన పరిణామ క్రమానికి అత్యంత అవసరమైన లక్షణం. జీవరాశిలో స్వతంత్రతకు సంబంధించిన భేదాలు, వాటి నిర్మాణ భేదాలపై ఆధారపడి ఉంటాయి. మొక్కలు, జంతువులకు మించిన స్వతంత్రం మనిషికి అవసరమవుతుంది. పెరగడం, నైపుణ్యాన్ని

సంతరించుకోవడం అన్నవి జీవరాశి సహజ లక్షణాలు. ఎదుగుదల లేకుండా స్థిరంగా ఉండిపోవడం, జీవరాశి లక్షణం కాదు. పదార్థాలు పెరగలేవు గనుక, వాటికి స్వతంత్రత అవసరం లేదు. కాని, జీవరాశి ఎదుగుదలకు, పరిణామక్రమానికి మూడు విషయాలు అవసరమైనవి ఉన్నాయి. అవి, పోషణ, రక్షణ, స్వతంత్రత అన్నవి.

జీవరాశి ఎదుగుదలలో, పోషణ అనేది ఎన్నో సత్యాలతో కూడుకొని ఉన్న అంశం. ఉదాహరణకు, ఒక మొక్క ఎదుగుదలకు, మట్టి, నీరు, సూర్యరశ్మి అవసరమవుతాయి. ఒక జంతువు ఎదుగుదలకు ఆహారం, ఇతర విషయాలు అవసరమవుతాయి. మొక్కలకు, జంతువులకు అవసరమైనవన్నీ మనిషికి కూడా అవసరంకావడంతో బాటు, పోషణ క్రింద, వరుస క్రమంలో మరికొన్ని అవసరాలు, ముఖ్యంగా ఆహారం, బట్టలు, ఇల్లు వంటివి కూడా చేరుతాయి. ఆహారం లేకుండా ఒకరు ఎలా బ్రతకగలరు? జీవంతో నున్న ప్రాణికి, ఆహారం, నీరు అనేవి అత్యంత ఆవశ్యకమైన సంపదగా గుర్తించాలి.

జీవరాశికి అవసరమయిన రెండవ లక్షణం, రక్షణ. రక్షణ అంటే అర్థం ఏమిటి? అంటే బ్రదకడానికి అవసరమయినంత మేరకు సాధనాలు, పరిసరాలను కలిగి ఉండటం. ఈ అవసరమైన సాధనాలు, శత్రువుల చేతగాని, ఇతరుల చేతగాని వారికి దూరం చేయబడకూడదు. దౌర్జన్యానికి వ్యతిరేకంగా, జీవనం, సంపద, ఆరోగ్యం, వస్తువులు మొదలైనవాటి భద్రత నిమిత్తం, పోషణకు తరువాత రక్షణ అవసరమవుతుంది.

మూడవ అవసరం, స్వతంత్రత. స్వతంత్రత అంటే అర్థమేమిటి? ఎదుగుదలలో ఎటువంటి అడ్డంకులు లేకపోవడమని దానికి అర్థం. ఉదాహరణకు, ఒక మొక్క ఎదుగుదలకు, పోషణ, రక్షణలతోబాటు, అన్ని అడ్డంకులు తొలగిన, అనుకూల వాతావరణాన్ని మనం అందించ గలగాలి. ఒక మొక్కను నువ్వు ఇంటి కప్పుకింద నాటావంటే, ఆ మొక్క పూర్తిగా ఎదగడానికి తగినంత స్థలం లేకుండా, నువ్వు దాని పరిణామక్రమాన్ని నిరోధిస్తున్నావన్నమాట. ఇదేం స్వాతంత్ర్యం? ఇది అడ్డంకులు లేని ఎదుగుదల ఎలా అవుతుంది? ఎదుగుదలకు, నైపుణ్యానికి ఆటంకంగానున్న, అడ్డంకులన్నిటితో పోరాడి, తొలగించుకుని ఎవరయితే ఎదుగుతారో, వారే నిజమైన స్వతంత్రులయిన మానవులు. అడ్డంకులకు వారు లొంగిపోరు.

స్వతంత్రతలో నున్న భేదాలను గురించి మనమిపుడు చూద్దాం. మానవజాతి జీవనం అనేది, ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నది. అది స్త్రీ పురుషులలో ఎవరి జీవనమైనా, వ్యక్తిగత జీవన సంక్లిష్టతలకు తోడు, సాంఘికంగా మన్నవలసిన జీవనాలు. మొక్కలు, జంతువులకన్నా, మనుష్యులు భిన్నమయినవారు. వారికి రెండు విధాలుగా విభజింపదగిన మరికొన్ని అవసరాలు ఉన్నాయి. అందులో ఒకటి, సామాజిక స్వాతంత్ర్యం. సామాజిక స్వాతంత్ర్యం అంటే ఏమిటి? ఇతరుల ఎదుగుదలను అడ్డుకోకపోవడం, వారిని బంధించి, వారి కార్యకలాపాలపై నిఘా ఉంచక పోవడం, వారిని దోచుకోకపోవడం, బానిసలుగా చేసికోకపోవడం, తమప్రయోజనం కోసం సాటి మనుష్యుల శారీరిక, మానసిక శక్తులను దోపిడీ చేయకపోవడం వంటి సత్సంబంధాలను సమాజంలోని ఇతర వ్యక్తులలో కలిగి ఉంటే అదే నిజమైన స్వతంత్రత అని అర్థం. ఎన్నో రకాలకు ఆలవాలమయిన సామాజిక స్వాతంత్ర్యంగా ఇది గుర్తింపబడుతుంది.

చరిత్రపరంగా పరికిస్తే, మానవశక్తిని కించపరచే గొప్ప అవరోధాన్ని మానవచరిత్రలో గమనించగలం. శక్తిమంతులయినవారు, ఇతరులను లోబరచుకుని, బానిసలుగా చేసికుని, వారి జీవనాన్ని, శ్రమ ఫలితాలను దోచుకొని తమ సంతోషంగా మార్చుకోవడం, చరిత్రలో కనిపిస్తుంది. ప్రపంచ ప్రజలు, ముఖ్యంగా భారతీయులు భౌతికవాదం, సామ్యవాదం మున్నగు సిద్ధాంతాలతో కూడిన జీవనాన్ని గడుపుతూనే, తమకు అవసరమయిన

దానికన్న, ఎక్కువ ధనాన్ని సంపాదిస్తున్నారు. వారు, ధన సంపాదన విషయంలో తాము ధనవంతులు కావడానికి నైతికతను ఒక అడ్డంకిగా భావిస్తున్నారు. ఇప్పుడిప్పుడే కొందరు ఆధ్యాత్మికవైపు మరలుతున్నారు. ఇటువంటివారే అనైతిక మార్గాన్ని తలక్రిందులుచేస్తున్న వారు!

దోపిడీ, పీడన అంటే అర్థం తెలుసా? ఇతరుల ప్రయోజనాలను తాము అనుభవించడం, అని వాటికి అర్థం. స్త్రీ, పురుషులు ఎవరయినాగాని, వారి అవసరం, ఫలవంతమైన వృక్షం అనుకుంటే, వారి శ్రమ, ఆలోచనలు అన్నవి ఆ వృక్షఫలాలు. ఈ పంట, అంటే వారి శ్రమ, ఆలోచనలు వారికే సొంతమయినవి. అయితే ఇతరులు వారికి సొంతమయిన ఈ ఫలితాలను దోచుకుంటే, మనమా వ్యక్తి ఇతరులచే దోచుకోబడినాడని అంటాం. చరిత్రమొత్తంలో అటువంటి దోపిడీలు, ఒక వ్యక్తిచేత, మరొక వ్యక్తి దోచుకోబడటం, ఒక జాతి ప్రజలచేత, మరొక సమూహపు ప్రజలు దోచుకోబడటం, లేదా వారిని బానిసలుగా చేసికోవడం కనిపిస్తూనే ఉన్నది. లేదా వారి అవకాశాలు దోచుకోబడటం, తన్మూలంగా దోపిడీకి గురి అయిన వారినుండి దోచుకునేవారు అత్యంత ఎక్కువగా ప్రయోజనాలను పొందటం గమనించగలం. ఉదాహరణకు, ఒక చిన్న భూభాగం ఇద్దరు వ్యక్తులకు సొంతమయి ఉంటే, అందులో బలవంతుడయినవాడు మొత్తం భూమిని సొంతం చేసికొని, బలహీనుని తరిమికొట్టడమో లేదా, బానిస రూపానికి ప్రతీకగా మార్చివేయడమో జరుగుతుంది.

ప్రస్తుత ప్రపంచం కూడా, సామాజిక స్వాతంత్ర్యాన్ని పవిత్రమైనదిగా గుర్తిస్తోంది. మానవహక్కులకు సంబంధించి, విశ్వప్రకటనను చదివి నట్లయితే, ప్రపంచం యుద్ధాలు, రక్తపాతాలు, దురదృష్టాలకు కారణం, వ్యక్తులు ఇతరుల సామాజిక స్వాతంత్ర్యాన్ని గౌరవించకపోవడమే అని గమనించగలం. ప్రవక్తల తర్కం ఆధునిక తర్కానికి చాలా దూరంగా ఉన్నదా? స్వేచ్ఛ పవిత్రమైనదే. అవును అది చాలా పవిత్రమైనదే!

సామాజిక స్వేచ్ఛ పవిత్రమైనది అన్నమాట సత్యం. మరొకవిధమైన స్వేచ్ఛ ధార్మిక స్వతంత్రత. ప్రవక్తల సిద్ధాంతానికి మానవ సిద్ధాంతానికి మధ్యగల భేదం, ప్రవక్తలు, మానవులకు అన్నిటికన్నా అత్యంత విలువైన ధార్మిక స్వతంత్రతను, దానితోబాటే సామాజిక స్వతంత్రతను కలిగిం చేందుకే ఉద్భవించారు. ధార్మిక స్వేచ్ఛ, సామాజిక స్వతంత్రత రెండూ పవిత్రమైనవే, రెండవదిలేక మొదటిదయిన ఆధ్యాత్మిక స్వేచ్ఛను సాధించడం వీలుకాదు. ఆధునిక మానవసమాజంతో వచ్చిన చిక్కు ఏమిటంటే, ధార్మిక స్వతంత్రతకై ప్రయత్నించకనే, సామాజిక స్వేచ్ఛను భద్రపరచుకోవాలనుకోవడం! నిజానికి ఇది క్లిష్టతరమైన పని, ఎందుకంటే, ప్రవక్తలవలన, విశ్వాసం వలన, పవిత్ర గ్రంథాలను అనుసరించడం వలన, సంబుద్ధుడైన బుద్ధుని బోధనలు అనుసరణ వలన మాత్రమే ధార్మిక స్వాతంత్ర్యం లభ్యం కాగలదు.

మానవ సమస్యలన్నీ ధార్మికపరమైనవే! పరిష్కారాలు కూడా ధార్మికత వలన పొందగలిగినవే! "కాబట్టి, మన సమాజానికి లోతైన ధార్మిక పునాది కావాలి గాని భౌతికపరమైనది గాదు". సత్యాన్ని అనుసరించే నిజమైన వ్యక్తి, ధార్మికపరమైన వ్యక్తిగా, న్యాయము, సమ్మత మైన, విశ్వసనీయమైన వ్యక్తిగానే ఉంటాడు. ఎవరయితే న్యాయబద్ధమైన, నీతియుక్తమైన జీవితాన్ని, వ్యక్తిగతంగా త్రికరణ శీలతతో గడుపుతారో, అటువంటి వారు విశాలమైన సమాజానికి కూడా శక్తిని అందించగలవారుగా ఉంటారు.

ప్రస్తుతం, ధార్మిక స్వతంత్రత అంటే ఏమిటో చూద్దాం. విభిన్నమయిన శక్తులతో, బలంతో, ఆకలితో, కోపం, అత్యాశ, లక్ష్యం, అత్యధిక ప్రేమ మున్నగు అధిక లక్షణాలతో కూడిన ఒక సంక్లిష్టమైన మూర్తి మానవుడు. మరోవైపు, కారణం, మానసిక, నైతిక అంతర్ముఖీనతలు అనుమతించబడినవి. అంతర్ముఖీనంగా గాని, ధార్మికంగా గాని ఒక వ్యక్తి స్వీయ స్వాతంత్ర్యాన్ని లేదా బానిసత్వాన్ని అనుభూతం చేసికోగలడు. అది

అత్యాశకు సంబంధించినదిగాని, మోహసంబంధంగాని, కోపం లేదా అత్యధిక ప్రేమకు సంబంధించిన బానిసత్వంతోగాని, లేదా ఈ విధమైన అన్ని దుష్ట స్వభావాలనుండి స్వేచ్ఛను పొందిగాని ఉండవచ్చు. ఒక కవి చెప్పినట్లు, నేను నిజాన్ని చెబుతాను. దానివలన సంతోషాన్ని పొందు తాను. నేను ప్రేమకు బానిసను, ఇహపరలోకాలు రెండింటిలో స్వేచ్ఛాజీవిని. ఆధ్యాత్మిక స్వతంత్రతను గురించి క్రైస్తవగ్రంథంలో ఒక కథ ఉన్నది. వికలమనస్కుడైన ఒక ఖైదీ, చివరకు జైలర్ ను ఎదిరించాలని, అప్పుడా జైలరు స్వీయ రక్షణకోసం తన్ను చంపుతాడనీ, ఆ విధంగా ఆ దుఃఖంనుండి బయటపడవచ్చుననీ తలచాడు. జైలర్‌ను ఎదిరించడానికి తనను తాను సమాయత్తం చేసికున్న ఆ ఖైదీ, తనను బంధించి ఉన్న చెరశాల తలుపు గొళ్లెంను పరిశీలించి, అది తాళం వేయబడలేదని గ్రహించాడు. పరిశీలనమీద, ఆ గొళ్లెం, ఎపుడూ తాళం వేయబడలేదని తెలిసికున్న ఆ ఖైదీ, ఆ తలుపును తెరచి, చూస్తూకూడా తనను పట్టించుకోని గార్డుల మధ్యనుండి నడచుకుంటూ ఇంటికి చేరి, సంతోషంగా తన శేష జీవితాన్ని గడిపాడు.

EMMET FOX అన్న రచయిత ఈ విషయాన్ని ఇలా వివరిస్తాడు. "ఈ పనిని అతడు అన్నేళ్లలో ఎప్పుడయినా చేసిఉండవచ్చు. కాని అతడు చేయలేదు. అతడు రాయో, ఇనుమో కాదు, ఒక ఖైదీ మాత్రమే! అయితే తప్పుడు విశ్వాసంతో నున్న ఒక ఖైదీ. అతడు బంధింపబడి ఉండలేదు. కాని, తాను బంధింపబడి ఉన్నానని అతడు అనుకున్నాడు. ఇది ఇతిహాసమో పురాణమో కాదు. అదొక రకమైన బోధన మాత్రమే!"

"మనందరం, ఏదో ఒక రకమైన చెరశాలలోనే నివసిస్తున్నాము. కొందరు ఒక రకమైన చెరశాలలో కాగా, మరికొందరు మరొకరకమైన చెరశాలలో. కొందరం తాళం వేయబడిన చెరశాలలో, మరికొందరు పశ్చాత్తాపం, కోపం వంటి చెరశాలల్లో...! కొందరు అంధత్వం, నిరాధారమైన భయాలు అన్న చెరశాలలో ఉంటే, మరికొందరు వ్యాధులు అనే చెరశాలలో బంధింపబడి ఉన్నారు. కానీ చెరశాల అనేది, మన ఆలోచనలకు సంబంధించినవే గాని, ప్రకృతికి సంబంధించినది గాదు."

ఒక వ్యక్తి గొప్ప మానవతావాదిగా ఉండవచ్చు. అతడు, విషయ నిష్ఠతను, బానిసత్వాన్ని త్రోసిరాజని, సామాజిక స్వతంత్రతను కలిగి, సామాజిక స్వేచ్ఛను నైతిక వర్తనతో కాపాడుకుంటాడు. అటువంటి వ్యక్తి, తన అంతఃకరణను, ఆత్మను, బుద్ధికుశలతను స్వతంత్రంగా ఉంచు కుంటాడు. ఈ విధమైన స్వాతంత్ర్యం', 'స్వీయ పవిత్రత' లేదా, 'సుశీలత' అని మతపరంగా పిలువబడుతుంది.

మానవులు, ఆధ్యాత్మిక స్వతంత్రతలేకుండా, సామాజిక స్వతంత్రతను కలిగి ఉండగలరా? అంటే, వారు, తమ మోహానికి, కోపానికి అత్యాశకు బానిసలుగా ఉంటారా? అదే సమయంలో, ఇతరుల స్వాతంత్ర్యాన్ని గౌరవిస్తారా? ఈ రోజుల్లో వారు 'అవును' అనే చెబుతారు, కాని ఆచరణలో తమ అత్యాశకు, ఆగ్రహానికి, మోహానికి ప్రతియొక్కరు బానిసలుగా ఉండాలని కోరుకుంటారు. అదే సమయంలో సామాజిక స్వేచ్ఛను గౌరవిస్తారు. ఇది వ్యతిరిక్తమైన ఆలోచనలతో బాధపడుతున్న మానవ సమాజంలోని ఎన్నో ఉదాహరణలలో ఒకటి మాత్రమే!

ప్రాచీన కాలంలోని మానవులు, స్వతంత్రంపట్ల, గౌరవంలేక, అదే భావనతో పయనించేవారు. ఎందుకని? వారు అజ్ఞానులు కనుకనా, లేక ఇతరుల స్వతంత్రతను దోచుకునే వారు కనుకనా...? వారు జ్ఞానాన్ని పొందిన తరువాత, ఇతరుల స్వతంత్రతను గౌరవించే అవసరాన్ని గుర్తించారని చెప్పగలమా?

ప్రాచీన మానవులు, ఇతరుల స్వేచ్ఛను హరించడం, వారి అజ్ఞానం వలనేనా అని మనం తెలిసికోవాలి. కాదు. అజ్ఞానం చేతగాని, జ్ఞానంచేత గాని చేయగలిగింది ఏవీ లేవు. తమ అభిలాషలను పూర్తిచేయగల తమ పనులనుగూర్చి వారికి పూర్తి అవగాహన ఉన్నది. ఇతరుల హక్కులను, స్వేచ్ఛను గౌరవింపలేకపోవడం అన్నది, ఆనాటి న్యాయశాస్త్రాన్ని అనుసరించి జరిగినదేనా? అయితే చట్టంలో మార్పు, ప్రవర్తనలో మార్పును తేగలదా? ఉదాహరణకు, అమెరికాలోని బానిస విధాన నిర్మూలనం, బానిసత్వాన్ని నిజంగా రూపుమాపిందా? లేదా, పూర్వోత్తర సందర్భాలను మార్చకనే, బానిస విధాన రూపాన్ని మాత్రం మార్చిందా? ఇతరుల స్వేచ్ఛను గౌరవింపకపోవడం అనే ఈ విధానానికి, వారి ఆలోచనలు, వారి తాత్వికతే ప్రధాన కారణమా?

ఇవి ఏవీ కావు. స్వీయ అభిలాష తప్ప, మరేది కాదు. ఒక వ్యక్తిగా, మనిషి, వీలయినన్ని సాధనాలనుండి, ఎక్కువ ప్రయోజనాన్ని తన కొరకు పొందాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. వంట చెరకు, రాళ్ళు, ఇనుము, సాధు జంతువులు.. వీటిని ఉపయోగించుకున్నట్లుగానే ఇతర మానవులను కూడా, అటువంటి సాధనాలుగానే పరిగణించి, అతడు వారిని తన లాభం కోసం వాడుకుంటాడు. ఒక చెట్టును నాటినా, నరికినా అతడు దానిని చెట్టుగనే చూస్తున్నాడు. అది తనకు ఎంతవరకు ఉపయోగపడుతుందో అని మాత్రమే ఆలోచిస్తాడు. అతడొక గొర్రెను బలియునట్లు చేశాడంటే, తన ఆహారం కోసం అంటే, తన స్వార్థం కోసం, దానిని నరికివేస్తాడు. ఇతరమానవులను బానిసలుగా చేసికోవడం, వారి హక్కులను దోచుకోవటం అన్నవి, తనకు తాను ప్రయోజనం చేకూర్చుకునేందుకే. ఈ విధంగా ఇతరుల స్వేచ్ఛను హరించడంతో బాటు అతని ప్రతిచర్యా, అతని సొంతలాభం కోసం అతడేర్పరచుకున్నదే! ఈ రోజు మనిషి కూడా అలాగే ఉన్నాడా? అవును. అలానే ఉన్నాడు. అతడేమాత్రం మారలేదు. పైగా, ఇంకా ఎక్కువ లాభాలను మ్రింగడానికి అతని నోరు ఇంకా విశాలంగా తెరువబడే ఉన్నది.

విజ్ఞాన శాస్త్రంగాని, చట్టంగాని అత్యాశను నిబద్ధించలేవు. దాని రూపాన్ని మార్చటం మాత్రమే అవి చేయగలిగిన పని. కొత్త సీసాలో పాత సరకే. ప్రాచీనమానవుడు, బయటకు మాట్లాడే స్వభావం కలవాడు, అతడింకా కపటస్థితిని చేరుకోలేదు.

నీతిబద్ధమైన ప్రవర్తన, వ్యక్తిని అన్నిరకాల బానిసత్వాలనుండి రక్షించి, అతడికి లేదా ఆమెకు ధార్మిక స్వేచ్ఛను కలిగించి, ఇతరులకు స్వాతంత్ర్యాన్నిచ్చేలా వారిని తయారు చేస్తుంది.

ధర్మసైనికుని భాగస్వామ్యం, ఈ నాటి సమాజం, ముఖ్యంగా అభివృద్ధిచెందని దేశాలకు సరిగ్గా సరిపోతుందని నా ఉద్దేశ్యం. కాబట్టి ధర్మ సైనికులందరూ, ఆధ్యాత్మిక సామాజిక స్వాతంత్ర్యాన్ని పొందేవరకు, పోరాటాన్ని కొనసాగించాలి. మానవులందరికీ ప్రాథమిక హక్కులను అందేలా చేయగల సంస్థను స్థాపించడమే నా ప్రధానలక్ష్యం.

గమనిక:

ఈ వ్యాసం, Ansarijan Publications, Islamic Republic of Iran వారిచే ప్రచురింపబడిన Murtada Mutahhari (1920–1979) గారి ఉపన్యాసాల ఆధారంగా వ్రాయబడినది.

❖ ❖ ❖

5. సామాజిక బౌద్ధ ధర్మం ద్వారా ఏర్పడే శక్తిసామర్థ్యాలు
(Empowerment through Socially Engaged Buddhism)



నేడు ప్రపంచం ఎన్నో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నది. ప్రపంచ వ్యాప్తంగా కుటుంబపరంగా, వ్యక్తిపరంగా ఎన్నో సవాళ్ళు ఎదురైనాయి, చెప్పలేని బాధలను అనుభవిస్తున్నాము. ఈ ఆటు పోటులో మనందరి పాత్ర కూడా వుందని మనం గుర్తించాలి. పేదరికం, ఆర్థిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం, మితిమీరిన సైనికీకరణ – యుద్ధాలు, పెరిగి పోతున్న అవినీతి వీటన్నిటి వల్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభాలనే కాదు, పర్యావరణ సంక్షోభాన్ని కూడా ఎదుర్కొంటున్నాం.

ఈ సంక్షోభాలన్నిటికీ మూలం నైపుణ్యత కొరవడటం, విషపూరిత భావజాలం, దోపిడీలు, వివక్షతలతో కూడిన జీవన విధానం, దురాశ, నైతిక పతనం మొదలగునవి అని చెప్పుకొనవచ్చును. వీటి వలన మానవ జీవితాల్లో విధ్వంసం జరిగింది, బతుకులు పాడైపోయినాయి.

వీటినుండి బైటపడాలంటే ఆచరణాత్మక దయాపూరిత ఆలోచనలు గల బౌద్ధం లాంటి ధార్మిక దృక్పథం కావాలి, ఆవిర్భావం జరగాలి. ఆ ధార్మిక దృక్పథంతో అనేక సమస్యలతో, అసమానతలతో సతమతమతున్న భారతదేశాన్ని మనం అన్ని విధాలుగా సంస్కరించుకోవాలి. అప్పుడే న్యాయశోభితమైన, శాంతియుత సమాజంను నిర్మించుకొని అందరం సుఖంగా జీవించగలుగుతాము. ఇంకా శాంతియుతంగా, సామరస్యంగా ముందుకు పోగలుగుతాము. అలా చేయకపోతే... భారతదేశంలో భవిష్యత్ తరాలు ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. దు:ఖాన్ని అనుభవించవలసి వస్తుంది.

ఇంచుమించు భారతదేశంలోని అన్ని రాజకీయ, సామాజిక వర్గాలు ఆర్థికపరమైన అభివృద్ధిని గురించి మాట్లాడుతూనే ఉన్నాయి. దీనిద్వారా, రాజకీయ నాయకులు శాంతియుతమైన, న్యాయబద్ధ మైన సమాజాన్ని నిర్మించాలనుకుంటున్నారు. కాని మంచి నడవడికను నేర్పే, ధార్మికపరమైన ఎదుగుదల లేకుండా, సమాజంలో న్యాయము, శాంతిని గురించి కలలు గనడం సాధ్యంకాదు.

భగవాన్ బుద్ధుని బోధనలను ఆచరించినట్లయితే, సామాజిక, రాజకీయ, ఆర్థికపరమైన దుఃఖాలు, అన్యాయాలు తొలగిపోగలవు.

గొప్పగా విజయవంతం కాగలిగిన, కొత్త సంకల్పమిది (సామాజిక బౌద్ధ ధర్మం). ఈ సంకల్పం, ప్రపంచంలోని సామాజిక బౌద్ధులకు ఎన్నో బహుమతులను, సన్మానాలను తెచ్చిపెట్టింది. భారతప్రభుత్వం, ప్రపంచ స్థాయి సామాజిక బౌద్ధ నాయకులను ఆహ్వానించి, తగిన విధంగా సౌకర్యాలను కల్పించి వారిని సత్కరించింది.

ఇతర బౌద్ధ అధ్యాపకులు చేసినట్లుగ, నేను 'సుత్త'లను, లేదా 'అభిధమ్మ'ను గాని బోధించను. అవి వయస్సులో పెద్దవారైన, యోగులకొరకు ఉద్దేశింప బడినవి. కాని నేను, మానవులకు, లౌకిక విషయాలను వదిలిపెట్టి, తన పరిసరాలను, పవిత్రతను, పరిశుభ్రతను పెంపొందించే పంచశీలను, బ్రహ్మవిహారాలను బోధిస్తాను. ఇవి సాధకునికి ధార్మిక సాధనలో కూడ తోడ్పడతాయి. అదే సమయంలో, అతడు, సామాజిక, రాజకీయ, ఆర్థికపరమైన దుఃఖాలను, అన్యాయాలను కూడా తొలగించుకొనగలడు.

ఈ సామాజిక బౌద్ధ ధమ్మ విధానం సామాన్యులు, అంగవైకల్యం కలవారు, అన్ని తరగతుల వారు ఆచరించి ఫలితాలను పొందగలరు.

సామాజిక బౌద్ధధర్మాచరణ, వ్యక్తికి ఉపయోగపడటమేగాక, అతని ద్వారా జాతీయాభివృద్ధిని సాధించడానికి కూడ సహకరించగలదు. సామాజిక బౌద్ధధర్మాన్ని ఆదరించే దేశాలు సత్ఫలితాలను పొందాయి.

ఈ సామాజిక బౌద్ధధర్మ ఉద్యమం, ఎవరయితే సాంప్రదాయకంగా, అరణ్యాల్లో నివసిస్తూ, ధ్యానాన్ని ఆచరించు బౌద్ధభిక్షువుల చేత ప్రారంభింపబడినది. అయితే, ఈ సామాజిక బౌద్ధధర్మ ఉద్యమం, వ్యక్తులకోసం, సమాజంకోసం పనిచేయడానికై, అరణ్యాలలోనున్న ఆ భిక్షువులను, నగరాలకు తెచ్చింది.

❖ ❖ ❖

6. సామాజిక బౌద్ధ ధర్మం – ఆధునిక నాగరికత

ఆధునిక నాగరికత మానవుడుని అనారోగ్యం, అశ్లీలం, ఆత్మహత్య యుతమైన జీవితం, పాప పూరితమైన నిత్య జీవితములోనికి నెట్టివేస్తుంది. దీనికి కారణం శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి నైతిక జీవన విధానం అవలంబిస్తూ సుఖ, సంతోషాల మార్గంలో పయనించక అక్రమమైన మార్గములో ఆస్తి-అంతస్తులను పొందే ప్రయత్నంలో ప్రకృతి యొక్క వికృతి స్వరూపము అనుభవములోనికి తెచ్చుకుంటున్నాము.

ఈ అంశము వివిధ విషయములలో ఏవిధంగా ఉన్నది, దానిని సామాజిక బౌద్ధ ధర్మమును ఆచరించి ఈ సమస్యలను అధిగమించు విధానము ఈ అధ్యాయములో తెలుసుకొందాము.

'ధర్మసేన – సంస్కరణోద్యమం (Education and Reforms through Sadhana & Seva movement) ద్వారా అన్ని వర్గాల ప్రజలను విద్యావంతులుగా చేయటం ద్వారా మనదేశంలో విఫలమయిన సమైక్యతా విధానమును సరి చేసుకొనుటకు ఈ సామాజిక బౌద్ధ ధర్మం ఆధారంగా తయారు చేసిన ఈ ఉద్యమం ఆనందంగా ధార్మిక అభివృద్ధిని గావించుటకు ఉపయోగపడుటను తయారు చేయడమైనది.

ప్రపంచవ్యాప్తంగ నీటికొరత

(ప్రేమలేకున్నా వేలాదిమంది బ్రదుకగలరు. కాని, నీరు లేకుండా ఒక్కరు కూడ బ్రదుకలేరు.)

నీరే జీవితం, నీరే మరణం:

మానవజాతికి ముఖ్యమైన వనరు అయిన నీరు, జనాభాపెరుగుదల, ఆధారవనరుల కాలుష్యం, లభ్యమవుతున్న నీటివనరుల అసమర్ధనీయమైన వాడకంల కారణంగా, ఉపయోగానికి తగినంతగా పెరుగక పోగా, అసమతుల్యత దిశగా సాగుతున్నది.

ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, ఆరువందల కోట్ల జనాభాకు తగినంత శుభ్రమైన నీరు, ఈ భూగ్రహం మీద ఉన్నది. అయితే, అసమానతతో కూడిన పంపకాలు, ఎక్కువగా వృర్ధం చేయడాలు, కాలుష్యాలు... మున్నగు కారణాలవలన, నీరు తగినంతగా సరిపడటం లేదు.

నీటి ఆధారంగా, వచ్చే వ్యాధులు, గృహసంబంధమైన వాడకం, నీటి పారిశుద్ధ్యం అన్నవి, ప్రపంచవ్యాప్తంగా, మరణాలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా నీటివలన వచ్చే ఈ వ్యాధులు, అయిదేళ్లలోపు పిల్లల మరణాలకు కారణమవుతున్నాయి. ఏ కాలంలో చూచినా, ప్రపంచంలోని, ఆరోగ్యకేంద్రాలలో, సగానికి పైగా పడకలు, నీటి ఆధారిత వ్యాధులతో బాధపడుతున్న రోగులతో నిండి ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం, ఎనభై ఎనిమిది శాతం వ్యాధులు, ఈ నీటి ఆధారిత వ్యాధులే. అపారిశుద్ధ్యం, అనారోగ్యకారకమైన సురక్షితం కానీ త్రాగునీటి వాడకం వలన వచ్చేవే. 2025వ సంవత్సరానికి, మూడవవంతుల ప్రపంచజనాభా, ప్రాథమిక పారిశుద్ధ్యత లోపించిన స్థితిలో, సురక్షితమైన త్రాగునీరు అందని స్థితిలో ఉన్నారు.

నీటి ఆధారంగా వచ్చే అతిసారవ్యాధుల వంటి వ్యాధులు, నీటి కాలుష్యం వలన వచ్చేవే. మలేరియా వంటి వ్యాధులు, నీటిలో గుడ్లు పెట్టే దోమలు, నత్తగుల్లల వలన వ్యాపిస్తూ, లక్షలాదిమందిని ఈ రోగాలబారిన పడవేస్తున్నాయి.

ఏ పనిని నిర్వహించాలన్నా కావలసిన ప్రాథమిక అవసరాలలో, నీరు అత్యంత ప్రధానమైనది. నీరు లేకుండా, అతి స్వల్ప కాలం మాత్రమే మనం జీవించగలం. అయినా, మనం నీటిని దుబారా చేస్తున్నాం. అవసరం లేకుండా, నీటిని వ్యర్థం చేయడమే గాక, పరిశుభ్రమైన నీరు అతి తక్కువ మోతాదులోనే లభిస్తున్నదన్న సత్యాన్ని అర్థం చేసికోలేకున్నాం. ప్రపంచంలో వందకోట్ల జనాభా వాడుకకు తగినంతగా కూడా పరిశుభ్రమైన నీరు లభించకున్నది. 2.5 వందల కోట్లకు పైగా జనాభా తగినంత పారిశుద్ధ్యం కలిగిన నీటిని వాడలేకపోతున్నారు. ప్రతి సంవత్సరం, ప్రపంచవ్యాప్తంగా, సురక్షితం కాని నీటి వాడకం వలన, నాలుగు కోట్లమంది మరణానికి గురి అవుతుండగా, అందులో అధికశాతం పిల్లలే కావడం, గమనార్హం. నిజానికి, కలుషితమైన నీటిని త్రాగడం వలన, ప్రతి ఎనిమిది సెకనులకు ఒక శిశువు చొప్పున మరణిస్తున్నది. గ్రామీణ ప్రాంతపు ప్రజలు, పట్టణ మురికి వాడలలోకి ప్రవాహంలా చేరడం వలన కూడ, ఆరోగ్య పరిరక్షణకున్న అవకాశాలు తీవ్రతరంగా తగ్గుముఖం పడుతున్నాయి.

నదులపట్ల, తడినేలల్లో పనిచేసే కఠిన పరిశ్రమలపట్ల, నీటిచే బలపడుతున్న చిక్కుముడులతో కూడిన జీవితం పట్ల, మనం గౌరవభావాన్ని కోల్పోయాము.

మనలో చాలా మందికి, మన జీవితానికి నీరు ఎంత ప్రధానమైనదో అనిగాని, నీటిలోని జీవరాశుల నశింపువలన వాతావరణ సమతుల్యత ఎలా దెబ్బతింటుందో అనిగాని తెలియదు. పెరుగుతున్న నీటి ఎద్దడి అనే వాతావరణ సమస్య వలన, మానవులెదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సమస్య, ఆరోగ్యసమస్య. ప్రకృతి నింపగలిగిన నీటికన్న తొందరగ, ప్రజల వాడకం వలన నీరు ఖాళీ అయిపోతుండటం చాలా సార్లు జరుగుతుంటుంది.

నైతిక, ఆధ్యాత్మిక వినాశం :

Toynbee అనే విమర్శకుడు చెప్పినట్లు, ఆర్థికపరమైన, వాతావరణపరమైన కారణాలవలనగాక, నైతిక, మతపరమైన కారణాల వలననే నాగరికతలు నాశమవుతూ ఉంటాయి. మతనాయకులు చాలావరకు సందిగ్ధస్థితికి లోనవుతూండటం పెరుగుతున్నది. అత్యంత ముఖ్యమైన సిద్ధాంత, నైతికపరమైన విషయాలతోనే వారు సరిపుచ్చుకుంటున్నారు తప్ప, 'మంచితనం' పట్లగల విశ్వసూత్రాలను వారు గుర్తించడంలేదు.

ఫలితంగా, పెద్ద ఉప్పెనల వంటి వివాహవిచ్ఛిత్తులు, సహజీవనాలు, లైంగికేతర సంబంధాలు, విపరీతబుద్ధులు, చిన్న వయస్సులోనే గర్భధారణలు, గర్భస్రావాలు, చిన్న పిల్లలపట్ల దురన్యాయ ప్రవర్తనలు, మత్తుపదార్థాల సేవనం, మానభంగాలు, వంచన, దొంగతనాలు, ఇతరుల ధనాన్ని అపహరించడాలు, బ్యాంకులదివాళా, అమర్యాదాపూర్వకచర్యలు, క్రూరనేరాలు.....మున్నగునవి అధికమవడమేగాక, న్యాయాన్ని ఉపేక్షించి, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ప్రపంచంలోని శ్రేష్ఠులైన మేధావివర్గం:

విద్యావేత్తలు, రచయితలు, చిత్ర నిర్మాతలు, టెలివిజన్ కథా నిర్మాతలు, ఉదారతగల రాజకీయ నాయకులు, వేదాంతులు – అందరూ చెప్పే అంశం, 'నీ సహజమైన నిజాయితీతో పనిచేయి' అని. కొన్ని దశాబ్దాల కాలంగా వారు, సాధారణ అనుభవాలు, సాంప్రదాయ విలువల పై తీవ్రమైన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. దానివలన సాంప్రదాయిక, సాంస్కృతిక విలువలను క్రమంగా పరిత్యజింపబడే విధానానికి మనం సాక్షీభూతులుగా ఉన్నాం. సత్యాన్ని బోధించడానికి ఒక విధానంగాని, సంప్రదాయంగాని లేదు. అంతేకాదు, ఎవరుకూడా, 'తన' అన్న స్వార్ధభావనను కలిగి ఉండరాదు. ఎవరైతే 'తన' అనే భావాన్ని కలిగి ఉండరో, వారు విముక్తిని పొందుతారు, ఇంతకుపూర్వం కన్న, ఎక్కువగా నైతిక ధార్మిక మార్గదర్శకత్వం ప్రజలకు బలంగా అవసరమవుతున్న ఈ తరుణంలో, సామాజిక నైతిక చట్రాన్ని, రక్షించవలసిన, బలపరచవలసిన మతాధికారులు కూడా, తప్పులను లెక్కచేయని రీతిలో, వివాహాలకు ప్రాధాన్యతనివ్వడంతో బాటు, విడాకులు, లైంగిక సంబంధాలు, స్వలింగరతి వంటి పాపపు పనులలో ఇరుక్కుపోతున్నారు.

అవినీతి విస్ఫోటనం:

మన నైతిక విలువలు నిలువునా పతనమవుతున్నాయి. ముఖ్యంగా మనం గమనించవలసిన విషయమేమిటంటే, పెద్ద తరాలవారు మరణించగా, ఇప్పటితరంలో, ఏ కొద్దిమంది మాత్రమే ఈ నైతికపతనం గురించిన అప్రమత్తతతో ఉన్నారు. నేటి యువతరం, ఈ నాడున్న విలువలు, ఇంతకుపూర్వం కూడ ఇలాగే ఉండేవని అనుకుంటూ ఉండవచ్చు. అపకీర్తి, అనైతికతలతో కూడిన ప్రవర్తనలను, ఈనాటి ప్రజలు తప్పుగా పరిగణించడంలేదు. పైగా, వాటిపట్ల సరైన తీర్పరులుగా వ్యవహరించడంలో కూడా విఫలులౌతున్నారు.

"ప్రాచీనకాలంలో, ధరించే దుస్తులనుబట్టి, కుటుంబ స్త్రీలకు, వ్యభిచారిణులకు మధ్యగల తేడాను సులభంగా గుర్తించగలిగే అవకాశముండేది. బాలికలు మర్యాద మార్గాన్ని తప్పినపుడు, వారి తల్లితండ్రులు, ముఖ్యంగా వారి తల్లులు, వెంటనే వారిని సరిదిద్దేవారు. ఈ రోజులలో ఈ స్థితి భిన్నంగా ఉంది. వారి దుస్తులను బట్టి, స్త్రీల మధ్యగల తేడాలను గుర్తించడం చాలకష్టం. ఏం జరుగుతున్నదిప్పుడు? విలువల ఎగవేత, నైతికపతనావస్థ అన్నవి ఇంటా, బయటకూడా శీఘ్రగతిని వ్యాపిస్తున్నాయి." – అని అంటారు, Paster Enoch Adeboye.

గాఢంగా సంతృప్తిపరచబడిన లైంగికతలు, అగౌరవమైన అసంఖ్యాక విధానాల్లో, వర్ణించి, అనుభవించి చెప్పబడిన వాటి ఛాయలు వ్యాపించిన సామాజికకాలంలో మనం నివసిస్తున్నాం. పూర్తినగ్నమైన, అర్ధనగ్నమైన ఛాయాచిత్రాలను సెల్‌ఫోన్‌ల ద్వారా పంపించుకునే అలవాట్లు, పాఠశాలస్థాయి విద్యార్థులలోనే బాగా పెరిగింది. యుక్తవయస్సులో నున్నవారిలో, హింసాత్మక ప్రవృత్తి, రోజురోజుకూ ఎక్కువవుతున్నది. సామాజిక, నైతిక చట్రం వెనుక, పేదరికానికి పరిహారంగా, నేరాలు రూపుదిద్దుకుంటున్నాయి. సాంకేతిక, పారిశ్రామికతలు రెండూ, మానవ లైంగిక విస్ఫోటనాన్ని బలంగా ఎలుగెత్తి చాటుతున్నాయి.

కళలు, సంగీతం:

"కళ అనేది ఒక వస్తువు కాదు, అదొక మార్గం." అంటారు – Elbert Hubbard

కళలు, సంగీతం అన్నవి సమాజానికి కిటికీలవంటివి. కళలు, సంగీతాల ద్వారానే, ఒక సమాజంలోనికి తొంగిచూడగలం. కొన్ని దశాబ్దాలుగా కళాసంగీతాలు ఘాటైనవిగా, వివాదాస్పదంగా మారిపోతున్నాయి. క్రమంగా, వీటిలోని నాణ్యత తుడిచిపెట్టుకు పోవడమేగాక, వ్యాపారాత్మకతను కూడా సంతరించుకుంటున్నాయి.

ముందుగా ఒక విషయం గమనార్హం. పతనమవుతున్న తరుణంలో భీకరత ఎక్కువవుతూ ఉంటుంది. నేటి ప్రజలు తమనుతామే ప్రేమించుకునేవారిగా, ధనాన్ని ప్రేమించేవారిగా, గర్వపోతులుగా, ఆత్మ స్తుతిపరులుగా, ఇతరులను నిందించేవారిగా, తల్లితండ్రులపట్ల అవిధేయులుగా, కృతఘ్నులుగా, నీతిబాహ్యులుగా, క్షమార్హులు కానివారుగా, నిందాత్ములుగా, స్వయం నియంత్రణ లేనివారిగా, పాశవికులుగా, మంచిని ప్రేమించలేనివారిగా, ద్రోహచింతనులుగా, దుడుకుదనం, దురభిమానం కలిగినవారిగా, ఉన్నారు. పాపకృత్యాలలో మునిగిపోతూ, పనికిరాని భీకరమైన కోరికలలో ఈదులాడుతూ, సత్యాన్ని ఎదిరిస్తూ, అవినీతిపరులుగా ఉంటూ, సహేతుకతకు దూరమవుతున్నారు. చాలాకాలం క్రితమే, ముందే చెప్పిన స్థితి, ఈనాడు జరుగుతున్న స్థితి.

ఆధునికమానవుని వేదనలకు ధార్మికతలో జవాబులున్నాయి. కాని, ప్రజలు దానిని చెప్పబడిన రీతిలో ఆచరించాలిగాని, వారికి ఇష్టమైనరీతిలోగాదు. వారేమీ నేర్చుకుంటున్నారో, దానిని ప్రస్తుత సమాజానికి అన్వయించి చూచుకోవలసిన అవసరం ఉన్నది.

ద్వేషం, హింస, యుద్ధం

పాశ్చాత్య నాగరికత, రెండు ప్రపంచ యుద్ధాల ఫలితంగా, లెక్కలేనన్ని మారణహోమాలు, కేంద్రీకరణ శిబిరాలు, సమస్త విధ్వంసాలు, హిరోషిమా నాగసాకిలపై బాంబుదాడులు వంటి ఎన్నో అమానవీయ క్రియలతో ఇరవయ్యవ శతాబ్దాన్ని, రక్తమయంగా మార్చింది. ఈ శతాబ్దంలోని, యుద్ధాలు, హింసలు మొదలైన దారుణక్రియలు, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో 350 మిలియనులకన్న, ఎక్కువమందినే బలి తీసికొన్నాయి. భారత, శ్రీలంకలలో, ఒక నిర్దిష్టజాతికి, భాషకు, సంస్కృతికి చెందిన యుద్ధాలు కూడ, ద్వేషానికి, హింసకు ఉదాహరణలుగానే గుర్తించాలి.

విజ్ఞాన, సాంకేతికశాస్త్రాలు శాంతికొరకు మాత్రమే పనిచేస్తూ, ప్రపంచంలో శాంతి మార్గాన్ని ఏర్పరచడానికి బదులు, దురదృష్టవశాత్తు న్యూక్లియర్ బాంబుల తయారీకి, గూఢచర్య క్రియలకి మాత్రమే ఉపయోగింపబడుతున్నాయి.

అలెగ్జాండర్ భారతదేశంపై దండయాత్రను చేసినపుడు, గ్రీకు సైనికుడు పట్టుకున్న ఒక దొంగ, అలెగ్జాండర్ ముందు నిలుపబడినాడట. శిక్ష విధింపబడిన ఆ దొంగ, అలెగ్జాండర్‌ను, "నేను చిన్న దొంగను. మరినీవో పెద్దదొంగవు. నేను నా ఆకలికోసం, ఒక్కడిగనే దొంగతనం చేస్తున్నాను. నీవు వేల సంఖ్యకు పైబడిన సైన్యం సహాయంతో దొంగతనం చేస్తున్నావు. నీకూ నాకూ మధ్య తేడా ఏమున్నది?" అని ప్రశ్నించాడు. అతని మాటలతో ఏకీభవించిన అలగ్జాండర్, ఆ దొంగను స్వేచ్ఛగా విడిచిపెట్టాడు.

"తప్పు చేయటం మానవ సహజ లక్షణం. కాని న్యూక్లియర్ యుద్ధ విషయంలో మనం ఒకే ఒకసారి మాత్రమే తప్పు చేయగలం"

పూర్వపు, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ సోవియట్ రష్యాలో, న్యూక్లియర్ ఆయుధాల పరిశోధనాలయంలో ఒకసారి విస్ఫోటన సూచికగా నున్న అలారం, పొరబాటున మ్రోగింది. ఒకవేళ ఆ అలారం మ్రోగక, ఆ విస్ఫోటనమే జరిగి ఉంటే, ప్రపంచ భవిష్యత్తు ఏమై ఉండేది?

భారత–పాకిస్తాన్ సంబంధాలలో విధ్వంసం, సంబంధించిన బీజాలు పాదుకొని ఉన్నాయి. 1947 లో స్వాతంత్ర్యానంతరం, విడిపోయిన భారత పాకిస్తాన్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగాయి. ఇందులో రెండు, కాశ్మీర్ రాష్ట్రం కోసం జరిగిన యుద్ధాలే! 1988లో రెండు దేశాలూ న్యూక్లియర్ పరీక్షలు జరిపాయి. 1991లో కార్గిల్ ప్రాంతంలో సాయుధులైన జిహాదీల మీద చేసిన దండయాత్ర, యుద్ధం అంచులదాకా వచ్చి ఆగిపోయింది. రెండుదేశాలు సంస్కరణల మూలంగా, మార్పులకు లోనవుతున్నాయి. భవిష్యత్తు స్నేహ సంబంధాలనాశించి, రెండు దేశాలు సంస్కరణలకు లోనయితే, భారత పాకిస్తాన్‌ల మధ్య భౌగోళిక స్థితులతో బాటు, సంగీతం, నాగరికత. వాణిజ్యం, మిలటరీ, రాజకీయం, సహజ వనరులు, భాష మొదలైనవాటి ఆధారంగా, భారత, పాకిస్తాన్, బంగ్లా దేశాల మధ్య ఏకత్వం కుదిరి, 'గ్రేటర్ ఇండియా' గ రూపొందే అవకాశం ఉన్నది, అని నా అభిప్రాయం.

ఇరవైయవ శతాబ్దంలో యుద్ధరంగపరిధులు మారుతున్నాయి. నీటి అడుగున, ఆకాశంలో, ఖండాలమధ్య జరుగుతున్న యుద్ధాలు, ప్రస్తుతం జీవితంలోని ప్రతివిషయంపై కంప్యూటర్లు ఆధిపత్యం కలిగి ఉన్నాయి కాబట్టి, కంప్యూటర్ల పరిధిలోనికి వచ్చాయి. ఒక దేశానికి చెందిన కంప్యూటర్లను పనిచేయకుండా అణచివేయడం అంటే, ఆ దేశం యొక్క ప్రాణనాడిని ఆపివేసి, ఇతరదేశాలనుండి ఆ దేశాన్ని విడిగా చీల్చివేయడమే అని అర్థం. మన ప్రాథమిక అవసరాలైన, విద్యుత్తు, నీరు, సమాచార రంగాలను కంప్యూటర్ల అజమాయిషీ చేస్తున్నాయి. అందుకే, కంప్యూటర్ల పనిచేసే సామర్థ్యాన్ని విఫలం చేయడం వలన, ఒక దేశాన్ని సామర్థ్యహీనంగా చేయడమే జరుగుతుంది.

పారిశ్రామిక, సాంకేతిక నాగరికతల ముందంజ ఫలితంగా, తయారుకాబడిన నేటి ఆయుధాలు సామూహిక విధ్వంసాన్ని అత్యంత వేగవంతంగా ఏర్పరచడమేగాక, కొన్ని కోట్ల సంవత్సరాలుగా ఉనికిలోనున్న ఈ భూగ్రహాన్ని కొన్ని గంటల కాల పరిమితిలోనే తుడిచిపెట్టగలదు. ఈ పేర్కొనబడిన కొన్ని ఆయుధాలు, సామూహిక విధ్వంసాన్ని కలిగించేవి.

వ్యాధులను మళ్ళీ శక్తిమంతం చేయడం వలన కలిగే ఆరోగ్య సమస్యలు:

నగర వీధులలోని దీపాలను వెలిగించడానికి సరిపడినంతగా లేని, పండిస్తున్న గ్రామీణ ప్రాంతాల నుండి, నగరాలకు తరలించ వీలుగాని ఆముదం కొరత అన్నది మాత్రమే పూర్వకాలంలోని సమస్య. కాని నేడు, టెలివిజన్లు, ఆనువంశిక విజ్ఞానాలు (Genetics), శాటిలైట్లు, చిన్న పర్సనల్ కంప్యూటర్లు, కళ్ళజోళ్ళు, రెఫ్రిజిరేటర్లు, అల్యూమినియం, అవయవమార్పిడులు, నానో పార్టికల్స్‌కు సంబంధించిన భౌతిక శాస్త్రవిజ్ఞానం.... ...ఇలా ఎన్నో ఊహించిచూడలేని విషయాలను సాధించుకున్నాం. ఔను, మనం మన సమస్యలనిలా పెంచుకుంటున్నాం కూడా.

జీవన విధానం వలన కలిగే వ్యాధులు (నాగరికతా వ్యాధులని కూడా పిలువబడుతున్నాయి) క్యాన్సర్, రక్తపోటు, స్థూల(ఊబ)కాయం, గుండెజబ్బులు, మధుమేహం, మతిమరుపును కలిగించే మెదడు వ్యాధులు (Alzheimer), Parkinson, బోలు ఎముకల వ్యాధులు, కీళ్ల వ్యాధులు, కణజాలముల మధ్య ఏర్పడే కాఠిన్యతలు, మూత్రపిండ వ్యాధులు, పక్షవాతం, ఉబ్బసం, డిప్రెషన్ మొదలైన ఎన్నో వ్యాధులు, ఆధునిక పారిశ్రామిక జీవన విధానం కారణంగా, మనం తింటున్న ఆహారం కారణంగా, గతకొన్ని దశాబ్దాలుగా, మనలో పాదుకుంటున్న ఆరోగ్య సమస్యలుగా గుర్తించగలం.

2005లో ప్రపంచవ్యాప్తంగా, ఈ జీవన విధాన వ్యాధుల వలన, యాభైయెనిమిది మిలియనుల ప్రజలు మరణించారు. 2020 నాటికి, ప్రపంచ మరణాలలో పదిమందిలో ఏడుగురి మరణానికి, ఈ జీవన విధాన వ్యాధులే కారణమవుతాయి. ఉదాహరణకు, మెక్సికోలో, ముప్పావు వంతు మరణాలు ఈ జీవనవిధాన వ్యాధులకు సంబంధించినవే కావడం గమనార్హం.

సూక్ష్మజీవులు, సామాజిక వ్యవస్థ:

స్థూలకాయత అన్నది, అంటురోగాలకు, దీర్ఘకాలిక రోగాలకు మధ్యస్థమైన తేడాను చెదరగొట్టే అంటువ్యాధి వంటిది. కలరా వంటి అంటువ్యాధులు, వ్యాపించినంత వేగంగా, స్థూలకాయత కూడా వ్యాపిస్తుంది. కలరా సూక్ష్మక్రిముల ద్వారా వ్యాపిస్తే, స్థూలకాయత సామాజిక వ్యవస్థద్వారా వ్యాపిస్తుంది.

నగరాలకు చెందిన పెద్ద వ్యాధి మధుమేహవ్యాధి. భారతదేశంలో ఒక ప్రధాన నగరమైన హైదరాబాదులో ఇది బాగా వ్యాపిస్తున్నది(?)

Digital Age disease (డిజిటల్ ఏజ్ డిసీస్):

కంప్యూటర్ ముందు కూర్చుని, రోజంతా కీ బోర్డ్ మీద టైపు చేయడం వలన, పునరావృత్తమవుతున్న ఒత్తిడి గాయాలు, కార్పెట్ టన్నెల్ సిండ్రోమ్ వంటి బాధలేర్పడుతున్నాయి. కీ బోర్డ్ పై ఇన్నిసార్లు తిరగడానికి వ్రేళ్ళు సృష్టింపబడలేదు. ఈ పద్ధతివలన, కండరాలు, నరములు బాధింపబడతాయి. ఈ బాధలకు నివారణ, ఫిజియోథెరఫీ చేయించుకోవడంతప్ప వేరుమార్గం లేదు. సమాచార సాంకేతికత (IT) అన్నది మనదేశంలో వేగంగా వ్యాపిస్తున్న ఒక పరిశ్రమ వంటిది. అయితే అది జీవితవిధానం వలన వ్యాపించే వ్యాధులను కలిగించడంలో హానికరమైనది.

ఇంతవరకూ కనిపెట్టబడని, కొత్తగా పుట్టుకొస్తున్న జీవన ఛిద్రతలను కలిగించే అంటువ్యాధుల్లా, ఈ వ్యాధి, గతనలభై సంవత్సరాలలో, ప్రపంచ మంతటా ఆవరించిన సర్వసామాన్యమైన రోగంగా పరిణామం చెందింది. Ebola, Sars వంటి జంతువుల నుండి వ్యాపించే వ్యాధులు కూడా, మానవుల ఆరోగ్యానికి జడిపింపుగానే పెరుగుతున్నాయి. ఈ రోజుల్లో ఎన్నో అంటువ్యాధులు, సూక్ష్మజీవినాశకమైన మందులను ఎదిరించే శక్తిమంతమైనవిగా వ్యాపిస్తున్నాయి.

ఫౌల్ట్రీలు, పాలకేంద్రాలు, గ్రుడ్లు, మాంసం మున్నగు పరిశ్రమలలో ఎక్కువ ఉత్పత్తిని సాధించాలన్న కారణంతో, సాంకేతికపరమైన అడ్డదార్లుగా, ఎన్నో మాత్రలను, హార్మోనులను, రసాయనాల వంటివాటిని ఉపయోగిస్తున్నారు. ఈ స్థితిలో, తీవ్రవ్యాధి కారకమైన, యాంటీ బయోటిక్స్‌ను ఎదిరించే శక్తి కలిగినవి అయిన కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి.

యాంటీబయోటిక్స్‌ను అతిగా ఉపయోగించే వ్యవసాయం కారణంగా ఉద్భవించే ఈ కొత్త సూపర్ క్రిములు, కారణం తెలియని మానవ దుఃఖాలకు, మరణాలకు కారణమవుతున్నాయి.

అంగీకృతంకాని వ్యావసాయిక విధానాలవలన, కొత్త వ్యాధులు, విస్తరిస్తున్నాయి. BSE (bovine spongiform encephalopathy) అనే విధ్వంసకరమైన ఒకానొక వ్యాధి, బ్రిటను దేశంలోని పశువులకు వ్యాపించడమేగాక, ఆ వ్యాధికి లోనైన పశుమాంసం తినడం వలన, జ జీ ణ అనే మరొక విధ్వంసకరమైన వ్యాధి మనుష్యులలో వ్యాపించింది.

జంతుసంరక్షణ:

క్రూరత్వం, దుఃఖాన్ని ఉపేక్షించడమే కాదు, సానుకూల సంతోషాలను కూడా పోగొడుతుంది. పరపీడన వలన, ఆనందాన్ని పొందడం కూడా, దీనికన్న, భిన్నమైనదికాదు.

దుఃఖాన్ని అలక్ష్యపరచే క్రూరత్వం, హింసతో కూడి ఉండవచ్చు, కాని హింస అన్న భావన, క్రూరకర్మ చేయడానికి అవసరమైన భావన కాదు. ఉదాహరణకు, ఒక వ్యక్తి నీటిలో మునిగిపోతూ సాయంకోసం అర్థిస్తున్నపుడు, సాయం చేయగలిగికూడ చేయక ఉదాసీనంగా చూడటమేగాక, అతని స్థితికి ఒకానొక తుంటరి ఆనందాన్ని పొందడమే క్రూరత్వం. ఈ స్థితి ఈ నాటి ప్రపంచప్రజలలో బాగా వ్యాపిస్తోంది.

మానవులచేతగాని, యంత్రాలచేతగాని పశువులను సంహరించే కసాయి అంగళ్లు, భూమిమీద నరకానికి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

యంత్రాల సహాయంతో, కసాయి అంగళ్లు గంటకు 250 నుండి 300 దాకా పశువులను సంహరిస్తున్నాయి. జంతువులపై దయను చూపడానికి కూడా, అవకాశం లేనంతగా త్వరితవేగంతో జరిగే ఈ విధానం నానాటికీ అధికరిస్తోంది.

“చేతినిండా ఆయుధాలున్నపుడు, ఎల్లవేళలా, మంచిగా ఉండటం అన్నది చాలా క్లిష్టమైన పని. ఉద్యోగి నిలకడగా ఒక పనిని కొనసాగించడంలో మినిగిపోయి ఉన్నపుడు, పశువులపట్ల మంచి వైఖరిని కలిగి ఉండటం అన్నది సాధ్యం కాని కార్యం. అతడు తన ఒత్తిడినంతా జంతువులపై ప్రసరింపజేస్తూ, గతి తప్పని పనిలో తీవ్రంగా మునిగిపోతాడు.” అని చెబుతారు.

చంపడానికి ముందు, పశువులను స్పృహ తప్పిస్తారు. మెషిను దెబ్బచేత స్పృహతప్పించడం ఒక పద్ధతి. ఒకవేళ, ఈ ప్రయత్నం చేత కూడా స్పృహను కోల్పోని పశువులను మరోమార్గం ద్వారా స్పృహతప్పిస్తారు.

సామాజిక బౌద్ధులు (ధమ్మ సైనికులు) ‘పంచశీల’లో మొదటిదైన అహింసను అభ్యాసం చేసేటపుడు, జంతు సంరక్షణను కూడా అభ్యాసం చేస్తారు. అందరిపట్ల అహింసాతత్వాన్ని కలిగి ఉండడంతో బాటు, ‘జంతుసంరక్షణ ఉద్యమాల’ను నిర్వహించడం, ‘జంతు సంక్షేమ పథకాల’ను బలపరచడం వంటివాటిని ఆచరిస్తారు.

జంతువులపై ప్రయోగాలు:

ప్రపంచవ్యాప్తంగా, ప్రతి సంవత్సరం 320 జంతువులు పరిశోధనల నిమిత్తం ప్రయోగశాలలలో చంపబడుతున్నాయి. పరిశోధనలు అంటే, ఎలుకల కడుపులోనికి రసాయనాలను పంపడం, కుక్కల తొడ కండరాలను కత్తిరించడం, తల్లులనుండి విడగొట్టి కోతిపిల్లలను ఒంటరిగా గదులలో ఉంచడం వంటివి.

ప్రజల ధనంతో, సంక్లిష్టమైన సామూహిక ధనం అంటే, జంతువులపై ప్రయోగాల నిమిత్తం, ప్రభుత్వం, విశ్వవిద్యాలయాల ప్రయోగశాలలు; పంజరాలు, తిండిని తయారుచేసే సంస్థలు; జంతువులను అభివృద్ధిపరచేవారు, అమ్మేవారు, రవాణాచేసేవారు, వంటి సంక్లిష్టమైన సామాజిక అల్లికతో కూడిన వ్యవస్థలో ఖర్చుపెట్టబడుతున్న కొన్ని కోట్ల ప్రజాధనమే అని అర్థం.

పరిశ్రమలు, అక్కడి ప్రజలు, తాము పెట్టే హింసలనుండి తప్పించుకోలేని జంతువుల వలన లాభపడతారు.

ప్రయోగశాలలలో జంతువులు:

ప్రయోగశాలలోని మూగజీవుల బ్రతుకు ఒంటరిగా, దుఃఖంలో, భరింపలేని నొప్పులతో కూడుకున్న ఖండ తుండెముల బ్రదుకు.

పరిశోధకులు, బలవంతంగా రసాయనాలను జంతువులచే తినిపించడం, మళ్ళీ మళ్ళీ వాటి శరీరాన్ని కోతలకు గురిచేయడం, వాటి మెదళ్లకు కరెంటు తీగెలను జతచేయడం, వెన్నెముకలను విరవడం వంటి ఎన్నో క్రూర కృత్యాలను చేస్తున్నారు. జంతువులు గ్రుడ్డిగా చేయబడడం, వాటిని మరుగుతున్న నీళ్లల్లో పడవేయడం, వేడివేడి పెనాలపై వేయించడం, మంచులో చల్లబరచడం వంటి కృత్యాలకు లోనవుతుంటాం.

కుక్కల పందేలు:

పందెపు కంపెనీలు, కుక్కలను పందేల కోసం తయారు చేయడంలో చాలా క్రూరంగా ప్రవర్తిస్తాయి. పందెపు కంపెనీలకు లాభదాయకం గాని గ్రేహౌండ్ జాతికి చెందిన కుక్కలు, సంవత్సరంలో 50,000 దాకా ప్రయోగశాలలకు పంపబడుతున్నాయి.

గులాబివర్ణపు పాలు తెలుపుగా మారడం:

అంటువ్యాధులు, యంత్రాల ద్వారా పాలుపిండటం వంటి చర్యలద్వారా, చాలాసార్లు పాలు గులాబీ వర్ణంలోకి తిరుగుతుంది. పాలను తెల్లబరచడానికి రసాయనాలను వాడుతున్నారు.

బాతులపట్ల క్రూరత్వం:

వివాదాస్పదమైన Foiegrass (ప్రత్యేకంగా కొవ్వు పేరుకొనునట్లుగా చేసిన పొట్టి బాతులు, పెద్ద బాతులు కాలేయం) అన్నది, పక్షులు తినగలిగిన దానికన్న ఎక్కువ ఆహారాన్ని వాటితో బలవంతంగా తినిపించడం వలన, ఆ ఆహారం పూర్తిగా జీర్ణంకాదు. అజీర్తిని కలిగించే కొవ్వు పదార్థాలతో కలిపి ఉడికించిన ధాన్యాన్ని తినిపించడంవలన, జీర్ణంకాక మిగిలిన ఆహారం కొవ్వుగ మారి కాలేయంలో నిల్వగా పేరుకుని, ఆ పక్షి మాంసాన్ని వెన్నలా మృదువుగా మారుస్తుంది.

చేపలను ప్రాణంతో తినడం:

కొన్ని రెస్టారెంట్లలో, ముఖ్యంగా చైనా, జపానులకు చెందిన రెస్టారెంట్లలో, బ్రతికి ఉన్న చేపలు – కడుపులోని వ్యర్థ భాగాలను తొలగించి, తుండెములుగా చేసిన ప్రాణంతో నున్న చేపలనే, వడ్డించడం, తినడం జరుగుతుంటుంది.

బ్రదికి ఉన్న పక్షులనే గ్రిల్ చేయడం:

ఆగ్నేయాసియా దేశాలు పెక్కింటిలో, చైనా రెస్టారెంట్లలో, పెద్ద లోహపు చువ్వల కటకటాలలో పక్షులు కుక్కివేయబడి ఉంటాయి.

వినియోగదారులు, తమకు కావలసిన పక్షులను ఎన్నుకుంటారు. ఆ పంజరాల నుండి బయటకు తీయడానికి ముందే, చేతికి అందకుండా, తిరిగి తిరిగి అలసిపోయిన ఆ పక్షులను బయటకు తీసి, రోస్ట్ చేసి ఇస్తారు. వినియోగదారులు ఈ చర్యలనంతా చూస్తూ ఆనందిస్తూ, తర్వాత కాల్చిన ఆ పక్షిని ఆరగించడం జరుగుతూంది.

ప్రపంచం, ప్రతి సంవత్సరం 240 మిలియనుల మైళ్ల దాకా పరచగలిగిన మాంసాన్ని ఆహారంలో వినియోగిస్తున్నది. అయితే, ఆయా జంతువులకు, పక్షులకు పెట్టే ఆహారంలో డెబ్బై అయిదు శాతం, జంతువుల, పక్షుల జీవరసాయన క్రియకు, ఎముకల ఎదుగుదలకే వ్యయమై పోతుంది.

గర్భ విచ్చిత్తులు:

ప్రపంచవ్యాప్తంగా, ఒక్క 2008లో మాత్రమే, నలభై రెండు మిలియనుల గర్భస్థ శిశువులు చంపివేయబడినారు. అంటే, 2008 లో రోజుకు, 111,500 మంది గర్భస్థ శిశువులు హత్యకు లోనయినట్లు. ఈ భాగాన్ని మీరు చదివి ముగించే సమయానికి, తమ తల్లి గర్భంలో రక్షణ కవచంలోనున్న, వందలమంది అమాయక శిశువులు కిరాతకమైన మరణాలకు గురికావొచ్చు. ఈ భ్రూణహత్యలలో చాలావరకు వైద్యపరమైన అవసరాలకోసం జరిగినవి కావు అన్న విషయాన్ని మనం మరిచిపోరాదు,

ప్రపంచంలో ఎక్కువ ప్రాంతాలలో గర్భవిచ్ఛిత్తి అన్నది చట్ట విరుద్ధ చర్య. కొన్ని దశాబ్దాల క్రితమే ఈ చర్య చట్ట బద్ధతను పొందింది. 1973 కు ముందు, యునైటెడ్ స్టేట్స్‌లో కూడా, చట్టవిరుద్ధంగా నున్న ఈ చర్య, ఖూ సుప్రీంకోర్ట్‌లో జరిగిన చారిత్రాత్మకమైన, Reo vs Wade ల కేసు మూలంగా, ఈ చర్యపై చట్టవిరుద్ధత తొలగించబడినది.

నాగరిక నరమాంసాహారులు

శరీర అవయవాలతో వ్యాపారం చేయడం అనైతికం, పాపపూరితం కూడా. అందువలన ఇటువంటి విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలి.

కోతిమెదడును తినడం:

ఐరోపా, ఆసియా ఖండాలలోని కొన్ని ప్రాంతాలలో కోతి మెదడును తినడం జరుగుతున్నది.

ముగింపు:

మన వర్తమాన జీవన విధానం, పాశవికమైన వినాశానికి ప్రతీక! ఇది వ్యక్తిని, సమాజాన్ని, అలాగే మానవసృష్టిని కూడా, పెద్ద సంఖ్యలోనే నాశం చేస్తున్నది. ఇంతకన్నా మంచి జీవితం, ఆనందదాయకమైన జీవితం కావాలంటే, సంపూర్ణమైన మార్పును కోరే ఆలోచనలవైపు దృష్టి మరల్చక తప్పదు.

“గతవారం కొవ్వొత్తి కర్మాగారం తగలబడి పోయింది. ప్రతియొక్కరు ఆ మంటల చుట్టూ నిలబడి, "HappyBirthday" పాటను పాడుకున్నారు.” అంటారు, స్టీఫన్ రైట్ అన్న రచయిత.

మనిషి వ్యవసాయం వంటి, ప్రకృతితో మమేకమైన పనులను చేస్తూ, రోజుకూ రోజుకూ, తరతరాలకు అదేపనిని కొనసాగించగలడు. పారిశ్రామిక విప్లవం తరువాత, నకిలీ జీవన విధానానికి అలవాటు పడిన మనిషి, ఎప్పటికీ ముగియని, కొత్త యంత్రాలను, కొత్త వస్తువులను, కొత్త ఉత్పత్తులను తయారీకరించడమనే పద్ధతి వలన, పర్యావరణాన్ని సమూలంగా నాశం చేస్తున్నాడు.

మనం, జీవించడానికి అతి తక్కువ పరిధిలోని వస్తువులే అవసరమవుతున్నా, మనం, వేలకొలదిగా వస్తువులను తయారుచేయడంలో తీరికలేనంతగా బ్రదుకుతున్నాం. ఈ కృత్రిమ నాగరికతలో బందీలమై, మనం, మన జీవితాలను కూడా కోల్పోతున్నాం. మనం సృష్టి అందాలను ఆస్వాదించడం కూడా మరిచిపోయాం. ఒక పువ్వు అందాన్ని నిదానించి గమనించి, ఆనందించడం మనకు తెలియదు. ఒక నదీ తీరధ్యానంలో మైమరచి గడపడం మనకు తెలియదు. అడవిలోని పుచ్చిపోయిన ఒక కర్రముక్కను తీసికొని దానిపై పెరుగుతున్న సూక్ష్మక్రిములను, ఫంగస్ ను పరిశీలించడం మనకు తెలియదు. మనం ప్రకృతికి ఎంతో దూరంగా జరిగిపోతున్నాం. నిజానికి చాలామంది మనుష్యులు, ప్రకృతిని, ఆనందించే సమయం ఏదంటే. వారివారి కంప్యూటర్ల డెస్క్ టాప్ మీద కనిపిస్తున్న ప్రాకృతికమైన గోడ కాగితాలను (వాల్ పేపర్స్) చూచినపుడు మాత్రమే!

ప్రపంచాన్ని సమూలంగా తుడిచిపెట్టే, అపాయకరమైన ఉపాయాల అన్వేషణలో మునిగిపోవడం కన్నా, మన జీవితాలలో, మన చుట్టూ ఉన్నవారి జీవితాలలో చిన్న చిన్న నిజమైన మార్పులను చేసికోవడమే మనమిప్పుడు చేయవలసిన కృత్యం.

ఆదర్శవంతమైన మానవ నాగరికత:

నేటి ఆధునిక నాగరికతకు చెందిన నాయకులు, వారి సొంత యిండ్లను, ప్రాకృతిక పచ్చదనంతో కూడిన అందమైన స్థలాలు, జలాశయాలు ఉన్నచోట నిర్మించుకుంటున్నారు, కాని సామాన్య జనులను, ఉద్యానవనాలు, తోటలు వంటి ప్రాకృతిక అందాలు ఏవీలేని ఇరుకైన స్థలాలలో జీవిస్తున్నారు.

పారిశ్రామికీకరణ పైపై మెరుగులు, మనలను కప్పివేస్తున్నాయి. మన ప్రత్యేకతను మళ్ళీ మనం కనుగొన్నట్లయితే, పర్యావరణంతో సత్సంబంధాన్ని ఏర్పరచుకోవడం సాధ్యమవుతుంది.

మన అశాశ్వతమయిన భౌతిక గుర్తింపునకు, నిజమైన ధార్మిక గుర్తింపునకు, మధ్యనున్న తేడాను అర్థం చేసికోవడం, పరిసరాల సమస్యలను తొలగించడానికి కీలకమైన అంశం. పర్యావరణపరంగా, ఆరోగ్యప్రదమైన భూగ్రహానికి పునాది, ఇటువంటి, నిజమైన చేతనత్వమే.

మన పరిసరాల వైపరీత్యాలకు సాధారణమైన పరిహారంగా, మన సమస్యలను, నేరుగా మన ధార్మిక, సాంస్కృతిక విలువలలేమితో జతపరుస్తుంది బౌద్ధం. ధార్మిక ప్రకృతిని మరిచిపోవడం అన్న బలహీనత, మనలను, ఇంద్రియవాంఛల పరితృప్తికై, యాంత్రిక నాగరికతపై ఆధారపడేలా చేస్తున్నది. దానివలన, విభిన్న రీతుల విశ్వవైపరీత్యాలు ఏర్పడుతాయి.

మానవత్వ ఉపరితల గ్రహింపు:

మనుష్యులు గతకొన్ని దశాబ్దాలుగా అంతర్గత జీవన అభివృద్ధి మీదకన్న, వస్తువుల వినియోగంపట్ల ఆకర్షణ, సమాజంలో గొప్పవారన్న భావన, స్థాయిలపట్ల ఉత్సాహం, అధికారంపట్ల మక్కువ వంటి బాహ్య విషయాలపట్ల ఎక్కువ శ్రద్ధ కలిగి ఉన్నారు. మనుష్యులు, వారి అంతర్గత లక్ష్యాలైన, శీలము, నైతికతల ద్వార గౌరవాన్ని పొందడం అన్నది ఎప్పటిదో ప్రాచీనమైన విషయం కాదు. గొప్ప లక్ష్యశుద్ధిని కలిగినవారు, శీలవంతులుగా, గౌరవనీయమైన ప్రవర్తనను కలిగి ఉంటారన్నది నిజం.

ఇటువంటి జీవనం, 'మంచి జీవితం' అన్న ఆలోచనకు అనుగుణంగా నిర్మించబడినది. దీర్ఘాలోచనల తరువాత, ఒకవ్యక్తి అటువంటి, మంచి శీలవంతమైన ప్రవర్తనతో, తనను తాను తీర్చి దిద్దుకుంటాడు. స్వభావనీతి కన్నా, మూర్తిమత్వపు నీతిని వివరించేటపుడు ఏర్పడే, అపాయకరమైన విషయాలను గురించి, వ్రాస్తూ, "వారి విధి వినాశకర మైనది. వారి భగవంతుడు, వారి ఆకలి మాత్రమే. వారి గౌరవం వారి అవమానంలోనే. వారి మనసు ఎపుడూ, లౌకిక విషయాల మీదే." అని పాల్ అన్న రచయిత గుర్తుచేస్తారు.

వ్యక్తిగత తృప్తికై ఉద్దేశించిన వాటిగానే, ఈ భూమిని, దాని ఉత్పత్తులను, సకల జీవరాసులను, ఇంకా సమస్తమైన వాటిని విస్తారంగా దోపిడీ చేయడం వలన ఈ ప్రపంచం పెద్ద సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నది. ఇదంతా దేనివలన అంటే, మనం, మన విధితోనున్న సంబంధాన్ని గురించి పూర్తిగా మర్చిపోయాం కనుకనే అన్నది గుర్తింపదగిన అంశం.

మన ఆలోచనలే మన గమ్యాన్ని నిర్ణయిస్తాయని చెప్పే, " ఒక ఆలోచనను నాటు. కర్మ అనే పంటను పొందు. ఒక కర్మను నాటు. ఒక అలవాటు అనే పంటను పొందు. ఒక అలవాటును నాటు.

శీలం అనే పంటను పొందు. శీలాన్ని నాటు. గమ్యమనే ఫలితాన్ని చేరుకో." అన్న సూక్తి గమనింపదగినది. ప్రస్తుతం మానవత్వంలోని లోపభూయిష్టమైన నమూనాలు, మన జీవితాలను, చాలా ఖరీదైనవిగా చేస్తున్నాయి. "జీవితం ఎపుడూ నకిలీ అవసరాలను తీర్చుకోవడం ద్వారా సౌకర్యవంతంగా ఉండదు. కాని సాధారణ జీవితం, ఉన్నత ఆలోచనల వలన మాత్రమే సౌకర్యవంతంగా ఉంటుంది." అన్న విషయాన్ని మనం మరిచిపోరాదు.

ఆధారం:

1. Wikipedia
2. Litareture found in the internet

❖ ❖ ❖

7. కలవరము, గందరగోళము
(THIS CONFUSED SOCIETY)
కలవరపరిచే సమాజం

ప్రాచీనకాలంలో కూడ, ద్వేషం, అత్యాశలు అన్నవి మానవజీవితాల పై అధికారాన్ని చలాయించాయి. క్రూరకృత్యాలు ఎన్నో జరిగాయి. యుద్ధాలు జరిగాయి. సంపద దోచుకొనబడినది. క్రమంగా భౌతికవాద కారణంగా, రాజకీయ సంక్షోభం, ఆహారకొరత, అంటువ్యాధులు వంటివి ఏర్పడినాయి. మానసిక కల్లోలాలు, పోటీ తత్వాలు అన్నవి చిట్టచివరి స్థానంలో ఉండినాయి గనుక, ఈ సమస్యల పరిష్కారం ఆనాడు కష్టం కాలేదు. వినియోగవస్తువుల స్థాయి తక్కువగా ఉండినది. పర్యావరణం భౌతికంగా రక్షింపబడుతూ, ఏ కొద్దిమంది ప్రజలు మాత్రమో, ప్రాకృతిక వనరులతో పెనుగులాడు తుండేవారు. ఏది ఏమైనా, ఈ నాటికన్నా మనిషి తన తోటివారిపట్ల తీవ్రంగా, కోపంగా ప్రవర్తిస్తున్నప్పటికీ, నేటివారికన్నా, అతని పరిసరాలు సంపూర్ణత్వానికి కొంచెం దూరంగానే ఉండేవి. అవి, తప్పించుకోవడానికి వీల్లేనంతగా ఏ విధమైన సామాజిక, మానసికపరమైన ఒత్తిడు లను వారిలో కలిగించలేదు. కాని మనిషిలో శాశ్వత కలవరాన్ని కలిగించేలా అవి, అతనిలో ఒకరకమైన గందరగోళాన్ని సృష్టించాయి. నేటి మానవుడు, అవధులు లేని అత్యాశలతో, పగ, ద్వేషాలతో, నడిపింపబడుతుండగా, నేటి ఆర్థిక సంబంధాలు, ఓటమిని చవిచూచేలా అతడిని పురిగొల్పు తున్నాయి. ఈ నేపథ్యంలో, మానవుని శక్తి అయిన హేతువాదం, జ్ఞానం సంపూర్ణంగా జయింపబడినాయి. క్రమంగా, ఈ స్థితిని సరియైన మనోదృక్పథంతో చూడడంలో అతడు విఫలుడవుతున్నాడు.

దయారహిత పరిసరాలు:

కాలం గడుస్తున్న కొలది, తన ప్రాపంచిక జీవితాన్ని, ఎక్కువ సౌకర్యవంతంగా మలుచుకునే ప్రయత్నంలో, అతని భౌతిక, మానసిక వాతావరణంలో దయారాహిత్యం చోటుచేసికోవడం జరిగింది. మనిషి తెలివితక్కువగా, భౌతిక అవసరాలపట్ల, ప్రేమను కలిగి ఉన్నందున, అది అతని అభ్యున్నతిని కొలిచే కొలబద్దగా గుర్తింపును పొందింది. నేటి ఆదర్శవాదుల, భౌతికవాదుల భావనలో, ఇది ఆశించినంతగా బలపరచబడినా, ఏదైతే, భీకరమైన సామాజిక, ఆర్థిక గందరగోళాన్ని సృష్టించిందో, ఆ భౌతిక అవసరాలపట్ల ప్రేమ, క్రమక్రమంగా ధార్మిక విలువలను పారద్రోలింది. సమాజంలోని ఎక్కువమంది, ప్రాపంచిక సంబంధమైన ఆనందం - తృప్తి అన్నవి, అవధులు లేనంతగా, వస్తువులను సేకరించడం, పెద్దపెద్ద ఉద్యోగాలను సంపాదించుకోవడం వలన మాత్రమే కలుగుతాయని నమ్ముతున్నారు. భౌతిక సౌకర్యాలు మాత్రమే మానవ ప్రగతికి చిహ్నమని, భౌతికవాదమే సమస్తమైన వాటిని అధిగమింపగలదని బాహాటంగా ప్రకటించే, భౌతికతత్త్వ ప్రాబల్యం వలన ఈ దృక్పథం బాగా ప్రచారంలోకి వచ్చింది. పరిహారాలుగా, ఈ తత్త్వం చెప్పే సూత్రాలు, పక్కా భౌతికవాద సంబంధాలే నని గుర్తుపట్టడంలో మనిషి విఫలుడవుతున్నాడు.

అయితే, ఆధునిక సామాజిక తత్త్వవేత్తలు, ఆర్థికవేత్తల చేత ఇవన్నీ కూడా, ఆదిమమైన, లేదా వెనుకబడిన జీవిత విధానంగా భావింపబడు తున్నాయి. వారి దృష్టిలో, ఎక్కువ అభివృద్ధిని సాధించడం

అంటే, మానవ సమాజం, వస్తువుల ఉచ్చులో తమను తాము ఎక్కువగా బిగించు కోవడమని అర్థం! సాధారణంగా మనిషి, నేరుగా, ఈ విషయాలచేత ఒకవిధంగా గాని, పెక్కువిధాలుగా గాని గాయపడి బాధపడేంతవరకు, ఈ కలవరాన్ని అర్థం చేసికోలేడు. మనిషి తరచుగా, ఈ కలవరం, గందరగోళం తనలోనే ఉన్నాయనిగాని, తానా స్థితిలోనే శాశ్వతంగా నివసిస్తున్నా ననిగాని, ఆ స్థితివైపు పయనిస్తున్నాననిగాని, తన ప్రస్తుత వాతావరణం ఇంకా ఆ స్థితికి ఆధారంగానే ఉందనిగాని గ్రహించడంలో విఫలుడవుతున్నాడు. సరియైన జ్ఞానాన్ని పొందే అవకాశం తనకింకా రాలేదని, సాటి మనుష్యులెప్పుడూ గందరగోళ పరిస్థితులలోనే ఉన్నారని అతడు అనుకుంటాడు. ఇది అత్యంత సహజమైన స్థితి.

ప్రసార, ప్రచారసాధనాలు చెబుతున్న, వివిధ దేశాలలోని గందరగోళ పరిస్థితులు, అక్రమ స్థితిగతులు, వ్యాకులతలను గురించిన వార్తా కథనాలు, యువతమీద ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచజనాభాలో, అత్యధిక సంఖ్యాకులైన యువతలో, వ్యాపించి ఉన్న అలజడులు, అశాంతి అన్నవి విశ్వవ్యాపితమైన, సామాజిక అస్వస్థతలే తప్ప వేరు కావు. సామాజిక, ఆర్థిక వాతావరణాలు భౌతికంగా సృష్టిస్తున్న సమాజంలోని కొంతభాగపు సమస్యలకు అవి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రస్తుత సామాజిక ఆర్తిక వ్యవస్థకు, తమ సమస్యలను తీర్చే సామర్థ్యం లేకపోవడం వలన, నేటి యువత సమాజంలో స్థిరపడి ఉన్న విలువలను వ్యతిరేకించడమే గాదు, సమాజం నుండి ఎటువంటి ప్రోత్సాహాన్ని గాని, ఆనందాన్ని గాని పొందలేక పోతున్నారు.

ఆధునిక ప్రపంచం, కృత్రిమమైన ప్రోత్సాహాన్నిచ్చే వస్తువుల అవసరం అన్న కారణంచేత, పారిశ్రామికీకరణకు దూరంగానున్న ప్రాచీనకాలపు సామాజిక విలువలను, అణచి వేస్తున్నాయి. ఈ కృత్రిమావశ్యకతల తృప్తి కోసం, ప్రజలు అత్యంత ఎక్కువ ధనసంపాదన చేయవలసి ఉంటుంది. దానిపై వారు, గొప్పగొప్ప, ఉద్యోగాలకోసం వెదుకులాట సాగించవలసి ఉంటుంది. యువతతో సరిపడినంతగా పెనవేసికున్న సమస్యలకు ఈ సత్యాలే ప్రధాన కారణాలు. ప్రపంచ జనాభా సమస్య కారణంగా, ప్రస్తుత సామాజిక విధానం, వెనుకడుగు వేయడానికి ఎంతో కాలం పట్టదు. జీవితంపట్ల, మానవునికున్న కోరికలు, వైఖరులను నేటి ఆర్థిక విధానాలు భరించలేవు, మానవ విలువలు, దృక్పథాలు మౌలికమైన మార్పులపై ఆధారపడి ఉంటే తప్ప. ఇటువంటి మానసిక మార్పులు హఠాత్తుగా సంభవించాలనుకోవడం చాలా కష్టమైన భావన! ప్రపంచపు అన్ని మూలల నుండి, ప్రస్తుతం, ధన సంపాదనా నిమిత్తమైన ఈ భౌతికస్వరం ప్రత్యక్షంగా వినిపిస్తున్నది, కాని ఆధ్యాత్మిక ప్రగతి అన్నది రెండవస్థానానికి త్రోసివేయబడినది. ప్రాచీనకాలంలో చెప్పికొనదగిన గుర్తింపును పొందిన ప్రాంతాలలో కూడ, ఆధ్యాత్మిక ప్రగతి, నేడు యిటువంటి రెండవ స్థానానికే చేరుకున్నది.

కలవరాలు, ఆందోళనల మూలకారణం:

చారిత్రికపరంగా పరిశీలిస్తే, నేటి ఆర్థికసమస్యలకు మూలకారణం గత యాభైయేళ్ల కాలంలో దూసుకొస్తున్న కొత్త కొత్త విధానాలే అన్నది గమనించగలం. పెక్కు రకాల వ్యాధులు, ఆకలిదప్పులు, వస్తువుల కొరత, నిరుద్యోగసమస్య, యుద్ధాలు, అధికధరలు మొదలైన వాటిచేత, వివిధ కాలాలలో, బాధలు పడుతున్నప్పటికీ, సుమారు రెండు శతాబ్దాలక్రితందాకా, అతి తక్కువ సంఖ్యలోనున్న ప్రపంచ జనాభా, తక్కువ సౌకర్యాల తోనే తృప్తి పడుతూ ఉండేవారు. అదేసమయంలో, నేటి సమాజం అనుభవిస్తున్న, భౌతిక, మానసికపరమైన ఒత్తిడులకు దూరంగా జీవితాన్ని గడిపేవారు. ఆ రోజుల్లో, సమాజం ఎదుర్కుంటున్న సమస్యలను సరిచేసే చరమసత్యాలుగా కూడ ఈ పరిస్థితులు, తరచూ పనిచేసేవి. ఉదాహరణకు, ఉపవాసాలు, వ్యాధులు అనేవి జనాభా తగ్గడానికి ప్రధాన కారణాలుగా పనిచేసేవి. ఏదిఏమైనా, పూర్వపు సమాజంలో, మానవ కల్పిత వైపరీత్యాలకన్నా,

ప్రాకృతికపరమైన వైపరీత్యాలే ప్రధాన సమస్యలుగా గుర్తింపబడేవి. కాని, మనందరము భాగస్వామ్యులుగానున్న ఆధునిక సమాజంలో మానవకల్పిత విలువలు, దాని ఫలితమైన ప్రమాదాలు, వినాశాలు అన్నవే నేటి కలవరాలకు, గందరగోళ పరిస్థితులకు ప్రధాన కారణాలుగా గుర్తింపబడుతున్నాయి. బుద్ధుడు ఉపదేశించిన ఆర్య అష్టాంగమార్గాన్ని అనుసరించడం వలన, ఇటువంటి అస్తవ్యస్త స్థితులను సులభంగా తొలగించడానికి వీలు పడుతుంది. ఉదాహరణకు, తప్పుడు జీవన విధానం వలన ఏర్పడే సంఘర్షణలను సమ్యక్ జీవనం, సమ్యక్ ప్రయత్నాలు తొలగించడమేగాదు, సమ్యక్ జీవన విధానం శాంతియుతంగా, సమరసంగా జీవించేలా సమాజానికి కూడ సాయపడుతుంది.

సమస్యలకు తగిన పరిష్కారంగా, ఆర్థికవిధానం కూడ సకృత్తుగా విశ్లేషించబడింది. వ్యాప్తిలోనున్న ఆర్థికచక్రాన్ని ఉపరితలం నుంచి మాత్రమే విశ్లేషించినా, ఈ విధానం కొంతవరకు, అంగీకరించదగిన స్థాయిలోనే ఉన్నది. ఆధునిక ఆర్థికశాస్త్రం, మనిషికి సంబంధించిన సామాజిక సమస్యల మూలాలను విశ్లేషించదు. ప్రధానంగా అది, సమస్యల అంచులను ప్రభావితం చేస్తుంది కనుకనే, ఈ భావన శాశ్వత ప్రాతిపదికన పరిష్కారాలను చూపడానికి అనర్హమైనదవుతుంది. తన రోజువారీ పనులకు, విధులకు, మార్గదర్శకం చేయగలిగిన, తత్వశాస్త్రాల, సిద్ధాంతాల మౌలిక నిర్వచనాల పట్ల, అప్రమత్తంగా లేకున్నట్లయితే, వారి తప్పుడు పనులను త్రోసిరాజని, మంచి పనులను నిర్వర్తించడానికి ప్రజలకు అవకాశం ఉండదు. ప్రపంచంలో చోటుచేసికుంటున్న ఈ రకమైన కలవరాలు, గందరగోళాలు, అస్తవ్యస్తస్థితులకు వ్యక్తిగతంగానో, సామూహికంగానో తాము చేసే పనులు కారణాలు కావు, అని ప్రజలు భావిస్తున్నారు. కాని ఈ అస్తవ్యస్తతలన్నీ వారి ప్రమేయం లేకనే, వారిని కారకులుగా చూపడానికి వీలు పడని, వారు ఆచరిస్తున్న బలీయమైన శక్తుల ప్రభావంతో ఏర్పడేవే! సమస్తమైన సామాజిక ఆర్థిక సమస్యలు, మానవకల్పితాలేనని, ఈ కలవరాలను, గందరగోళాన్ని, అపనమ్మకాలను తొలగించుకోవడానికి వ్యక్తి మాత్రమే బలమైన సాధనమన్న విలువైన సమాచారాన్ని, బౌద్ధ ఆర్థిక విధానం అందిస్తోంది.

ఆహారపు కొరత:

చాల దేశాలలో, ఎక్కువ పరిధిలో వ్యాపించిన, ఆకలి సమస్య, ఆకలి మరణాలు – వీటి గురించి తరచూ ప్రకటనలు వెలువడుతూనే ఉంటాయి. చాల చోట్ల వ్యాపించి ఉన్న క్రూరమైన, ఆహారపు కొరత, ప్రజలను పెద్ద సంఖ్యలోనే ఉపవాసపు అంచులకు చేరుస్తోంది. బౌద్ధం, మానవుని భౌతిక అవసరాలను గుర్తిస్తున్నా, బ్రదకడానికి ప్రాథమిక అవసరమైనదిగా, ఆహారానికి కొంత ప్రాధాన్యాన్నిస్తోంది.

ఆహారపు కొరత అనేది, కొత్త సమస్యకాదు. చరిత్ర, ఆహారపుకొరతను గురించి వివరించి చెబుతుంది. ఆహారం లభించక పస్తులున్న ప్రజలతో కూడిన దేశాల సామాజిక, రాజకీయ వ్యవస్థను తీవ్రంగా ప్రతిధ్వనిస్తున్నాయి, గనుక, నేడు కలవరపాటు, గందరగోళం వంటి పరిస్థితుల వివరణ అన్నది, ప్రధాన సమస్యగా మారింది. వందసంవత్సరాల క్రితం, ఈ ప్రాంతాలు ఎదుర్కొన్న ఇవే సమస్యలకన్నా, ప్రస్తుత సమస్యలు భిన్నమైనవి. ఈ పస్తులు అన్నవి, మనిషి ప్రాథమిక అవసరమైన, తగినంత ఆహారాన్ని అందించలేని ప్రభుత్వాల, ఆర్థిక, రాజకీయ వైఫల్యాలను ప్రతిఫలిస్తున్నాయి. తగినంతగా ధాన్యాన్ని పండించలేకపోవడమో, సేకరించలేకపోవడమో అన్న కారణాలవలన కాకుండ, సరికాని పద్ధతిలో రూపకల్పన చేయబడిన అభివృద్ధి పథకాల వలన మాత్రమే, పెక్కు దేశాలు తమ ప్రజలకు సరిపడినంత ఆహారాన్ని అందివ్వలేకపోతున్నాయి. అధికాహారోత్పత్తి కోసం ఉద్దేశించబడిన, విలువైన ఆర్థిక వనరులను, వేరే విషయాలవైపు దారి మళ్లించడం

జరుగుతున్నది. మొదటగా, సరిపడినంతగా ఆహారం అందని జనాభా, పోషకాహారలేమికి, దానివలన వ్యాధులకు గురికావడం వలన దేశ ఆరోగ్య పరిస్థితులు దెబ్బతింటాయి. ఇది పౌరుల భౌతిక, మానసిక సామర్థ్యాన్ని బలహీనపరచటం వలన, సమాజానికి బద్ధులై ఉండేలా వారిని నియంత్రించుకోవడంలో రాజ్యం విఫలమవుతున్నది.

రాజ్యాంగ బద్ధత కాని, ఈ భావజాలం, ద్వేషానికి మూల కారణమవుతుంది. వ్యక్తికి, సమాజానికి సంబంధించి, దౌర్జన్యం, ఆయుధాలతోకూడిన సంఘర్షణలు అన్నవి మానవ కర్మకు, చరమ సాధనాలుగా మారుతాయి.

జనాభా పెరుగుదల:

మానవ సమాజంలో, తీవ్రంగా పెరుగుతున్న జనాభా, ఆధారవనరుల రూపాన్ని అధ్వాన్న స్థితికి చేరుస్తోంది. నిజమైన ఆదాయం, సంపదల వ్యత్యాసాలు, అస్తిత్వ బేధాలు అన్నవి, కృత్రిమ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, దారితీస్తున్నాయి. అవసరమైన వస్తువుల కొరత ఎప్పుడూ ఉన్నదే. సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించే దృష్టితో, జనాభా పెరుగుదలను నియంత్రించడమే దీనికి తగిన పరిష్కారం. సమాజం, ఇప్పటికే పెరిగి ఉన్న జనాభాతో వ్యవహరించవలసి ఉన్నది. ప్రపంచంలోని అన్ని దేశాలు, సమానమైన కుటుంబనియంత్రణ విధానాలను అమలుపరిచినపుడు మాత్రమే జనాభా పెరుగుదలను అరికట్టగలం. ప్రస్తుతకాలంలో, కొన్ని సమాజాలు కుటుంబనియంత్రణను విధిగా పాటిస్తుండగా, కొన్ని దేశాలు ఈ చట్టాన్ని అమలుపరచడం లేదు. దాని ప్రకారం, విశ్వవ్యాప్తంగా అభిలషించిన స్థిరసంఖ్య (ఘ్తఅ౦ జూశీఱత్) ను గుర్తించడం కష్టమైనప్పటికీ, సామ్యవాద దేశాలు, పెట్టుబడిదారీ దేశాలు రెండూ కూడా, ఈ కుటుంబనియంత్రణ చట్టాలను, సాధారణ ఆర్థిక విధానాలను నియంత్రించే సాధనంగా గుర్తించి అమలుపరుస్తున్నాయి. ఆధునిక వ్యవస్థను సంక్షోభానికి గురిచేయగల సాధారణ ఆర్థిక విధానాన్ని పట్టించు కోనంతవరకు, పస్తులు, ఆహారపు కొరత వంటి ప్రధాన ఆర్థిక సమస్యలను, ఇప్పటికీ పెరుగుతున్న జనాభా మాత్రమే కల్లోల పరచగలదు.

ద్రవ్యోల్బణం, విరామం:

పెరుగుతున్న సంక్లిష్టమైన ఆధునిక ఆర్థిక విధానాలు, మానవాభివృద్ధి పట్ల పెరుగుతున్న తప్పుడు భావనలతో, నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్య మరికొంత విస్తరిస్తుంది. దీనికి ముఖ్యమైన ఉదాహరణ, ద్రవ్యోల్బణ, విరామాలకు సంబంధించిన ప్రోత్సాహమే! ద్రవ్యోల్బణం, లేదా ధరల పెరుగుదలలున్నపుడు, వ్యాపార లావాదేవీలను అధమాధమ స్థాయిలో నడపడం వీలు కాదు. అపుడు వ్యాపార విషయాలలో ఏర్పడే ఒక మాంద్యత వలన సాధారణంగా ధరలు పెరగలేవు, అని ఆధునిక ఆర్థికశాస్త్రం చెబుతుంది.

ద్రవ్యోల్బణం, విరామం రెండూ ఆధునిక సమాజంలో ఒకానొక అధ్వాన్నస్థితిని, కలవరపాటును కలిగిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, ధరలు పెరిగినపుడు, ఆదాయాన్ని బట్టి ప్రజలు వస్తువులను పరిమితంగానే కొనగలరు. విరామమేర్పడినపుడు లేదా, వ్యాపార లావాదేవీలలో వైఫల్యత సంభవించినపుడు, రోజువారీ జీవన అవసరాలను కూడా తీర్చుకోలేరు. ప్రపంచ ధనిక దేశాలలో పెద్ద సంఖ్యలోని ప్రజలు ఉద్యోగాలను కూడా కోల్పోయారు.

సోమరిపోతులకు పని లేదు, అని గాని, అవసరాలకు తగినంతగా వస్తువులను తయారు చేయలేమనిగాని, దీని అర్థం కాదు. తమ భత్యం గురించిగాని, విద్యాసంబంధమైన విషయాలను గాని ప్రతిభను గాని పట్టించుకోకుండా, ప్రతి దేశంలోని ప్రజలు ఉత్పత్తి సాధనలో, తమనుతాము భాగస్వామ్యులుగా చేసికుంటూనే ఉన్నారు. తమకు అవసరమైన వస్తువులను తయారుచేసికోవడంలో శక్తి గలవారిగానే ఉన్నారు. అందరికీ అవకాశాలు అందని, ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థ, అబద్ధపు వస్తువిలువల ఆధారంగా ఏర్పడిన ఫలితమే!

నిరుద్యోగ సమస్య:

బలవంతపు నిర్వ్యాపారాన్ని అనుభూతం చేసికోవటాన్ని మించిన గొప్ప కలవరం గాని, గందరగోళ పరిస్థితులుగాని వేరే ఏవీ లేవు. అందరికొరకు పనిచేయడానికి మనిషి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. పని అతని అస్తిత్వానికి, జీవనానికి మాత్రమేకాదు, మానవజాతి ఆధ్యాత్మిక, భౌతికాభివృద్ధికి కూడా అవసరమే! మరోవైపు, ఈ నిరుద్యోగసమస్య, తమ జీవిత కాలమంతా ఏ పనీ చేయక సోమరిగా మిగిలినవారిని లేదా కొంతకాలమైనా నిరుద్యోగులుగా మిగిలినవారిని, అనైతికులుగా, వైఫల్యురుగా, మారుస్తుంది. అటువంటివారు, సమాజ విధానంలోని ఏ భ్రాంతికీ లోబడని యదార్థ వాదులుగా మారుతారు. అదే సమయంలో, తనకు అవసరమైన అత్యంత ప్రాథమికమైన వస్తువులకోసం, చాలా కాలంగా ఎదురుచూస్తున్న వారు, కనీస అవసరాలైన ఆహారం, దుస్తులు వంటి మౌలికమైన అవసరాలను పొందలేకపోతున్నందున, ఇంతకుపూర్వం కన్నా, ఎక్కువ భౌతికవాదులుగా మారుతారు.

బాగా అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక వేత్తలు చెప్పినట్లు, సంపదలు, సంపదల లేమి అన్నవి చక్రభ్రమణాల వంటివి. ఎవరైతే, తమ ఉద్యోగాలను కోల్పోయారో, ఆ ప్రజలు వ్యాపార లావాదేవీలు యదార్థ స్థితికి చేరుకున్నపుడు, మళ్ళీ ఉద్యోగాలను పొందే అవకాశాలున్నాయి. కాని, పేద దేశాలలో, ముఖ్యంగా, విద్యాధికులైన యువతలో ఇటువంటి పరిస్థితులు, అస్తవ్యస్తతలకు, కలవరపాటుకు మూలకారకాలైన, రాజకీయ, సామాజిక సమస్యలను ఏర్పరుస్తున్నాయి.

అధిక వినియోగం, ప్రకృతి:

వస్తువుల వినియోగంలో గాని, ఆహార విషయంలో గాని, దుస్తుల విషయంలోగానీ, మితంగా వాడుకోవడాన్ని, బౌద్ధం సమర్థిస్తుంది. మానవుని అవసరాలను తీర్చడంలో, అంతిమ ఆధారమైన ప్రకృతిపట్ల ఒక మృదువైన ఆచరణను కలిగి ఉండటాన్ని ఒక అవసరంగా బౌద్ధం చెబుతుంది. ప్రకృతిపట్ల భీకరమైన, ఉగ్రమైన ప్రవర్తనకు, మానవునిలోని పేరాశ, ధనలోభం, ఇంకా ఇంకా ఆర్జించాలన్న తాపత్రయాలే కారణాలు. ప్రతిదాన్ని, అవసరానికి మించి కలిగి ఉండటం అన్న విషయాన్ని గొప్ప విషయంగా మనిషి భావిస్తాడు. దానిని పొందడానికి తన పనుల పట్ల ఏమాత్రం సిగ్గుపడకుండా, ప్రకృతి వనరులను దోచుకుంటాడు. తత్ఫలితంగా, ఆధునిక ప్రపంచంలో, గుర్తించవలసిన సమస్య అయిన, వస్తు వినియోగసమస్య, అవసరానికి మించిన అధిక వస్తువులను వినియోగించడం వలన, ప్రాకృతిక వనరుల తరుగుదలకు దారి తీయడమే గాక, అత్యంత తక్కువ వనరులను మాత్రమే మిగిల్చి ఉంచగలుగుతుంది. మానవుని అపరిమితమైన అవసరాలు, ఆర్థిక శాస్త్రాన్ని సవాలుచేసే ప్రత్యక్ష సత్యమని ఆధునిక ఆర్థికతత్త్వవేత్తలు సిద్ధాంతీకరిస్తున్నారు. ఇళ్ళలో ఉన్న, ఉపయోగించని ఎన్నో వస్తువులు, ఈ పరిస్థితిని వివరించే మంచి సాక్ష్యాలు. వస్తువులను

తయారీకరించడం, వాటిని ఉపయోగించడం అన్న విషయాల ఆధారంగా, నేటి సామాజిక స్థితిగతుల ప్రమాణాలు నిర్ణయింపబడుతున్నాయి.

అవసరాన్ని మించిన వస్తు వినియోగం, భవిష్యత్తరాలకు నష్టాన్ని కలిగిస్తుంది. ఈ భూమి మీద లభ్యమవుతున్న వనరులను ఈ తరంవారు, అవసరాలకు తగినంతగా మాత్రమే ఉపయోగించుకుంటూ, ఈ భువిపై నివసించబోతున్న భవిష్యత్తరాలు సురక్షితంగా జీవించడానికి, వారికి అందించవలసిన అవసరం కూడా ఉన్నది.

ప్రకృతికీ, మానవునికీ మధ్య ఒక సత్సంబంధాన్ని సమకూర్చుకున్నపుడే, ఇది సాధ్యమవుతుంది. మానవుని పేరాశకు, ధన లోభానికి, ఆర్జించాలన్న తాపత్రయానికి ప్రకృతి సాధనం కారాదు. ఈ భూమిలో నెలకొని ఉన్న క్షయమై పోయేవి, క్షయం కానివి అయిన రెండు రకాల వనరులు అయిన పెట్రోలియం, బొగ్గు వంటి ఇంధనాలు, మానవుని చేత నిర్మింపబడలేని, శిలాజాలు, తగరం, జింకు, రాగి వంటి ప్రాథమిక మూలకాలు మొదలైనవి ఈ ప్రకృతిలో నిక్షిప్తమై ఉన్నాయి. ఇంకా ఈ క్రమంలో, కొనసాగుతున్న మానవ అస్తిత్వాన్ని బలపరిచే, ఆధునిక ఆర్థికశాస్త్ర క్రియాశీలత అన్నది అర్థరహితమైనదిగా గుర్తించాలి. ఆధునిక కర్మాగారాలు, మానవుల ఎముకలను, రక్తాన్ని దుర్బలపరచే క్యాన్సర్ మొదలైన వ్యాధులను, ఆహారసంబంధమైన వ్యాధులను కలిగించే వాయువులను, రసాయనాలను, వ్యర్థపదార్థాలను విడుదల చేస్తున్నాయి. ఒకవైపు, పొగమంచు కారణంగా, రోడ్లమీద దీపాల వైఫల్యతల కారణంగా, జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మనుష్యుల ప్రాణాలను హరిస్తుంటే, మరో వైపు, కర్మాగారాల నుండి చెరువులలోనికి, నదులలోనికి విడుదలయ్యే వ్యర్థ పదార్థాలు, ఆ నీటిలోని చేపలను, ఆ నీటినుపయోగించి పండించే కూరగాయలను, ఆ నీరు కలిసే సముద్రంలోని జీవాలను విషపూరితంగా మారుస్తున్నాయి.

తన కష్టార్జితంతో ఆస్తులను సంపాదించుకోవద్దని, వస్తువులను తయారు చేసికోవద్దని, బుద్ధుడెపుడూ చెప్పలేదు. ఏ రూపంలో గాని, ఆధిపత్యాన్ని చలాయించే పేరాశతో కూడిన వ్యక్తిత్వాన్ని బుద్ధుడు సమర్థించలేదు. ఆయన సిద్ధాంతం, అధికోత్పత్తి అన్నది సమస్యకాదు, కాని మానవుని అభివృద్ధికి ఉపకరించేంత వరకైన ఉత్పత్తి చాలునని మాత్రమే

భావనా సంక్షోభాలు:

తమ అస్తిత్వ నిరూపణకై అత్యాధునికమైన ఆయుధాలను అభివృద్ధి పరచుకోవడానికి ప్రధాన వనరులైన, అంతర్జాతీయ ఆందోళనలు, రాజకీయ సంక్షోభాలు, కుట్రలు, విప్లవాలు, జాతీయ అరాచకాల వ్యాప్తి, సాంకేతిక స్పర్ధల వంటి నేటి సమాజమంతటా వ్యాపించిఉన్న, ప్రపంచ ఆర్థిక సమస్యలకు ప్రధానకారణాలైన భావనా సంక్షోభాలు, ఇంతకు పూర్వమే పేర్కొనబడినాయి. ఈ సంక్షోభాలు, సమాజంలోని జాతుల మధ్య విభేదాలకు దారితీస్తున్నాయి. నూట యాభై యేళ్లక్రితం పుట్టిన మార్క్స్ కన్నా ఎన్నో శతాబ్దాలు ముందు పుట్టిన బుద్ధుడు చెప్పిన, ఆదర్శాలు, భావాలు ఈ కాలానికీ తగియున్నవి. మార్క్స్, లెనిన్‌ల మౌలిక సిద్ధాంతాలనుండి, వ్యక్తిత్వ ప్రధానంగా విడదీయబడిన వామపక్ష రాజకీయాలు మున్నగునవి, తమ సిద్ధాంతాలను ప్రచారం చేస్తూనే ఉన్నాయి. ఆర్థిక సంబంధమైన, ప్రాథమిక భేదాలు కొలతలుగా, ప్రతిరోజూ ఇటువంటి కొత్త వర్గాలు పుడుతూ ఉండటాన్ని మనం చూస్తూనే ఉన్నాం. మార్క్సిస్ట్ తాత్విక సిద్ధాంతాలలో స్వల్పభేదాలతో, భావనా సంఘర్షణలతో ఎన్నో వర్గ భేదాలు ఏర్పడుతున్నా, వారు తమంతతాముగా ఒక విధానానికి కట్టుబడి

ఉన్నారు. తన్మూలంగా, రష్యా, చైనా దేశాలు రెండూ కమ్యూనిష్టు దేశాలే అయినా వాటిమధ్య దృక్పథాలలో చాలా తేడాలను గుర్తించగలం.

నిజానికి, పెట్టుబడుదారీ విధానం లేదా ప్రజాస్వామ్య విధానం మీదకన్న, కమ్యూనిజం, వ్యక్తి అభివృద్ధిపట్ల తక్కువగానే స్పందించింది. మార్క్స్, "మతం అనేది ప్రజలకు మత్తుమందు వంటిది." అని చెప్పాడు. కాని ఏ సామ్యవాద దేశం కూడా అవసరమైన వస్తూత్పత్తిని నిర్బంధించలేదు, ముఖ్యంగా ఆయుధాలు, సైనికోపయోగకారకాలైన ఆయుధాల ఉత్పత్తిని. ఎందుకంటే, తమ భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్ది, వారిని స్వాధీనులుగా చేసికోవాలంటే వీటి అవసరం ఉన్నది గనుక. అదే విధంగా, వ్యక్తి ఆచరణ చుట్టూ తిరిగే, సామ్యవాదంలో విభిన్నమైన, సంక్షోభాలు, కలవరాలు ఎన్నో దాగి ఉన్నాయి. బుద్ధుని ఉపదేశాలు, ప్రజాస్వామ్య జీవన విధానాన్ని ఉద్దేశించినవి. వ్యక్తిని గౌరవిస్తూ, స్వప్రయత్నాన్ని, స్వీయ నియంత్రణను ఉపదేశించే, బౌద్ధ తాత్వికత, సంపూర్ణంగా, సమరస భావనతో సాగెడిది. సామ్యవాదం, మనిషిని, ఉత్పత్తి సాధనంగా మాత్రమే చూస్తూ, అతని స్వేచ్ఛను హరిస్తుండగా, భౌతిక, నైతిక లక్ష్యాలమీద దృష్టిని నిలిపేలా బుద్ధుడు ప్రజలకు బోధించాడు.

ఒకవిధంగా, ప్రాథమికమైన ఆర్థిక పునాదులు, ముఖ్యంగా, పేదరికం వంటి వాటిలో, ఈ సామ్యవాదం (కమ్యూనిజం) సిద్ధాంతాలు, బౌద్ధం చెప్పే ఆర్థిక విధానాలకు దగ్గరగా ఉన్నట్లు కనిపించినా, మరో వైపు, ఆర్థిక దృక్పథంతో కూడి ఉండని, స్థిరమైన సమాజాన్ని గూర్చి బుద్ధుడెపుడూ ఉద్దేశించి ఉండలేదు. అంటే స్థిరమైన సమాజానికి సక్రమమైన ఆర్థిక దృక్పథం అవసరమని బుద్ధుడు ఉద్దేశించాడు. సామ్యవాదం, బౌద్ధం రెండింటి లక్ష్యం సామాజిక స్థిరత్వాన్ని ఉద్దేశించేవే అయినా, బుద్ధుడు ఉపదేశించిన శాంతి, అహింసా, వ్యక్తి గౌరవం వంటి సమరసభావనలలో పోలికే లేదు. కమ్యూనిజం, మార్క్సిజం, నియంతృత్వాలు ఆర్థికలక్ష్యాలను, కఠినమైన పద్ధతులద్వారా పొందాలనుకునేవే! బౌద్ధం మచ్చుకైనా చెప్పని, నిర్బంధ పద్ధతులతో కూడుకొన్నవే ఇవన్నీ.

సాటి మనుష్యులపై, అసహనంతో వెలసిన ఈ సిద్ధాంతాలు మానవుల అభివృద్ధికై ఏమీ చేయలేవు. పైగా, అవి మానవుల ఆధ్యాత్మిక ప్రకృతిని నశింపజేస్తున్నాయి కూడా. వ్యక్తి లోని స్వేచ్ఛాయుత ఆలోచనలను అభివృద్ధి పరచుకునే శక్తి కూడా బలహీన పరచబడినది. ఉదాహరణకు, వ్యక్తి యొక్క మాటలు, ఆలోచనలు, చేతలపై విధింపబడిన నియంత్రణలు, కఠినమైన ఆంక్షలు, వ్యక్తి స్వేచ్ఛగా ఎదగడానికి గాని, అతని ఆధ్యాత్మిక ప్రగతికి గాని తోడ్పడటం లేదు అన్నమాట నిజం.

సామాజిక కాలుష్యం:

నేడు మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య, వివిధ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల ఫలితాలే! అదే విధంగా, అభివృద్ధి చెందిన దేశాలలో సైతం, సామాజిక సమస్యలు అధ్వాన్నంగా, రూపుదిద్దుకుంటున్నాయి. తక్కువ అభివృద్ధికి నోచుకున్న దేశాలలో, ఈ ఫలితాలు పూర్తిగ, భిన్న రీతుల్లో కనిపిస్తున్నాయి. అదే సమయంలో, ఎక్కడయితే జాతి ఆధారంగా సాంఘిక వర్గాలు వేర్లూనుకున్నాయో, అటువంటి భూస్వామ్య వ్యవస్థ పునాదులపై, ఉన్నత వర్గం, అధమ వర్గం అన్న భేదాలు రూపుదిద్దుకున్నాయి. అయితే, బుద్ధుని బోధనల ప్రకారం, ఉన్నత, అధమ భేదాలను కలిగించే జాతి, పుట్టుకను బట్టి గాక, వ్యక్తి యొక్క ప్రవర్తనను, శీలాన్ని బట్టి ఏర్పడుతుంది.

ప్రపంచంలోని సంపన్న దేశాలు, సామాజిక భౌతిక పరంగానే గాక, మానసిక ఆధ్యాత్మిక పరంగా కూడా, కలుషితమయినాయి. వేగవంతమైన జీవనవిధానం, మానసిక ఆందోళనలు, ఆదుర్దాలు, మొదలైనవి, అధిక సంఖ్యలో సామాజిక క్రూరతను పెంచుతున్నాయి. వస్తుపరంగా, ఉద్యోగ పరంగా కూడా తాము ధనవంతులమేనన్న భావన, అప్రమత్తత నేటి ప్రజల్లో ఉన్నప్పటికీ, జీవన నాణ్యతమాత్రం రోజురోజుకూ తగ్గిపోతుంది. ఎదుగుతున్న సినీ పరిశ్రమ, సాంఘిక కాలుష్యానికి కారణమవడమే గాక, మనుష్యుల మానసిక ఆందోళనలను కూడా ఎక్కువ చేస్తుంది. ఒక రచయిత చెప్పినట్లు, "ఇక్కడ నేడు నువ్వు విభిన్నరీతులైన ధార్మిక పేదరికాన్ని చూడగలవు. ఇదే నేటి ప్రపంచపు అధమాధమమైన స్థితి. వాస్తవంగా నేటి అత్యధిక అభివృద్ధిచెందిన ప్రపంచపు మొత్తమైన లాభం ఇదే."

ఈ అభివృద్ధి చెందిన దేశాలలో కనిపిస్తున్న సంఘటనలు, పెరుగుతున్న ఆత్మహత్యలు, హత్యలు, ఆక్సిడెంట్లు, నేరాలు... వంటివి పూర్తిగా భౌతిక అవసరాలతో కూడిన జీవనంలో ఒత్తిడులను, సామాజికపరమైన గందరగోళాలను కలిగించడంతో ఆగక, తమ ఆత్మసంతృప్తి కోసం, అత్యధిక ధన సేకరణకు ప్రజలను ప్రేరేపించే ఆర్థిక విధానాలను కూడా ఏర్పరుస్తున్నాయి. అధికమవుతున్న లోభం, తృష్ణ అన్నవి అహేతుకమైన విధానాలను కలిగిన ద్వేషాన్ని, జీవనవేగాన్ని పెంచుతున్నాయి.

బౌద్ధ ఆర్థికవిధానం, ఐకమత్యంతో ఒకరికొకరు తోడ్పడుతూ, సామరస్యంగా ఎదిగే సామూహిక జీవనవిధానంలో దాని మూలాలను కలిగి ఉన్నది. ఎదుగుతున్న వ్యక్తి తనలోని స్వార్థాన్ని, ఇంకా ఇంకా ఆర్జించాలన్న తాపత్రయాన్ని, తనకు తానే తొలగించుకుంటాడు. ఈ స్థితిని నిరూపించే సామాజిక వ్యవస్థను చారిత్రికంగా మనం దర్శించాం. భారత దేశపు ప్రసిద్ధ చక్రవర్తి, అశోకుడు తన అత్యంత విశాలమైన సామ్రాజ్యాన్ని, బౌద్ధధర్మానుగతంగా పరిపాలించాడు. అతని పాలన కాలంలో, ప్రజలు శాంతి సామరస్యాలతో జీవించారు. రాజ్యం అన్ని రకాల అభివృద్ధి పథంవైపు అడుగులేసి సాగింది. ప్రజలు అలా సంతృప్తిగా జీవించడానికి కారణం, సంపూర్ణ జీవనం గడపడానికి తగిన ప్రాథమిక అవసరాలు వారికి లభించడమే. అశోకుని పాలనాలక్ష్యం, రాజ్యాన్ని విస్తరింప చేయడం కాదు, ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించడమే!

శాశ్వతమైన అవధులు లేని ఆర్థిక సంబంధ విస్తారతల సాధ్యం, సాధనలమీద నేటి ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉన్నది. కాని బుద్ధుడు, ఈ ప్రపంచం క్షణికమైనదని అన్నాడు . ప్రతివస్తువు, అశాశ్వతమైనదే కాబట్టి, ప్రతిదానికీ, ప్రారంభం, అంతం అనేవి ఉంటాయి. ఈ క్రమంలో, ఏది ముఖ్యం? ఏదికాదు? ఏ విధంగా ఆర్థిక లక్ష్యాలను సాధించగలం? ఏ విధంగా అప్రమత్తతను అభివృద్ధి పరచుకోగలం? అంత్యాలు ఏవి? వ్యక్తి తన అస్తిత్వానికి తగినంతవరకు మాత్రమే విలువైన వస్తు సేకరణ చేయడానికి మనసును తేటపరచుకొని ఉన్నాడా? అన్న విషయాలను గమనించాలి.

తప్పుడు లక్ష్యాలపట్ల శ్రద్ధ

ఆధునిక ఆర్థిక వ్యవహార శాస్త్రం–మానవుల అవసరాలు:

ప్రస్తుత సమాజంలో ఎక్కువ భాగాన్ని ఆక్రమించుకున్న ఆర్థిక, రాజకీయ, సామాజికపరమైన కలవరపాటు, గందరగోళాలకు, ఆర్థిక శాస్త్రాన్ని ప్రధానంగా కలిగి ఉండటమే కారణమని తెలుస్తోంది.

ఒకవేళ, లక్ష్యాలు, సాధనాలకు, ఆర్థిక వ్యవహార శాస్త్రానికి మధ్యగల సంబంధాన్ని, హేతుబద్ధత తో ఏర్పరచి ఉన్నట్లయితే, ఈ గందరగోళ పరిస్థితి కొంత తక్కువ స్థాయిలో ఉండి ఉండెడిదేమో! Keynes అన్న రచయిత, తన ప్రసిద్ధ రచన, The General Theory ని ప్రచురించే సమయానికే, ఆర్థిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్రంలా ఒక ఎదిగిన స్థాయికి చేరికొన్నది. అదే సమయంలో, లయన్ రాబిన్స్ వంటి వ్యాఖ్యాత మొదలుగా గల కొంతమంది రచయితలు. తత్వము, భావము అన్న విషయాల ఆధారంగా, ఆర్థశాస్త్రాన్ని, విజ్ఞానశాస్త్ర స్థాయికి చెందినదని వివరించారు., ఇవి, సంపూర్ణంగా, వారి అభిప్రాయాలు మాత్రమేకావు. ఆదం స్మిత్ తో మొదలుపెట్టి, గత నూటడెబ్బై అయిదు సంవత్సరాలలో భిన్న భిన్న ప్రాంతాలకు చెం దిన అర్ధ శాస్త్రవేత్తల అభిప్రాయాలను క్రోడీకరించి, లయన్ రాబిన్స్ వ్రాసిన, 'Nature and Significance of Economics' అన్న పుస్తకం అప్పటికే ప్రచురితమై ఉన్నది. లయన్ రాబిన్స్ తన పరిశోధనలో, అర్ధశాస్త్ర లక్ష్యాలు, వాటిసాధనాలు పట్ల, శ్రద్ధ కనబరిచారు. లయన్ రాబిన్స్ పరిశోధనా ఫలితాలయినా, అతనికి ముందున్నవారు చెప్పిన అంశాలయినా, మానవుని అవసరాలు, అంతులేని వస్తువులను, ఉద్యోగాలను సంపాదించాలన్న కోరికలు- అపారమైనవి కాగా, ఆ లక్ష్యాలను, సాధించడానికి లభ్యమవుతున్న, భౌతిక వనరులు మాత్రం చాల పరిమితమైనవే అన్న విషయాన్ని విశదపరుస్తున్నాయి. నిజానికి, ఎవరూ ప్రశ్నించడానికి వీలుపడని విధంగ, ఈ భౌతికవనరులు కచ్చితంగా, పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. ఇవి ఇలా గనుక లేనట్లయితే, అర్ధశాస్త్ర విజ్ఞానం ఇప్పటికన్నా భిన్నంగా ఉండెడిది. మానవుల లక్ష్యాలు, సాధనాలను సమతుల్యం చేయడానికి తగినంత వనరులను ఈ ప్రపంచం కలిగి ఉండగా, ప్రజలు, ఆ లభ్యమవుతున్న వనరులను వాడుకోవడంలో పరిమితిని పాటించాలి. వనరులను పరిమితంగా ఉపయోగించుకోవడం అన్న విషయం వివాదాస్పదమైనది కాదు, ఎందుకంటే, బౌద్ధం ఇదే విషయాన్ని చెబుతుంది. ప్రాకృతిక వనరులను అర్ధ వంతంగా ఉపయోగించు కుంటూ, తమ భౌతిక, ధార్మిక ప్రగతిని అభివృద్ధి పరచుకోవలసిందిగా, బుద్ధుడు, ఉపాసకులకు చెప్పాడు. ఎవరూ ఈ సిద్ధాంతాన్ని గూర్చి ప్రశ్నించవలసిన అవసరం లేదు, ఎందుకంటే, ఈ పరిమిత లక్ష్యాలను సాధించడానికి ఎన్నో మార్గాలున్నాయి. మరోవైపు, ఒక హేతువాది, తన ప్రాచ్య ఆలోచనల ఫలితంగా, మానవుని లక్ష్యాలు అపరిమితం అన్న దృక్పథాన్ని ఒప్పుకొనకపోవచ్చు. తాము అమ్ముతున్న వస్తువులను, నిజంగా అవసరం లేకున్నా, ప్రజలచేత ఎక్కువగా కొనిపించేలా బలవంతపెట్టే, భీకరంగా పెరుతున్న పారిశ్రామిక వరుస అంగళ్ల ను, న్యాయ పరిచేందుకై, బహుశః వారిలా నమ్ముతుండవచ్చు. వస్తువులు, పరిశ్రమలు, ప్రాబల్యకారకాలు గనుక, ఈ వస్తువుల సేకరణ, ప్రకృతిని నిర్దయతో దోపిడీ చేసే విధంగా, మానవుని ప్రేరేపిస్తుంది. మనిషి తన చుట్టూ ఉన్న ఇతర అంశాలకన్నా, కర్మాగారాలకోసమే తన అస్తిత్వాన్ని కలిగి ఉన్నట్లు కనబడుతున్నది.

ధార్మిక ఎదుగుదల వలన, ప్రజలు తమ భౌతిక అవసరాల వెదుకులాటపట్ల తమకుగల అభిరుచిని పరిమితం చేయలేరు. రెండవదే నిజమైనట్లయితే, అతని భౌతిక అవసరాలు సిద్ధాంతపరంగా అసంఖ్యాకమని, ఆధునిక అర్ధ శాస్త్రవేత్త చెబుతాడు. అయితే, మనిషిలోని, ధార్మిక పరమైన, ఎదుగుదల, అతని ధార్మిక, భౌతిక పరమైన అవసరాలను, చక్కగా సమతుల్యం చేయగలదు. ఎలాగంటే, అతని భౌతిక అవసరాలు, సిద్ధాంతపరంగా, అసంఖ్యాకమే అయినా, మంచి జీవననిమిత్తం, తాము పొందిన వస్తువులలోనే, తమ ఆనందాన్ని, సంతృప్తిని పొందడం ద్వారా! బుద్ధుడు చెప్పిన ఆర్థిక వ్యవహార విధానం, 'మానవుని అవసరాలు తీరాలి, కాని జీవితం పూర్తిగా భౌతిక అవసరాల నిమిత్తం మాత్రమే కాదు', అని చెబుతుంది.

బుద్ధుని ప్రకారం, ఒకవ్యక్తియొక్క ప్రాథమిక అవసరాలు తృప్తిపరచబడినపుడు మాత్రమే, అతడు సంతృప్తితో జీవించగలడు. సతోషం అన్నది, సురక్షితమైన ఆర్థికవిధానం మీద ఆధారపడి ఉంటుందని కూడా బుద్ధుడు చెబుతాడు. సంపదలకు, స్వాతంత్ర్యానికి సంబంధించిన ఆనందం, అప్పులు లేకుండా, నిందాత్మకం కాకూడా బ్రదికే నైతిక వర్తన మీద ఆధారపడి ఉంటుంది అని అంటాడు.

ఆర్థిక వ్యవహారాభివృద్ధి:

ఆధునిక అర్ధశాస్త్రం, ఇతర విషయాలచేత ఆవరింపబడి ఉన్నందున, లక్ష్యాలకు సాధనాలకు సంబంధించిన సమస్యలు, ప్రస్తుతం ఎప్పడో గాని పరిష్కరింపబడటం లేదు. ఆధునిక అర్థశాస్త్రం, ప్రముఖంగా, పేదదేశాల అభివృద్ధికి, ఆ దేశాల ఆర్థిక ఎదుగుదలకు పాటుపడుతుంది. నేడు, ఆర్థికాభివృద్ధియొక్క ప్రధాన లక్ష్యం, ప్రజల సుస్థిరజీవనం కోసం తగినంత, వస్తువులను అభివృద్ధిపరచడం. బుద్ధుడు ఉపదేశించిన, స్థిరమైన సామాజిక సూత్రాలతో ఇది పోలి ఉంది. ఆధునిక సమాజంలో, ప్రజలు సౌకర్యవంతంగా, బ్రతకడానికి, అవసరమైన వస్తువులను అందివ్వడం, ఉద్యోగావకాశాలను పెంచడం, మరిన్ని సౌకర్యాలను కల్గించడం వంటివి మూలకారకాలుగా గుర్తింపబడుతున్నాయి.

వస్తువులను, ఉద్యోగాలను స్థాపించి, మానవుల ఆర్థికాభివృద్ధిని ఫలవంతంగా సాధించ వచ్చుననుకోవడం, మానవుని నైతిక, ధార్మిక ఎదుగుదలకు, ఏ కొంచెం కూడా సాయపడటం లేదు. గ్రంథాలలో, విద్యమూలంగా మానవ వనరులను అభివృద్ధి పరచగలమన్న ఆధారాలు కనిపిస్తున్నా, ముఖ్యమైన విషయం ఏమిటంటే, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విలువలను ఉపయోగించి, మానవుల సామర్థ్యాన్ని వారి ధార్మిక ప్రగతి దిశగా గాక, గుంపు తయారీదారులలో భాగస్వామ్యులుగా చేరడానికి వారిని సన్నద్ధులుగా చేయడం జరుగుతున్నది. ఇందులో వాస్తవమేమిటంటే, వస్తువులను తయారు చేయడానికో లేదా ఆర్థికపరమైన ఊడిగం చేయడానికో మనుష్యులను సన్నద్ధులుగా చేయడానికి వారిలోని నైపుణ్యతలను బలపరచడమేనని అర్థం.

శ్రీలంకవంటి పేద దేశాలలోనే కాదు, పెద్ద సంఖ్యలోని సంపన్న దేశాలలో కూడా, ఇటీవల వరుసగా జరుగుతున్న సంఘటనలు, భౌతిక అవసరాలు, సాధనాలు మాత్రమే, మానవుని పూర్తి జీవితాన్ని తృప్తిపరచడానికి సరిపోవని నిరూపిస్తున్నాయి. ఎక్కువ సంఖ్యలో ముందే ఆవరించి ఉన్న జీవనానికి అవసరమైన ప్రధాన వస్తువులు, పర్యావరణాన్ని, సకల జీవరాసులను మనిషికి హానికరంగా మార్చడమేగాక, సామాజిక, నైతిక దిగజారుడుతనాన్ని, ఏర్పరచగల పెక్కు వ్యతిరేక కారకాలను కూడా కలిగిస్తున్నాయి. సంపన్నదేశాలలో, ఈ పరిణామదశ, ఆర్థికాభివృద్ధి ఫలితాలను సంపూర్ణంగా వ్యతిరేకిస్తున్నది. మానవుని స్వకీయ ప్రయత్నం వలన బయల్పడిన, అననుకూలమైన వాతావరణం, మానవుని ధార్మికాభివృద్ధిని మాత్రమే కాదు, ఆర్థికవ్యవస్థ పెరుగుదలను కూడా దుష్ప్రభానికి గురిచేస్తున్నది. సరియైన విలువలను కప్పివేసి, జీవన నైతిక ప్రమాణాలను ఏదయితే తొలగిస్తుందో, అటువంటి ప్రధాన వస్తువుల అందుబాటుకు మనిషి నిజానికి సంతోషపడతాడు.

విప్లవం, సంఘర్షణ, మానసిక ఆందోళనల నేపథ్యంలో, సమతుల్యమైన, సంపూర్ణ వ్యక్తిత్వంతో కూడిన జీవన ప్రమాణాలు కోరబడుతున్నవి. పేదదేశాల అభివృద్ధికై, కృషిచేసే ప్రాథమిక చట్రాలతో కూడిన ఆధునిక ఆర్థిక వ్యవహారశాస్త్రం, అన్నిరకాలకు చెందిన ఆర్థికవిధానాలలో కనిపిస్తున్న సామాజిక వాతావరణ సమస్యలను పరిష్కరించడానికి చాలిఉండటం లేదు. ఒత్తిడిని కలిగించడానికి తగినంత ప్రధాన వస్తువులపై నున్న శ్రద్ధ దీనికి ముఖ్యకారణంగా గుర్తించగలం.

మానవుని సంపూర్ణాభివృద్ధి:

ఆహారం, దుస్తులు, ఇల్లు ఇతర రామణీయకతలు వంటి ప్రాథమిక అవసరాలు, మానవుని అస్తిత్వ నిరూపణకు తోడ్పడుతున్నట్లు, వ్యక్తమవు తుంది. బౌద్ధ సిద్ధాంతం కూడా, ఈ విషయాన్ని అంగీకరిస్తుంది. బౌద్ధంలో, దాని మౌలికతాత్వికత కారణంగా, మానవాభివృద్ధి అన్నది, విభిన్న దృక్పథాలన్నీ కలిసి ఏర్పడిన ఒకానొక సమైక్య రూపమే! ప్రధాన వస్తువుల ఆవశ్యకత అన్నది, మానవాభివృద్ధిలో ఒక భాగం మాత్రమే!

ధార్మిక, భౌతిక, సామాజిక సంబంధమైన ఏ అభివృద్ధి అయినా, బయటినుండి వచ్చే దుర్మార్గశక్తులను జయించి, తనకుతానై ఎదగవలసిన మనిషి మీద ఆధార పడినవే! సాధారణంగా బయటి శక్తులు, మంచిస్థితిలోనికి చేర్చడానికి గాని, అధమ స్థితిలోనికి నెట్టివేయడానికిగాని వ్యక్తిని ప్రభావితం చేస్తాయి. మనిషి తనకు తానే యజమానిగనుక, అతడు ఎటువంటి బయటిశక్తులపై ఆధారపడవలసిన అవసరంలేదు. పైగా, తన మానసిక శక్తిని, స్వయంగా, ఉపయోగించటం వలన, చెడును ఎదుర్కోవడానికి తనను తాను సన్నద్ధునిగా చేసికొనగలడు. సమస్త భౌతిక ప్రపంచం తన సొంత సృష్టి గనుక, తనదైన సమస్తాభివృద్ధికి తాను మాత్రమే బాధ్యుడుగా అవుతున్నాడు, మనిషి. ఎందుకంటే, అటువంటి ప్రపంచాన్ని సృష్టించుకో గలు గుతున్నాడంటే, ఆ సంఘటనలు, ముఖ్యంగా ప్రాపంచిక సంఘటనలపైనున్న అభిరుచిని మార్చుకునే శక్తి అతనికి ఉన్నదని అర్థం. ప్రస్తుతమున్న స్థితి, తన ప్రగతికి హానిని కలిగించేదని అతడు భావించినట్లయితే, అతడు మాత్రమే, ఈ విధానాన్ని సరిచేసికో గలిగిన స్థాయిని కలిగి ఉన్నాడు. బుద్ధుడు బోధించినట్లు, వ్యక్తి తనకుతానే మధ్యవర్తిగా, తనంతట తాను సర్వోత్కృష్టునిగా మారగలడు. ఇటువంటి మార్పులు ధార్మిక ప్రగతి వలన మాత్రమే వీలవుతుంది. ఉదాహరణకు, ప్రస్తుత అధిక వస్తువుల తయారీలో, సాంకేతిక అభివృద్ధిలో చూపబడు తున్న అతడి ప్రయత్నం, నైపుణ్యతలను, ఇదేవిధంగా నైతిక, ధార్మిక అభివృద్ధికి కూడా ఉపయోగించుకోవచ్చు. నేటి ప్రపంచం, అత్యధిక భౌతిక అవసరాల సేకరణ, ఉపయోగం వలన, హింసాత్మకంగా, నాశనరీతిలో సాగుతున్నది గనుక, వస్తువుల బలంతో, ఆధిపత్యం చలాయిస్తున్నా ఈ ప్రపంచంలో అహింస, న్యాయం వంటి తాత్వికాంశాలకు సంబంధం లేకుండా పోతున్నది. వైవిధ్యభరితమైన, మత, కుల భేదాలకు కారకమైన, ద్వేషం, హింస వంటి వినాశకర మైన హేతువులచేత ఆదరింపబడుతున్న భౌతికవాదం, నేటి సమాజానికి భారంగా తయారయిందని, చరిత్ర నిస్సందేహంగా చాటుతున్నది. ఎక్కడయితే, నిర్దిష్టజాతికి, భాషకు, సంస్కృతికి చెందిన, ప్రమాణాలు, ధార్మిక విలువలు నశిస్తాయో, అటువంటి సమాజంలో మాత్రమే ద్వేషం, హింస, నాశాత్మకమైన పోటీ తత్వాలు మొదలైనవి ఉద్భవిస్తాయి.

స్థూలజాతీయ ఉత్పత్తి - తప్పుడు అభిప్రాయాలు:

వస్తువుల ఉత్పత్తి, వినియోగం, ఉద్యోగాలు తగ్గినపుడు, నిరుద్యోగసమస్య ప్రబలుతుందనేది ఆధునిక అర్థశాస్త్రం చెప్పే ముఖ్య సిద్ధాంతం. నిరుద్యోగ సమస్యను తొలగించాలనుకుంటే ఒక దేశం, మనుష్యులకు ఉపయోగపడినా లేకున్నా, వస్తువుల తయారీని ఆపకుండా కొనసాగిస్తూ ఉండవలసినదే! పైగా పెద్దపెద్ద సామ్యవాద దేశాలు, వస్తువుల తయారీ కోసం మానవవనరుల అభివృద్ధికై కేటాయించిన మొత్తంలో పేర్కొనదగిన కొంత భాగాన్ని, యుద్ధసంధమైన ఆయుధాల తయారీకి మళ్ళించడం జరుగుతున్నది. తాము సంతోషంగా లేకున్నా, ధనవంతులు ప్రదర్శించుకున్నంతగా వస్తువుల ఉచ్చులో బాహిరంగా తాము తగులుకోలేకున్నా, పేదప్రజలు, ధనవంతులు వెచ్చించిన ధనాన్ని తాము వెచ్చించలేరు గనుక, తమ వినియోగ అవసరాలను పేర్కొనదగిన స్థాయిలో తగ్గించుకుంటున్నారు.

వస్తువులను, ఉద్యోగాలను ఉత్పత్తిచేయగల మొత్తాన్ని, ఆ దేశపు 'స్థూల జాతీయ ఉత్పత్తి' (GNP) గా గుర్తిస్తారు. ఎక్కువ వస్తూత్పాదన, ఉద్యోగావకాశాలు పెరిగిన కొలదీ ఆ దేశపు 'స్థూలజాతీయ ఉత్పత్తి' పెరిగి, ఆ దేశం ధనిక దేశంగా గుర్తింపును పొందుతుంది. GNP మాటల్లో చెప్పాలంటే, ఒక దేశం యొక్క ఆర్థికపరమైన అభివృద్ధి, ఆ దేశ సంపన్నతకు చిహ్నంగా గుర్తింపబడుతుంది. ఇలా చెప్పాలంటే, ఎటువంటి వస్తు వులయినా, తయారీ విధానంలో ఆలస్యమయినా, త్వరితమైనా, వాణిజ్య ప్రకటనలు, అత్యాధునికమైన అమ్మకపు సూత్రప్రమాణాల మూలంగా, అన్ని వస్తువులు అమ్మివేయబడుతున్నాయి. సాధారణ పద్ధతిలో, తమదగ్గర తగినంతగా ధనం ఉన్నా, వాణిజ్య ప్రకటలు లేకపోయినట్లయితే, ఎక్కువమంది ప్రజలీ వస్తువులను కొనలేరు. వినియోగదారులు దృష్టిలో వాణిజ్య ప్రకటనలు, ప్రజలకు తెలియపరచడంకన్నా, ఏకస్వ (patent rights) విధ్వంశానికే ఉపయోగింపబడుతున్నాయి. ఉత్పత్తి సానుకూలంగా, లాభదాయకంగా సాగడానికి తగిన అవసరాన్ని ఏర్పరుస్తున్నాయి గనుక, ఈ ఆధునిక అమ్మకపు అభివృద్ధి పథకాలు, దేశం యొక్క స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతున్నాయి.

GNP విశ్లేషణలో, తరచూ నిర్లక్ష్యం చేయబడే అంశం, మానవాభివృద్ధికే ఈ అభివృద్ధి జరుగుతున్నదా అనే అంశం. ఎక్కువ వినియోగం, ఉన్నతస్థితిలో బ్రదుకుతున్నారనడానికి సమానార్థకం కాదు. ఒక్కసారి ప్రజల భౌతికాభివృద్ధికి కావలసిన వస్తువులు, ఉద్యోగాల ఉత్పత్తి, హేతుపూర్వకంగా జరిగినట్లయితే, జనాభా పెరుగుదల కానంతవరకు, భారీ ఎత్తున వస్తువుల, ఉద్యోగాల ఉత్పత్తి అవసరం ప్రజలకు ఉండదు. మానవాభివృద్ధి అనేది, ప్రజల జీవన స్థితిగతుల నాణ్యతమీద అవసరమైనంత వస్తువులను కావలసినంతమేరకే ఉపయోగించుకోగలిగిన సామర్థ్యం మీద మాత్రమే ఆధారపడి ఉన్నది. తక్కువ వ్యయము, ప్రయత్నం ద్వారానే, మానవాభివృద్ధిని సాధించగలం అన్న సత్యం మీదే ఆధారపడి ఉన్నది.

పేద దేశాలయినా, ధనిక దేశాలయినా, వాటి ఆర్థికాభివృద్ధి అనేది, అధిక సంఖ్యలో వారు వినియోగించే వస్తువుల సూచనమేరకేనని, నేడు నిర్ధారింపబడుతున్నది. GNP లేదా పెరుగుదల స్థాయి, మరియు ప్రధాన రాబడిమీద ఆధారపడి, ఈ సూచనలుంటాయి. సమయపాలన, వనరులు, శక్తిని ఉపయోగించి, దాదాపు అన్ని దేశాలు ఇటువంటి పట్టికలను తయారు చేస్తున్నాయి. ఈ సూచికలు, క్రమంగా ఒక దేశపు ఆర్థిక శక్తిని లెక్కించడానికి ఆ దేశాన్ని అంతర్జాతీయస్థాయిలో పోల్చి చూడడానికి ఉపయోగింపబడుతున్నాయి. ఆధునిక ఆర్థిక శాస్త్రాభివృద్ధి, ఈ విశ్వాసాల చుట్టూనే నిర్మింపబడుతున్నాయి. గతంలో రెండవ ప్రపంచయుద్ధ కాలంలో, ఈ విశ్వాసాలను మరింత నొక్కివక్కాణించడం జరిగింది. అంతకుపూర్వం పెక్కు దేశాలు వలస పాలనలో ఉండి, అభివృద్ధిపరమైన దృక్పథాన్ని కలిగిలేనందువలన, ఆర్థికాభివృద్ధి అనే అంశానికి పెద్దగా అస్తిత్వం లేకుండెడిది. అణచివేతకు గురై యుండిన ఆ స్థితిలో, అభివృద్ధి పందేనికి దూరంగానున్న, రాజకీయ ప్రతిపత్తిలేని దేశాలను వారు కలుపుకొని చూసే అవకాశం లేదు.

అతిముఖ్యమైన ఆర్థికావసరం అంటే అవసరం లేని విషయాలపట్ల తృష్ణలేని స్థితిలో వ్యవహరించడమేనని అర్థం. అభివృద్ధిచెందిన దేశాల చారిత్రిక కాలానికన్న మించిన ఎంతో గత శతాబ్దాల వారసత్వం, సంస్కృతులను పేదదేశాలెన్నో కలిగి ఉన్నాయి. ఈ దేశాలు, తరాలనుండి తరాలకు వారసత్వంగా, ఆధ్యాత్మిక విలువల రూపంలో, సంప్రదాయం రూపంలో పొందిన సంపదలు అగణితమైనవి. భౌతిక అవసరాలవలెగాక, అంతర్గత విలువలను ప్రతిపాదించే ఈ శ్రేష్టతా లక్షణాలను ద్రవ్యసంబంధమైన పదాలతో వివరించలేము. కొన్ని వేల సంవత్సరాల క్రితం, తక్కువగా అభివృద్ధిచెందిన దేశాలెన్నో, తమ ఆర్థిక స్థితిగతులను మతం, నైతిక విలువల

నేపథ్యంతో గాఢంగా అభివృద్ధి చేసికున్నాయి. ఈ స్థితిని త్రోసిరాజని, ఒకానొక దుర్మార్గమైన, విధ్వంసకరమైన ప్రభావం ఈ నాటి మానవ సమాజమంతటా వ్యాపిస్తున్నది.

పేదరికపు సూచన:

ప్రతివ్యక్తికి అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించడం లేదా పేదరిక నిర్మూలనం అన్న అంశం, ప్రతి దేశం తన ప్రజలకు సమకూర్చే శ్రమ, ఉద్యోగాల ఆధారంగా గుర్తింపబడతాయి. ఆచరణాత్మకమైన జీవన విధానంలో కొన్ని ధనిక దేశాలు మాత్రమే జాతీయస్థాయి సమానతను పొందగలిగాయి. మరోవైపు, తగినంత ఆదాయానికి దూరమైన, తక్కువ ఆదాయాన్ని పొందగలిగినవారు నిర్ణీతకాలంలో పొందే లాభాల ఆధారంగా, పేదరికపు జాబితాను లెక్కించడం జరుగుతున్నది.

కాని ఈ విధానాన్ని అంతిమ నిర్ణయంగా గ్రహించడానికి వీలుపడదు. ఒక సమాజం యొక్క 'ప్రామాణిక సూత్రాలు', 'విలువల సంతుష్టి' పై ఆధారపడిన సామాజిక, ధార్మికపరమైన విలువలకు కూడా, ఈ నిర్ణయాధికారంలో భాగస్వామ్యాన్ని కల్పించాలి. అట్టడుగు స్థాయిలో నివసిస్తున్న ప్రజలలో పేర్కొనదగిన కొంతమంది భౌతిక ఆవశ్యకతలయినా అభివృద్ధిపరచబడినపుడు, వారి వైఖరిలో మార్పు రాగలదు. అదే సమయంలో, భౌతిక అవసరాలతోనే గాక, ధార్మిక, నైతికపరమైన అభివృద్ధిలో కూడ ఒక జాతి సాధించిన, ఆచరణాత్మకమైన అభివృద్ధిని, ఈ పట్టిక అర్థవంతంగా చూపగలదు.

నిజానికి తక్కువ సంఖ్యలోని దేశాలు, ఆదాయం, సంపదల విభజన అన్న పథకాన్ని అనుసరిస్తుంటే, పెక్కురు అంతర్జాతీయ ప్రతినిధులు, ఈ పథకానికి తగినంత ప్రాధాన్యాన్ని ఇవ్వడం లేదు అని గ్రహించగలం. ప్రపంచబ్యాంకు వంటి అభివృద్ధి ప్రాతినిధ్యం వహించిన సంస్థలు ప్రకటిస్తున్న పథకాలలో ప్రధానమైన సంక్షోభాలు తలసూపుతున్నాయి. వినియోగ వ్యయంగా నిర్ణయించి, సామాజిక సంక్షేమంకోసం, రాయితీలు, వ్యయాలను పునః పరిశీలించి ప్రపంచబ్యాంకు వినియోగ ఖర్చులక్రింద ఇస్తున్న ధనం, ప్రస్తుతం ఆదాయ పంపక పథకాల క్రింద, పేదరిక నిర్మూలనా పథకాల క్రింద వినియోగించడం జరుగుతున్నది.

అవసరం లేని వస్తువులు:

అధిక సంఖ్యలోని దేశాలలో, ముఖ్యంగా సంపన్న దేశాలలో, అత్యధిక సంఖ్యలో వస్తువుల తయారీ, ఉద్యోగాల పెంపుదల జరుగుతున్నా, అందులో కొంతభాగం మాత్రమే మానవుని అభివృద్ధికి ఉపకరించేవి కాగా, తక్కినవి మానవ వినాశానికి దోహదపడేవే! యుద్ధ సంబంధ ఆయుధాలు, మారణాత్మకాలైన అణ్వాయుధాలు, జీవసంబంధ, రసాయన సంబంధమైన యుద్ధ సామగ్రి వంటి ఆయుధాల తయారీ ప్రయత్నాలు, మానవుని వినాశం కోసం మాత్రమే గాక, మనం జీవిస్తున్న ఈ భూగ్రహం మీది వనరులను నాశం చేసి పర్యావరణ విధ్వంసానికి దారితీసే స్పష్టమైన ఉదాహరణలు. ప్రపంచంలోని ఆర్థికంగా అభివృద్ధి చెందిన పెక్కు దేశాలు, సామ్యవాదపాలనలో నున్న దేశాలు, తమ జాతీయ బడ్జెట్‌లో 25 శాతాన్ని యుద్ధసంబంధమైన ఆయుధాల తయారీకే నేడు ఉపయోగిస్తున్నాయి.

ఈ యుద్ధ సామగ్రి కొరకు పెట్టే వ్యయం, తక్కువ ఆదాయంతో జీవిస్తూ జీవన అవసరాలను తీర్చుకోలేని ప్రజలను అదే స్థితిలో వదలి వేస్తుంది. ప్రస్తుతం ఉపయోగింపబడుతున్న పాతబడిన యుద్ధ ఆయుధాల స్థానంలో అత్యంత అధునాతనమైన ఆయుధాలు, వ్యవస్థలు, కొత్త సామగ్రి తయారీ ఖర్చులు పెరుగుతున్నాయి.

ఇవేగాక, ఈ హేతుపూర్వక సమాజంలో ఉపయోగించి పారవేసే వస్తువుల తయారీలో ఎంతో జాతీయాదాయం వ్యయం కాబడుతున్నది. వాణిజ్య శక్తులకు లోబడిన వ్యక్తి మనస్సు, బుద్ధి రెండూ, ఫ్యాషన్ కోసం కావొచ్చు, తేలికదనానికి అలవాటుపడటం వలన కావొచ్చు, ఉపయోగించి పారవేసే వస్తువుల వాడకం నుండి బయటకు రావడం లేదు. ఉదాహరణకు, బూతు పుస్తకాలు, నీలి చిత్రాలు, మాదకద్రవ్యాలు, పొగాకు వంటి ఎన్నో ఉత్ప్రేరకాలకు మనిషి బానిసకావడమే దీనికి ఉదాహరణ. ఇందులో ఏవీ కూడా, అతని జీవన విధానానికి అవసరమైనవి కావు. పైగా వినియోగానికి పనికిరానివి కూడా! వీటికి బానిసలైన మనుష్యులు సమాజానికి భారంగా తయారవుతున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు పెక్కింటిలో ఈ రకమైన పనికి రాని, హానికరమైన వినియోగవస్తువులను న్యాయవిరుద్ధంగా అందించడానికి ఎన్నో నేర సంఘాలు తయారుకాబడుతున్నాయి. అధిక ఒత్తిడితో కూడిన ఈ వస్తువుల అమ్మకపు ప్రణాళికాపథకాల ద్వారా అందుబాటులోనికి వస్తున్న ఈ హానికరమైన వస్తువులకు చాల మంది బానిసలవుతున్నారు.

సహేతుకమైన ఉత్పాదన:

ఇంతవరకు చర్చించుకున్న విషయాలవలన, మానవుని వాస్తవమైన అభివృద్ధిని తూకం వేయడానికి ప్రస్తుతం ఉపయోగింపబడుతున్న సంఖ్యాత్మకమైన కొలతలు పనికిరావని తేలుతున్నది. ఈ సూచనలు మనిషిని రెండవ స్థానానికి త్రోసివేసి, వస్తువులకు ప్రథమ స్థానాన్ని ఇస్తున్నాయి. పేరాశ, ధన లోభత్వాలను తగ్గించుకున్నట్లయితే, అందరికీ అనుకూలమైన మార్గదర్శకాన్ని దగ్గర చేయగలిగిన, తేజస్సు, శాంతి, సంతృప్తి అన్నవి ఏర్పడుతాయి. బుద్ధుడు తన ధర్మబోధనలో సామాన్యమైన దుస్తులు, ఆహారం, ధ్యానం, ప్రతిఫలనలతో కూడిన జీవన విధానాన్ని ప్రకటించాడు. ఈ రకమైన సమాజంలో ఉన్నత నైతిక విలువలు మనిషిని, అదేవిధంగా సమాజాన్ని అభివృద్ధిపథం వైపు నడిపిస్తాయి.

నిరుద్యోగం, ఆదాయోత్పత్తి, ఉత్పాదన-పంపకం వంటి సమస్యలను సరిదిద్దడానికి చాలాకాలం నుండి ప్రశ్నింపబడిన రీతిలో కొనసాగుతున్న ఆర్థిక సిద్ధాంతాలు, పథకాలతో కూడి, సరైన రక్షణమార్గంలో సాగని ప్రస్తుత ఆర్థిక చక్రాన్ని, పునాదులతో సహా మార్చి కొత్త రూపమివ్వవలసిన అవసరం ఉన్నది. ఎన్నో ఆర్థికవిధానాలు వస్తువులను, ఉద్యోగాలను పెద్ద సంఖ్యలోనే కల్పిస్తున్నా, అత్యధిక సంఖ్యాకులు ఈ క్రమంలో ఉద్యోగాలను పొందుతున్నా, ఇంకా అధిక సంఖ్యాకుల మధ్య కొనసాగుతున్న పేదరిక నిర్మూలనను జయించడానికి వీలు కలగడం లేదు. అధిక సంఖ్యాకుల మధ్య పేదరిక సమస్య అన్నది ప్రపంచం మొత్తానికీ సంబంధించిన అంశమే! అట్టడుగు వర్గాల ఆదాయాన్ని పెంచడానికి అవసరమైన, ఆహారపదార్థాలు, దుస్తులు, ఇంటి సామగ్రి వంటి వస్తువులను అందివ్వడానికి తగిన, సాధనాలు, వనరులను చాలినంతగా అభివృద్ధి పరచుకోకపోవడం మొదలైనవి దీనికి కారణాలు. నేటి ప్రధాన సమస్య, వనరుల స్థాయిని తగినంతగా కలిగి ఉండి, తమ ఉత్పత్తిని, సులభంగా, అనుకున్న స్థాయికి పెంచుకోగలిగిన ప్రజలు, తమ సొంత అవసరాలను తీర్చగలిగిన లేదా వనరుల కొరత కలిగిన ఇతర దేశాలవారి వాడుకకు సరిపడిన వస్తువుల తయారీకి పూనుకోవడం లేదు అన్న వాస్తవం.

బౌద్ధం, విజ్ఞానశాస్త్రం, సాంకేతికవిద్య

మానవుని కోరికలను, దృక్పథాన్ని, జీవిత విధానాన్ని, శాస్త్ర, సాంకేతిక విద్యలు సంపూర్ణంగా స్వాధీనం చేసుకున్నప్పటికీ, బౌద్ధం వివరిస్తున్న జీవనతాత్వికతకు, ఆధునిక శాస్త్రసాంకేతిక విద్యలపై ఆధారపడిన

ఆర్థికాభివృద్ధికి మధ్య ఎటువంటి సంఘర్షణలూ లేవని గమనించగలం. ప్రస్తుతం మనం గుర్తించవలసిన అంశం, శాస్త్ర, సాంకేతికవిద్యలకు, అభివృద్ధికి మధ్యనొక సమతుల్యతను సాధించవలసి ఉన్నదని మాత్రమే! సాంకేతిక విద్యా ఫలితాలను దానికోసం మాత్రమే ఉపయోగించడంగాని, మానవజీవన విధ్వంసానికి దారితీయగల మార్గాలను సృష్టించడంగాని చేయనంత వరకు, సాంకేతిక మార్పులు ఆహ్వానింపదగినవే! యుద్ధ కార్ఖానాలు, అత్యంత ఆధునికమైన ఆయుధాల అవసరాలు... వీటితో పోల్చిచూసినపుడు, సాంకేతిక పరమైన కొత్త కల్పనలు, వాటి మార్పులు అన్నవి గుర్తింపదగిన స్థాయికి పెరిగాయని తెలిసికోగలం! పైగా, ఆధునిక సాంకేతిక శాస్త్ర సహాయం వలన, దేశాలు పరస్పరం పోటీపడుతూ, తమ తమ సొంతలాభాలు, ప్రయోజనాలకోసం విలువలు లేని గృహసంబంధమైన వస్తువులతో కూడిన ఆర్థిక తత్వాన్ని సృష్టించుకుంటున్నాయి, కాని, "వీటినుండి మనిషి ఏం పొందగలుగుతున్నాడు?" అన్న ప్రశ్న మాత్రం తలెత్తనీయడం లేదు.

తృప్తినివ్వగలిగిన జీవన స్థాయిని కల్పించుకోవడం వలన గాక, ఇతరమైనవాటిని పాతబరచగల, అత్యంత ఆధునికమైన జీవనస్థాయిని పెంపొందించుకోవడం వలన నిజమైన సంతుష్టి అన్నది కలుగుతుంది. దేశాలు, వ్యక్తులు సాంకేతికపరమైన కొత్త కల్పనల సహాయంచేత, ఆధునికమైన జీవనస్థాయిని అందుకోగలుగుతున్నారు. ఉన్నతమైన జీవన విలువల శక్యతలు ఏవి? అనిగాని, అటువంటి జీవన విలువలకోసం నిరీక్షణలు ఎందుకు ? అనిగాని రూఢియైన ఆలోచనలు ఎవరికీ లేవు. ఉన్నతస్థాయికి చెందిన జీవితాన్ని ఆనందిస్తున్న వారయినా, అంతటితో తృప్తిని పొందక, మరికొంత అభివృద్ధిని అభిలషిస్తున్నారు. ప్రస్తుతం మనిషి ఎదుర్కొంటున్న సంఘర్షణాత్మకమైన స్థితి ఇది. మనుష్యులను సంతృప్తిపరచగల జీవన విలువలు, మనుష్యులకు పరిపూర్ణమైన సంతృప్తినీయగలిగిన జీవన స్థాయి ఇంకా ఏర్పడలేదు గనుక, ఈ సంఘర్షణను దాటలేని స్థితిలోనే ఇంకా మానవుడున్నాడు.

బౌద్ధ ఆర్థిక ప్రణాళిక

అధిక వస్తూత్పత్తి, మానవాభివృద్ధిపట్ల నిర్లక్ష్యం అన్న వాటిని నేటి ప్రణాళికా విధానం నమ్ముతున్నది. వస్తువుల ఉపయోగం ద్వారా మనిషి అభివృద్ధి చెందాలన్న దృక్పథంతో ఆధునిక ఆర్థిక ప్రణాళికలు ఏర్పరచబడినాయి. 'అభివృద్ధి' అంటే భౌతిక వస్తువుల అభివృద్ధిగానే గుర్తింపబడినాయి గనుక, ఆధునిక వస్తు సంబంధమైన ప్రణాళిక అంటే వస్తు సంబంధమైన ఆధారపత్రం మాత్రమే అని గమనించాలి.

లౌకిక విషయాలను మాత్రమేగాక, తక్కిన అన్ని విషయాలకు సంబంధించిన వివిధ లక్ష్యాలను గూర్చి, బౌద్ధ ఆర్థిక విధానం పట్టించుకుంటుంది. ఈ లక్ష్య సాధనకోసం ఉపదేశింపబడిన బౌద్ధ విద్యకూడ విభిన్నమైనది. విలువలను పునశ్చరణచేసి, భౌతికపరమైన మార్పులు వ్యక్తిని బాధించక ముందే, మనిషిని పునర్నిర్మించే ప్రయత్నంలోని ప్రాధాన్యతను గుర్తించడమే బౌద్ధ ఆర్థిక విద్య యొక్క ప్రధాన లక్ష్యం.

ఈ భూమిపై నివశిస్తున్న మనిషితో దగ్గరితనాన్ని కలిగి ఉన్న విశాలమైన స్పష్టమైన బౌద్ధసిద్ధాంత అన్వయం, అనుకున్న స్థాయిలో గాక, తక్కువస్థాయిలోనే ముఖ్యత్వాన్ని సంతరించుకున్నది. తత్ఫలితంగా ప్రజలు, అసంఖ్యాకులయిన మేధోజీవులు చెప్పిన ప్రాపంచిక సంబంధమైన అంశాలపై మక్కువతో, బౌద్ధాన్ని కొంత పక్కకు పెట్టారు.

లక్ష్యాల ప్రత్యేకతలు:

దేశం ఉత్పత్తి చేసిన మొత్తం వస్తువుల విలువను, ఏర్పరచిన ఉద్యోగాలను, ఆ దేశంలో నివశిస్తున్న ప్రజల సంఖ్యచేత భాగించి లెక్కించే తలసరి ఆదాయ విధానం సరైన సంఖ్య నిస్తుందని నమ్మలేముగనుక, బౌద్ధ ఆర్థిక విధానం ఆచరణలో ఈ విధానాన్ని పరిగణించదు.

వనరులను పదిలంగా రక్షించే విధానాన్ని చేపట్టిననపుడు మాత్రమే ఆ వనరులను బౌద్ధ ఆర్థిక విధానం హేతుబద్ధతతో ఉపయోగించుకుంటున్నది. నాగరికులయిన ఔత్సాహికుల సమూహంగా ఈ వనరుల పరిరక్షణను గురించి ఆర్థిక ప్రణాళికావేత్తలు తరచూ భావిస్తుంటారు. ఉదాహరణకు, నేలకోతను ఏర్పరుస్తూ, పర్యావరణ వ్యవస్థలో మార్పులకు కారణమవుతూ, అకస్మాత్తుగా సంభవించే వరదలకు, తద్వారా జలాశయాల అడుగున బురదచేరికకు కారణమవుతూ, అడవులు నరికివేయబడుతున్నాయి. కొన్ని కోట్ల సంవత్సరాలనుండి ఏర్పడిన, ఇంకా ఏర్పడుతున్న మూలవనరు లను, అడవులను నరికివేయడమనే ఒకే దెబ్బతో మనిషి నాశం చేస్తున్నాడు. సహజంగానే బౌద్ధం ఏ రూపంలోనున్న జీవుల ప్రాణాలనయినా నాశం చేయకూడదని ప్రకటిస్తుందిగనుక, స్వయంచాలక శక్తితో జాతీయవన్యప్రాణులు అనే వనరులను కూడా రక్షిస్తూంది.

ప్రస్తుతం మనిషికి నిజంగా అవసరంకాని వస్తువులను, సంపదలను, ఉద్యోగాలను అధికసంఖ్యలో, ఉత్పత్తి చేయడం అనే విధానంవలన, పునర్నిర్మించడానికి వీలుకాని బొగ్గు, పెట్రోలు వంటి వనరులను త్రవ్వితీయటంద్వారా, అపారమైన విలువగల వనరులశాతాన్ని మనిషి ఖర్చుచేసి వేస్తున్నాడు. శక్తినిచ్చే ఈ ప్రాథమిక వనరులను త్వరితంగా ఖర్చు చేసివేయడం వలన, భవిష్యత్తరాలకోసం వాటిని రక్షించి ఉంచాలన్నది స్పష్టమవుతున్న సత్యం. పెట్రోలు విషయంలో ఈతరంవారు, గుర్తింపదగిన ప్రమాదకరస్థాయిలోనే, ఆయిల్ నిక్షేపాలను దోపిడీ చేస్తున్నారని తెలిసికోగలం. ఇతర ఏ విధమైన శక్తి వనరులకన్నా, ఆయిల్ తక్కువ కాలుష్యాన్ని కలిగిస్తుందిగనుక, ఆయిల్ నిక్షేపక్షేత్రాల రక్షణ చాలా ముఖ్యమైన అవసరం. ప్రాంతీయాభిమానంగల జాతులకన్నా, భిన్నంగా ఆధ్యాత్మికంగా ఎదిగిన మనిషి, మానవ సంతతి గురించి ఆలోచించగలడు.

బౌద్ధం అభివృద్ధి ప్రణాళికలో ముఖ్యమైన లక్ష్యం, భౌతిక, ఆధ్యాత్మిక పరమైన రెండింటికీ చెందిన, వ్యక్తిగతమైన అభివృద్ధిమాత్రమే. అచ్చంగా మానవాభివృద్ధితో సంబంధంకలిగిన బౌద్ధ ఆర్థిక విధానానికి, ఈ ఆర్థికాభివృద్ధి అనే పదప్రయోగానికి సంబంధం లేదు. భౌతిక అవసరాల ప్రకటన, వినియోగాల కోసం మాత్రమే ఆర్థిక ప్రణాళికలు ఏర్పడుతున్నపుడు, అవి మనిషి ధార్మికాభివృద్ధికి ఎలా ఉపకరించగలవు?

దానం విశేషం:

దానం అంటే ఇవ్వడం అనే అంశం, చుట్టూ ఉన్న పరిసరాలను బలోపేతం చేయగలిగిన అంశం! ఇంచుమించుగా అన్ని మతాలలోనూ కనిపించే ఈ 'దానం' అనే లక్షణానికి బౌద్ధంలో ప్రత్యేక స్థానముంది. ఈ పదానికి ప్రస్తుతమున్న సంకుచితమైన అర్థం, అన్వయం, ఆచరణతో కూడి, నిజమైన అర్థంతో విస్తరించవలసిన అవసరం ఉన్నది.

అధిక సంఖ్యలో చాలనంత ఎక్కువగా ప్రాథమిక వస్తువులు లభ్యమైనపుడు మాత్రమే, ప్రతియొక్కరు సమాన భాగాన్ని పొంది సంతోషంగా జీవించడానికి వీలుకలుగుతుంది అన్న లక్ష్యం ప్రధానంగా ఉండాలి. అందరికీ సమానంగా వస్తువులను అందించాలి అనుకున్నపుడు, ఆదాయ భేదాలను తొలగించాలి.

బౌద్ధ అభివృద్ధి ప్రణాళికలు, అధిక సంఖ్యా బలంచేత గుర్తించడం గాక, ప్రజల అవసరాలకు తగినంతగా లేదా కొంత తక్కువగానైనా అందించగల వస్తువుల సంఖ్యా బలం మీద, వారిని సంతృప్తిపరచగల విధానం మీద నిర్మింపబడినాయి.

నిషేధింపదగిన పనులు:

ఆయుధాలను, మనుషులను రవాణా చేయడం, మాంసం కొరకు జంతువుల పెంపకం, మత్తు పదార్థాలు, విషము, మాదకద్రవ్యాల వంటి వస్తువుల వ్యాపారాన్ని బుద్ధుడు నిషేధించాడని 'అంగుత్తర నికాయ' అన్న బౌద్ధ గ్రంథం వలన తెలుస్తున్నది. ప్రథమమైనది, ప్రధానమైనది అయిన పరిశ్రమల ప్రణాళికలన్నీ మానవునికి అవసరంలేనివి, మానవ విధ్వంసానికి దారితీసేవి అయిన వస్తువులను తయారుచేయడాన్ని బహిష్కరించింది. లభ్యమవుతున్న మత్తు పదార్థాలు, విష వస్తువులు, యితర హానికారకమయిన మాదకద్రవ్యాల అంచనాలను నిర్ణయించలేము గాని, నేటి ప్రపంచంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వ్యసనానికి అనుగుణంగా, వాటి ఉత్పత్తి కూడా నెమ్మదిగా పెరుగుతూనే ఉన్నది.

మత్తుపానీయాలు మానవుల శరీరాన్ని బలహీనపరుస్తాయి, రోగగ్రస్థం చేస్తాయి కనుక, మత్తుపానీయాల తయారీకి బౌద్ధ ఆర్థికశాస్త్రంలో చోటుకల్పింపబడలేదు. మాదక ద్రవ్యాల ప్రభావం వలన, మనిషి ఆలోచించే శక్తిని, ఆరోగ్యాన్ని నష్టపోతాడు. బుద్ధుడు నిషేధించిన వాణిజ్యాలలో మత్తుపదార్థాల వ్యాపారం ఒకటి. ఈ స్థితిని సాధించడం కష్టం కాదు. కొన్ని ఇస్లాం దేశాలలో మత్తుపానీయాలు పూర్తిగా నిషేధింపబడినాయి. తక్కిన దేశాలు ఇలా ఎందుకు చేయలేకపోతున్నాయన్నది ఆలోచింపవలసిన బాధాకరమైన అంశం.

వనరులు:

లక్ష్యాల ప్రత్యేకతలు, కోరదగిన అలవాట్ల బహిష్కరణల వంటి పనులకు తరువాత, ఈ ఆర్థిక ప్రణాళికలో మనం గుర్తించదగిన సమస్య, వనరులను గూర్చిన సమస్య. ఎంతమంది వ్యక్తులుతాము ఉత్పత్తిచేస్తున్న దానిలో ఏ కొంతనైనా ఎంతవరకు పొదుపుచేస్తున్నారన్నది గమనార్హం.

పొదుపు, సద్యస్ఫూర్తి ప్రాపంచిక విషయాలమీది అధిక తృష్ణా నియంత్రణల వంటి ముఖ్యసూత్రాల ఆధారంగా బౌద్ధధర్మం బోధింపబడినదికనుక, బౌద్ధ ఆర్థిక విధానం, మితవ్యయం అన్న అంశం మీద ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తుంది.

బౌద్ధం, తప్పనిసరిగా గాని, బలవంతపెట్టిగాని మితవ్యయం చేయమనిగాని, పొదుపు చేయమనిగాని చెప్పదు. అభివృద్ధి పథంవైపు పయనించాలంటే, అర్థమైన ఒకేఒకమార్గం మితవ్యయాన్ని ఆచరించడం పట్ల బౌద్ధ ఆర్థిక ప్రణాళికా విధానం ప్రజలను అప్రమత్తులను గావిస్తుంది. వ్యర్థ పదార్థాల నిషేధాన్ని గూర్చి చెప్పడం చేత, బౌద్ధం, సాధారణమైన జీవన విధానాన్ని ప్రతిపాదించడమేగాక, ప్రజలిప్పుడు గడుపుతున్న భౌతికపర మైన జీవన విధానంలో అవసరమైనంతవరకే వస్తువులను ఉపయోగించుకుంటూ మితవ్యయాన్ని పాటించేలా కొన్ని మార్పులను సూచిస్తుంది.

పొదుపుపట్ల ప్రచారం చేయవలసిన అవసరంగాని, అధిక వడ్డీరేట్లను ప్రకటించవలసిన అవసరం గాని లేదు. బౌద్ధ జీవన విధానంలోనే మితవ్యయం, పొదుపు ప్రణాళికలు కలిసి ఉన్నాయి. వడ్డీరేట్లు ఎప్పుడూ నామమాత్రంగానే ఉంటూ, సరియైన అప్రమత్తతతో, మితవ్యయంతో కూడిన సంపూర్ణ జీవన విధానాన్ని ప్రోత్సహించే బహుమతిగా మాత్రమే ఉండాలి. సామాజిక విలువలెప్పుడూ వడ్డీరేట్ల చేత నియంత్రించబడలేవు గనుక, అప్పుడు మాత్రమే సమాజం పొదుపుపట్ల, మితవ్యయం పట్ల స్వచ్ఛందంగా వ్యవహరిస్తుంది.

బహిరంగమైన, వ్యక్తిగతమైన పొదుపు పథకాలు:

బుద్ధుడు, బౌద్ధ ఉపాసకులకు తమ ఆదాయంలో నాల్గవ వంతును పొదుపు చేయవలసినదిగా చెప్పాడు. కాని, ఒక పేద దేశానికి ఈ విధానం చాలా కష్టతరమైన మార్గం కావొచ్చు. కాని, తమ ఆదాయంలో నాల్గవవంతుకంటే, యింకా ఎక్కువ మొత్తాన్ని సహకార విధానం వలన పొదుపు చేస్తున్న దేశాలు ప్రస్తుతం, మనకు ఎక్కువే కనబడుతున్నాయి.

ఒకదేశం, జాతీయ ఉత్పాదనకు మూడవవంతు ధనాన్ని మాత్రమే వినియోగించుకుంటే, మిగిలిన నాల్గవ వంతును పొదుపు చేయడమేకాదు, ఆ ధనాన్ని దేశ ఆర్థికాభివృద్ధికి పెట్టుబడిగా వాడుకోవచ్చు. దీని అర్థం, కనీసం జాతి ఉత్పాదనలో నాల్గవ వంతును భవిష్యత్తరాల అవసరంకోసం పక్కన ఉంచవచ్చు. ప్రాథమిక అవసరాలను సమకూర్చడానికి తగిన హామీగా మాత్రమే గాకుండా, ఎదురుచూడని రీతిలో ఏర్పడిన కరువులు, వరదలు, వ్యాధులు, అంటురోగాలు వంటివాటిని ఎదుర్కోవడానికి, ఇంకా చెప్పాలంటే, ఉత్పాదన నిమిత్తంగా కూడా, ఆ ధనాన్ని ఉపయోగించుకోవచ్చు.

ప్రస్తుతం అందరూ భావిస్తున్నట్లుగా వినియోగ విధానం మీద పొదుపు ఎటువంటి అడ్డగింపులను, నిలుపుదలను చూపవలసిన అవసరం లేదు. ముందే చేరికొన్న జీవన స్థాయికి హాని కలిగిస్తుందనిగాని, వినియోగ విషయంలో ప్రతియొక్కరు బరువైన త్యాగాలను చేయవలసిందనిగాని, అది సూచించవలసిన అవసరం లేదు. ఈ విషయంలో బౌద్ధవిధానంలో చెప్పబడిన సంప్రదాయికమైన ఉన్నతస్థాయి జీవన ప్రమాణాల మధ్యగల విశిష్టతను గమనించాలి. నైతిక, ధార్మికాభివృద్ధికి దూరంగా ఎటువంటి ఉన్నత ప్రమాణాలను జీవనగతిలో సాధించడం వీలుకాదు అన్న విషయాన్ని గుర్తించాలి.

బౌద్ధ ఆర్థిక విధానం ఫలితంగా, ఎక్కువ పొదుపు చేయడం వీలవుతుంది. కాబట్టి, ఈ పరిధిలో బౌద్ధ ఆర్థికవిధానం ఆధునిక ఆర్థిక సూత్రాలను ఒప్పుకుంటుంది. ఇక్కడ ముఖ్యమైన తేడా ఏమిటంటే, ఆధునిక ఆర్థిక విధానంకన్న, బౌద్ధ ఆర్థికవిధానం వలన ఉన్నత స్థాయి పొదుపు వీలవు తుంది. ఎందుకంటే, పొదుపు చేయబడుతున్న ధనం, ఈ రెండు విధానాలలో ఒకే పద్ధతిలో ఉపయోగించుకోవడం జరగడం లేదు గనుక. ఈ పొదుపు ధనాన్ని, విభిన్నమైన పథకాలలో నిల్వ చేయడంగాక, హేతుబద్ధంగా మానవాభివృద్ధికి అవసరమైన ఆర్థిక ప్రణాళికలకు, పంచబడుతుంది.

ప్రభుత్వాలు, యుద్ధ ఆయుధాల, మారణాయుధాల, హానికరమైన మాదకద్రవ్యాల, మత్తుపానీయాల, అవసరంలేని ఆడంబర వస్తువుల, బూతుబొమ్మల చిత్రాల వంటి నిషిద్ధ వ్యాపారాలకు ఈ పొదుపు ధనాన్ని వాడుకోరాదు. మరల పునరుద్ధరించలేని శక్తివనరులను నష్టపరుస్తూ, ఎనిమిది గ్యాస్ సిలిండర్లతో ఆడంబరంగా నడుస్తూ, వాయు కాలుష్యానికి కారకమయ్యే మోటారుకార్ల నిర్మాణాన్ని ఆపివేయవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తించాలి. సమానమైన సౌకర్యాలను, చిన్నవైన, నాలుగు సిలిండర్ల కార్ల ప్రయాణంలో కూడా ప్రజలు పొందగలరు. అదే విధంగా, ఎదురుచూడని విపత్తులకు దారితీసే, సూపర్ సోనిక్ క్రాఫ్ట్ తయారు చేయవలసిన అవసరం కూడా లేదు. అంతకన్నా, నేడు అందుబాటులోనున్న వాయుమార్గాల ద్వారానే వీలయినంత వేగంగా ప్రయాణం చేయగలరు.

అటువంటి సమాజంలో, ద్రవ్యోల్బణం ఏర్పడదు. ఎందుకంటే, ఉత్పత్తికి, వినియోగానికి ముఖ్యత్వాన్నిస్తూ, ధరలను మారుస్తూ వాడుకునే వస్తువుల కొరత విశ్వవ్యాపితంగా ఉండదు కాబట్టి. ప్రజలకోసం ఉత్పత్తి చేయబడే వస్తువులకు ద్రవ్యోల్బణం ద్వారా కొనగలిగిన శక్తిలో కోత ఉండదు. ప్రస్తుతం ప్రజలు, ద్రవ్యోల్బణం వలన, పొదుపు చేయలేక పోతున్నారు. ఏవైతే, అందుబాటును నిషేధిస్తుందో, లేదా తృప్తికరమైన లాభాపేక్షలకోసం తక్కువగా ఉత్పత్తి చేస్తుందో అటువంటి ఏకఛత్రాధిపత్యం చేత, ఈ వస్తువులు తయారుచేయబడి విక్రయించబడుతున్నాయి గనుక, ఈ స్థితి యింకా పెరిగే అవకాశాలున్నాయి.

బౌద్ధ ఆర్థిక చట్రం ప్రకారం, పొదుపు అనేది వ్యక్తిచేత మాత్రమే ఆచరించబడవలసినదిగాదు. ప్రభుత్వం కూడా తప్పక ఆచరించవలసిన అవసరమైన ప్రణాళిక ఇది. తగినన్ని పొదుపు పథకాల ద్వారా, కోశాగారం లోటును తరచూ ఏ విధంగా భర్తీ చేయాలో, ప్రభుత్వ పెట్టుబడులు, ఖర్చులు మొదలైనవి ఎలా ఉండాలో అన్న విషయాన్ని గురించి బౌద్ధ సాహిత్యంలోని కూటదంత సుత్తం చెబుతుంది. ఒకదేశం, అధిక మొత్తాన్ని, సైన్యం కోసమో, యుద్ధ ఆయుధాలను తయారుచేయడానికో, సేకరించడానికో ఖర్చుపెట్టవలసిన అవసరం లేదు. ఇలా చేయడం వలన ఒకరాజ్యం అధికంగా పొదుపు చేయడానికి వీలు కలుగుతుంది. రక్షకదళం మీద ఖర్చు కూడా పరిమితంగానే చేయవచ్చు. పోలీసుల జోక్యంతో పరిష్కరింపగలిగినవి కొంత నేరం, కొద్ది న్యాయాతిక్రమణ, మాదకద్రవ్య వ్యసనాలవంటి పెద్ద నేరాలకన్నా ఎక్కువ సంఖ్యలోనివి కొన్ని మాత్రమే ఉండవచ్చు.

భౌతికపరమైన లక్ష్యాలకు చోటు లేనందువలన, ఆదర్శాల సంఘర్షణల వలన తలెత్తే అంతర్జాతీయపరమైన ఒత్తిడుల తీవ్రత తక్కువే ఉండాలి. మిగిలిన ఒకే ఒక ఆదర్శం, ఆధ్యాత్మిక పునాదులను కలిగి, సమానమైన అభిలాషతో, శాంతియుత జీవనాన్ని ఆధ్యాత్మిక సామరస్యతను కలిగించే ఆదర్శం మాత్రమే! ఆధ్యాత్మిక సామరస్యత లేకపోవడం అన్న విషయం అన్నిరకాల ఒత్తిడులకు గొప్ప కారణమవుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వపాత్రను, సాధారణీకరించడంతోబాటు, అతి తక్కువ పరిధిలో అధికారం కొనసాగుతూ, అత్యవసరపనులు చేసే ఉద్యోగుల కోసం ఖర్చుపెట్టేదే ప్రభుత్వం చేసే పెద్ద ఖర్చుగా ఉండాలి. దాని ప్రకారం పెద్ద మొత్తంలో ధనాన్ని పొదుపు చేయడమేగాక, ఆ ధనం రాజకీయ, ఆధ్యాత్మిక పరిధులు రెండింటికి చెందిన మానవుల అభివృద్ధికి ఉపయోగించడానికి వీలవుతుంది.

అప్పు:

ఒకవ్యక్తి అప్పు చేయడాన్ని హద్దులో నియంత్రించుకొని, పెట్టుబడి పెట్టడానికి గట్టిగా ప్రయత్నించాలని, బుద్ధ దృక్పథం చెబుతుంది. మానవుడు సంతోషంగా జీవించడానికి సాధించవలసిన నాలుగు సత్యాలలో, అప్పు లేకుండా జీవించడం ఒకటి. ఋణగ్రస్థుడు కాకుండా ప్రతివిషయాన్ని సక్రమంగా నిర్వహించుకున్నపుడు, అతడు, ప్రకాశవంతమైన జీవనమార్గానికి సాయపడగలిగిన విధంగా కొంత ధనాన్ని పొదుపు చేయగలడు. ఈ సూత్రం, ప్రస్తుతం, మనిషికీ, అదేవిధంగా దేశానికి కూడా ఆచరణాత్మక విధానమే!

విదేశీయుల సాంకేతిక సౌలభ్యం, వారి పెట్టుబడులపై ఎక్కువగా ఆధారపడటం అభిలషణీయం కాదు. దేశం దిగుమతి చేసికుంటున్న వాటికి, స్వదేశీయమైన వస్తువులకు మధ్య చట్టబద్ధతతో కూడిన, మధ్యస్థమైన సాంకేతిక విలువలను ఏర్పరచుకోవాలి. వనరులను, ధనంగా సమీకరించే ప్రయత్నంలో ప్రభుత్వం, ప్రజలు పొదుపు చేయడంలోని కాఠిన్యాన్ని, కష్టాన్ని అభివృద్ధి ప్రణాళికను ప్రధానమైనదిగా గుర్తించాలి. ఇంతకుముందే చెప్పినట్లు, ఈ విషయంలో ప్రభుత్వం మిగులు వనరులుండే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసికోవాలి. ప్రభుత్వం వాస్తవమైన పొదుపును చేయవలసిన అవసరముందని, సుస్థిరత్వానికి ప్రాతినిధ్యం వహించే అంశంగా బుద్ధుడు చెప్పిన విషయం ఇది. ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు కలిగిన సంస్థలు బహుశః పొదుపుచేసే బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు అన్నవే! అభివృద్ధి ప్రణాళికలకోసం పెట్టుబడిపెట్టడంలో అవి కలతచెందవచ్చు. ఇటువంటి సమయంలో ప్రజలకు అప్పులివ్వగలిగిన బ్యాంకులుగా తన కాలంలోని 'సీతువరు' ధనిక పెట్టుబడిదారులను పేర్కొన్నాడు, బుద్ధుడు. సామాన్యమైన దుస్తులు, ఆహారం, ఇల్లు వంటి వాటిని గూర్చి 'ఆరియవంసపతిపద" చెబుతుంది. వ్యవసాయం, వాణిజ్యం, పశుపోషణ, పరిశ్రమలు, ప్రజాపాలన, మరికొన్ని రకాల సేవారంగాలకు ధనం ఖర్చు చేయవచ్చునని బుద్ధుడు ప్రత్యేకంగా పేర్కొన్నాడు.

వ్యవసాయరంగం:

నీటిపారుదల, పంటలకు తగినంత నీటిని అందించడం, పంటలు పండించడం, చెట్లు నాటడం, అటవీ పెంపకం, అటవీ రక్షణలను తప్పక ఆచరించవలసిన శ్లాఘనీయ మైన చర్యలుగా, రాజు తప్పక ఆచరించవలసిన గొప్ప కార్యాలుగా బుద్ధుడు చెప్పాడు. దేశాన్ని వైభవోపేతం చేయ గలిగిన ప్రధాన మార్గమిది. మరోవైపు, ఎన్నో పెద్ద పెద్ద నదులు, ఉత్పత్తి విషయంలో మనిషికి ఏమాత్రం సాయపడకనే, వృధాగా సముద్రంలో కలిసి పోతున్నాయి. నీటిపారుదలను పెంచే నిర్మాణాలపట్ల మానవ వనరులు ఉపయోగింపబడటమేకాదు, నీటిపారుదల ప్రణాళికలను ఏర్పరచడంలో పరిణితి చెందిన నైపుణ్యాన్ని, సాంకేతిక జ్ఞానాన్ని ఇంకా ఉపయోగించుకోవాలి. బౌద్ధం ప్రధాన మతంగా కలిగిన సింహళం (శ్రీలంక) లో సింహళ ప్రభువులు, బౌద్ధ సిద్ధాంతాల ఆధారంగా, ఆర్థిక ప్రణాళికలను అమలుపరిచారు. ఈ పద్ధతి, దేశంలో వ్యవసాయికాభివృద్ధికి తోడ్పడే ఎన్నో పనులను ప్రభావితం చేసింది.

బౌద్ధం, పశుహత్యను నిషేధించినప్పటికీ, పశుపోషణార్థం పేర్కొనదగిన కార్యకలాపాలను గూర్చి చెబుతుంది. ముసలివైన పశువులు వట్టిపోయిన పశువులు ఎక్కువగా వ్యవసాయంలో ఉపయోగింపబడేవి. నిరుద్యోగ సమస్యలు ఉన్న కొన్ని దేశాలలో, అధికభాగం పెట్రోలు వంటివి దిగుమతి చేసికోబడుతున్నదేశాలలో,

ట్రాక్టర్లు మొదలైన యంత్రసామగ్రి ఉపయోగింపబడుతున్నాయి. పశుపోషణ వలన, ఖర్చులేకుండా పంటలకు ఎరువు లభించగలదు. పైగా ఇది పాలవ్యాపారాన్ని వృద్ధిపరచడమేగాక, పెరుగువంటి పదార్థాల అధికోత్పత్తికి కూడా తోడ్పడుతున్నది. మాంసాహారానికి బదులు ఉపయోగింపదగిన బలవర్ధకమైన ఆహారం పాల ఉత్పత్తులు.

బౌద్ధ ఆర్థికచట్రం ప్రకారం, వ్యవసాయ ఉత్పాదనలపెంపుదలకు పాటించే ప్రేరణ పద్ధతులు కొంత భిన్నమైనవి. బలమైన శ్రామికవర్గం ఉన్న ఎక్కువ దేశాల ప్రధాన లక్ష్యం ధన సంపాదన. బౌద్ధ ఆర్థిక విధానాన్ని అనుసరించినట్లయితే, ధనం ప్రధాన లక్ష్యంగాక, మానవుని భౌతిక, ఆధ్యాత్మిక ఎదుగుదలను మాత్రమే నిజమైన వ్యక్తిగతాభివృద్ధిగా పరిగణింపబడుతుంది. అటువంటప్పుడే మనుష్యులు, స్వార్ధరహితంగా, ఇతరుల మంచిని కోరే విధంగా తనను తాను ప్రేరేపించుకుంటూ, కరుణా దయ వంటి భావనలను కలిగి ఉంటారు. బౌద్ధ ఆర్థిక విధానంలో దాగిఉన్న నిజమైన ధార్మిక ప్రేరణకలిగిన సాధనలివి.

పరిశ్రమలు:

వీలయినంత వరకు, బౌద్ధ ఆర్థిక ప్రణాళికలు, కొన్ని వస్తువుల తయారీకి పెద్ద యంత్రాలు అవసరం గనుక, భారీ పరిశ్రమలకు, కష్టతరమైన పరిశ్రమలకు మధ్యనొక అవసరమైనంత సమతుల్యతను సాధించాయి. కాని అత్యంత సామాన్య వస్తువులను, భారీ యంత్రాల నుండి తయారు చేయడానికి, దీనికి ఎటువంటి సంబంధం లేదు.

బౌద్ధ ఆర్థికాభివృద్ధి ప్రణాళికలో, ఆహారం, దుస్తులు, ఇంటి సామాగ్రి... వీటిని తయారుచేయటం అన్నది గొప్ప పరిశ్రమ! కానీ ఈ వస్తువులన్నీ భారీ పరిశ్రమలద్వారాగాక, లఘుపరిశ్రమలద్వారా ఉత్పత్తి చేయవలసిన అవసరం ఉన్నది. ఏకాధిపత్యం, భారీ పరిశ్రమలు రెండవస్థానంలో ఉంచబడాలి.

బుద్ధుడు, నిరుద్యోగ సమస్యలను గురించి ప్రత్యేకంగా మాట్లాడాడు. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వరంగం, భూమి, పశుపోషణ వంటి రంగాలలో ఉద్యోగ అవకాశాలను గుర్తించాడు. శ్రామికవర్గం ఎక్కువగా పనిచేసే ఉత్పత్తి విధానాలు, బౌద్ధ ఆర్థిక విధానంలో సాంకేతికపరమైన మార్పుగా ఇది గుర్తింపబడుతుంది. భారీ పరిశ్రమలు, చిన్న చిన్న లఘుపరిశ్రమలుగా మార్చబడినపుడు, ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

వనరుల రక్షణ:

గత వివరాలు, ధన సంబంధ, భౌతికవస్తు సంబంధ వనరుల రక్షణలో, సామర్థ్యశీలతను చూపవలసిన అవసరముందని అంటుండగా, బౌద్ధ ఆర్థిక ప్రణాళికలు, ప్రాకృతిక వనరుల రక్షణకు, పర్యావరణ రక్షణకు పెద్దపీటను వేస్తోంది. ప్రాకృతిక వనరులను ఉపయోగించుకునేటప్పుడు, ప్రకృతి ఎటువంటి విచ్ఛేదాలకు గురికాకూడదని బౌద్ధం కచ్చితంగా ప్రకటిస్తుంది. అడవులను, సహజసిద్ధమైన వృక్షసంపదను పూర్తిగా దోచివేయటం, అడవుల నరికివేతవంటి పనుల వలన ఏర్పడే మట్టికోత, నీటివనరులు, వర్షపాతం, ఉష్ణోగ్రత మున్నగు వాతావరణ సంబంధ అంశాలలో మార్పులను తెచ్చి, మానవుని ఉనికికే భంగం కలిగిస్తూంది.

ఇంకా ఎన్నో తరాలు ఈ భూగ్రహం మీద బ్రతకవలసి ఉన్నది గనుక, వనరులరక్షణ, తద్వారా ప్రకృతిని రక్షించుకోవలసిన అవసరం ఉన్నది. భవిష్యత్తరాలు, ఈ భూగ్రహం యొక్క జీవనం.... వీటితో పోల్చిచూచినపుడు, ప్రస్తుతమున్న తరం చాలా తక్కువ శాతానికి చెందినది అన్న విషయాన్ని గుర్తించి, వనరుల రక్షణను ప్రధాన అంశంగా గుర్తించాలి.

కాలుష్యం, వ్యర్థం, ప్రాకృతిక వనరులను ఉపయోగించుకోవడంలో మనం ఆచరిస్తున్న తప్పుడు చేతలకు పరిష్కారమనదగిన అంశాలను గురించి బౌద్ధ ఆర్థిక విధానం చెబుతుంది. నేడు మనం ఎదుర్కొంటున్న పెక్కు సామాజిక, ప్రాకృతిక సమస్యలకు అత్యధిక స్థాయిలో సంపదను కూడబెట్టాలన్న మానవుని స్వార్థమే ప్రధాన కారణం. మరోవైపు పేదరికం, వ్యాధులు, అధిక మరణాలు, పోషకాహారలేమి, ఒత్తిడి మొదలైన వాటిని కలిగిస్తున్నది. తరచూ ఏర్పడుతున్న భూకాలుష్యం, సముద్రకాలుష్యం, వాయు కాలుష్యాలకు సంబంధించిన సమస్యలకు మూలంగా, పారిశ్రామిక దేశాలు కూడా సుస్థిరతను సాధించలేకపోతున్నాయి. శుభ్రమైన నీరు, గాలి, ప్రాథమిక అవసరాలు కూడా మానవుని సుస్థిరజీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నీటి వనరుల కొరతల వంటివి, కాలుష్యంతో కూడిన భూమిమీద మానవజీవితాన్ని అపాయకర స్థితిలోకి నెట్టివేస్తున్నది. అకుశలమైన సామాజిక, ఆర్థిక పరిస్థితులు సృష్టిస్తున్న సమస్యల పరిష్కారానికి లఘుపరిశ్రమలు తోడ్పడగలవు. ఈ చిన్న పరిశ్రమలు ఎక్కువ శ్రామికవర్గంతో, తక్కువ సాంకేతిక సాయంతో, సాంప్రదాయిక, ఆధునికతల మేలి కలయికతో కూడిన మధ్యేమార్గాన్ని ఎన్నుకుని పనిచేయాలి.

భారీ సాంకేతిక పరిశ్రమల నుండి వెలువడే రసాయనిక కాలుష్యాలు ప్రకృతిని, మానవుని మనస్సును కలుషితం చేసినంతగా, ఈ లఘుపరిశ్రమల నుండి వెలువడుతున్న కాలుష్యాలు చేయలేవు. కొంత రసాయన కాలుష్యాల వంటివి ఏర్పడినా వాటి స్థాయి తక్కువగానే ఉంటుంది కాబట్టి దానిని నియంత్రించడం కూడా సులభమే అవుతుంది.

సహకార సంఘాలు:

లఘుపరిశ్రమల ద్వారా తయారు కాబడుతున్న అవసరమైన వస్తువులు సహకార సంఘ నియమాల ప్రకారం, తక్కువ ధరలకే ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా, ఇజ్రాయిల్‌లో kibbutz విజయవంతమైన తీరు, సహకార సంఘాల మెరుగైన పనితీరుకు అద్దం పడుతుంది. ఈ సహకార నియమాలు, ప్రజలకు సమాజానికి కీలకస్థానం ఇస్తున్నందున, బౌద్ధ ఆర్థిక చక్రం కోరినట్లు, చేస్తున్నాయి. ప్రజలు కలసి నిర్వహించే సంస్థ కాబట్టి సహకారసంఘాలు ప్రజలకే సొంతమైనవి. ప్రజల అభిలాషకు తగినట్లు, స్వయంసాయం, అవగాహన, నమ్మకాల ఆధారంగా ప్రజలచేత నడుపబడే సంఘాలివి. మానవ సహకారంతో నిర్వహింపబడే ఈ సంస్థలు అవసరమైనంత మేరకు చిన్న సంస్థలుగానే నడుపబడుతున్నవి. వస్తువుల ఉత్పత్తి, పంపకం రెండింటినీ చేతబట్టి, భారీగా నిర్వహింపబడిన ఆధునిక ఆర్థిక సంస్థలు ఎదుర్కున్న పెక్కు ఓటములను జయించి, ఈ సహకార సంఘాలు విజయవంతంగా నడుపబడుతున్నాయి.

ఈ విషయంలో ప్రభుత్వం నిర్వహించే అధికారానికి ప్రజలచేత నడుపబడే సహకార సంఘాల అధికారానికి మధ్య స్వల్ప భేదాలున్నాయి. ముఖ్య భేదం రాజ్యం తరపున పనిచేసే అధికారి నిర్ణయానికి లోబడి ఉండవలసిన అగత్యం లేకుండ, ప్రజలందరి భాగస్వామ్యం వలన సహకార సంఘాలు స్వయం నిర్ణయాత్మకంగా పనిచేస్తాయి. రాజ్యం పెట్టుబడిదారీగా లేదా ఏకాధిపత్యంగా నడిచే స్థితిలో ఆ అధికారి

చేపట్టే ప్రతి చర్య రాజ్యానికే ఆపాదింపబడుతుంది. ప్రజలు తమంతట తాము ఆధిపత్యం వహించి నిర్ణయాధికారాన్ని కలిగిఉండే సహకార విధానం భారీ సంస్థగా ముందుకు రావలసిన అవసరం ఉన్నది.

వ్యక్తిగత పరిశ్రమల స్థానం:

వ్యక్తిగత పరిశ్రమలు ఎప్పుడూ వ్యక్తులకు లాభాలను సమకూర్చి, ధనవంతులుగా మార్చడానికి ఉపకరిస్తుందే తప్ప, జాతీయ ఆర్థిక అభివృద్ధికి ఉపకరించవు. పేదవారు, పేదరికం ధనవంతులను మరింత ధనవంతులుగా మారుస్తుంది గనుక, వారు తృణీకరింపదగినవారు. వ్యక్తిగత పారిశ్రామిక విధానంలో ఆ ప్రణాళిక మొత్తం, రాజ్యానికి సహకరించెడిదే అయినా, బౌద్ధ ఆర్థిక విధానం అటువంటి వ్యక్తిగత పారిశ్రామిక ప్రణాళికలకు ప్రాముఖ్యాన్నిస్తుంది. వ్యక్తిగతపరిశ్రమలు గట్టి ప్రయత్నం, స్వేచ్ఛల ఆధారంగా వ్యక్తి బాగు అన్న లక్ష్యంతో ఏర్పడినవిగా, బౌద్ధ ఆర్థిక విధానం వీటిని గుర్తిస్తున్నది. మానవాభివృద్ధి, తద్వారా రాజ్యాభివృద్ధికోసం మానవసమాజం ధర్మబద్ధమైన జీవన విధానంతో నిర్దేశింపబడుతుంది గనుక, నేడు సోషలిస్టు రాజ్యాల వలె బౌద్ధ ఆర్థిక విధానం మానవ ఆర్థిక విధానంలో అత్యంత అధికమైన చొరవను చూపక, తగినంత స్వేచ్ఛనిస్తుంది.

ఏ సమాజంలోనయితే వ్యక్తి చేతలు, జీవితం అధికార బలంతో నిర్దేశింపబడతాయో, అక్కడ మానవుని ప్రాథమిక భూమిక అయిన ఆధ్యాత్మిక అభివృద్ధి కలచివేయబడుతుంది.

ఆర్థిక చట్రానికి వెన్నెముకలా పనిచేసే సహకారసంఘాలు, వ్యక్తిగత పారిశ్రామిక కేంద్రాలుగానే గుర్తింపబడతాయి. ఈ నిర్మాణ విధానం వలన, ప్రజలచేత నడుపబడుతున్న రాజ్యం యొక్క ప్రమేయం కొద్దిగానే ఉంటుంది. ఔత్సాహికులు, శక్తిమంతులు, నిజాయితీపరులైన వారితో నడుప బడుతున్నపుడు, ఈ సహకార సంఘాలు విజయవంతంగా, సామర్థ్యశీలతతో పనిచేయగలవు. ప్రజల నిజాయితీ లోప, సంఘ వ్యతిరేకమైన పనుల వలన కొన్ని దేశాలలో ఈ సహకార సంఘాలు ఓటమిని చవిచూస్తున్నాయి. ప్రభుత్వపు అనవసరపు ప్రమేయంలేని చోట, మనిషి, తనను తాను నిజాయితీగా మలుచుకున్న వ్యవస్థలో, ఏ విధమైన ఆర్థిక సంస్థయినా విజయవంతంగా గమించే అవకాశం ఉన్నది. పరిశీలనాత్మకంగా చూస్తే ప్రతి విషయం రాజ్యంచేత, నిర్వహింపబడటం ఆచరణలో కష్టం. సోవియట్ యూనియన్ వంటి దేశాలలో, ఏకీకృత పద్ధతుల వలన, తక్కువ ఆర్థికాభివృద్ధి చెందిన నేపథ్యంలో, తీవ్రమైన సమస్యలు తలెత్తాయి. స్వేచ్ఛగా ప్రవర్తించడానికి లేనపుడు, తాను మదుపు చేసిన మొత్తంపై, ఎటువంటి ఫలితాన్ని, తిరిగి పొందలేనపుడు, వ్యక్తినష్టపోతాడు. ఆ స్థితిలో, తన పనిలో అభిలాషను, ప్రేరణను కోల్పోయి, రాజ్యం తరఫున పనిచేసే ఒక సంస్థగా మాత్రమే మిగులుతాడు. అటువంటప్పుడు, ఈ సమాజంలో స్వతంత్రంగా ఆలోచించగల, ప్రవర్తించగల భాగస్వామినే నని, తనను తాను గుర్తుపట్టడంలో నష్టపోతాడు.

ప్రణాళికల ఆచరణ:

శ్రీలంక, థాయిలాండ్, బర్మా వంటి దేశాలలో బౌద్ధారామాలే ప్రాచీనమైన సామాజిక, ధార్మిక కేంద్రాలుగా, ప్రధాన విద్యాకేంద్రాలుగా, గుర్తింపును పొందిన విశ్వవిద్యాలయాలుగా పనిచేస్తున్నాయి.

ఒక ఆలయం, అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చేయబడినపుడు, ఒక జాతి సాధించవలసిన లక్ష్యాలను గురించి, అవగాహన కలిగేలా ప్రజల్లో ఒక ఐక్యతాసూత్రాన్ని ప్రేరేపించగలదు. అభివృద్ధి చెందిన

దేశాలలో, సాధారణవ్యక్తి అవసరాలను గుర్తించకనే, ఆ అవసరార్థం ఒక ప్రణాళికలను సిద్ధం చేయకనే, ముందే ఏర్పరచుకున్న ప్రణాళికలను అమలుపరచటం జరుగుతున్నది. తత్ఫలితంగా, జాతి అవసరాలను తీర్చుకోవడం కోసం, ప్రజలు తమతో తాము సహకరించుకునే విధానాన్ని మరిచి, విభిన్న దృక్పథాలతో విభిన్న దిశల్లోకి లాగివేయబడుతున్నారు.

అత్యధిక అభివృద్ధి, అత్యల్పాభివృద్ధి:

ఆర్థికస్థితి, ఆర్థికసాధనల ఆధారంగా దేశాలు రెండు విధాలుగా విభజింపబడుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలకన్నా, ఇంకా అభివృద్ధి చెందవలసిన దేశాలు ఎక్కువ ఉన్నాయి. పొందియుండు, పొందలేకపోవు – అను రెండింటి మధ్యనున్న వ్యత్యాసంతో, సంబంధించినది గనుక, 'ఆర్థికాభివృద్ధి పరిశీలన' అన్న అంశం చాలా ప్రాధాన్యమైనది. ఒకవైపు అత్యధిక సంఖ్యగల ప్రపంచ జనాభా, ముఖ్యంగా ఆసియా, దక్షిణమెరికా, ఆఫ్రికా వంటి దేశాలలో పేద వారుగానే జీవిస్తూండగా, అతికొద్దిమంది సంపన్నులు మాత్రమే అవసరాలకు మించిన సౌకర్యాలతో మూలవనరులను ఉపయోగించుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యానికి భిన్నంగా అత్యధిక అభివృద్ధిని పొందిన ప్రపంచం ఉన్నది.

ధనిక దేశాలనుండి పేదదేశాలకు వనరుల ప్రవాహం:

మనిషి తన దృక్పథంలోను, ప్రవర్తనలోను, సంపూర్ణమైన అభివృద్ధిని తనకుతానై సాధించేలా, ఆర్థికాభివృద్ధిస్థాయి ఉండాలి. ఆర్థికపరమైన ఎదుగుదలకు కూడా ఒక పరిమితి ఉండాలని, లభ్యమవుతున్న వనరులను మితంగా ఉపయోగించుకోవాలని బౌద్ధం చెబుతుంది. పరిమితులను పాటించని అభివృద్ధి వలన మానవజాతి విధ్వంసం ఒక ముగింపులేని దశకు చేరుకుంటుంది. పరిమితిలేని స్థాయిలో మానవుని హీనస్థితిని ఇది సూచిస్తుంది. ఎదుగుదల సిద్ధాంతాన్ని పరిమితిని పాటించని స్థాయిలో పొందాలనుకుంటే, మనం జంతువులస్థాయికి దిగజారిపోయిన మానవుని హీనస్థితిని ఒప్పుకునేందుకు సిద్ధంగా ఉండాలి. మరో మాటలో చెప్పాలంటే, మానవుని నైతిక ఆధ్యాత్మిక వెనుకబాటుతనం అన్నది జంతులోకపు ప్రవృత్తితో సమానమైన స్థాయికి సంబంధించి ఉన్నది. మరోమాటలో చెప్పాలంటే, మానవుని నైతిక ధార్మికపరమైన వెనుకబాటుతనం అన్నది, అతడు ఉపయోగిస్తున్న భౌతిక వస్తుసంబంధమైన అభివృద్ధికి మించింది. సంపన్న దేశాలు పెక్కింటిలో కనిపించే స్వచ్ఛమైన సాక్ష్యమిది.

పరిమితులులేని మానవాభివృద్ధి:

భౌతిక విషయాలనుగాక, నైతిక, ధార్మిక ఎదుగుదలను ఎన్నుకోవడం. మానవునికి సంబంధించినంత వరకు, నైతిక, ధార్మిక పరమైన ఎదుగుదలకుగాని, ఈ వలయంలో అతని సాధనలకు గాని, పరిమితులు లేవు. భౌతిక లాభాలకు పరిమితి ఉండగా, నైతిక ధార్మికపరమైన ఎదుగుదలకు పరిమితులు లేవు. ఇవి అపరిమితమైనవి. తక్కువగా నున్న జీవితకాలంలో, మనిషి అత్యున్నతమైన ధార్మికపరమైన అభివృద్ధిని సాధించడం చాలా కష్టతరమైన పని.

బౌద్ధ ఆర్థిక విధానంలో అభివృద్ధికి పరిమితులను పాటించడం అన్నది సాధ్యంకాని పని. ఎందుకంటే, అభివృద్ధి అంటే నాణ్యమైన మానవుడిగా ఎదగడమే గనుక! ఏ దశలోనైనా సంపూర్ణత్వాన్ని సాధించడానికి మానవులు గట్టి ప్రయత్నం చేయాలి. ఇటువంటి సంపూర్ణత్వసాధన కోరదగినదని చెబుతుంది.

ముగింపుమాట: 1976 లో H. N. S. Karunatilake గారిచే రచింపబడి, N. Chandraratne, J. P. గారిచే Diamand Printers, Colombo తరఫున ప్రచురింపబడిన 'THIS CONSFUSED SOCIETY' అన్న పుస్తకానికి వ్రాయబడిన పుస్తక సమీక్ష, ఈ వ్యాసం.

❖ ❖ ❖

8. పునరుద్ధరణపై ఒక సమీక్ష
(REVIEW TO REFORM)

బుద్ధుడు జ్ఞానోదయం పొంది, రెండువేల ఆరువందల సంవత్సరాలు సమీపిస్తున్న సందర్భంగా, ప్రస్తుతం బౌద్ధధర్మం కొన్ని చోట్ల అనుసరిస్తున్న తప్పుడు మార్గాలను సమీక్షించడం వివేకవంతమైన పని. పెక్కు దేశాలలో, చాలామంది, బౌద్ధులు ధమ్మాన్ని అనుసరించడం పట్లగాక, బౌద్ధంతో కూడియున్న ఆచారాలను అనుసరించడంలోనే, మిక్కిలి ఆసక్తిని కలిగి ఉండటాన్ని గమనించగలం! బౌద్ధధమ్మ సారాంశం, జీవితంలోని అసంతృప్తి సంబంధమైన అంశాలవలన ఏర్పడిన దుఃఖం, దుఃఖ కారణం, దుఃఖ నిరోధం, దుఃఖ నిరోధ మార్గమైన ఆర్య అష్టాంగ మార్గం..... అన్న నాలుగు సత్యాలతో కూడి ఉన్నది. బౌద్ధ ఆచరణ అంటే, ఆర్య అష్టాంగమార్గాన్ని ఆచరిస్తూ, జీవన అసంతృప్తి విధానాల వలన ఏర్పడే దుఃఖం నుండి, జననమరణ సంబంధమైన చక్రం నుండి విముక్తిని పొందడమే!

బౌద్ధంతో ముడిపడియున్న సంప్రదాయాలు, ఆచారాలు చాలా ఉన్నాయి. సరిగ్గా ఆచరించినపుడు అందులోనివి కొన్ని ఉపయోగకరమైనవి, మరికొన్ని బుద్ధ బోధనలను సయితం విభేదించే విలువలు లేని ఆచారాలు! మొదటిది, తప్పుడు మార్గంలో ఆచరించినట్లయితే కేవలం అవి ఆచారాలుగానే మిగులుతాయి. సరయిన అక్కరతో, ఏకాగ్రతతో ఆచరించలేనపుడు, 'పంచశీల' కూడా విలువలేని ఆచారంగానే మిగిలిపోతుంది. మరొక ఆచారం, బుద్ధుని విగ్రహాలకు పువ్వులు సమర్పించి పూజించడం అనే ఆచారం. చాలామంది బౌద్ధులు, నిర్వాణమార్గాన్ని ఉపదేశించిన గొప్పగురువు, బుద్ధుడు చెప్పిన సత్యాలమీద ఏకాగ్రతను నిలుపకుండా, స్థిరత్వం లేని మనసుతోనే, ఈ విధానాన్ని ఆచరిస్తున్నారు. పైగా, పువ్వులు అస్థిరత్వాన్ని, వస్తువులు క్షణికత్వాన్ని, మార్పును సూచిస్తాయి. పువ్వులు అందంగా ఉన్నా, స్వల్పకాలంలోనే, వాడిపోయి, రాలిపోతున్నాయి. మన శరీరాలు కూడా, కొంతకాలానికి అదే విధమైన అస్థిరత్వానికి గురవుతున్నాయి. ఇదే విధంగా, ఎక్కువసార్లు, చైత్య ప్రాధాన్యంపట్ల అప్రమత్త దృష్టి లేకనే, బుద్ధుని శారీరిక భాగాలపై నిర్మింపబడిన చైత్యాలకు కూడా, పువ్వులను అర్పించడం జరుగుతున్నది.

బుద్ధుడు పరినిర్వాణం చెందిన చాలా కాలం తరువాత నుండి ఆచరించడాన్ని ప్రారంభించిన దేవతల పూజ, బోధివృక్ష పూజలను (బుద్ధుడు సంబోధిని పొందిన సంఘటనకు కృతజ్ఞతను ప్రధానంగా చూపుతూ చేస్తున్న, బోధివృక్ష పూజను ప్రత్యేకపరుస్తూ) పరిత్యజించాలి. బుద్ధ బోధనలకు వ్యతిరేకమైన ఇంద్రియవాంఛలపట్ల గల తృష్ణను నిరాకరించడమే ప్రధాన ఉద్దేశం కాదు. దేవతల పూజ, బోధివృక్ష పూజలవంటి బయటినుండి తోడ్పాటును వెదుక్కునే బలమైన తృష్ణపట్ల, జాగరూకులయి ఉండవలసిందని హెచ్చరికగా కూడ ఇది పనిచేస్తుంది.

హిందూ స్త్రీలయిన భారతీయరాణులను వివాహమాడిన సింహళ రాజులమూలంగా, ఇరువురూ కలిసి తమ మతపరమయిన ఆచారాలను ఒకే చోట నిర్వహించుకోవడానికి అనువుగా, బౌద్ధ ఆరామాలలో హిందూ ఆలయాలు నిర్మింపబడినాయి. ఈ ఆచారం, శ్రీలంకలోని 'బాంబలటితియ' లో, ప్రసిద్ధి పొందిన 'వజీరారామయ' వంటి కొన్ని ఆలయాలలో తప్ప, మిగిలిన ప్రాంతాలలో ఇంకా కొనసాగుతూనే ఉన్నది. బౌద్ధం ప్రకారం, తక్కువ శక్తిని కలిగిన దేవతల ప్రభావం అతి కొద్దిగనే ఉంటుంది. మనుషులు విముక్తిని పొందడానికి సహాయపడగలననిగాక, దారి చూపగలనని మాత్రమే చెప్పిన బుద్ధుడు, మానవుని విముక్తి అన్నది, మనిషి చేతిలోనే ఉన్నది, అనగ స్వయంశక్తితో మాత్రమే మనిషి విముక్తిని పొందగలదు అని చెబుతాడు.

తల్లిదండ్రులను, గురువులను పూజించే ఆచారం కూడా బౌద్ధంలో ఉన్నది. పెద్దలపట్ల శుద్ధమైన ప్రేమను, గౌరవాన్ని ప్రకటించడంకోసం, ఈ విధి ఆచరింపబడాలి. ఎన్ని క్లిష్టమైన పరిస్థితులెదురైనా, పెద్దలను హింసించడంగాక, చేతులు మోడ్చి, వారిని పూజించగలగాలి. తల్లిదండ్రులను హింసించడాన్ని బౌద్ధం, హేయమైన చర్యగా, గుర్తిస్తుంది. పైగా భిక్షువులను, పెద్దలను గౌరవించడంవలన, గొప్ప లక్షణమైన, వినయం పెంపొందే అవకాశమున్నది.

శబ్దకాలుష్యం:

'చర్చి గంటలు అన్నవి, క్రైస్తవ మతగురువు యొక్క ఫిరంగి దళాలు' అని, ఒక జర్మన్ ప్రజానాయకుడు చెప్పినట్లు, తమ ముఖ్యత్వాన్ని ఇతరుల పై చాటుకోవాలనుకునే మతసంస్థలు ఏవైనా, గొప్ప శబ్దాలను చేసేవే అయి ఉంటాయి. ప్రపంచంలో శబ్ద కాలుష్యాన్ని కలిగించేవాటిలో, బౌద్ధ ఆరామాలుకూడా పేర్కొనదగినవి. బర్మాలో, గంటలకొలది, రోజులకొలదిగ, అభిధమ్మ సూత్రాలను వల్లె వేయటాన్ని, చెవులు బద్దలయేలా, లౌడ్ స్పీకర్ల నుండి వినిపిస్తూనే ఉంటారు. శ్రీలంకలో తెల్లవారేవరకు రాత్రంతా నెమ్మదిగా, 'రక్షణసూత్రాలను' వల్లెవేయటాన్ని లౌడ్ స్పీకర్లు ప్రసారం చేస్తూనే ఉంటాయి.

'ఉపోసథ' ప్రత్యేకపూజ రోజుల్లో ఆరామాలకువచ్చే బౌద్ధ ఉపాసకులకోసం, వారి అష్టశీల సూత్రాలు, ధార్మికోపన్యాసాలు లౌడ్ స్పీకర్లద్వారా వినిపింపబడుతూనే ఉంటాయి గనుక, ఆ రోజులు కూడా, చాలా శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తూంటాయి. ఇదే విధంగా, థాయ్ లాండ్‌లో, కంబోడియాలోని బౌద్ధ సంస్కారాలు, లౌడ్ స్పీకర్లు లేకుండా పూర్తిగావు.

ఒకరు చేసే శబ్దకాలుష్యం, ఇంటిబయటిదాకా ఆగదు. అది ఇంటిలోని మనుష్యులను, ఊరిలోని ప్రజలను కూడా బాధిస్తుంది. ఇది ఇతరులను, వారి వారి పనులను చేసికొననీయక అడ్డుకోవడమేకాదు, వారి చదువు, ఆలోచనలు, ధ్యానం, విశ్రాంతి వంటి అవకాశాలకు అంతరాయం కలిగిస్తుంది గనుక,

సమాజానికి హానికారకమైన ఈ శబ్దకాలుష్యం, 'అకుశల కర్మ'గా కూడ గుర్తింపబడుతుంది. లౌడ్ స్పీకర్ల శబ్దాలవలన ఏర్పడే హానికర మైన ప్రభావాలు, ఆధునిక పద్ధతిలో కొనసాగే హింసాత్మకమైన చర్యలు.

అయితే, కొన్నిసార్లు, ఈ లౌడ్ స్పీకర్ల శబ్దాలు న్యాయబద్ధమైనవే! ఉదాహరణకు, ఒక భిక్షువు పెద్దసంఖ్యలో నున్న ప్రజలనుద్దేశించి చెప్పే ధార్మికోపన్యాసాలు అందరికీ స్పష్టంగా వినబడాలంటే, లౌడ్ స్పీకర్ల అవసరం ఉన్నది. అయితే, ఆ ఉపన్యాసాన్ని వినాలన్న ప్రేరణతో, ఆ ఉపన్యాసస్థలానికి వచ్చిన ప్రజల వరకు, ఆ ధార్మికోపన్యాసం వినబడితే సరిపోతుంది. ఇరవైయ్యవ శతాబ్దంలో మాత్రమే కనుగొనబడిన ఈ లౌడ్ స్పీకర్ల వాడకం వలన బౌద్ధ విశ్వాసం బలపడింది అన్న దాఖలాలు లేవు. విశ్వాసం లేనివారిలో, ఇవి విశ్వాసాన్ని పెంచటానికి పనికిరావు.

భిక్షాప్రదానం:

బౌద్ధ ఆచార్యులకు, భిక్షను ఇవ్వాలని ప్రతి బౌద్ధుడికి తెలుసు. ఈ రోజుల్లో ఎన్నో ఆరామాలు తమవద్దకు వచ్చే భిక్షువులకు కూడ భిక్షను, వసతిని కల్పిస్తున్నాయి. దానికి ప్రతిగ, ఆ ఆరామ అధ్యక్షుడు, భిక్షువులనుండి బలవంతంగా చందాలనుగాని, లేదా వారి సేవను గాని కోరుతున్నాడు. ఈ రకమైన పరస్పర మారకపు చర్యలు ఖండింపదగినవి.

భగవాన్ బుద్ధుడు, భిక్షకై స్వయంగా తన శిష్యులతోబాటు, గ్రామాలకు వెళ్ళేవాడు. ఆనాటినుండి బౌద్ధభిక్షువులు అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

ఉపాసకులు, తామిచ్చే భిక్షకు ప్రతిగ, భిక్షువులనుండి ఏదోకొంత ధార్మిక ప్రయోజనాన్ని ఆశిస్తారు.

చివరగా, బౌద్ధ ధర్మాన్ని ఆచరించడానికి, తద్వారా తమను తాము నిజాయితీగా, మానసిక ఏకాగ్రతతో, జ్ఞానంతో తీర్చిదిద్దుకోవడానికి, బౌద్ధ ఉపాసకులను ప్రేరేపించాలి. ఈ సంబంధంగా, 'భావన' ధ్యానం యొక్క ప్రాధాన్యతను పద్ధతి ప్రకారం గాని, అనిబద్ధమయిన స్థితిలోగాని స్వీకరించి మానసాన్ని పవిత్రీకరించుకోవటానికి, శారీరిక, మానసిక అప్రమత్తతను పెంచుకోవటానికి, ఉన్నదానిని ఉన్నట్లుగానే సమస్తాన్ని చూడగలిగిన, వాటి క్షణికత్వాన్ని గుర్తించగలిగిన జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవడానికి, జీవన సంబంధమైన అసంతృప్తుల వలన ఏర్పడే దుఃఖం, అనాత్మ, నిరంతరం మారుతున్న పరిణామాలు, మొదలైన స్థితులను అర్థం చేసికోవడానికి – 'భావన' ధ్యాన ప్రాధాన్యాన్ని గుర్తించాలి.

వక్కనమలడం, పొగత్రాగడం:

వక్కను నములుతుండటం, సిగరెట్లను త్రాగడం వంటి సాధకుల, ఉపాసకుల అలవాట్లు ఖండింపదగినవి. ఈ రెండు అలవాట్లు కూడా ఆరోగ్యభంగకారకాలే! పంచశీలలో చోటును పొందిన ఐదవ శీలమిది.

మొబైల్ ఫోన్లు:

మాట్లాడటానికి గంటలకొలదిగ మొబైల్ ఫోన్ల వాడకం అన్నది చాలా చెడు అలవాటు. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం, భారతీయులు మరుగుదొడ్లను కలిగిఉన్న సంఖ్యకన్న మించిన సంఖ్యలో ఎక్కువగ మొబైల్

ఫోన్లను కలిగిఉన్నారు. మొబైల్ ద్వారా సెక్స్ చిత్రాలు పంపటం, న్యూడ్ చిత్రాలు చూడటానికి ఉపయోగించటం వంటివి నిషేదించాలి. యువతను క్రమశిక్షణలో ఉంచాలి. మొబైల్ ద్వారా అనేక మోసాలు జరుగుతున్నాయి. అందుకు ప్రతి వ్యక్తి జాగ్రత్తగా ఉండాలి.

విద్యాకేంద్రాలుగా విహారాలు:

విహారాలు లేదా ఆలయాలు పూజాస్థలాలుమాత్రమేగావు, అవి విద్యను నేర్పే కేంద్రాలుకూడా. మన సంప్రదాయంలో, మనం ఆలయాలను విద్యాసంస్థలుగా కూడా ఉపయోగించుకున్నాము. దాదాపు, ప్రతివీధిలోను మనం ఎక్కువ సంఖ్యలో ఆలయాలను కలిగిఉన్నాం కాబట్టి, ఈ పద్ధతి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పారిశుధ్యం మున్నగు విషయాలలో కూడా, ప్రజలకు సరయిన అవగాహనను కలిగించగలం.

సిద్ధార్థుడు సంబుద్ధిని పొంది, దాదాపు రెండువేల ఆరువందల సంవత్సరాలను సమీపిస్తున్న ఈ సందర్భంలో, బౌద్ధభిక్షువులు, బౌద్ధ ధ్యాన గురువులు, బౌద్ధ ఉపాసికులు, పండితులు, ధమ్మ బోధకులు, గుర్తింపదగిన పాత్రలను పోషింపవలసిన అవసరమున్నది.

కృతజ్ఞతలు:

దాదాపు ఇరవైఆరు శతాబ్దాలుగా, భగవాన్ బుద్ధుని బోధనలను కాచి, రక్షిస్తూన్న గొప్పవారయిన ధ్యానగురువులు, తత్వవేత్తలు, ఉపాసకులయిన బౌద్ధ పండితులు, దాతలు, ఉపాసకులు, బౌద్ధ ఆచార్యులు అందరికీ నమస్కరిస్తున్నాను.

❖ ❖ ❖

9. ధార్మికం - మానవత్వం

మానవ జీవితం ఉత్కృష్టమైనది. మానవునికి లభించిన సౌకర్యాలు ఏ జీవజంతువుకూ లభించలేదు. వ్రాయుట, చదువుట, ఆలోచించుట, నివాసము, వ్యాపారం, వాహనం, మనోరంజనం వంటి సౌకర్యాలు, మారే ప్రాణికైనా లభించాయా?

పుట్టిన వాడు గిట్టక తప్పదు. మృత్యువును అధిగమించి నిర్వాణ సిద్ధి వరకు చేరే సామర్థ్యం మనిషికే ఉంది. ప్రపంచంలో మరణించిన వారితో సమానంగా జీవితాన్ని గడపక అమరుల వలె దృఢంగా ఉండాలి. వ్యక్తి ఉన్నతికి సద్గుణములు అవసరము. ఆ గుణాలు మానవత్వానికే గీటురాళ్ళు. ఈ గుణాలు ఎక్కువ మోతాదులో ఉంటే ఆ వ్యక్తి శ్రేష్ఠుడు అవుతాడు. ఈ సద్గుణములు కలిగి ఉన్న వారిని మహాపురుషులంటారు. ఇటువంటి వారు ప్రపంచంలో అమరులు కాగలరు. సదాచారములేని వారు నరకమును అనుభవిస్తుంటారు.

కొంతమంది వ్యక్తులు శారీరక అవసరాలు పూర్తి చేసుకొనిన తరువాత మిగిలి ఉన్న సామర్థ్యము భోగము, విలాసం, సంగ్రహం, అహంకారం, మొదలైన వాటి కొరకు వినియోగిస్తున్నారు. వివిధ దురాచారాలలో ఈ అమూల్య జీవనం వృధా చేస్తున్నారు. జీవితోద్దేశ్యాన్నుండి దూరమై మరణించిన మనిషితో సమానంగా ఆయుష్షు బరువును మోసుకుంటూ కాలాన్ని గడుపుతున్నారు.

మానవత్వం, సహనం, సద్భావనతో పాటు 'భిన్నత్వంలో ఏకత్వం' వంటి వాటిని 'ధమ్మ సైనికుల సంస్కరణోద్యమం' (Dharma Soldier's Reform Movement) ఆచరించుట వలన తోటి వ్యక్తులకు ప్రేరణ కలిగిస్తుంది. మనది మానవ జన్మ. ఈ ప్రపంచంలో మనలను మనము ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దుకోవడం ద్వారా సమాజానికి మరియు మానవాళికి తోడ్పడాలి. మార్పు మరియు సంస్కరణ మన నుండి ప్రారంభం అవ్వాలి. మన కుటుంబం, మన ప్రాంతం, మన నగరం, మన రాష్ట్రం, మన దేశ మరియు మొత్తం ప్రపంచం కోసం పాటుపడటమే మన బాధ్యత. మన మనసులో ఎటువంటి భేద భావం లేకుండా సద్గుణాలను పెంపొందించుకోవాలి. అందరితో గౌరవ మర్యాదలతో వ్యవహరించాలి. ఎటువంటి నటన, బాహ్య ప్రదర్శన కాకుండా నిజమైన మానవుడిగా ఉండాలి.

ఏ మంచి విషయాలనైతే శ్రోతగా వింటున్నారో, వాటిని జీవితంలో ఆచరిస్తూ, జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని భావిస్తూ, జాతి, మతం, స్త్రీ-పురుష, ప్రాంతం, రంగు, వస్త్ర ధారణ, ఆహారపు అలవాట్లు వంటి కారణాలతో భేద భావన లేకుండా అందరూ కలిసి ముందడుగు వెయ్యాలి. వాస్తవమైన ధార్మిక మూలాలు ధృఢపడాలి. సేవ, సాధన సరైన ఉద్దేశ్యంతో చేయాలి.

ప్రేమ, ధర్మం, విశ్వాసం, మానవత్వం, శ్రద్ధా భక్తి, శరణాగతి, ఆధ్యాత్మికల సమ్మేళనం. 'ధార్మికత' మరియు 'మానవత్వం' యొక్క అపూర్వ సంగమం నా "ధమ్మసేన" సంస్కరణోద్యమం. సాధకుడు ప్రాపంచిక అవసరాల కోసమే భక్తి లేదా ప్రార్థన చెయ్యకూడదు. సాధకుడు అన్ని సమయాలలో ఏది ఉన్నా లేకపోయినా

శరణాగతుడై ఉంటూ సమస్థితిలో ఏకరసంగా ఉంటాడు. ప్రాపంచిక వస్తు సంపద, సౌకర్యాలు, లేకున్నా కోల్పోయినా అతడి మనో భావంలో మార్పు రాదు.

సాధన అనేది సాధకుని యొక్క వ్యక్తిగతమైన యాత్ర. ఎవరి ప్రయాణం వారే చేయవలసి ఉంటుంది. ఒకరు మరొకరి కోసం ప్రయాణం (సాధన) చేయలేరు. ఎవరు సాధన చేస్తారో వారు ఆఖరి మజిలికి (నిర్వాణము) చేరుకుంటారు. సాధకుడు దేనిపై విశ్వాసాన్ని కలిగి ఉన్నాడనేది ఎంతో ముఖ్యం. క్షణభంగురమైన, సదా మార్పు చెందే, నశించిపోయే వస్తువుపై విశ్వాసముంచరాదు. ప్రాపంచిక విషయాలు ఒక క్షణం సత్యమై ఉంటూ కొంత సమయం తరువాత అసత్యంగా మారిపోతూ ఉంటాయి. ఆస్తులు, అంతస్తులు వెంటపడి సాధకుడు ధార్మిక జీవితమును పాడు చేసుకొనరాదు.

ధార్మికత వేరు జీవితం వేరు అనుకుంటారు. ధార్మికత కలసి ఉన్నదే జీవితం. కాబట్టి ప్రాపంచిక వ్యవహారాలలో ఉంటూనే జీవితాన్ని ధార్మికతతో మేళవించి పారలౌకిక చింతనతో ఉండాలి. జీవితాన్ని ఎంతో సమతుల్యంగా జీవించాలి. మనకు జన్మతః వచ్చిన శక్తి-సామర్థ్యములను సద్వినియోగపరచుకోవాలి.

మనలోని నింద, ద్వేషం, ఈర్ష్య వంటి చెడు భావనలను తొలగించుకోవాలి. ప్రేమ, సమ్రత, సహనం, విశాలత్వం, కరుణ, వంటి సద్భావనలను కలిగి ఉంటూ అందరితో సామరస్యంగా జీవించాలి. మానవీయ గుణాలను కలిగి ఉండటమే మనం మానవులం అనటానికి ప్రమాణంగా ఉండాలి.

ప్రతి ఒక్కరూ అనుక్షణం అప్రమత్తతతో ఈ జీవన యాత్రను సాగించాలి. పరిస్థితుల ప్రతికూలంగా ఉన్నా లేదా అనుకూలంగా ఉన్నా, సాధన చేస్తూ ముందుకు సాగాలి. అప్పుడే ధర్మాచరణ చేస్తూ చెడు మార్గం వైపు మరలకుండా ఉంటాము. మనలో చెడు భావాలు ఉదయిస్తే మనపై మరియు అందరిపై అది దుష్ప్రభావం చూపుతుంది. కనుక ప్రతికూల భావాలను మనసులోకి ప్రవేశించే అవకాశం ఇవ్వకూడదు. అన్ని సమయాలలో మనసును అదుపులో ఉంచాలి. ఇలా జీవిస్తేనే ఇహపరలోకాలలో సార్థకమొనర్చుకోగలము.

కొంతమంది ఇతరుల కర్మలను అనాలోచితంగా అనుసరిస్తూ ఉంటారు. ప్రకృతి పరంగా వచ్చిన వివేకాన్ని, విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించుకొనుట లేదు. గుడ్డిగా ఇతరులను అనుసరించటం ఎంతో హానికరం. ఉదాహరణకు పరీక్షా సమయంలో ఒక విద్యార్థి ఎదుట విద్యార్థి నుండి చూసి వ్రాస్తే అతడి మేధస్సు వృద్ధి చెందదు. పరీక్షలో మంచి మార్కులు సంపాదించినా నిష్ప్రయోజనమే. అంధ విశ్వాసంతో ఇతరులను అనుసరించకూడదు. మన కర్మల వలన మనకు మరియు ఇతరులకు మేలు జరగాలి.

ప్రకృతిలో అశుభం అనేది ఏదీ లేదు. కావున కర్మానుసారంగా వ్యవహరములు జరుగుతూ ఉంటాయి. అన్ని దిక్కులు అన్ని రోజులు, అన్ని సమయాలు శుభ ఘడియలే. మానవులందరు శ్రేష్ఠులే. జాతి-పాతి, ఉన్నతి-నీచ భావాలను వదలి జీవిత కళ నెరిగి జీవించాలి.

వర్తమానములో జీవించటం (Living in the present) నేర్చుకోవాలి. ఇది మనో చాంచల్యాన్ని అరికడుతుంది. ఈ క్షణం ఎలా గడుస్తుందో గమనిస్తూ గడపటమే వర్తమానంలో జీవించటం (To be mindful). ఇలా చేయటం వలన మనస్సు అన్య విషయాలపై మరలక సదా ఎరుకతో (Mindful) ఉంటుంది.

పనసపండును కోసేముందు అరచేతులకు నూనె రాసుకోవాలి. లేకపోతే దాని పాలు బంకలా వేళ్ళను పట్టుకుని వదలదు. అలాగే శరణాగతితో ఫలితమును ఆశించకుండా ఖర్మ చేసుకుంటూ ముందుకు సాగాలి.

వ్యవహారిక జీవితంలో ఇతరుల ఆచార వ్యవహారాల వలన మనం ప్రభావితం అవుతూ ఉంటాము. కానీ ఇతరులను అనుసరించే ప్రయత్నం చేయకూడదు. జీవితమనేది విద్యాలయంలో నిర్వహించే పరీక్షలు వంటివి కాదు. ఇక్కడ ప్రతీ ఒక్కరికీ వేరు వేరు ప్రశ్నలు లభిస్తాయి. దానికి సమాధానం అందరిదీ ఒకేలా ఉండదు. జీవితంలో మంచి రోజులు లేదా చెడ్డ రోజులు అంటూ ఉండవు. మనం చేసే వ్యవహారాలను బట్టి అవి మంచి రోజు లేదా చెడ్డరోజు అనేది ఆధారపడి ఉంటుంది. మంచి రోజులు సంతోషాన్ని తీసుకు వస్తే చెడ్డ రోజులు మనకు అనుభవాన్ని నేర్పిస్తారు.

ప్రపంచంలో అనేక జీవన విధానములు ఒకసారి జరుగుతున్నాయి. అయితే ఏ జీవన విధానం మన జీవితం యొక్క పరమ లక్ష్యాన్ని అనగా నిర్వాణాత్మ ప్రాప్తిని కలుగజేస్తుందో ఆ జీవన విధానమే అర్థవంతమైనదిగా భావించాలి. మిగిలినవన్నీ అర్థరహితమైనవే. ఎవరైతే అజ్ఞానం, అంధకారం మరియు అసత్యంలోనే జీవిస్తున్నారా, వారిని అజ్ఞానం నుండి జ్ఞానం వైపు, అంధకారం నుండి ప్రకాశం వైపు మరియు అసత్యం నుండి సత్యం వైపు తీసుకు వెళ్ళే అత్యుత్తమమైన సాధనయే సాధకులు ఎంచుకోవాల్సి ఉంటుంది. అది మతం, జీవన విధానం ఒక శాఖ, ధార్మిక గురువులు స్థాపించిన సంస్థలు మొదలైనవి ఏమైనా కావచ్చు. అయితే సాధకుడు తనకు తగిన మార్గమును ఎన్నుకొని శరణాగతుడై సాధన చేసి పరమావధిని చేరుకోవాలి.

బుద్ధుని యొక్క బోధనలు నుండి మనం జీవించే కళను నేర్చుకోవాలి. మన ఆలోచన సరళి, దైనందిన వ్యవహారం సరిగా ఉంచుకోవాలి. నిర్మల భక్తితో, నిష్కామ కర్మలనాచరిస్తూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శిస్తూ నిజమైన మానవులుగా జీవించటం నేర్చుకోవాలి. ప్రజ్ఞ మనలను గమ్యానికి చేరుస్తుంది. శీల, సమాధి, ప్రజ్ఞ దీనికి సాధనాలు. ఇది జ్ఞాన మార్గం, కర్మ మార్గం మరియు భక్తి మార్గం యొక్క మేలి కలయిక. ఉదాహరణకు నేను బుద్ధ దాసుడను – జ్ఞానయోగం; నిన్నే శరణంటిని – కర్మయోగం; నన్ను క్షమించు – భక్తియోగం.

ప్రతి సాధకుడు "ధర్మ సైనికుడై" మానవాళి శ్రేయస్సుకై, ప్రగతికై, విశ్వ శాంతికై విశేష సేవ చెయ్యాలి. సత్యాన్ని తెలిసి, ధార్మిక జాగృతి కలిగించి, విశ్వంలో శాంతి, అహింస, సహోదర భావ స్థాపనకై కృషి చెయ్యాలి. ఈ కర్మలను వైరాగ్యంతో త్రికరణ శుద్ధితో చెయ్యాలి. దీనివలన మనసులోని మాలిన్యం శుభ్రపడుతుంది.

జీవన లక్ష్యం తెలియాలి, మానవునిగా వ్యవహరిస్తూ దైవత్వం పొందాలి. దీనికి ప్రతి సాధకుడు నేనెవరు? నా యదార్థ స్వరూపమేది? ఈ ప్రపంచాన్ని నడిపించే శక్తి ఏమిటి? తెలుసుకోవాలి. దీని వలన దేశ, భాష, మతం, కులం పేర్లతో అడ్డుగోడల్ని అధిగమించగలము.

ప్రతి ప్రాణి తనపై తాను ప్రేమ కలిగి వుండటం సహజ ధర్మం. ఈ సహజ స్థితి నుండి అహంకారం, భోగాలను అందించాలని ఇది తాపత్రయ పడుతుంది. ఈ తీవ్ర వాంఛయే దేహ మమకార భావాన్ని బాగా పెంచి అహంకారాన్ని మరింత బలపరుస్తుంది. (One stimulates another) ఇట్లు పరస్పర ఆధార రూపాల్లో దేహతాదాత్మ్య భావనను పరిత్యజించుట చాలా కష్టం.

మోక్షం/నిర్వాణం అంటే అజ్ఞానం నుండి విడుదల. అహంకారమే అజ్ఞానం. 'నేను' అను తలంపే అహంకారం. 'నేను' అనే పరిమిత బుద్ధి సాధకుడిని బంధిస్తుంది. ఇది అజ్ఞానం. కనుక అజ్ఞానరాహిత్యమే మోక్షప్రాప్తి. 'మోక్షం' పొందదానికి అది ఒక వస్తువు కాదు. మన పరిశుద్ధ (Purified) రూపమే మోక్షం.

రంగు రూపు కారణంగా ఎటువంటి భేదభావం కలిగి ఉండకూడదు. ఏ కారణం చేతనైన వివక్షత కలిగి ఉంటే, మనకే నష్టం కలుగుతుంది. అందరి శరీర నిర్మాణం మరియు తత్వం ఒకటే అయినందున ఇతరుల ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, నివసించే ప్రాంతం కారణంగా ద్వేష భావన కలిగి ఉండకూడదు. జ్ఞానవంతులు సత్యం, ప్రేమ, నిజాయితీ మార్గంలో చరిస్తారు.

జీవితాన్ని సార్ధకం చేసుకోవటానికి సంపూర్ణ 'శరణాగతి' తొలి మెట్టు. భగవాన్ బుద్ధునకు శరణాగతుడు అయినవాడు తప్పనిసరిగా సత్య మార్గంలో పయనిస్తాడు. శరణాగతిని వీడిన వాడు సత్యమార్గం నుండి వైదొలిగే ప్రమాదం ఉంటుంది. అహంకారానికి లోనౌతాము. మనం ఎంతో శ్రేష్ఠులమని, మనం చేసే పనులే గొప్పవిగా తలుస్తాము. ఇది మనకు ఇతరులకు ఎంత నష్టం కలిగిస్తుంది.

ఎవరైతే తమకు ఒక ప్రత్యేకమైన ఉనికి లేదని తలుస్తారో వారు ఈ శరీరం, మనసు, మనోభావాలు, సంపద ఇవన్నీ ప్రకృతిగా భావించి సద్వినియోగ పరుస్తారో అటువంటి వారికి ఇతరులను హాని కలిగించే భావనలు మనసులో ఉదయించవు.

మనం అలుపెరుగని కృషి చేస్తూ చైతన్యంతో వ్యవహరించాలి. శ్రమపడినా విఫలమైతే నిరుత్సాహపడకూడదు. ఈ పరాజయం వెనుక కూడ మన శ్రేయస్సు దాగి ఉందని తెలుసుకోవాలి.

సజ్జనుడైన వానిని దుర్జనుడు సేవించి సజ్జనుడౌతాడు. మహా తపస్వి అయి ఉండి కూడ చోరునీ మూర్ఖుడిని సేవిస్తే ఆ తపస్వి కూడ మూర్ఖుడే అవుతాడు.

'ధార్మికత' మరియు 'మానవత్వం' యొక్క అపూర్వ సంగమం మన 'ధర్మసేన యొక్క జీవన విధానం'.

పైన చెప్పిన విధంగా సాధన చేస్తే మనం జన్మ రాహిత్యాన్ని పొందగలము. దీనినే ముక్తి అని, కైవల్యం అని, నిర్వాణమని అంటారు. జీవుడు జన్మ-కర్మల బంధాలను తెంచుకోవటమే మోక్షం, మోక్షం అంటే జన్మరాహిత్యం, దుఃఖ రాహిత్యం కర్మ ఉంటే జన్మ తప్పదు. కనుక జన్మ లేకుండా ఉండాలంటే కర్మ కూడా ఉండకూడదు. శరణార్థుడువై త్రికరణ శుద్ధితో నిష్కామ కర్మ చేయటం ద్వారా నిర్వాణమును పొందవచ్చును.

❖ ❖ ❖

పార్ట్ - 3

రీ స్క్రిప్టింగ్

రీ స్క్రిప్టింగ్ కోర్స్

ఈ రీ స్క్రిప్టింగ్ కోర్స్‌ను రెండు లేదా మూడు రోజుల పాటు నిర్వహించబడుతుంది. దీనిలో మొదటి రోజు నాలుగు సుత్తములను బోధించుట జరుగుతుంది. రెండవ రోజు సామాజిక బౌద్ధ ధర్మము (బౌద్ధ ధర్మ ఆచరణ) బోధించడం, చర్చించడం జరుగుతుంది. మూడవ రోజు ధ్యానం బోధించడం జరుగుతుంది. ఈ కోర్సు నిర్వహణ వలన అర్హతగల వ్యక్తులు తప్పనిసరిగా సామాన్య స్థితి నుండి ఒక మంచి వ్యక్తిగా మారుతారు.

అర్హతలు :

1) 25 సం॥లు పైబడిన వాడై ఉండాలి.
2) చదవటం, వ్రాయటం తెలిసి యుండాలి.
3) ఆర్థికపరంగా తన ఖర్చులు తాను భరించగలిగిన వాడై ఉండాలి.
4) అవసరమయిన సమయమును కేటాయించి రోజూ సాధన చేయగలిగి ఉండాలి.
5) అన్ని మతాలు, కులాలు, ప్రాంతాల వారు స్త్రీ-పురుషులు భేదములు లేకుండా ఆసక్తి గలవారు అందరూ అర్హులే.
6) సంస్కరించుకొని జీవితంలో ముందడుగు వెయ్యాలి అని అభిలాష కలవారు అందరూ ఆహ్వానితులే.
7) ప్రతి సాధకుడు ఒక ధర్మ- సైనికుడు (Dharm Soldier) అయ్యి జీవితము అంతా ఆనందంగా జీవించగలుగుతాడు.
8) ప్రతి సాధకుడు తమ తమ ఆశయాలను (Goals) ను సాధించడంలో సఫలీకృతులగుదురు.

1. సిగాలోవాద సుత్తం

ఒకానొక సమయంలో భగవానుడు రాజగృహంలో వేణువనంలోని కలందక నివాపంలో విహరిస్తూ ఉన్నాడు. ఆ సమయంలో శ్రేష్ఠి పుత్రుడు సిగాలుడు నగరము దాటి వెళ్ళి తడిసిన వస్త్రాలతో, తడి ఆరని తలతో తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం, పైన ఇంకా క్రింద ఆరు దిక్కులకు చేతులు పైకెత్తి జోడించి ప్రణామాలు చేస్తున్నాడు. మధ్యాహ్నానికి ముందు భగవానుడు శుభ్రమైన పాత్రచీవరాలు ధరించి వేణువన విహారం నుండి రాజగృహం వైపు భిక్షాటనకు బయలుదేరాడు. దారిలో సిగాలుడు ఆరు దిక్కులకు ప్రణామాలు చేస్తుండడం గమనించి అతనితో...

భగవానుడు: "ఓ! గృహపతిపుత్రా! నీవు ఉదయాన్నేలేచి నగరం వెలుపలకొచ్చి ఇలా తడిసిన తలతో, తడి బట్టలతో ఆరుదిక్కులకు నమస్కరిస్తున్నావు ఎందుకు?"

సిగాలుడు: "భగవాన్! నా తండ్రి మరణిస్తూ నన్ను వివిధ దిక్కులకు నమస్కారాలు చేయమని ఆదేశించారు. నేను నా తండ్రి అంతిమ ఆదేశాలను పాటిస్తున్నాను. కనుకనే ఉదయాన్నే లేచి నగరం వెలుపలికి వచ్చి చేతులు పైకి జోడించి తూర్పు, పడమర, ఉత్తరం దక్షిణం, కింద, పైన ఇలా ఆరు దిక్కులకు నమస్కరిస్తున్నాను."

భగవానుడు: " ఓ! గృహపతి పుత్రా ! ఆర్య ధర్మంలో ఇలా ఆరు దిక్కులకు నమస్కారాలు చేయడమనేది లేదు."

సిగాలుడు: "మంచిది భగవాన్ ! మీరు కృపతో నాకు ఆర్య ధర్మంలో సరైన విధంగా ఎలా నమస్కరించాలో తెలియజేస్తూ ఆర్య ధర్మజ్ఞానాన్ని ప్రసాదించండి."

భగవానుడు: "అయితే గృహస్థుడా! ఇప్పుడు శ్రద్ధగా విను. నేను నీకు బోధిస్తాను"

(శ్రేష్ఠి పుత్ర సిగాలుని ప్రార్థన మన్నించి, ఆ సమయాన భగవానుడిచ్చిన ఉపదేశం సిగాలునికి గాక గృహస్థులందరికీ అత్యంత కల్యాణకారి అయినటువంటిది. గృహస్థులకై ఉద్దేశించిన ఈ ఆచారసంహిత శుద్ధధర్మంవలె సార్వజనీనమైనది, సార్వదేశికమైనది, సార్వకాలికమైనది. ఆనాడు 2600 సంవత్సరాల పూర్వం సిగాలునికి ఇచ్చిన ఈ ఉపదేశము ఎంత శ్రేష్ఠమైనదో ఈనాటి గృహస్థునికి గూడా అంతే శ్రేష్ఠమైనది.

భగవానుడు: గృహపతి పుత్రా! గృహస్థుడైన ఆర్యుడు నాలుగు కర్మ క్లేశాల నుండి దూరంగా ఉంటాడు, నాలుగురకాల దూషిత చేతనలు ఆధారంగా గల పాపకర్మలను వదిలివేస్తాడు. ఆరు రకాల వినాశకరములగు ఆచరణలనుండి తప్పించుకొంటాడు. ఈ ప్రకారంగా పద్నాలుగు రకాలుగా ఇంద్రియ నిగ్రహం గలిగి జీవిస్తూ ఆరు దిక్కులా కవచాన్ని ఏర్పరచుకొని సురక్షితంగా ఉంటాడు. తన ఇహలోక పరలోకాలను సంస్కరించుకొంటాడు. ఈ జీవితాన్ని సఫలం, సార్థకం చేసుకొంటాడు శరీరం వదిలినప్పుడు అతనికి సుగతి ప్రాప్తిస్తుంది.

నాలుగు కర్మ క్లేశాలు

ఆర్య గృహస్థుడు వదిలేసే నాలుగు కర్మ క్లేశాలేమిటి?

"జీవహింస, దొంగతనం, వ్యభిచారం, అసత్య భాషణం..."

"ఈ నాలుగూ కర్మక్లేశాలు, మలినకర్మలు".

(ఈ కర్మలవల్ల క్లేశమే పెరుగుతుంది. మాటలతోనూ, చేతలతోనూ చేసే ఈ నాలుగు విధాల దుష్కర్మల వల్ల అతడు ఇతర ప్రాణుల సుఖాన్ని హరించివేస్తాడు. వాటి దు:ఖానికి కారణమవుతాడు. తనకు కూడా అంతిమంగా దుఃఖమే లభిస్తుంది. ఈ నాల్గింటి నుండి విరక్తుడై, సాధన ద్వారా సద్గృహస్థుడు తన చిత్తాన్ని వశపరచుకోవడమే గాక నిర్మలం చేసుకొంటాడు, దానిని వికారవిహీనం చేస్తాడు.)

దూషిత కర్మలకు నాలుగు ప్రోద్బలాలు

"చెడు కర్మలు చేయకుండా ఉండటానికి ప్రోత్సహించే బలమేమిటి?"

"ప్రకృతి నియమాన్ని తెలుసుకోకుండా,
ధర్మాన్ని ఆచరించకుండా
రాగ, ద్వేష, మోహ, భయాలనే
నాలుగు దూషిత మనో చేతనల ప్రోద్బలంతో
చెడుకర్మలు చేసే వారి సద్గుణాలు
కృష్ణ పక్షపు చీకటిరాత్రులలో
కృశించే చంద్రునివలే నశించిపోతాయి."
"కానీ ఆర్య గృహస్థుడీనాలుగు

దూషిత మనో చేతనలను తలెత్తనీయక
ఏ పాపకార్యాలనూ తల పెట్టనివాని సద్గుణాలు
శుక్ల పక్షపు వెన్నెల రాత్రులలో
పెరిగే చంద్రుని వలే వృద్ధి అవుతాయి."

ఈ ఎనిమిది రకాల దోషాలపై విరక్తిగల సద్గృహస్థుడు తెలివితో తన సంపాదనను సంరక్షించు కొంటాడు. ధనసంపదను నష్టపరిచే ఆరు కారణాలనుండి దూరంగా ఉంటాడు.

ధన వినాశ హేతువులు

1. మద్యపానం,
2. తిరుగ కూడని సమయాల్లో, సందుల్లో గొందుల్లో షికార్లు చేయడం,
3. నృత్య గానాలు, తమాషాలలో ఆసక్తి,
4. జూదమాడడం,
5. పాపులతో సాంగత్యం చేయడం.
6. సోమరితనం.

వివేకవంతుడైన గృహస్థుడు ఈ దురలవాట్లన్నీ ధనవినాశనం మరియు స్వపతనానికి కారణాలని గ్రహిస్తాడు.

ధనవినాశనానికి గల ఆరు కారణాలు, వాటి పరిణామాలు

1. మద్యపాన వ్యసన పరిణామాలు

అ) కళ్ళముందే చూస్తూ చూస్తూనే సంపదలు నశించిపోతాయి.
ఆ) కలహాలు తగువులు పెరుగుతాయి.
ఇ) నానారకాలైన వ్యాధులకు తలుపులు తెరుచుకొంటాయి.
ఈ) అపకీర్తి పాలవుతాడు.
ఉ) మర్యాద పోతుంది, బుద్ధిహీనుడవుతాడు.

2. తిరుగ కూడని సమయాల్లో సందుల్లో, గొందుల్లో షికార్ల వల్ల వచ్చే పరిణామాలు

అ) తను అసురక్షితుడవుతాడు.
ఆ) ఇంటివద్ద భార్యా బిడ్డలు అసురక్షితులవుతారు.
ఇ) ధనసంపద అసురక్షితమవుతుంది.
ఈ) ఎవరో చేసిన పాపానికి తనను అనుమానిస్తారు.
ఉ) నిందలు వేస్తారు.
ఊ) వాస్తవంగా అనేక దుఃఖాలకు కారణమైన దుష్కర్మలుగూడా జరుగుతాయి.

3. నృత్య గానాలు, తమాషాల వ్యసనాల వల్ల వచ్చే పరిణామాలు

ఇవ్వాళ ఎక్కడ పాటకచ్చేరీ ఉంది? నృత్యగానం ఉంది? వాద్య సంగీత కచేరీలున్నాయి? తాళ మృదంగ వాద్య కచేరీ ఉంది? అనే ఆలోచనలతో ఎల్లప్పుడూ వ్యాకులత చెందుతూ, ఉద్వేగానికి లోనవుతూ ఉంటాడు నిత్యమూ పాట కచేరీలు, నృత్యగానాలు, సినిమాలు, ఆటలు తమాషాలు, నైట్ క్లబ్బుల్లో తిరగడం. ఈ వ్యసనాలు ధనం, శీల చరిత్ర (కీర్తి) ఆరోగ్యం మూడింటినీ నాశనం చేస్తాయి.

4. జూదం వల్ల వచ్చే పరిణామాలు

అ) గెలిస్తే వైరం కొని తెచ్చుకొంటాడు.

ఆ) ఓడితే డబ్బు పోయిందనే దుఃఖాన్ని కొని తెచ్చుకొంటాడు.

ఇ) చూస్తుండగానే కళ్ళెదుటే డబ్బు హరించుకుపోతుంది,

ఈ) సమాజంలో అతని మాటను ఎవరూ విశ్వసించరు.

ఉ) మంచి మిత్రులు, సహచరులు తిరస్కరిస్తారు.

ఊ) 'ఇతడు పెళ్ళాం పిల్లల్ని పోషించలేడు' అని ఎవరూ పిల్లనివ్వరు.

5. పాపులతో స్నేహం వల్ల పరిణామాలు

ఏ మంచి వ్యక్తి ఇతనికి తోడుగా ఉండడు. కేవలం దుష్టులు, వ్యభిచారులు, కాముకులు, పాషండులు, గూండాలు, ద్రోహులు మాత్రమే అతని సాంగత్యం చేస్తారు. దుర్జనుల సాంగత్యం, సజ్జనుల అసాంగత్యం వల్ల తను కూడబెట్టుకున్న సంపదనంతా పోగొట్టుకొని నానారకాల దు:ఖాలు కొనితెచ్చుకొంటాడు.

6. సోమరితనానికి బానిస అవడానికి కారణాలు

అ) ఈ రోజు చాలా చలిగా వుంది.

ఆ) ఈ రోజు చాలా వేడిగా వుంది.

ఇ) ఈ రోజు చాలా ఆలస్యమైంది.

ఈ) ఈ రోజు ఇంకా తెల్లవారలేదు.

ఉ) ఈ రోజు చాలా ఆకలిగా వుంది.

ఊ) ఈ రోజు ఎక్కువగా తినేశాను... అని ఇలాంటి వంకలు వెతికి, చేయవలసిన పని చెయ్యడు. ఫలితంగా తనకు రావలసిన సంపదను పొందలేడు. ఉన్న దాన్ని పోగొట్టుకుంటాడు.

నిజమైన మిత్రుని గుర్తు

సంపత్తిని నాశనం చేసే పై ఆరు కారణాలలోనూ, పాపులతో చేయు దుస్సాంగత్యానికి భగవానుడు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చాడు. తరచుగా సత్సాంగత్యం దొరకని కారణాన మరియు దుస్సాంగత్యంలో పడడంవల్ల గృహపుత్రులు నానావిధాలైన దుఃఖదాయకమైన వ్యసనాలకు బానిసలవుతుంటారు. అందువల్ల మిత్రుని రూపంలో ఉన్న శత్రువెవరో గుర్తించడం చాలా అవసరం, భగవానుడు ఇలా తెలిపాడు.

"గృహపతిపుత్రా ఈ నలుగురిని మిత్రుల రూపంలో ఉన్న శత్రువులని గ్రహించాలి"

1. పరధన హారక మిత్రుడు: ఇలాంటి వ్యక్తి....

అ) పరుల ధనాన్ని అపహరించే ఉద్దేశంతో మిత్రత్వం కలుపుతాడు.

ఆ) కొద్దిగా ఇచ్చి చాలా రాబట్టాలని చూస్తాడు.

ఇ) నానారకాల ఇబ్బందులు వచ్చే పనులు చేస్తాడు.

ఈ) తన స్వార్థం కోసం కలిసి ఉంటాడు.

2. వదరుబోతు మిత్రుడు (వాగేవాడు):

ఇలాంటి వ్యక్తి ఎందుకూ పనికిరాడు, మాటలు మాత్రం చెబుతుంటాడు.

అ) ఒకప్పుడు నీకు సహాయం చెయ్యాలని ప్రాకులాడానని అబద్ధాలు

ఆ) ఎప్పుడైనా అవసరం వస్తే ఈ విధంగా సహాయపడతానని గోరంతలు కొండంతలుగా చేసి చెబుతుంటాడు.

ఇ) వర్తమానానికి సంబంధించి గాలి మేడలు కడుతుంటాడు.

ఈ) కానీ నిజంగా అవసరం వచ్చినప్పుడు ముఖం చాటేస్తాడు.

3. పొగిడేమిత్రుడు: ఇలాంటి వ్యక్తి

అ) చెడ్డపనుల్లో గూడా సై అంటే సై అంటాడు.

ఆ) మంచి పనుల్లోనూ సరేనంటే సరే అంటాడు. ఇ) నీ ముందు ప్రశంసలు.

ఈ) నీ వెనుక నిందాలాపనలు.

4. వినాశ-సహాయక మిత్రుడు: ఇలాంటి వ్యక్తి

అ) మద్యపాన వ్యసనంలో చిక్కుకోడానికి తోడ్పడుతాడు.

ఆ) తిరుగ కూడని సమయాల్లో సందుల్లో, గొందుల్లో పనిలేకుండా తిరగడంలో తోడుంటాడు.

ఇ) ఆట పాటల్లో, నృత్యగానాల్లో మునిగి తేలడంలో తోడుంటాడు.

ఈ) ప్రమాదకారి అయిన జూదంలో తోడుంటాడు.

భగవానుడు పైనాలుగు విధాల వ్యక్తులను 'మిత్రుని వేషంలో ఉన్న శత్రువు' అని గ్రహించి వారి సాంగత్యం శీఘ్రాతిశాఘ్రంగా వదిలించుకోడంలో నీ మంచి ఉంది" అంటాడు.

ఈ విధంగానే ఈ క్రింది నాలుగు రకాల నిజమైన మిత్రులను తన హితులుగా భావించి వారి సాంగత్యంతో లాభం పొందుతాడు.

1. ఉపకారియైన మిత్రుడు: ఈ వ్యక్తి

అ) మత్తులో వున్న మిత్రుడిని ఆపదల నుండి కాపాడుతాడు.

ఆ) మత్తులోవున్న మిత్రుని సంపద కాపాడుతాడు.

ఇ) కష్టాలొచ్చిన మిత్రునికి శరణయిస్తాడు.

ఈ) పనిపడ్డప్పుడు అవసరానికంటే రెండు రెట్లు మిత్రునికి సహాయం చేస్తాడు.

2. సుఖదుఃఖాల రెండింటియందూ తోడుండే మిత్రుడు:

అ) తన రహస్యాలను మిత్రునికి చెబుతాడు.

ఆ) మిత్రుని రహస్యాలను ఇతరుల వద్ద దాస్తాడు.

ఇ) కష్టాలలో మిత్రుని వదిలిపెట్టడు.

ఈ) అవసరం వచ్చినప్పుడు మిత్రునికై ప్రాణాలైనా ఇవ్వడానికి వెనుకాడడు.

3. శ్రేయోభిలాషి మిత్రుడు: మంచి చెడులను విశ్లేషించు ఈ వ్యక్తి–

అ) మిత్రుడిని పాపాలబారినుండి రక్షిస్తాడు.

ఆ) మిత్రుడిని పుణ్యకార్యాలలో పడేస్తాడు.

ఇ) మిత్రునికి అతడు వినని ధర్మం గురించి చెబుతాడు.

ఈ) మిత్రునికి సద్గతి ప్రాప్తించు మార్గాన్ని బోధిస్తాడు.

4. అనుకంపక మిత్రుడు: సానుభూతి చూపించే ఈ వ్యక్తి,

అ) మిత్రుడు నిర్ధనుడైనపుడు సంతోషించడు.

ఆ) మిత్రుడు ధనికుడైనప్పుడు సంతోషిస్తాడు.

ఇ) మిత్రుని నిందించువానిని ఆపుతాడు.

ఈ) మిత్రుని ప్రశంసించు వానిని ప్రోత్సహిస్తాడు.

పై నాలుగు రకాల చెడు స్నేహాలు వదలి, నాలుగు రకాల మంచి స్నేహాలు చేయు గృహస్థుడు విపత్తులనుండి తప్పించుకుంటాడు, సంపత్తి సంపన్నుడవుతాడు.

వాస్తవమైన ఆరు దిశలు

ఆ తరువాత భగవానుడు సిగాలునకు ఆర్య ధర్మంలో నిజమైన ఆరు దిశల పూజకు అర్థం చెప్పి నేర్పించారు ఆరు దిశలను ధర్మపు వస్త్రంతో ఎలా కప్పాలో, ధర్మ పూర్వక జీవితం జీవించి అన్ని దిశలలోను తన సురక్షణ కవచాన్ని ఎలా సుసిద్ధం చేసుకోవాలో తెలియజెప్పాడు.

ఆరు దిశలు అనగానేమి?

తల్లిదండ్రులకు తూర్పుదిశ, గురుజనులకు దక్షిణదిశ, భార్యాబిడ్డలకు పశ్చిమదిశ, బంధుమిత్రులకు ఉత్తరదిశ, పాలేరు పనివాళ్ళకు క్రిందిదిశ, శ్రమణులకు, బ్రాహ్మణులకు' పై దిశ అని తెలుసుకోవాలి.

1. తల్లిదండ్రుల సేవ– పుత్రులు ఐదు విధాలుగా తల్లిదండ్రుల సేవ చేయాల్సి ఉంటుంది.

అ) వారు నన్ను పోషించి పెద్ద చేశారు కాబట్టి, నేను వారి వృద్ధాప్యంలో వారి పోషణభారం వహించాలి.

ఆ) వారు నాపట్ల వారి కర్తవ్యం నిర్వహించారు కాబట్టి, నేనూ వారి పట్ల నా కర్తవ్యం నిర్వహించాలి.

ఇ) వారు వంశం కాపాడారు, కాబట్టి నేనూ వంశాన్ని కాపాడాలి.

ఈ) వాళ్ళు నాకు వారసత్వాన్ని ఇచ్చారు కాబట్టి, నేను గూడా నా పిల్లలకు వారసత్వాన్ని ఇవ్వాలి.

ఉ) దివంగతులైన కుటుంబ పెద్దలు, తాతముత్తాతల పుణ్యార్థం దానం చేయాలి.

ఈ విధంగా సేవించిన పుత్రులను తల్లిదండ్రులు - ఐదు విధాలుగా దీవిస్తారు.

అ) వారిని పాపకర్మలనుండి కాపాడతారు.
ఆ) వారిని పుణ్యకర్మలలో పెడతారు.
ఇ) వారికి విద్యలు నేర్పిస్తారు.
ఈ) తగిన వధువును తెచ్చి పెళ్ళి చేస్తారు.
ఉ) సమయం వచ్చినప్పుడు తమ వారసునిగా ప్రకటిస్తారు.

పై విధంగా సేవించబడ్డ మాతా పిత రూపమైన తూర్పు దిక్కుఐదు రకాలుగా పుత్రునిపై కృప చూపుతుంది.

ఈ విధంగా గృహస్థునకు తూర్పు దిక్కు శుభప్రదమౌతుంది. కవచమౌతుంది, యోగక్షేమమౌతుంది, నిర్భయాన్నిస్తుంది.

2. గురుజనుల సేవ– శిష్యుడు ఐదు విధాలుగా గురువుల సేవ చేయాల్సి ఉంటుంది.

క) గురువు వచ్చినప్పుడు తత్పరతతో లేచి నిలబడాలి.
ఖ) అవసరం వచ్చినపుడు దగ్గర ఉండాలి.
గ) శుశ్రూషలు (సేవలు) చేయాలి.
ఘ) పరిచర్యలు చేయాలి.
చ) వారినుండి సత్కార పూర్వకమైన విద్య నేర్చుకోవాలి.

ఇలా ఐదువిధాలుగా సేవించబడ్డ "గురువు శిష్యునిపై ఐదువిధాలుగా కరుణ చూపుతాడు.

క) వానిని నీతిమంతుణ్ణి చేస్తాడు.
ఖ) చక్కగా విద్యను గ్రహించే విధానాన్ని నేర్పుతాడు.
గ) తాము నేర్చిన వృత్తి మరుగునపడకుండా, యోగ్యుని ద్వారా నిలచి ఉండేట్లు అందులోని మెళకువలను విశ్లేషించి నేర్పుతాడు.
ఘ) అతని బంధువులలో ప్రశంసించి ప్రోత్సహిస్తాడు.
చ) అంతటా సురక్షితంగా ఉండగలిగే విధంగా వానికి శిక్షణనిస్తాడు. ఈ ప్రకారంగా ఐదువిధాలుగా శిష్యునిచే సేవించబడ్డ దక్షిణదిశ రూపుడైన ఆచార్యుడు, అతనిపై ఐదు రకాలుగా కృప చూపించి దక్షిణ దిశను శుభకరంగాను, రక్షణకవచంగాను, భయరహితంగాను చేస్తాడు.

3. భార్యకు పతి సేవ– ఐదువిధాలుగా పత్నికి సేవ చేయాల్సి ఉంటుంది.

క) ఆమెను గౌరవంగా చూసుకోవాలి.
ఖ) ఆమెను అవమానపరచకూడదు.
గ) వ్యభిచారం చేయకూడదు.
ఘ) ఆమెకు సంపదను వినియోగపరిచే అధికారమివ్వాలి.
చ) ఆమెకు అలంకారానికి కావలిసిన వస్త్రాభరణాలు సమకూర్చాలి.

ఈ ఐదు విధాలుగా సేవించబడ్డ పత్ని పతికి ఐదు రకాలుగా సహకరిస్తుంది–

క) గృహ నిర్వహణలో సంపూర్ణ కర్తవ్యం వహిస్తుంది.
ఖ) స్వజనులను, పనివాళ్ళను బాగా సంతుష్టులుగా ఉంచుతుంది.

గ) వ్యభిచారిణి కారాదు.
ఘ) పతి సంపాదించిన ఆస్తిని రక్షిస్తుంది.
చ) ఇంటిపనులు సర్వం అలసట లేకుండా చేసుకుపోతుంది.

ఈ ఐదు విధాలుగా పతి ద్వారా సేవించబడ్డ పశ్చిమదిశ రూపమయిన పత్ని, పతియందు ఐదు రకాలుగా ప్రీతి జూపించి పశ్చిమ దిశను శుభకరంగాను, రక్షిత కవచంగాను, సురక్షితంగాను భయరహితంగాను ఉంచుతుంది.

4. మిత్రుని సేవ – ఐదువిధాలుగా మిత్రుని సేవించవలెను.

క) ఇవ్వడంతో,
ఖ) ప్రియమైన మాటలతో,
గ) మేలు చేయటంతో,
ఘ) సమభావం ప్రకటించడముతో,
చ) ఆడినమాట తప్పకుండా విశ్వాసంతో సేవించవలెను.

పై ఐదు విధాలుగా సేవించబడ్డ స్నేహితుడు, కుటుంబ మిత్రుడైన గృహస్థునికి ఐదు రకాలుగా మేలు చేస్తాడు.

1) మత్తులో ఉన్నపుడు అతనిని రక్షిస్తాడు.
2) మత్తులో ఉన్నపుడు అతని డబ్బును కాపాడుతాడు.
3) సంకట సమయంలో శరణునిస్తాడు.
4) కష్టాలలో తోడు విడవడు.
5) పరివారంలోని అందరినీ ఆదరిస్తాడు.

ఐదు విధాలుగా సేవించబడ్డ ఉత్తరదిశ రూపమయిన మిత్రుడు, బదులుగా ఐదు రకాలుగా సహకరించి ఉత్తరదిశను శుభప్రదంగాను, రక్షణ కవచముగాను చేస్తాడు.

5. నౌకరుల సేవ – ఐదు విధాలుగా యజమాని నౌకరుల పట్ల తమ విధులను నిర్వవర్తించ వలసి ఉంటుంది.

క) వారి శక్తికి తగ్గ పని అప్పజెప్పాలి.
ఖ) వారికి భోజనం, మరియూ వేతనాలివ్వాలి.
గ) వ్యాధిగ్రస్తుడైన వానిని రక్షించాలి.
ఘ) ఉత్తమమైన సరసమైన భోజనం పెట్టాలి.
చ) వానికి అవసరమైనపుడు సెలవులివ్వాలి.

ఐదు రకాలుగా సేవించబడ్డ నౌకరులు యజమానికి ఐదు విధాలుగా సేవ చేస్తారు.

క) యాజమానికంటే ముందే నిద్ర లేస్తారు.
ఖ) యజమాని నిద్రించిన తరువాత పడుకుంటారు.
గ) దొంగిలించక ఇచ్చినది మాత్రమే పుచ్చుకుంటారు.
ఘ) ఇచ్చిన పనిని చక్కగా నిర్వహిస్తారు.
చ) యజమాని కీర్తి ప్రతిష్ఠలు పెంపొందింపజేస్తారు.

పై ఐదు విధాలుగా సేవించబడ్డ క్రింది దిశ రూపులైన సేవకులు యజమానికి ఐదు విధాలుగా సేవచేస్తూ, క్రింది దిశను శుభప్రదముగను, రక్షణ కవచముగనూ, సురక్షితముగాను, క్షేమ పూర్వకముగానూ భయరహితముగానూ ఉంచెదరు.

6. శ్రమణులకు (భిక్షువులకు) సేవ– కుటుంబ పుత్రుడు ఐదు విధాలుగా శ్రమణులకు సేవ చేయవలెను.

క) మైత్రీ భావం నిండిన శరీరకర్మలతో,

ఖ) మైత్రీ భావం నిండిన వాచిక కర్మలతో,

గ) మైత్రీ భావం నిండిన మానసిక కర్మలతో,

ఘ) విశాలహృదయంతో ఆహ్వానించి,

చ) లోకీయ అవశ్యకాలను(భిక్షువు ఉపయోగించుకొనే వస్తువులను) పూర్తి చేసి, వారి సేవ చేయవలెను.

పై ఐదు విధాలుగా సేవించబడ్డ శ్రమణులు, ఆరు విధములుగా కుటుంబ పుత్రులపై కృప వహిస్తారు.

క) పాపకర్మల నుండి కాపాడుతారు.

ఖ) కుశల కర్మల యందుంచుతారు.

గ) కల్యాణకరమగు గాక అని దీవిస్తారు.

ఘ) ఇంతకుముందు విని ఉండనటువంటి ధర్మం వినిపిస్తారు.

చ) గ్రంధాలలో ఉన్న ధర్మాలను అన్వేషించి సమృద్ధి పరుస్తారు.

ఛ) సద్గతికి దారి చూపిస్తారు.

ఈ ఐదు విధాలుగా సేవించబడ్డ ఊర్ధ్వదశ రూపులైన శ్రమణులు, బ్రాహ్మణులు', సద్గృహస్థుని ఆరు విధాలుగా అనుగ్రహించి పై దిశను శుభప్రదముగానూ, రక్షణ కవచముగానూ, సురక్షితముగానూ, క్షేమ పూర్వకముగానూ, భయరహితముగానూ ఉంచెదరు.

సద్గృహస్థుడు ధర్మాచార సంహితను ధారణ చేసి ఈ విధంగా ఆరుదిశలనుండి భయవిముక్తుడవుతాడు. భగవానుని మంగళ ఉపదేశం విన్న శ్రేష్ఠిపుత్ర సిగాలుడు పూర్తిగా తృప్తి చెందాడు. (దీఘనికాయ –31)

1. అప్పటి కాలంలో అరహంతులను, బ్రహ్మచారులను బ్రాహ్మణులని పిలచేవారు

బహుం వే సరణం యన్తి, పబ్బతాని వనాని చ

ఆరామరుకచేత్యాని, మనుస్సా భయతజ్జితా. -- ధ.ప 188.

భయంతో బెదిరిపోయి అనేక మంది పర్వతాలు, వనాలు, ఆరామాలు, వృక్షాలు, చైత్యాలు మొదలైన వాటిని శరణు పొందుతారు.

నేతం ఖో సరణం ఖేమం, నేతం సరణముత్తమం

నేతం సరణమాగమ్మ, సబ్బదుకా పముచ్చతి. -- ధ. ప 189.

అటువంటి శరణం క్షేమకరం కాదు. అటువంటి శరణాన్ని పొంది ఎవ్వరూ దుఃఖాలన్నిటినుండి ముక్తులు కారు.

యోచ బుద్ధు ధమ్మ, సంఘఇచ్చ సరణం గతో
చత్తారి అరియసచ్చాని, సమ్మప్పడ్డాయ పస్సతి. - - ధ. ప 190.
దుక్ఖం దుకసముప్పాదం, దుకస్స చ అతిక్కమం
అరియంచట్ఠజ్గికం మగ్గం, దుకూపసమగామినం. --ధ.ప 191.

బుద్ధున్ని, ధమ్మాన్ని, సంఘాన్ని శరణు పొందినవాడు, దుఃఖం, దుఃఖకారణం, దుఃఖనిరోధం, దుఃఖాన్ని ఉపశమింపజేసే అష్టాంగమార్గం అనే ఈ నాలుగు ఆర్యసత్యాలను సమ్యక్ ప్రజ్ఞతో చూస్తాడు.

నాలుగు ఆర్యసత్యాలు:- 1. ఈ లోకంలో దుఃఖం ఉంది. 2. ఆ దుఃఖానికి కారణం ఉంది. అదే తృష్ణ, 3. దాన్ని తొలగించవచ్చు. 4. అందుకోసం సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పం, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ, సమ్యక్ వృత్తి, సమ్యక్ ప్రయత్నం, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి అనే ఆర్య అష్టాంగమార్గాన్ని అనుసరించాలి.

ఏతం ఖో సరణం ఖేమం, ఏతం సరణముత్తమం
ఏతం సరణమాగమ్మ, సబ్బదుకా పముచ్చతి. --ధ.ప 192.

ఈ శరణం క్షేమకరమైంది. ఈ శరణం ఉత్తమమైంది. ఈ శరణాన్ని పొందినవారు, అన్ని దుఃఖాలనుండీ ముక్తులు అవుతారు.

❖ ❖ ❖

2. దీఘజాణు (వ్యాఘ్రపాద) సుత్తం

ఒకానొక సమయాన భగవానుడు కోళియ ప్రదేశంలో కక్కరపత్త నామధేయంగల కోళియ నగరాన విహారం చేస్తున్నారు అప్పుడు కోళియ పుత్ర దీర్ఘజాణుడు భగవానుని వద్దకు వచ్చాడు. దగ్గరకు వెళ్ళి అభివాదం చేసి ఒక వైపు కూర్చొని భగవానునికి ఈ విధంగా నివేదించుకొన్నాడు. "భంతే ! మేము గృహస్థులం కామ-భోగులం పుత్రుల, స్త్రీల బాధలతో సహా ఇంట్లో నివసిస్తూ ఉంటాం కాశీ చందనాన్ని ధరిస్తాం. మాల, గంధ లేపనాలను ధరిస్తాం వెండి బంగారాలను వాడకంలోకి తెస్తాము, వాటిని ధరిస్తాము. భగవానుడు మాకు ఇహ లోకంలో హితకారి, సుఖకారి మరియు పరలోకంలో గూడా హితకారి, సుఖకారి యగు ధర్మాన్ని ఉపదేశించండి. అని కోరగా...

ఓ వ్యాఘ్రపాదుడా! ఉత్థాన సంపద, ఆరక్ష - సంపద, కల్యాణ మిత్రత ఇంకా సమజీవితము అను నాలుగు ధర్మములు, కుల (కుటుంబ) పుత్రులకు ఇహలోక హితమునకు, ఇహలోక సుఖానికి కారణమవుతాయి.

వ్యాఘ్రపాదా! ఉత్థాన సంపద అని దేన్నంటారు? వ్యాఘ్రపాదా! ఎవరైనా కులపుత్రుడు ఏ ఆజీవిక సాధనైనా (వృత్తి) ఉపయోగించదలిస్తే, వ్యవసాయం గానివ్వండి, వాణిజ్యం, గోపాలనం, ధనుర్విద్య, రాజకీయ నౌకరి, లేదా ఒక శిల్పకళయైనా అందులో అతను దక్షుడవుతాడు, సోమరితనాన్ని త్యజిస్తాడు ఆ పనిని విశ్లేషించడంలో, ఉపయోగించడంలో లగ్నమై ఉంటాడు. దానిని పూర్తి చేయడంలో, క్రమబద్ధము చేయడంలో సమర్థుడవుతాడు. వ్యాఘ్రపాదుడా! ఇదియే ఉత్థానసంపద అంటే.

వ్యాఘ్రపాదుడా! ఆరక్షా సంపద అని దేనినంటారు? వ్యాఘ్రపాదా! ఒక కులపుత్రుడు. వీరుడై కండబలము ఉపయోగించి చెమటోడ్చి ధర్మబద్ధంగా ఐశ్వర్యవంతుడవుతాడు. అతడు తన ఐశ్వర్యాన్ని రాజులు కాజేయకుండా, దొంగలు దొంగిలించకుండా, అగ్నికి ఆహుతికాకుండా, వరదల్లో కొట్టుకుపోకుండా ఇంకా ఏ పనికిమాలినవాడో తన ఐశ్వర్యం పై అధికారం చలాయించకుండా జాగ్రత్త పడతాడు. వ్యాఘ్రపాదా! ఇదే ఆరక్షా - సంపద అంటే.

వ్యాఘ్రపాదా! కల్యాణ మిత్రత అనగానేమి? వ్యాఘ్రపాదా! ఏదయినా గ్రామమునందుగానీ, పట్టణమందుగానీ ఎవరయినా కులపుత్రుడుంటే అక్కడ గృహపతి గానీ గృహపుత్రుని వంటి వారు చిన్న వారయినా పెద్దవారయినా కొందరు శీలవృద్ధులై (భిక్షువులు) ఉంటారు. వారు శ్రద్ధావంతులు, సదాచారులు, త్యాగులు ప్రజ్ఞావంతులు అయివుంటారు. ఆ గ్రామపు కులపుత్రులు వారితో కాలం గడపడం, మాట్లాడడం, చర్చించడం చేస్తుంటారు. వారి వద్ద శ్రద్ధ గురించి నేర్చుకుని శ్రద్ధావంతులవుతారు. శీలాన్ని గురించి నేర్చుకొని శీలవంతులవుతారు, త్యాగం గురించి తెలుసుకొని త్యాగశీలులవుతారు. ప్రజ్ఞ గురించి తెలుసుకొని ప్రజ్ఞావంతులవుతారు. వారితో కలిసిమెలిసి ఉంటూ, మాట్లాడతారు, చర్చిస్తారు. వ్యాఘ్రపాదా! వారినే కల్యాణ – మిత్రులంటారు.

వ్యాఘ్రపాదా! సమజీవనము అని దేనినంటారు? వ్యాఘ్రపాదా! ఒక కుల (కుటుంబం) పుత్రుడు తను అనుభవిస్తున్న సంపత్తికి ఆదాయం – ఖర్చు తెలుసుకొంటూ దాని ప్రకారం సమ–జీవనం జీవిస్తుంటాడు. మరీ వైభవంగా కాకుండా, మరీ నీచంగా కాకుండా ఖర్చు ఆదాయానికి మించకుండా జీవితం గడుపుతుంటారు. వ్యాఘ్రపాదా, ఇలా తరాజులో తూచినట్లు ఖర్చు ఎక్కడ తగ్గిందో, ఎక్కడ అధికమయిందో స్పష్టంగా తెలుసుకుంటూ ఉంటాడు. ఈ ప్రకారంగా ఒక కులపుత్రుడు తను అనుభవిస్తున్న సంపదను మరీ పైన కాకుండా, మరీ క్రిందకు దిగజారకుండా ఆదాయ వ్యయాల ననుసరించి ఆదాయం ఖర్చు కంటే అధికంగాకుండా, ఖర్చు ఆదాయానికి మించకుండా సమ–జీవనం గడుపుతుంటాడు

వ్యాఘ్రపాదా! ఒకవేళ ఈ కులపుత్రుడు అల్ప ఆదాయము వాడయివుండి గొప్పవానిలా జీవిస్తున్నట్లయితే అప్పుడు వాని గురించి అందరూ ఈ కులపుత్రుడు మేడిపండు తిన్నట్లు డబ్బు ఖర్చు పెడుతున్నాడని అంటారు. అనగా తినడం కంటే వెదజల్లడమెక్కువ చేస్తుంటాడని అర్థం. వ్యాఘ్రపాదా! ఒక వేళ ఈ కులపుత్రుడు అధిక సంపాదనా పరుడై వుండి గూడా మరీ క్రింది స్థాయిలో పిసినారిగా జీవిస్తుంటే, అందరూ వీడు దిక్కుమాలిన చావు చస్తాడని అనుకొంటూవుంటారు. అనగా తను సంపాదించిన సంపత్తిని దిక్కులేని దానిలా సదుపయోగపరచక అనాథలా వదిలేయడంవల్ల తను గూడా అనాథలాగే పోతాడు అని అర్థం. కానీ వ్యాఘ్రపాదా! ఎప్పుడయితే ఒక కులపుత్రుడు తను అనుభవిస్తున్న సంపదను, ఆదాయ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని మరీ పై ఎత్తులలో కాకుండా మరీ క్రింద కాకుండా "నా ఆదాయం వ్యయం కంటే అధికంగా ఉంటోంది. కానీ నా ఖర్చు ఆదాయానికి మించదు అని సరి సమానమగు జీవనము జీవిస్తువుంటాడో, వ్యాఘ్రపాదా దీనినే సమ – జీవనము అని అంటారు".

వ్యాఘ్రపాదా! ఈ ప్రకారంగా ఉత్పన్నమయిన భోగసాధనలు హరించిపోవడానికి నాలుగు దారులున్నాయి. వేశ్యాలోలుడవడం, త్రాగుబోతు కావడం, జూదరి కావడం మరియు దుస్సాంగత్యంలో ఉండడం.

ఒక చెరువులో నీరు నిండడానికి నాలుగుదారులున్నాయనుకుందాం. అలాగే నీరు పోవడానికి కూడా నాల్గుదారులున్నాయనుకుందాం. ఎవరయినా నీరు నిండే దారులు మూసివేసి, నీరుపోయేదారులు తెరిచి ఉంచి, పైనుండి వర్షంగూడా సరిగ్గా కురియకున్నట్లయితే, ఆ చెరువు క్షీణిస్తుందే గానీ వృద్ధి చెందదు. ఇదే విధంగా వ్యాఘ్రపాదా! పై విధంగా ఉత్పన్నమయిన భోగసాధనల నాశనం గావడానికి నాలుగు దారులు వున్నాయి. 'వేశ్యాలోలత్వం, త్రాగుడు, జూదం, ఇంకా దుస్సాంగత్యం'. ఇదే విధంగా ఉత్పన్న భోగసాధనల ఆగమనానికి నాలుగు దారులున్నాయి. వేశ్యాలోలత్వం లేకుండడం, త్రాగుడుకు దూరముగా ఉండడం, జూదరి కాకుండడం ఇంకా సత్సాంగత్యంతో ఉండడం. ఎలాగైతే పెద్ద చెరువులో నీళ్ళు నిండడానికి

నాలుగు దారులున్నాయో నీళ్ళు కారి పోవడానికి నాలుగు దారులున్నాయను కొందాం. ఎవరయినా నీరు ప్రవహించిపోయే దారులు మూసివేసి నీరు నిండేదారులు తెరచివుంచినట్లయితే, పైపెచ్చు వర్షాలు కూడా బాగా కురిసినట్లయితే ఆ పెద్ద చెరువు బాగా నిండుతుందని ఆశించవచ్చు. ఎండిపోతుందని కాదు కదా! ఇలాగే పై విధముగా ఉన్నత భోగసాధనల ఆగమనానికి నాలుగు మార్గాలున్నాయి. వేశ్యాలోలుడు కాకుండుట, త్రాగుబోతు కాకుండుట, జూదరి కాకుండుట, మరియు మంచి సాంగత్యముతో ఉండుట. ఈ నాలుగు ధర్మములు కుల పుత్రునికి ఇహలోక హితం మరియు పరలోక సుఖం కలుగజేస్తాయి.

వ్యాఘ్రపాదా! ఈ క్రింది నాలుగు ధర్మాలు కులపుత్రుని పరలోక హితాన్ని, పరలోక సుఖాన్ని కలుగజేస్తాయి. ఆ నాలుగు ఏవి? శ్రద్ధా - సంపద, శీల - సంపద, త్యాగ - సంపద, ప్రజ్ఞా - సంపద.

వ్యాఘ్రపాదా! శ్రద్ధాసంపద అని దేనినంటారు? కులపుత్రుడు, “భగవానుడు అరహంతుడు, సమ్యక్ సంబుద్ధుడు, విద్య మరియు ఆచరణ సంపన్నుడు, సుగతుడు, లోక విదుడు, అనుపమానుడు, పురుషులను ధర్మ మార్గంలో పెట్టే సారథి, దేవమానవుల శాసకుడు, శిక్షకుడు, బుద్ధుడు భగవానుడు” అను తథాగతుని 'బోధి' పట్ల శ్రద్ధ గలవాడై ఉంటాడు. శ్రద్ధావంతుడై ఉంటాడు వ్యాఘ్రపాదా! దీనినే శ్రద్ధా - సంపద అని అంటారు.

వ్యాఘ్రపాదా! శీలసంపద అని దేనినంటారు? వ్యాఘ్రపాదా! కులపుత్రుడు ప్రాణ హింసనుండి, దొంగతనం నుండి, వ్యభిచారం నుండి, మిథ్యాభాషణ మందు ఇంకా మత్తు పానీయాలు మొదలుగా గల ఉన్మత్తులను చేసే మత్తు పదార్థ సేవనంపట్ల విరక్తి కలిగి ఉంటాడు. వ్యాఘ్రపాదా! దీనినే శీలసంపద అని అంటారు.

వ్యాఘ్రపాదా! త్యాగసంపద అని దేనినంటారు? వ్యాఘ్రపాదా! కులపుత్రుడెప్పుడు మద - మాత్సర్యరహిత చిత్తుడై గృహవాసం చేస్తాడో, త్యాగి అయివుంటాడో, దానశీలుడై, పెద్ద చెయ్యివాడై, యాచకునికి ఇవ్వడం మరియు పంచి పెట్టేవానిలా ఉండే దానిని త్యాగ సంపద అని అంటారు.

వ్యాఘ్రపాదా! ప్రజ్ఞాసంపద అని దేన్నంటారు? వ్యాఘ్రపాదా! కులపుత్రుడు ప్రజ్ఞావంతుడై ఉంటాడు. ఉదయవ్యయాల అనుభవము కలుగజేసేది, అవిద్య యొక్క ఆవరణను ఛేదించేది, సమ్యక్ రూపంలో దుఃఖక్షయము చేసేది ఆర్య ప్రజ్ఞ. వ్యాఘ్రపాదా! ఇదే ప్రజ్ఞాసంపద.

ఈ క్రింది నాలుగు ధర్మాలూ కులపుత్రుని పరలోక హితానికీ, పరలోక సుఖానికి కారణమవుతాయి.

పని చేయడంలో ఉత్సాహయుక్తుడు, అప్రమాదీ వ్యవస్థాపకుడు, సమతుల్య జీవనం గడిపే వ్యక్తి, ఆర్జిత సంపదను రక్షించుకొనువాడు, శ్రద్ధగలవాడు, సదాచారి, ప్రజ్ఞావంతుడు మరియు త్యాగి అయివుండి అతడు నిత్యమూ పరలోక మార్గాన్ని పరిశుద్ధం చేసుకుంటాడు. ఈ విధంగా తథాగతుని ద్వారా గృహనివాసులైన శ్రద్ధగల వ్యక్తుల ఇహలోక మరియు పరలోక సుఖానికై ఎనిమిది మార్గములు తెలియజేయడం జరిగింది. ఈ ప్రకారముగా గృహస్థుల త్యాగము వారి పుణ్యవృద్ధికి కారణమవుతుంది.

(అంగుత్తర నికాయ - 8.54)

❖ ❖ ❖

3. మహామంగళ సుత్తం

నిదానం

నిజమైన మంగళం ఏది అన్న జిజ్ఞాసతో మనుష్యులు దేవతలు పన్నెండేళ్ళ పాటు చర్చించినప్పటికీ ఆ మంగళాన్ని (స్వాస్థ్యయనం, స్వస్తత చేకూర్చేదాన్ని) తెలుసుకోలేక పోయారు. సర్వపాప నాశనం కొరకు భగవానుడు ముప్పది ఎనిమిది మంగళాలను ఉపదేశించాడు. సకల ప్రాణుల హితం కొరకు మనం ఆ మంగళ గాథలను పఠిద్దాం!

నేనిలా విన్నాను – ఒకసమయంలో భగవానుడు శ్రావస్తిలో జేతవనంలో అనాథపిండికుని ఆరామంలో ఉన్నాడు. అప్పుడు ఒకనాటి రాత్రి చివరి జాములో జేతవనమంతటినీ తన తేజస్సుతో ప్రకాశింపజేస్తూ ఒక దేవత భగవానుని వద్దకు వచ్చాడు. అతడు భగవానుని సమీపించి ప్రణామం చేసి, ఒకప్రక్కన నిలబడి, భగవానునితో ఇలా అన్నాడు–

దేవత

1. చాలామంది దేవతలు, మనుష్యులు శుభాన్ని కోరుకుంటూ 'మంగళములు ఏవి?' అని ఆలోచిస్తున్నారు. ఏవి మంగళ కార్యాలో చెప్పండి.

భగవానుడు

2. మూర్ఖులకు దూరంగా ఉండడం, పండితుల సేవ చేయడం, పూజింప దగినవారిని పూజించటం – ఇవి ఉత్తమ మంగళాలు.

3. అనుకూల ప్రదేశంలో నివసించటం, పూర్వం చేసుకొన్న పుణ్యం, సరియైన సంకల్పం చేయటం – ఇవి ఉత్తమ మంగళాలు.

4. అనేక శాస్త్రాలలో, శిల్పాలలో, వినయంలో మంచిశిక్షణ కలిగి యుండటం, మంచిమాటలు మాట్లాడగల్గటం – ఇవి ఉత్తమ మంగళాలు. 5. తల్లిదండ్రులకు సేవచేయటం, భార్యాబిడ్డలను పోషించటం, చిక్కులులేని పనులు చేయటం – ఇవి ఉత్తమ మంగళాలు.

6. దానం చేయటం, ధర్మం ప్రకారం నడుచుకోవటం, బంధువులకు సహాయపడటం, అనిందితమైన పనులు చేయటం – ఇవి ఉత్తమ మంగళాలు.

7. పాపకార్యాల పట్ల విముఖత, మద్యపానం చేయకుండటం, ధర్మం పట్ల జాగ్రత్తగా ఉండటం – ఇవి ఉత్తమ మంగళాలు.

8. పెద్దల ఎడల గౌరవాన్ని కలిగిఉండటం, వినయంతో ఉండటం, దొరికిన దానితో సంతుష్టి పడటం, సహాయపడిన వారిపట్ల కృతజ్ఞతతో ఉండటం, సమయానికి ధర్మాన్ని వినటం – ఇవి ఉత్తమ మంగళాలు.

9. మాటలలో ఓరిమిని చూపటం, శ్రమణుల దర్శనం, సమయానికి ధర్మాన్ని గురించి చర్చించటం – ఇవి ఉత్తమ మంగళాలు.

10. తపస్సు, బ్రహ్మచర్యం, ఆర్యసత్యాల దర్శనం, నిర్వాణ సాక్షాత్కారం – ఇవి ఉత్తమ మంగళాలు.

11. లోకధర్మాల తాకిడికి చిత్తం చలించకుండా ఉండటం, శోకానికి వశం కాకపోవటం, నిర్మలత్వాన్ని, క్షేమాన్ని (భద్రతను) పొందిఉండటం – ఇవి ఉత్తమ మంగళాలు.

12. ఈ విధంగా ఈ ఉత్తమ మంగళాలను ఆచరించినవారు జీవితంలో ఎక్కడా అపజయం పొందరు. అంతటా శుభాలనే పొందుతారు.

(సుత్తనిపాత 2.4)

❖ ❖ ❖

4. పరాభవసుత్తం

విజ్ఞానవంతుడైన గృహస్థుడు మంగళకర్మలలో నిరతుడై తన ఉన్నతికై ఎలా పాటుపడతాడో, అలాగే అజ్ఞానుడైన గృహస్థుడు మంగళ కర్మలనుండి విరతుడై అమంగళ కర్మలలో నిరతుడై పతనమౌతాడు. పతనోన్ముఖుడు కావడానికి కారణాలను ఒకసారి ఒక దేవత అడుగగా, భగవానుడు ఇలా తెలియ జెప్పాడు.

ఓ గౌతమా! పతనం వైపుకు ప్రయాణం చేసే పురుషుని విషయమై అడుగడానికి మేము వచ్చాము. అధోగతికి కారణాలేమిటో సెలవివ్వండి.

భగవానుడు

1. ఉన్నత శీలుడైన వ్యక్తిని గుర్తించుట సులభం. పతనమార్గంలో ఉన్న వ్యక్తిని గుర్తించడం కూడా సులభమే. ధర్మ ప్రియునికి ఉన్నతి జరుగుతుంది. ధర్మ ద్వేషి పతనమౌతాడు.

2. ఎవరికి దుర్జనులు ప్రియులుగా, సజ్జనులు అప్రియులుగా ఉంటారో, ఎవరికి దుర్జనుల ప్రవర్తన ఇష్టంగా ఉంటుందో, ఈ గుణాలే వారి పతనానికి కారణాలవుతాయి.

3. ఎవడైతే నిద్రాలోలుడో, సభలు సమావేశాలంటూ తిరుగుతుంటాడో నిరుద్యోగి, సోమరి, కోపిష్టి అయిన వాడు, తన పతనానికి తానే కారణమవుతాడు

4. ఎవరు సంపన్నుడైవుండి గూడా బలహీనులైన తన వృద్ధ తల్లితండ్రుల భారం వహించడో, వారి పాలన పోషణలను చూడడో, అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

5. ఎవడైతే శ్రమణులకు, బ్రాహ్మణులకు ఇంకా ఇతర యాచకులకు ఏమీ ఇవ్వగూడదనే ఉద్దేశ్యంతో, అబద్ధం చెప్పి మోసం చేస్తాడో అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

6. ఎవరి దగ్గరయితే చెప్పుకోదగినంత సంపదలుండి, వెండి బంగారాలు, భోజన సామగ్రులన్నీ ఉండిగూడా, తానొక్కడ రుచికరమైన పదార్థాలను భుజిస్తాడో అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

7. ఎవడైతే తన జాతి, ధనసంపదలు మరియు గోత్రంపై గల దురాభిమానంతో, అహంకారంతో తన బంధువులను నిరాదరిస్తాడో, అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

8. "ఎవరైతే స్త్రీలోలుడై త్రాగుడులో, జూదంలో మునిగితేలుతుంటాడో అతడు తన సర్వ సంపాదననూ కోల్పోయి పతనమౌతాడు".

9. "ఎవడైతే భార్యపట్ల అసంతుష్టుడై, వేశ్యాలోలుడు మరియు పరస్త్రీలోలుడవుతాడో అతడు తన పతనానికి తానే కారణమవుతాడు".

10. "ఎవడైతే వృద్ధుడై ఉండిగూడా నవయువతిని భార్యగా తెచ్చుకుంటాడో, అతడు ఆమెపట్ల అనుమానాలు, ఈర్ష్యల వల్ల నిద్రపోలేక తన పతనానికి తానే కారణమవుతాడు".

11. "ఎవరైతే దురాశ మరియు ఆస్తి నష్టం చేసే స్త్రీకి గానీ, పురుషునికి గానీ, ఆస్తిపై అధికారమిస్తారో, వారు తమ పతనానికి తామే కారణమవుతారు".

12. "క్షత్రియ కులంలో జన్మించిన అల్ప సంపదశాలి, మహాలోభి అయిన వాడు రాజ్యాన్ని కాంక్షిస్తే, అతడు తన పతనానికి తానే కారణమవుతాడు".

"బుద్ధిమంతుడైన వ్యక్తి. లోకంలో పతనానికి దారితీసే ఈ కారణాలను బహుజాగ్రత్తగా అర్థం చేసుకుని, ఆర్యదర్శన సంపన్నుడవుతాడు. అతడు ఇదే జన్మలో నిర్వాణ లాభుడవుతాడు".

(సుత్తనిపాత - 1.6)

❖ ❖ ❖

గమనిక

ఆంగ్లంలో ప్రచురితమైన విదేశీ భావనలను మన సమస్యల పరిష్కారానికి ఏ విధముగా వినియోగించాలో ఈ పుస్తకము తెలుగులో అనువదించి వివరించడమైనది. పాఠకుల అభిప్రాయాలను, సలహాలను రచయితకు తెలియజేయగలరు. మీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి ముద్రణలో సవరించడం జరుగుతుంది.

ఈ పుస్తకమును డిజిటలైజ్ చేయడంలో కొన్ని మార్పులు, చేర్పులు చేయడమైనది. పాఠకులు మార్పును గుర్తించగలరు.

భిక్షు సుమేధ బోధి

సెల్ : **97014 53550**

ఈ-మెయిల్ : dham.sol@gmail.com

సామాజిక బౌద్ధ ధమ్మం

భిక్ఖు సుమేధ బోధి

భవతు సబ్బ మంగళం!

భిక్ఖు సుమేధ బోధి

ప్రపంచ వ్యాప్తంగా కుటుంబ పరంగా, వ్యక్తి పరంగా ఎన్నో సవాళ్ళు ఎదురౌతున్నాయి. ఈ ఆటుపోటులలో మనందరి పాత్ర కూడా ఉందని గుర్తించాలి. దీనికి కారణం మనలోని లోభ, దోష, మోహములే అని బుద్ధుని బోధన.

ఈ సమస్యల నుండి బయట పడటానికి పాఠకులకు శీలాధారిత జీవన విధానం సామాజిక బౌద్ధ ధమ్మము అవలంభిస్తూ సుఖ సంతోషాలతో జీవించుటకు ఈ పుస్తకము ఒక మార్గదర్శిని.

ఈ ధర్మము ప్రపంచ వ్యాప్తంగా మంచి ఫలితాలను సాధించింది. అందువలన ఈ విధానమును తెలుగు వారి అభ్యున్నతి కాంక్షిస్తూ తయారు చేయబడినది.